
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ణి చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 219

సోమవారం 30-10-2023



ఆరు.. భారత్ జోరు..
ఇంగ్లండ్‌పై 100 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం - 14లో



'మేరా యువ భారత్'
పటేల్ జయంతి సందర్భంగా రేపు ప్రారంభం: మోదీ - 6లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

కేరళలో వరుస పేలుళ్లు

ఇద్దరు మహిళలు మృతి... 51 మందికి గాయాలు

- కొచ్చి నగర సమీపంలోని 'జెహోవా' క్రైస్తవుల మత ప్రార్థనల్లో ఘటన
- దేశవ్యాప్తంగా చర్చిల వద్ద భద్రత కట్టుదిట్టం
- పేలుళ్ల పని తనదేనంటూ ఓ వ్యక్తి లొంగుబాటు

6లో

తోడేళ్లలా ఆవురావురు

కాంగ్రెస్‌కు చాన్స్ ఇస్తే గొర్రెల మందపై పడ్డట్టు పడదామనుకుంటున్నారు

కోదాడ, తుంగతుర్తి, ఆలేరు సభల్లో సీఎం కేసీఆర్ ఫైర్



- ఉప్పెనలా ఉద్యమిస్తే తెలంగాణ ఇచ్చారు.. పుణ్యానికి ఇవ్వలే
- 14 ఏళ్ల పాటు ఏడిపించి ఎంతో మంది ప్రాణాలు తీసుకున్నారు
- మేం తెలంగాణ ఇచ్చామని చెప్పడానికి కాంగ్రెస్‌కు సిగ్గుండాలి
- ధరణి రద్దు చేస్తే దొంగల రాజ్యమే..

3లో

"రాహుల్ గాంధీ ధరణి తీసేస్తానంటున్నాడు. ఆయనకు వ్యవసాయం ఎరుకనా.. ఎద్దు ఎరుకనా, ఎన్నడన్న నాగలి దున్నిండా? ఎవడో సన్నాసి రాసిస్తే చిలుక పలికినట్లు పలుకుతున్నాడు. ధరణి ఉంటేనే మీ భూములు మీకున్నాయి. నిశ్చింతగా ఉన్నారు. ప్రభుత్వం వద్ద, అధికారుల వద్ద భూములపై ఉన్న అధికారాన్ని ధరణితో రైతులకే ఇచ్చాం. ఆ అధికారాన్ని కాపాడుకుంటారా? పోగొట్టుకుంటారా? మీరే నిర్ణయించుకోవాలి.
- ముఖ్యమంత్రి కేసీఆర్



ఆదివారం ఆలేరులో ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు

రెండు రైళ్లు ఢీ

ఏపీలోని విజయనగరం జిల్లాలో పెను ప్రమాదం

ముందు వెళ్తున్న పలాస ప్యాసింజర్‌ను ఢీకొన్న రాయగడ ప్యాసింజర్

బయల్దేరిన కాసేపటికే మాళి-అలమండ స్టేషన్ల మధ్య దుర్ఘటన

12 మంది దుర్మరణం

32 మందికి పైగా గాయాలు

ఇంజన్, 5 బోగీలు నుజ్జునుజ్జు.. మృతుల్లో లోకో పైలట్!

- ఏపీ మృతులకు రూ.10 లక్షలు.. గాయపడ్డ వారికి రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ఏపీ ప్రభుత్వం
- ఇతర రాష్ట్రాల మృతులకు రూ.2 లక్షలు, గాయపడ్డ వారికి రూ.50వేల పరిహారం
- సీఎం జగన్‌కు రైల్వే మంత్రి ఫోన్.. ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

12లో

న్యూస్‌రీల్

హమాస్ స్థావరాలే లక్ష్యం



గాజాలో హమాస్ స్థావరాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ భూతల దాడులు ఉధృతం చేసింది. ఇజ్రాయెల్ పదాతి దళం ముమ్మందుకు చొచ్చుకెళ్తుండగా వైమానిక దళం నిప్పుల వర్షం కురిపిస్తోంది. గత 24 గంటల్లో 450 స్థావరాలపై దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ ఆదివారం ప్రకటించింది.

- వివరాలు 6లో

తోకముడిచిన టీడీపీ



తెలంగాణలో తెలుగుదేశం పార్టీ తోక ముడిచింది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయట్లేదంటూ చేతులెత్తేసింది. తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేసే స్థాయిలో దృష్టి పెట్టలేమని, తెలుగు తమ్ముళ్లకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ చావుకబురు చల్లగా చెప్పారు.

- వివరాలు 2లో

ముకేశ్ అంబానీకి మళ్లీ బెదిరింపులు

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ రూ. 200 కోట్లు ఇవ్వకుంటే చంపేస్తామని ఆదివారం మరో బెదిరింపు మెయిల్ వచ్చింది.

- వివరాలు 6లో

అప్పుల కుప్ప చేశారు

బీఆర్ఎస్ పాలనలో ప్రజల నెత్తిన రూ. 5 లక్షల కోట్ల రుణ భారం

సోనియా రాష్ట్రం ఇవ్వడం వల్లే కల్వకుంట్ల కుటుంబానికి పదవులు

సంగారెడ్డి, మెదక్ ప్రచార సభల్లో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ధ్వజం



ఆదివారం సంగారెడ్డిలోని గంజి మైదానంలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభలో మల్లికార్జున ఖర్గే, జగ్గారెడ్డి, భట్టి విక్రమార్క, రేవంత్‌రెడ్డి

- కర్ణాటకలో అన్ని హామీలు అమల్లోకి.. కేసీఆర్, మంత్రులు అబద్ధాలు చెప్తూ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారు
- రండి.. బస్సుల్లో కర్ణాటకకు తీసుకెళ్లి వాస్తవాలు చూపిస్తాం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ మెదక్: సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే దాన్ని అప్పుల పాలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని ఈ తొమ్మిదేళ్లలో ఐదు లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా మార్చారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్న కేంద్ర ప్రభుత్వం, అందుకు మద్దతిస్తున్న బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని.. అవి కలిసే పనిచేస్తున్నాయని చెప్పారు. రెండు పార్టీలు కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశాయని మండిపడ్డారు. తాము

మిగతా 2వ పేజీలో ▶

గులాబీ గూటికి నాగం

ఆయన నివాసానికి వెళ్లి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన కేటీఆర్, హరీశ్‌రావు.. ప్రగతిభవన్‌లో కేసీఆర్‌తో భేటీ



- అదే బాటలో పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి కూడా..
- త్వరలోనే లాంఛనంగా బీఆర్ఎస్‌లో చేరుతామన్న అసంతృప్త నేతలు
- అధికార పార్టీలో చేరిన మహబూబ్‌నగర్ జిల్లా నేతలు పి.చంద్రశేఖర్, ఎర్ర శేఖర్

5లో

రేవంత్‌కు అధికారమిస్తే కోరిలో అమ్మేస్తాడు

కడుపులో గుద్ది నోట్లో పిప్పరమెంట్ పెట్టే రకం వాళ్లు

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం భేటీలో మంత్రి కేటీఆర్

టీఎస్‌పీఎస్సీని డిసెంబర్ 3 తర్వాత ప్రక్షాళన చేస్తాం

బీజేపీ ఫేక్ న్యూస్ ప్రచారాలను విస్తృతంగా ఎండగడదాం



సాక్షి, హైదరాబాద్: ''కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ఓటుకు నోటు కేసులో చిక్కిన దొంగ. అమరుల స్తూపం వద్దకు వచ్చి మద్యం పంచకుండా గెలుద్దాం, ప్రమాణాలు చేద్దాం రా.. అంటున్నాడు. నోట్లకట్టలతో పచ్చిగా దొరికిన దొంగ నీతులు చెప్తున్నాడు. కాంగ్రెస్ వాళ్లే రేవంత్‌రెడ్డిని రేటెంత రెడ్డి అంటున్నారు. ఆయన చేతికి అధికారమిస్తే రాష్ట్రాన్ని కోరిలో చారాణాకు

మిగతా 3వ పేజీలో ▶

ప్రచారాన్ని పరిగెత్తిస్తాం

3 నుంచి బీజేపీ విస్తృత కార్యక్రమాలు: కిషన్‌రెడ్డి

తొలిసారిగా బీసీ సీఎం ప్రకటన చేసింది బీజేపీయే

మత రిజర్వేషన్ల పేరిట బీసీలకు కాంగ్రెస్ వెన్నుపోటు

అందరినీ దగా చేయడం బీఆర్ఎస్ నైజం

ఇక్కడా యోగి ప్రభుత్వం తరహాలో అక్రమార్కులను బుల్డోజర్లతో అణచివేస్తాం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని నవంబర్ మూడో తేదీ నుంచి విస్తృతం చేయనున్నట్లు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు, వివిధ రాష్ట్రాల అధ్యక్షులు పాల్గొంటారని తెలిపారు. నామినేషన్ల

మిగతా 5వ పేజీలో ▶



..మళ్లీ పార్టీ టికెటివ్వలేదా!!

మిర్యాలగూడ, వైరా ఇస్తేనే పొత్తు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టీకరణ

- పొత్తు ధర్మం కోసం ఒక్కో మెట్టు దిగామని వెల్లడి
- తమతో పొత్తుపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని విమర్శ
- రెండు రోజుల్లో కాంగ్రెస్ తేల్చకపోతే విడిగా పోటీ చేస్తామని అల్టిమేటం

2లో

పెండింగ్ 19పై నేడు కాంగ్రెస్ భేటీ

'పొత్తు' పొడిచేనా!

వివరాలు 2లో

క్లుప్తంగా...

కల్వకుంట్ల కుటుంబసభ్యులే పారాచూట్లు: మధుయాష్కీ



ఎల్బీనగర్: మెదక్‌లో పుట్టి గజ్వేల్, కామారెడ్డి, సిరిసిల్లకు వెళ్లిన పారాచూట్లు కల్వకుంట కుటుంబసభ్యులేనని ఎల్బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్ ధ్వజమెత్తారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీరు కూడా స్థానికేతరులని, వ్యాపారపరంగా, రాజకీయంగా అవకాశాలు ఇవ్వవద్దు అని రేపు బీఆర్ఎస్ నాయకులే అభ్యంతరం వ్యక్తం చేస్తారని పేర్కొన్నారు. శ్రీకాంతాచారి ఒళ్లు తగలబడి పోతుంటే కవిత, తారకరామారావు వ్యాపారాలు చేసుకున్నారని విమర్శించారు. జాగృతి కవిత స్కిల్ డెలప్‌మెంట్ పేరుతో రూ.800 కోట్ల మేరకు అక్రమార్జనకు పాల్పడ్డారని ఆరోపించారు. కేటీఆర్ అధికార అహంకారంతో భూకబ్జాలు, దౌర్జన్యాలు చేస్తూ వాటాలు పంచుకుంటున్నారని ఆరోపించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యేపై స్థానికులు అసంతృప్తితో ఉన్నారని, ఆయనపై ఫిర్యాదులు చేద్దామన్నా ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఇక్కడి ప్రజలు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కబ్జాల నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పాలేరు బరిలోనే షర్మిల

మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడిస్తాం: వైఎస్సార్‌టీపీ

ఖమ్మం రూరల్: చర్చల పేరుతో కాలయాపన చేసి మోసం చేసిన కాంగ్రెస్‌ను రాష్ట్రంలో ఓడిస్తామని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్టా రాంరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలో ఆదివారం పార్టీ నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గం నుంచి తమ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పోటీ చేస్తారని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో నాలుగు నెలలుగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ తదితరులతో ఢిల్లీలో చర్చలు జరిపామని, సీట్లు సర్దుబాటు చేయకుండా మోసగించిన కాంగ్రెస్‌ను ఎన్నికల్లో ఓడిస్తామని అన్నారు. తెలంగాణలో ఒంటరిగానే అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పారు. పాలేరులో ఇద్దరు బడా కాంట్రాక్టర్లు పోటీలో ఉన్నారని, వారికి ప్రజల నుంచి ఎలాంటి మద్దతు లేదని తెలిపారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి చరమగీతం పాడే దమ్ము ఒక్క వైఎస్సార్‌టీపీకే ఉందని అన్నారు.

36 లక్షల మంది నిరుద్యోగులతో 'విద్యార్థి రాజకీయ పార్టీ'

పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్

పంజగుట్ట: ఇప్పటివరకు నిరుద్యోగులను అన్ని పార్టీలు ఓటుబ్యాంకుగా వాడుకున్నారే కానీ, చట్టసభల్లో అవకాశం కల్పించలేదని, అందుకే రాష్ట్రంలోని 36 లక్షలమంది నిరుద్యోగులం కలిసి 'విద్యార్థి రాజకీయ పార్టీ'ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్ తెలిపారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని, ఎన్నికలకు ముందే 2.65 లక్షల ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు తయారు చేసుకుని ప్రజల వద్దకు వెళుతున్నామన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 50 మంది అభ్యర్థులను ప్రకటించి బీఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ మన్మోహన్, సునీల్ మాట్లాడుతూ పార్టీ ప్రకటించేముందు అన్ని పార్టీల అధినాయకులను కలిసి నిరుద్యోగులకు 50 శాతం సీట్లు కేటాయించాలని కోరినా పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సంఘం తమకు బ్యాట్ గుర్తు కేటాయించిందని తెలిపారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ అధ్యక్షుడు అన్వేష్, నేతలు నవీన్ పాక, జాదవ్, బుగ్గ శ్రీకాంత్, నందు, వినయ్‌గౌడ్, సాత్వికారెడ్డి, మహిళా వింగ్ అధ్యక్షురాలు సౌమ్య పాల్గొన్నారు.

సభలకు బదులు రోడ్ షోలు

భారీ సభల నిర్వహణ ప్రస్తుతానికి వద్దనుకుంటున్న కాంగ్రెస్
- కొత్త జిల్లా కేంద్రాల్లో జాతీయ నాయకులతో ప్రచారం చేసేలా ప్రణాళిక
- ఎన్నికలున్నవి మినహా మిగతా రాష్ట్రాల నేతల పర్యటనలు
- ఉదయం పార్టీ కార్యకర్తలతో సమావేశాలు.. సాయంత్రం రోడ్ షోలకు ప్లాన్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ బహిరంగ సభల నిర్వహణకు బదులు ప్రస్తుతానికి కార్నర్ మీటింగ్‌లు, రోడ్ షోలకే పరిమితం కావాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. కొత్తగా ఏర్పాటైన జిల్లా కేంద్రాలన్నింటిలో ఇతర రాష్ట్రాలకు చెందిన జాతీయ స్థాయి నాయకులతో ప్రచారం నిర్వహించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాం మినహా ఇతర రాష్ట్రాల నేతలతో రోడ్‌షోల నిర్వహణ కోసం ప్లాన్ వేస్తోంది. భారీ బహిరంగ సభలు నిర్వహించి ప్రజలను సభకు తీసుకువచ్చే దాని కంటే ప్రజల్లోకి తామే వెళ్లడం మేలన్న ఆలోచనతో కార్యాచరణ రూపొందిస్తున్నట్టు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. రోడ్ షోలలో భాగంగా ఉదయం పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి వారికి దిశానిర్దేశం చేయాలని.. సాయంత్రం రోడ్ షోలు నిర్వహించాలని భావిస్తున్నట్టు కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. దీని ద్వారా పార్టీ శ్రేణుల్లోనూ కొత్త జోష్ వస్తుందని అంటున్నారు.

నేటి బస్సు యాత్ర వాయిదా

సోమవారం భువనగిరి పార్లమెంట్ పరిధిలోని జనగామ, ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో నిర్వహించతలపెట్టిన రెండో విడత బస్సు యాత్ర అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్టు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆయా నియోజకవర్గాల్లో తిరిగి యాత్ర ఎప్పుడు నిర్వహించేదీ త్వరలోనే తెలియజేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

అగ్రనేతలతో పెద్ద సభలు

ఈ నెల 31న కొల్లాపూర్‌లో ప్రియాంకా గాంధీ బహిరంగ సభ జరగనుంది. దీనితోపాటు అగ్రనేతలతో మరో రెండు, మూడు పెద్ద సభలు నిర్వహించాలని పీసీసీ నేతలు యోచిస్తున్నారు. ఈ సభల్లో పార్టీ అతిరథ మహారథులతో హామీలు ఇప్పించాలని భావిస్తున్నారు. అవి మినహా చాలా వరకు రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు, బస్సుయాత్రతో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించాలని నిర్ణయించారు.

అప్పుల కుప్ప చేశారు



ఆదివారం సంగారెడ్డిలో కాంగ్రెస్ విజయభేరి సభకు హాజరైన ప్రజలు

▶ మొదటి పేజీ తరువాయి

కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని.. కానీ ఈ విషయంలో కేసీఆర్, మంత్రులు అబద్ధాలు ప్రచారం చేస్తూ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని చెప్పారు. దమ్ముంటే కేసీఆర్, మంత్రులు రావాలని, బస్సుల్లో కర్ణాటకకు తీసుకెళ్లి హామీల అమలు వాస్తవాలను చూపిస్తామని సవాల్ చేశారు. అసలు ఎన్నికలప్పుడు హామీలివ్వడం, తర్వాత మాటతప్పడం సీఎం కేసీఆర్ నైజమని విమర్శించారు. ఆదివారం సంగారెడ్డిలోని గంజి మైదానంలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభలో, మెదక్‌లోని రాందాస్ చౌరస్తాలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు.

మోదీ, కేసీఆర్ మోసం చేస్తున్నారు

మెదక్‌లో పోటీ చేసిన ఇందిరాగాంధీ బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పారని.. కానీ కేంద్రంలోని మోదీ సర్కారు ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తోందని ఖర్గే ఆరోపించారు. రైల్వే వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు 30 లక్షలకుపైగా ఖాళీలుంటే.. ప్రధాని మోదీ కేవలం రెండు, మూడు వేల ఉద్యోగాలను భర్తీ చేసి, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కూడా నిరుపేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని.. బ్యాంకుల జాతీయీకరణ, భూసంస్కరణలను చేపట్టినదని తమ పార్టీయేనని గుర్తుచేశారు. ఏపీ కాంగ్రెస్ నష్టపోతుందని తెలిసినా సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని ఖర్గే చెప్పారు. సోనియా ప్రత్యేక రాష్ట్రం ఇవ్వడం వల్లే కేసీఆర్, ఆయన కుటుంబం పదవులు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు.

మేడిగడ్డతో కేసీఆర్ అవినీతి బయటపడింది: రేవంత్

కేసీఆర్ పాలనలో తెలంగాణను బెల్టుషాపుల రాష్ట్రంగా మార్చారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని.. నాణ్యత లోపం వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని ఆరోపించారు. దీనితో కేసీఆర్ అవినీతి బట్టబయలైందని వ్యాఖ్యానించారు. రూ.లక్ష కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్టు ఇసుక కదలడంతో కుంగిందని నీటి పారుదల శాఖ ఈఎన్సీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ హామీల అమలు విషయంలో బీఆర్ఎస్ కిరాయి మనుషులతో దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఐదు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తోందని.. సీఎం తేదీ ఖరారు చేస్తే బస్సులో కర్ణాటకకు తీసుకెళ్లి హామీల అమలును చూపిస్తామని చెప్పారు. తెలంగాణకు పట్టిన దరిద్రం వదలాలంటే బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

సంపదను పంచడానికే ఆరు గ్యారంటీలు: సీఎల్పీ నేత భట్టి

దొరల తెలంగాణకు, ప్రజల తెలంగాణకు మధ్య జరుగుతున్న యుద్ధమే ఈ ఎన్నికలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం వచ్చినప్పుడే ప్రజల కలలు సాకారం అవుతాయన్నారు. రాష్ట్రంలో ఉన్న సంపదను ప్రజలందరికీ పంచడానికే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు తీసుకొచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

సంగారెడ్డి గడ్డ దమ్మేంటో చూపిస్తాం: జగ్గారెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని, సంగారెడ్డిలో భారీ మెజారిటీతో గెలిచి ఈ గడ్డ దమ్మేంటో చూపిస్తామని ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేర్కొన్నారు. "హరీశ్‌రావు చాలెంజ్ చేస్తున్నారు. జగ్గారెడ్డిని ఓడగొడతాడట. ఇక్కడి ప్రజలకు పౌరుషం లేదనుకుంటున్నాడా? ఈ గడ్డకు పౌరుషం లేదనుకుంటున్నాడా? సంగారెడ్డి ప్రజలారా.. మీ కష్టాల్లో నేను అందుబాటులో ఉంటా. మీ దమ్మేందో చూపించాలి. హరీశ్‌రావు సంగారెడ్డిలో ఎలా తిరుగుతారో చూస్తా" అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. కాగా, సభ చివరిలో ఖర్గేతో సెల్ఫీలు దిగేందుకు కార్యకర్తలు ఒక్కసారిగా పోటీపడ్డారు. ఒక సందర్భంలో ఆయన మీద పడిపోయారు. వెంటనే భద్రతా సిబ్బంది, జగ్గారెడ్డి కలిసి ఖర్గేను సభ నుంచి బయటికి తీసుకువెళ్లారు.

6 గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం

రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలని.. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఖర్గే పిలుపునిచ్చారు. ప్రజల కోసం, ప్రజాస్వామ్య రక్షకులకు మద్దతు ఇవ్వాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే కర్ణాటకలో మాదిరిగా తెలంగాణలో 6 గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



రేవంత్.. గ్లూకోజ్ గోలీలు తీసుకో..

సంగారెడ్డి విజయభేరి సభ జరుగుతుండగా.. మల్లు భట్టి విక్రమార్క గ్లూకోజ్ గోలీలు వంటివి తింటూ పక్కన ఉన్న రేవంత్‌రెడ్డిని కూడా తీసుకొమ్మన్నారు. దీంతో రేవంత్ తీసుకొని తింటూ ఇలా కనిపించారు.

నేడు 'మేడిగడ్డ'పై ప్రాథమిక నివేదిక?

- కుంగుబాటుకు కారణాలు, మరమ్మతులపై అనిల్ జైన్ కమిటీ నివేదిక రెడీ
- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి 15 రకాల సమాచారం అందించిన నీటిపారుదల శాఖ

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీ కుంగిన ఘటనపై కేంద్రం ఏర్పాటు చేసిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) చైర్మన్ అనిల్ జైన్ కమిటీకి 18 రకాల నివేదికలు/ సమాచారాన్ని రాష్ట్ర నీటిపారుదల శాఖ అందించింది. నీటిపారుదల శాఖ నుంచి దాదాపుగా అన్ని వివరాలు, నివేదికలు అందిన నేపథ్యంలో బ్యారేజీ కుంగిన ఘటనపై సోమవారం ప్రాథమిక నివేదికను అనిల్ జైన్ కమిటీ కేంద్రానికి సమర్పించే అవకాశాలున్నాయి. కమిటీ మొత్తం 20 రకాల నివేదికలు / సమాచారాన్ని కోరగా, గతంలోనే రెండు రకాల నివేదికలను పూర్తిగా, మరో సమాచారాన్ని నీటిపారుదల శాఖ పాక్షికంగా అందజేసింది. ఆదివారం మరో 15 రకాల వివరాలను ఎన్డీఎస్ఏకు సమర్పించినట్టు ఆ శాఖ ప్రకటించింది. మిగిలిన రెండు నివేదికలను త్వరలో అందజేస్తామని తెలియజేసింది. తాము కోరిన 20 రకాల సమాచారాన్ని ఆదివారంలోగా అందజేయాలని, లేనిపక్షంలో నీటిపారుదల శాఖ వద్ద ఇచ్చేందుకు ఎలాంటి సమాచారం లేదని పరిగణించి ముందుకు వెళ్తామని ఎన్డీఎస్ఏ డెడ్‌లైన్ విధించిన విషయం తెలిసిందే. దీంతో నీటిపారుదల శాఖ ఆగమేఘాల మీద చర్యలు తీసుకుంది. ఈ నెల 24న అనిల్ జైన్ కమిటీ మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించి మరుసటి రోజు హైదరాబాద్‌లోని జలసౌధలో నీటిపారుదల శాఖ ఈఎన్సీలతో సమావేశమై చర్చించింది. బ్యారేజి కుంగడానికి కారణాలతోపాటు మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలను నివేదికలో పొందుపరచనుంది.

తోకముడిచిన టీడీపీ

తెలంగాణ ఎన్నికల బరిలో దిగలేమన్న చంద్రబాబు, లోకేశ్
- కాసాని అధ్యక్షతన జరిగిన సమావేశానికి లోకేశ్ గైర్హాజరు
- తండ్రీ కొడుకుల తీరుపై తెలుగు తమ్ముళ్ల మండిపాటు
- కాంగ్రెస్‌తో ఒప్పందం కుదుర్చుకుని తమను బలిపశువులను చేశారని ఆవేదన
- ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ముందు ఆందోళనలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో తెలుగుదేశం పార్టీ తోక ముడిచింది. ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడం లేదంటూ చేతులెత్తేసింది. ఈ మేరకు తెలుగు తమ్ముళ్లకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేశ్‌లు చావు కబురు చల్లగా చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎదురవుతున్న పరిస్థితులను తట్టుకుని నిలబడేందుకే తమకు సమయం సరిపోతుందని, తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేసేంత స్థాయిలో తాము దృష్టి కేంద్రీకరించలేమని, ఈసారి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు. దీంతో తెలంగాణ తెలుగుదేశం పార్టీలో ముసలం పుట్టింది. తండ్రీ కొడుకుల ప్రయోజనాల కోసం తెలంగాణలో పార్టీని నమ్ముకుని ఉన్న నేతలను నట్టేట ముంచారంటూ తమ్ముళ్లు ఆందోళనకు గురవుతున్నారు. కాంగ్రెస్ పార్టీతో కుదుర్చుకున్న లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే ఆ పార్టీకి మేలు చేసేందుకు తమను బలిపశువులను చేశారని ఆవేదనకు గురవుతున్నారు. తాము ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేసి తీరతామని, బీఫారాలు ఇవ్వకుంటే స్వతంత్రంగా పోటీ చేస్తామని తెలుగుదేశం అధినాయకత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.

లోకేశ్‌తో మాట్లాడుకోవాలన్న బాబు

తెలంగాణలో జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై తెలుగుదేశం పార్టీ చాలా రోజులుగా నాన్చుతూ వస్తోంది. అన్నిచోట్లా పోటీ చేయకపోయినా, బలమున్న చోటయినా పోటీకి దిగుదామని పార్టీ నేతలకు చెప్పుకుంటూ వచ్చింది. కాగా ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో పోటీ విషయమై తేల్చుకునేందుకు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఇటీవల చంద్రబాబు నాయుడితో రాజమండ్రి జైల్లో ములాఖాత్ అయ్యారు. అయితే తెలంగాణలో పోటీ చేసే విషయం తాను మాట్లాడలేనని, లోకేశ్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని జ్ఞానేశ్వర్‌కు చంద్రబాబు సూచించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో జ్ఞానేశ్వర్ అధ్యక్షతన తెలంగాణ తెలుగుదేశం పార్టీ నేతలు సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌కు రావాల్సిందిగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు ఆహ్వానం పంపారు. అయితే లోకేశ్ హాజరు కాకుండా.. తెలంగాణలో పోటీ చేయడం లేదనే సమాచారాన్ని పంపించారు. దీంతో తెలుగు తమ్ముళ్లు ఏం చేయాలో పాలుపోని స్థితిలో పడాల్సి వచ్చింది. తాము ఖచ్చితంగా పోటీ చేయాల్సిందేనని, బలమున్న నియోజకవర్గాల్లోనైనా పోటీకి అంగీకరించాలని డిమాండ్ చేశారు. కానీ లోకేశ్ ససేమిరా అనడంతో సమావేశానికి వచ్చిన నేతలు అక్కడే ఆందోళనకు దిగారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నారంటూ మండిపడ్డారు. తండ్రీకొడుకుల కోసం తాము త్యాగాలెందుకు చేస్తామని ప్రశ్నించిన నేతలు.. కాంగ్రెస్ పార్టీకి లాభం చేయాలన్న ఆలోచనతోనే తెలంగాణలో పోటీని విరమించుకున్నారంటూ బహిరంగ ఆరోపణలకు దిగారు. స్వతంత్ర అభ్యర్థులుగానైనా బరిలోకి దిగుతామంటూ సమావేశంలో తీర్మానం చేశారు.

మిర్యాలగూడ, వైరా ఇస్తేనే పొత్తు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- పొత్తు ధర్మం కోసం ఒక్కో మెట్టు దిగాం
- రెండురోజుల్లో కాంగ్రెస్ తేల్చకపోతే విడిగా పోటీ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'మిర్యాలగూడతో పాటు వైరా సీటు ఇస్తే ఓకే.. ఈ రెండు స్థానాలు ఇవ్వకపోతే పొత్తు కుదరదు. రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తేల్చకపోతే మేము విడిగా వెళ్తాం' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం, ఆ తర్వాత రాష్ట్ర కమిటీ సమావేశం ఉంటాయని, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశాల్లోపు కాంగ్రెస్ పార్టీ నుంచి స్పష్టమైన ప్రకటన రాకుంటే తాము విడిగా పోటీ చేయడం తప్ప మరో మార్గం లేదని అన్నారు. బాల్ కాంగ్రెస్ కోర్టులోనే ఉందని వ్యాఖ్యానించారు.

చిత్తశుద్ధి లేకనే ఇలా చేస్తున్నారు..

కాంగ్రెస్‌తో పొత్తు కోసం జాతీయ, రాష్ట్ర స్థాయిలో పలుమార్లు చర్చలు జరిగాయని, తొలుత భద్రాచలం, పాలేరు, మిర్యాలగూడెం, ఇబ్రహీంపట్నం, వైరా స్థానాలను అడిగామని తమ్మినేని తెలిపారు. భద్రాచలం సిట్టింగ్ స్థానం ఇవ్వడం కుదరదని చెప్పారని, ఒక దశలో పాలేరు ఇస్తామని చెప్పి.. తర్వాత వారి అభ్యర్థిని ప్రకటించారని అన్నారు. ఒక్కో మెట్టు దిగి భద్రాచలం, పాలేరు వదులుకున్నామని, చివరకువారు ప్రతిపాదించిన వైరా, మిర్యాలగూడ సీట్లకు అంగీకరించామని వివరించారు. మళ్లీ ఇప్పుడు వైరా స్థానం ఇస్తామని చెప్పలేదంటూ ఆ పార్టీకి చెందిన ఒక నేత మాట్లాడారని విమర్శించారు. ప్రస్తుతం మిర్యాలగూడతో పాటు హైదరాబాద్ నగరంలో ఒక సీటు ఇస్తామని ఆపార్టీ నేతలు చెబుతున్నారని తమ్మినేని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి సీపీఎంతో పొత్తుపై చిత్తశుద్ధి లేకనే అలా మాట్లాడుతున్నారని, ఇది సరైంది కాదని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ, అది మద్దతిచ్చే పార్టీ గెలవొద్దనే విషయంలో తమ వైఖరి చాలా స్పష్టంగా ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ముందుకొస్తే సంతోషమని వ్యాఖ్యానించారు. తాజా పరిణామాలను సీపీఐ నేతలకు కూడా తెలియజేశామని చెప్పారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

'పొత్తు' పొడిచేనా!

- ఎటూ తేల్చని కాంగ్రెస్
- వైరా ఇస్తామని చెప్పలేదంటున్న నేతలు
- ఆ సీటు ఇవ్వకుంటే కుదరదంటున్న సీపీఎం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, వామపక్షాల పొత్తుపై నీలినీడలు అలుముకుంటున్నాయి. ఆ పార్టీల మధ్య పొత్తు కుదురుతుందా? లేదా? అన్న సందిగ్ధత ఏర్పడుతోంది. సీపీఐ విషయంలో స్పష్టత వచ్చినా, సీపీఎంకిస్తామన్న రెండుస్థానాల్లో మిర్యాలగూడ ఖరారు చేసిన కాంగ్రెస్ పార్టీ.. వైరా స్థానంపై ఎటూ తేల్చకపోవడంతో ఆదివారం సీన్ మారిపోయింది. వైరా ఇవ్వనిపక్షంలో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని సీపీఎం స్పష్టం చేసింది. కాంగ్రెస్ తన తుది నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉన్న నేపథ్యంలో అసలు వామపక్షాలు, కాంగ్రెస్ మధ్య పొత్తు ఉంటుందా లేదా అన్న చర్చ జరుగుతోంది.

సీపీఐ మౌనం..

సీపీఐ, సీపీఎంలకు రెండేసి చొప్పున అసెంబ్లీ స్థానాలు కేటాయించేందుకు కాంగ్రెస్ పార్టీ అంగీకరించింది. అయితే వామపక్షాలు కోరుకున్న విధంగా స్థానాలు ఇవ్వడం కుదరదని స్పష్టం చేసింది. సీపీఐ కొత్తగూడెం, మునుగోడు స్థానాలు కోరగా, కాంగ్రెస్ పార్టీ కొత్తగూడెం, చెన్నూరు స్థానాలు కేటాయించింది. సీపీఎం మిర్యాలగూడతో పాటు భద్రాచలం లేదా పాలేరు స్థానాలు ఇవ్వాలని కోరగా మిర్యాలగూడ మాత్రమే సాధ్యమవుతుందని, మిగిలిన రెండింటిలో ఏ సీటూ ఇవ్వలేమని కాంగ్రెస్ తేల్చిచెప్పింది. ఆ రెండు స్థానాలకు తమ అభ్యర్థులను కూడా ప్రకటించింది. దీంతో వైరా తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ కూడా ఇచ్చేందుకు సిద్ధమైనట్టు భావించినా ఒక్కరోజులో పరిస్థితి మారింది. తాజా పరిణామాలపై సీపీఐ మౌనంగా ఉంది. ఏం చేయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. కాగా ముందు ప్రకటించిన చెన్నూరు స్థానం కూడా సీపీఐకి కేటాయించే అవకాశాలు కనిపించడం లేదని అంటున్నారు. అదే నిజమైతే సీపీఐ వైఖరి కూడా మారే అవకాశముందని చెబుతున్నారు. ఒక వేళ చెన్నూరు ఖరారైతే కాంగ్రెస్‌తో ముందుకు వెళుతుందా? సీపీఎంతో ముడిపెడుతుందా? అనే చర్చ జరుగుతోంది.

సహకారంపై సందేహాలు

పొత్తు కుదిరినా కాంగ్రెస్ ఏమేరకు సహకరిస్తుందోనన్న చర్చ కూడా నడుస్తోంది. ఇప్పటికే మిర్యాలగూడలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిని ఆ పార్టీ అనధికారికంగా ప్రోత్సహిస్తోందని సీపీఎం వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. కొత్తగూడెంలోనూ అలాంటి పరిస్థితే నెలకొందని సీపీఐ వర్గాలు చెబుతున్నాయి. ఇలాగైతే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో రెబల్ అభ్యర్థులను ప్రోత్సహించకూడదనే షరతును కాంగ్రెస్ పార్టీ ముందు పెట్టాలని వామపక్షాలు భావిస్తున్నట్టు సమాచారం.

పెండింగ్ 19పై నేడు భేటీ

- ఢిల్లీకి పయనమైన టీపీసీసీ నేతలు
- నేటి రాత్రి.. లేదంటే రేపు తుది జాబితా!
- వామపక్షాలతో పొత్తు తేలే అవకాశం

సాక్షి, హైదరాబాద్: పెండింగ్‌లో ఉన్న 19 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్‌పార్టీ సోమవారం తుది చర్చలు జరపనుంది. వామపక్షాలతో పొత్తుతో పాటు పోటీ తీవ్రంగా ఉన్న ఈ స్థానాల్లో ఏం చేయాలన్న దానిపై ఢిల్లీ వేదికగా నేతలు సమావేశం కానున్నారు. ఈ భేటీ కోసం టీపీసీసీ నేతలు ఆదివారమే ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఏఐసీసీ కార్యాలయంలోని వార్ రూంలో పార్టీ అధిష్టానంతో జరిగే సమావేశానంతరం సోమవారం రాత్రి లేదంటే మంగళవారం తుది జాబితా వస్తుందని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి.

లెఫ్ట్‌తో 'లెఫ్టా.. రైటా?'


లెఫ్ట్ పార్టీలతో పొత్తుల విషయంలోనూ సోమవారం జరిగే సమావేశాల్లో స్పష్టత వస్తుందని కాంగ్రెస్ వర్గాలు చెపుతున్నాయి. ముఖ్యంగా సీపీఎం పార్టీతో పీటముడి పడిన వైరా, మిర్యాలగూడ స్థానాల్లో ఏం చేయాలన్న దానిపై కాంగ్రెస్ నేతలు నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో పాటు సీపీఐకి ఇవ్వాలనుకుంటున్న కొత్తగూడెం, చెన్నూరు సీట్ల విషయంలోనూ తేడా వచ్చిందనే చర్చ జరుగుతోంది.

వివేక్ కుమారుడికి చెన్నూరు సీటు?

చెన్నూరు స్థానాన్ని మాజీ ఎంపీ వివేక్ కుమారుడికి కేటాయించేందుకు కాంగ్రెస్ పార్టీ అంగీకరించిందని, ప్రస్తుతం బీజేపీలో ఉన్న వివేక్‌ను పార్టీలో చేర్చుకుని ఆయన్ను పార్లమెంటుకు పోటీ చేయించాలని కాంగ్రెస్ ప్రతిపాదిస్తోందని సమాచారం. ఈ మేరకు శనివారమే మొయినాబాద్‌లోని వివేక్ ఫాంహౌస్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, వివేక్‌లు భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో సీపీఐకి చెన్నూరు అసెంబ్లీ కేటాయించడం కష్టమేనని, సీపీఐ, సీపీఎంలకు చెరొక్క సీటును మాత్రమే కాంగ్రెస్ ఆఫర్ చేస్తుందని, ఇందుకు ఆ పార్టీలు అంగీకరిస్తే కలిసి ముందుకెళ్లవచ్చని, లేదంటే ఎవరి దారిలో వారు వెళ్లాల్సి వస్తుందని కాంగ్రెస్ నేతలంటుండడం గమనార్హం.

గాంధీభవన్‌లో ఉద్రిక్తత

నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలంటూ ఆందోళన



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న వ్యక్తిని అడ్డుకుంటున్న కార్యకర్తలు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రాబోయే ఎన్నికల రెండవ జాబితా విడుదలైన తర్వాత కాంగ్రెస్ పార్టీలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆదివారం గాంధీభవన్‌లో నర్సాపూర్ అభ్యర్థిగా ఆవుల రాజిరెడ్డిని మార్చాలని కోరుతూ నియోజకవర్గ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన దిగారు. ఈ సందర్భంగా పలువురు ఆందోళనకారులు మాట్లాడుతూ....కాంగ్రెస్ పార్టీ అంటే తమకు ఎంతో అభిమానమని గత కొన్నేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నవారిని కాదని ఇతరులకు టికెట్లు కేటాయించడం సరికాదన్నారు. బచావో కాంగ్రెస్ హటావో పారాచూట్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఓ కార్యకర్త పెట్రోలు పోసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే పక్కనే ఉన్న పార్టీ కార్యకర్తలు అడ్డుకుని ఆ వ్యక్తిపై నీళ్లుచల్లి నిప్పుంటించుకునే ప్రయత్నాన్ని ఆపివేశారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారుతుండటంతో పోలీసులు కలుగజేసుకుని పార్టీశ్రేణులను బయటకు పంపించివేశారు.

మద్యం నియంత్రణకు సహకరించండి

సరిహద్దు రాష్ట్రాల అధికారులతో తెలంగాణ ఎక్సైజ్ అధికారుల భేటీ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తరలించకుండా ఉండేందుకు సహకరించాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ పొరుగు రాష్ట్రాల అధికారులను కోరింది. 2023 ఎన్నికల్లో భాగంగా అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణలో నిర్వహించారు. సమావేశంలో కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా ఎక్సైజ్ నేరాల నియంత్రణ, ఇతర రాష్ట్రాల సహకారం, సమాచార మార్పిడి తదితర అంశాలపై ఐదు రాష్ట్రాల అధికారులు చర్చించారు. సమావేశంలో భాగంగా రాష్ట్ర ఎక్సైజ్ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ మాట్లాడుతూ, ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా మద్యం అక్రమ తయారీ, రవాణా జరిగే అవకాశముందని, అక్రమార్కులు సరిహద్దుల్లో తిష్టవేసి నేరాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తారని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో సరిహద్దు రాష్ట్రాల అధికారులు సహకారం అందించాలని, తెలంగాణలో ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని కోరారు.




ఆదివారం తిరుమలగిరి, కోదాడలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలకు హాజరైన బీఆర్‌ఎస్‌ పార్టీ శ్రేణులు, ప్రజలు

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్‌ను తిట్టిన నాగం ఇప్పుడెలా చేరారు?

టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి



సాక్షి, నాగర్‌కర్నూల్‌: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతిపై నిత్యం సీఎం కేసీఆర్‌ను నిలదీస్తూ.. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పోరాటం చేస్తున్న నాగం జనార్దన్‌రెడ్డి ఇప్పుడు బీఆర్‌ఎస్‌లో ఎందుకు చేరుతున్నారో ప్రజలకు చెప్పాలని టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడు మల్లు రవి కోరారు. నాగర్‌కర్నూల్‌ జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్‌ అభ్యర్థి కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డితో కలిసి మల్లు రవి విలేకరులతో మాట్లాడారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు మోటార్ల కొనుగోళ్లలో అవినీతిపై లెక్కలతో సహా చెప్పిన నాగం, ఇప్పుడు ఆ ఆరోపణలపై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. ఏఐసీసీ, టీపీసీసీ చేపట్టిన సర్వేల్లో ముందున్న వారికే టికెట్లు కేటాయించిందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఇన్‌చార్జ్‌ ఠాక్రే, జానారెడ్డి కలిసి పలుమార్లు జనార్దనరెడ్డితో సమావేశమై ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్సీ ద్వారా మంత్రిగా అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారని వివరించారు. తాను 1985 నుంచి 2018 వరకు కాంగ్రెస్‌పార్టీలో ఉన్నానని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. 2018లో నాగం జనార్దన్‌రెడ్డే పారాచూట్‌లా పార్టీలోకి వచ్చి తనను బయటకు పంపాడని ఆరోపించారు.

కాంగ్రెస్‌కు అధికారం అసాధ్యం

ఎంపీ బడుగుల లింగయ్య

సాక్షి, హైదరాబాద్‌: కాంగ్రెస్‌ పార్టీ నేతలు పొర్లు దండాలు పెట్టినా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని బీఆర్‌ఎస్‌ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌ పేర్కొన్నారు. కాంగ్రెస్‌ పార్టీ బస్సుయాత్రలతో ప్రజలకు ఒరిగేదేమీలేదని ఎద్దేవా చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో ఆదివారం ఎంపీ లింగయ్య మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా వెలువడిన తర్వాత కాంగ్రెస్‌ పార్టీ మరింత అప్రతిష్టపాలైందన్నారు. టీపీసీసీ పదవిని రేవంత్‌రెడ్డి డబ్బులతో కొనుగోలు చేశారని ఆరోపించిన రాజగోపాల్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌ గూటికే చేరడం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్‌ నేతలు పార్టీని వీడుతుండటం ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతోందన్నారు. సర్వేలన్నీ బీఆర్‌ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయన్నారు.

ఓటమి తప్పదని తెలిసే బీజేపీ బీసీ రాగం: ప్రకాశ్‌

సాక్షి, హైదరాబాద్‌: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసే బీసీ సీఎం పేరిట బీజేపీ కొత్త రాగం అందుకుందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ బండా ప్రకాశ్‌ముదిరాజ్‌ విమర్శించారు. బీజేపీ పక్కా బీసీల వ్యతిరేక పార్టీ అని, తెలంగాణలో ఆ పార్టీ గెలిచే అవకాశాలు లేవని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ప్రకాశ్‌ ముదిరాజ్‌ మీడియాతో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేకపోయాయని అన్నారు. బీసీ సీఎం పేరిట ప్రజలను మోసగించేందుకు వస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని ప్రకాశ్‌ పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌ పొరుగునేతలతో అసత్య ప్రచారాలు: దాసోజు



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో జరిగిన అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌ పార్టీ ఓర్వడంలేదని బీఆర్‌ఎస్‌ పార్టీ సీనియర్‌ నేత దాసోజు శ్రవణ్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన ఊపిరితో ఉన్న ఈ పార్టీ కోసం పొరుగు రాష్ట్రాల నుంచి నేతలు టూరిస్టుల మాదిరి వచ్చి ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని, వాటిని ఇక్కడి ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్‌ పార్టీకి నాయకులు కరువయ్యారని, దీంతో పొరుగు రాష్ట్రాల నుంచి ఆ పార్టీ నాయకులు వచ్చి అసత్య ప్రచారాలు చేస్తూ తెలంగాణ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలను అమలు చేశామంటూ ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఆయన మాటలు చూస్తుంటే గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు.

బీఆర్‌ఎస్‌కు వికారాబాద్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దంపతుల రాజీనామా

వికారాబాద్‌ అర్బన్‌: కొంత కాలంగా వికారాబాద్‌ ఎమ్మెల్యే ఆనంద్‌పై అసంతృప్తితో ఉన్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దంపతులు మంజుల, రమేశ్‌ ఎట్టకేలకు ఆదివారం బీఆర్‌ఎస్‌ పార్టీకి రాజీనామా చేశారు. వారి రాజీనామాతో పట్టణంలో పార్టీకి గట్టి దెబ్బే తగిలింది. మున్సిపల్‌ పరిధిలో మాజీ వైస్‌ చైర్మన్‌ చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్‌కు అన్ని వర్గాల్లో మంచి పట్టు ఉంది. పట్టణంలో ఆయన మాస్‌ నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రధానంగా స్లమ్‌ ఏరియాల్లో, శివారు వార్డుల్లో, వ్యాపార వర్గాలు, ఉద్యోగుల్లో ఆయనకు వ్యక్తిగత అభిమానులు ఉండటంతో అనేక సార్లు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు.

తోడేళ్లలా ఆవురావురు

కోదాడ, తుంగతుర్తి, ఆలేరు సభల్లో కాంగ్రెస్‌పై కేసీఆర్‌ ఫైర్‌

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, సాక్షి, యాదాద్రి, కోదాడ

‘కాంగ్రెస్‌ పదేళ్లుగా అధికారం లేక ఆకలితో ఆవురావురంటోంది. చాన్స్‌ ఇస్తే గొర్రెల మంద మీద తోడేళ్లు పడ్డట్టు పడదాం.. మట్టిగడ్డ కూడా మింగుదామనే ఆలోచనతో ఆ పార్టీ నేతలు ఉన్నారు. అలాంటి కాంగ్రెస్‌ కావాలా? అభివృద్ధిలో ముందుకు పోతున్న బీఆర్‌ఎస్‌ కావాలా? ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి..’ అని సీఎం కేసీఆర్‌ అన్నారు. ‘మేము తెలంగాణ ఇచ్చామని చెప్పడానికి కాంగ్రెస్‌ పార్టీకి సిగ్గుండాలి. 14 ఏళ్ల పాటు ఏడిపించారు. ఎంతోమంది ప్రాణాలు తీసుకున్నారు. ఏడాదిపాటు భయంకరమైన పోరాటం చేస్తే ఇచ్చారు తప్ప పుణ్యానికి ఇవ్వలే..’ అంటూ ధ్వజమెత్తారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కోదాడ, ఆలేరులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో, తిరుమలగిరిలో నిర్వహించిన తుంగతుర్తి నియోజకవర్గ సమర శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు.



కోదాడ సభలో అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్‌

చావునోట్లో తలకాయ పెడితే దిగొచ్చారు..

‘బీఆర్‌ఎస్‌తో కాంగ్రెస్‌ పొత్తు పెట్టుకొని రాష్ట్రంలో, ఢిల్లీలో అధికారం పొంది ఏడిపించారు తప్ప, మర్యాదగా తెలంగాణ ఇవ్వలేదు. ఉద్యమంలో కేసీఆర్‌ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అని ఆమరణ దీక్ష చేపట్టి చావు నోట్లో తలకాయ పెడితే, ప్రజలంతా ఉప్పెనలా ఉద్యమం చేస్తే అప్పుడు దిగి వచ్చి తెలంగాణ ప్రకటన చేశారు. మళ్లీ కొంతమంది ముందుకు ఎగదోసి రాజీనామా నాటకం ఆడి, వెనక్కి తీసుకున్నారు. తరువాత ఏడాదిపాటు భయంకరమైన ఉద్యమం చేస్తే తప్ప మన తెలంగాణ మనకు రాలేదు. ఎంతమంది ప్రాణాలు తీసుకున్నారు. ఎంతమంది ఉద్యమకారులను జైల్లో పెట్టారు. చెరుకు సుధాకర్‌ను కూడా జైల్లో వేశారు. అయినా తట్టుకుని నిలబడ్డాం కాబట్టి, పోరాటం చేశాం కాబట్టి దిగి వచ్చి ఇచ్చారు. శ్రీకాంతాచారి లాంటి వారి ప్రాణాలను బలి తీసుకొని ఇచ్చారు తప్ప పుణ్యానికి తెలంగాణ ఇవ్వలే. ఎవరెవరివో బూట్లు నాకిన వాళ్లు ఇప్పుడు వచ్చి చెప్పే మాటలు నమ్మొద్దు. తెలంగాణ ఉద్యమానికి బయలుదేరినప్పుడు పిడికెడు మందే ఉన్నాం. ఒక్క కాంగ్రెస్‌ నాయకుడు, బీజేపీ నాయకుడు రాలేదు. జేఏసీ ఏర్పాటు కోసం రాజీనామా చేయమంటే మంత్రి పదవులను వదిలిపెట్టలేదు. ఎన్నికలు వచ్చాయంటే రకరకాల మనుషులు వచ్చి రకరకాలుగా మాట్లాడతారు. ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలి..’ అని కేసీఆర్‌ విజ్ఞప్తి చేశారు.

రాహుల్‌కు వ్యవసాయం ఎరుకనా?

‘కాంగ్రెస్‌ నాయకులు ధరణి పోర్టల్‌ను తీసేస్తామని పదేపదే చెబుతున్నారు. రాహుల్‌గాంధీ కూడా ధరణి తీసేస్తానంటున్నాడు. ఆయనకు వ్యవసాయం ఎరుకనా.. ఎడ్డు ఎరుకనా, ఎన్నడన్న నాగలి దున్నిండా..? ఎవడో సన్నాసి రాసిస్తే చిలుక పలికినట్లు పలుకుతున్నాడు. ధరణి ఉంటేనే మీ భూములు మీకున్నాయి. నిశ్చింతగా ఉన్నారు. ప్రభుత్వం వద్ద, అధికారుల వద్ద భూములపై ఉన్న అధికారాన్ని ధరణితో రైతులకే ఇచ్చాం. ఒకరి భూములను ఒకరికి రాసిన తంటాలు పోయాయి. ధరణితో మీ బొటన వేలు పడితే తప్ప మీ భూమి బదిలీ కాదు. ఆ అధికారాన్ని కాపాడుకుంటారా? పోగొట్టుకుంటారా? మీరే నిర్ణయించుకోవాలి. ధరణి తీసివేస్తే వీఆర్‌ఓలు వస్తారు, అధికారుల రాజ్యం వస్తుంది. పహాణి నకళ్ల కోసం తిరగాలి. రైతుబంధు రూ.10 వేలు వస్తే రూ.3 వేలు ఇమ్మంటారు. గతంలో చూసిన దోపిడీ దొంగల రాజ్యమే రావాలా? ధరణి ఉండి రైతులకే అధికారం ఉండాలా? ఆలోచించండి. ధరణిలో భూమి ఉందంటే రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు కూడా కొంటున్నారు..’ అని సీఎం చెప్పారు.

తెలంగాణ సల్లగ గావాలి..

‘కాంగ్రెస్‌ నాయకుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు వృథా అంటున్నాడు. ప్రజలు చెల్లిస్తున్న పన్నుల డబ్బును దుబారా చేస్తున్నామని అంటున్నాడు. రైతుబంధు ఉంచాలా..? తీసి వేయాలా..? ఉండాలంటే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వాన్ని గెలిపించాలి. రైతుబంధు అనేది ఒట్టిగా ప్రకటించలేదు. ఎంతో ఆలోచించి ప్రారంభించాం. ఓట్ల కోసం తేలేదు. ఎక్కడకెళ్లి అడిగినా రైతుబంధు ఉండాలని లక్షల మంది సభల్లో చెబుతున్నారు. తెలంగాణ రాకముందు 40, 50 లక్షల టన్నుల వడ్లు పండితే.. ఇప్పుడు 3 కోట్ల టన్నుల వడ్లు పండుతున్నాయి. ఎక్కడికక్కడే కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఒకనాడు రైతు కుటుంబాలకు పిల్లను ఇచ్చేవారు కాదు, ఇప్పుడు పిల్లను ఇవ్వాలంటే భూమి ఉందా? అని అడుగుతున్నారు. హైదరాబాద్‌లో ఉన్నవారు కూడా వచ్చి వ్యవసాయం చేస్తున్నారు. తెలంగాణ సల్లగ గావాలి..రైతుల ముఖాలు తెల్లగ గావాలి.. అప్పుల బాధలు పోవాలి..’ అని ఆకాంక్షించారు.

శివకుమార్‌.. ఇజ్జత్‌ తీసుకోవడానికి వచ్చాడా?

‘24 గంటల కరెంట్‌ దేశంలో ఒక్క తెలంగాణలోనే ఇస్తున్నాం. వ్యవసాయ స్థిరీకరణ జరగాలని నాలుగైదేళ్లుగా ఒక పాలసీ ప్రకారం ఇస్తున్నాం. కేంద్రం ఎన్నో ఇబ్బందులు పెట్టింది. మీటర్లు పెట్టాలని వత్తిడి తెచ్చి పెట్టకపోతే ఏడాదికి రూ.25 వేల కోట్ల కోత పెట్టింది. ఇంకో పది వేల కోట్లు కోత పెట్టినా.. నా ప్రాణం పోయినా మోటార్లకు మీటర్లు పెట్టనని చెప్పా. పీసీసీ అధ్యక్షుడేమో 24 గంటల కరెంటు ఇచ్చి కేసీఆర్‌ దుబారా చేస్తున్నారని అంటున్నాడు. 3 గంటలే సరిపోతుందని చెబుతున్నాడు. 3 గంటలు ఉండాలా? 24 గంటలు ఉండాలా? 24 గంటలు ఉండాలంటే బీఆర్‌ఎస్‌కే ఓటు వేయండి. కర్ణాటక ఉప ముఖ్యమంతి శివకుమార్‌.. మా రాష్ట్రంలో ఐదు గంటల కరెంటు ఇస్తున్నాం.. మా గొప్పతనం చూడమంటున్నాడు. నవ్వాలో ఏడ్వాలో తెలవడం లేదు. ఆయన ప్రచారానికి వచ్చాడా.. ఇజ్జత్‌ తీసుకోవడానికి వచ్చాడా?’ అని సీఎం ఎద్దేవా చేశారు.

దళిత బిడ్డల దరిద్రాలు పోవాలనే దళితబంధు

‘జవహర్‌లాల్‌ నెహ్రూ ప్రధానమంత్రి అయిన నాడే దళితుల పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో అంబేడ్కర్‌ మాట గౌరవించి దళితుల అభివృద్ధికి శ్రీకారం చుడితే 75 ఏళ్ల స్వాతంత్య్రం తరువాత కూడా దళితులకు ఈ దరిద్రం ఎందుకు ఉండేది? తెలంగాణ వచ్చాక, ఒక దశకు వెళ్లాక దళిత బిడ్డల దరిద్రాలు పోవాలనే దళితబంధు పథకం తీసుకొచ్చాం. ఎన్నికలు రావడంతో కొంతమంది వస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌ నుంచి ఒకాయన వస్తున్నాడు. ఆయన రాష్ట్రంలో అన్నానికే గతి లేదు. యూపీ, బిహార్‌, బెంగాల్‌ కూలీలు నాట్లు వేయడానికి, బతకడానికి మన రాష్ట్రానికి వస్తుంటే.. ఆ రాష్ట్రాల సీఎంలు వచ్చి మనకు పాఠాలు చెబుతున్నారు..’ అని విమర్శించారు.

సంక్షేమంలో ముందున్నాం..

‘గతంలో తెలంగాణలో ఆత్మహత్యలు, వలసలు ఉండేవి. వీటన్నింటికీ రాష్ట్రం ఏర్పడిన తరువాత చరమగీతం పాడాం. తొమ్మిది, పదేళ్లలోనే దేశానికి తలమానికమైన తలసరి ఆదాయంలో నంబర్‌ వన్‌ అయ్యాం. పేదల సంక్షేమం, వ్యవసాయ విప్లవం, ఐటీ విప్లవం రావడంతో అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నాం. పేదల పెన్షన్లను పెంచుకున్నాం. కళ్యాణలక్ష్మి ప్రవేశపెట్టి పెంచుకున్నాం. మత్స్య సంపద రూ.33 వేల కోట్లకు పెరిగింది. రైతుబంధును యూఎన్‌ఓ ప్రశంసించింది..’ అని ముఖ్యమంత్రి కేసీఆర్‌ తెలిపారు.

పించన్లు సహా అన్నీ పెంచుకుందాం

‘సమైక్య పాలనలో రూ.40 నుంచి రూ.200 పింఛన్‌ ఇచ్చేవారు. తెలంగాణ రాగానే రూ.1,000 వరకు పెంచి దాన్ని రూ.2,016 వరకు తీసుకొచ్చాం. మరోసారి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం వస్తే రూ.5 వేల వరకు పెంచుకుందాం. రైతుబంధు కూడా దశల వారీగా పెంచుకుంటూ పోతాం. రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లోకి డబ్బులను నేరుగా పంపుతుంది. ఇలా ప్రభుత్వం ప్రతి విషయంలో రైతులకు అండగా ఉంటుంది..’ అని సీఎం హామీ ఇచ్చారు. తుంగతుర్తిలో కిషోర్‌ను లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గం మొత్తం దళితబంధు అమలు చేస్తామని చెప్పారు. యాదగిరిగుట్ట గోపురం అంత ఎత్తున ఓట్లు వేసి ఆలేరులో గొంగిడి సునీతను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంతమంది వ్యతిరేకించినా కోదాడ నుంచి బీసీ బిడ్డ మల్లయ్య యాదవ్‌కు టికెట్‌ ఇచ్చానని, బీసీలందరూ కష్టపడి అత్యధిక మెజారిటీతో ఆయన్ను గెలిపించాలని చెప్పారు.

కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే మోసపోతారు

- ఆ పార్టీని రాష్ట్రంలో సమాధి చేయాలి
- నర్సాపూర్‌ ఎన్నికల సభలో మంత్రి హరీశ్‌రావు



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

నర్సాపూర్‌: కాంగ్రెస్‌ నేతల మాటలు నమ్మి ఓటేస్తే మోసపోతారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మెదక్‌ జిల్లా నర్సాపూర్‌లో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్‌ పార్టీ ఎన్నికల శంఖారావం సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలో ఉన్న కర్ణాటకలో రోజుకు ఐదు గంటలే విద్యుత్‌ ఇస్తున్నామని, ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ ఇక్కడ ఎన్నికల ప్రచార సభలో చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. శివకుమార్‌ వాస్తవాన్ని చెప్పారంటూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. మన రాష్ట్రంలోని కాంగ్రెస్‌ నాయకుల మాటలు నమ్మి ఆ పార్టీకి ఓటేస్తే ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు కోసం గోసపడిన రోజులు మళ్లీ వస్తాయని ప్రజలను హెచ్చరించారు. డీకే శివకుమార్‌ మాటలను రాష్ట్రంలోని రైతులు అర్థం చేసుకుని కాంగ్రెస్‌ను తెలంగాణలో సమాధి చేయాలని హరీశ్‌రావు హితవు పలికారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక కష్టాలతో బతికామని, ఇప్పుడిప్పుడే మన బతుకులు ఒక స్థాయిలో బాగు పడుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్‌తోనే మన బతుకులు మరింత బాగు పడతాయని అన్నారు. కాగా, రైతుబంధు కింద ఆర్థిక సహాయం ఆపాలని కాంగ్రెస్‌ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని మంత్రి ఆరోపించారు. యాసంగికి రైతుబంధు కావాలా.. వద్దా? అని రైతులను ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. మూడు గంటల కరెంటు చాలని అంటున్నారని, అలాంటి వారికి ఓటెయ్యవద్దని చెప్పారు. ఈ సభలో నర్సాపూర్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సునీతారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నర్సాపూర్‌ ఎన్నికల ఇన్‌చార్జి వెంకటరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు నాలుగున్నర శతాబ్దాల చరిత్ర

- మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరం
- మీడియాతో బీజేపీ మధ్యప్రదేశ్‌ ఇన్‌చార్జి మురళీధర్‌రావు



సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్‌ నగరానికి నాలుగున్నర శతాబ్దాల చరిత్ర ఉందని, వాణిజ్యం, వ్యాపారం, విభిన్న సంస్కృతి, సాంప్రదాయాలు, కళలకు పేరొందిందని బీజేపీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్‌ ఇన్‌చార్జి మురళీధర్‌రావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ అధికారంలోకి రాకుంటే హైదరాబాద్‌ సంకనాకిపోతుందంటూ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యల పట్ల బీజేపీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్‌ ఇన్‌చార్జి మురళీధర్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...హరీశ్‌ వ్యాఖ్యలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానన్నారు. ఓటమి భయంతో ఉన్న బీఆర్‌ఎస్‌ నాయకులు ఇష్టానుసారంగా బూతులు మాట్లాడుతున్నారన్నారు. నిజాం కాలం కంటే ముందు నుంచే హైదరాబాద్‌ ప్రపంచ ఖ్యాతి గడించిందని, హరీశ్‌ అతని మామ కేసీఆర్‌ పుట్టకముందు నుంచి ఎన్నో రకాలుగా ఘనత సాధించిన నగరమని వివరించారు. జనరిక్‌ మెడిసిన్‌ ఉత్పత్తిలో అతి ముఖ్యమైన నగరం హైదరాబాద్‌ అని, ఇందులో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాత్ర ఏంటి అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మాఫియా రాజ్యం పోవాలన్నా వేగంగా అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్‌ ఓడిపోవాలన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న బీజేపీ కార్యకర్తలను జైలులో వేస్తోందని, ఇప్పటివరకు హైదరాబాద్‌లో హమాస్‌కు మద్దతుగా ర్యాలీ తీస్తుంటే బీఆర్‌ఎస్‌ మద్దతు ఇస్తోందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్‌ ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

బీసీల కోసం కేసీఆర్‌ ఎంతో చేశారు

- జూలూరు గౌరీశంకర్‌ ‘బీసీ ఆత్మగౌరవ భవనాలు’ పుస్తకావిష్కరణలో తలసాని



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని. చిత్రంలో రచయిత జూలూరు

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో బీసీలకు, అట్టడుగు వర్గాల పేదల అభ్యున్నతికి కేసీఆర్‌ లాగా కృషి చేసిన ముఖ్యమంత్రి దేశంలో మరెక్కడా లేరని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ అన్నారు. ఆదివారం తన నివాసంలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్‌ జూలూరు గౌరీశంకర్‌ రాసిన ‘బీసీ ఆత్మగౌరవ భవనాలు’ పుస్తకాన్ని శ్రీనివాస్‌ యాదవ్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీ సామాజిక వర్గాల జీవన ప్రమాణాలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్మాణాత్మకంగా కృషి చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీలకు ఆత్మగౌరవ భవనాలు కట్టించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, చేతి వృత్తుల వారికి లక్ష రూపాయలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. ‘మేమొస్తే బీసీ సీఎం’ అని అమిత్‌ షా ప్రకటించడం పచ్చి బూటకమని విమర్శించారు. బీజేపీకి, కాంగ్రెస్‌కి బీసీ ఓట్ల మీద ఉన్న శ్రద్ధ బీసీల జీవన ప్రమాణాలు పెంచడంపై లేదని విమర్శించారు. పుస్తక రచయిత జూలూరు గౌరీశంకర్‌ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్‌ దార్శనిక ఆలోచనలకు ఆచరణ రూపంగా బీసీలు నిలిచి తీరుతారని, కేసీఆర్‌ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా ఉంటారని అన్నారు.

నేడు మూడుచోట్ల సీఎం కేసీఆర్‌ సభలు

సాక్షి, హైదరాబాద్‌: భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, సీఎం కె.చంద్రశేఖర్‌రావు సోమవారం మూడు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే బహిరంగసభల్లో పాల్గొని ప్రసంగిస్తారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన హెలికాప్టర్‌లో బయలుదేరి కామారెడ్డి జిల్లా జుక్కల్‌ నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగే సభలో పాల్గొని అక్కడ నుంచి బాన్సువాడకు చేరుకుంటారు. బాన్సువాడలో రెండు గంటలకు జరిగే సభలో సీఎం కేసీఆర్‌ ప్రసంగిస్తారు. తిరిగి 3 గంటలకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌ నియోజకవర్గ కేంద్రంలో జరిగే సభలో పాల్గొంటారు. అక్కడ నుంచి హైదరాబాద్‌కు సీఎం కేసీఆర్‌ బయలుదేరి వెళ్తారు. పార్టీ అభ్యర్థులు హనుమంతు షిండే(జుక్కల్‌), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), ఎం.భూపాల్‌రెడ్డి (నారాయణఖేడ్‌)కు మద్దతుగా ప్రచారం చేస్తారు.

కర్ణాటకలో ఐదు గంటలే కరెంట్‌



- వ్యవసాయ విద్యుత్‌పై ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రే చెప్పారు: కేటీఆర్‌
- గ్యారంటీల పేరిట అరచేతిలో వైకుంఠం చూపుతున్నారు
- గెలవగానే కమీషన్లకు ద్వారాలు తెరిచారు
- కాంగ్రెస్‌కు అధికారమిస్తే తెలంగాణలో అంధకారమేనని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్‌: దేశంలోనే ఎక్కడా లేనిరీతిలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్న తెలంగాణకు వచ్చి కర్ణాటకలో ఐదు గంటల కరెంటు ఇస్తున్నామని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మంత్రి కేటీ రామారావు విమర్శించారు. కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే అంధకారం తప్పదని తెలంగాణ ప్రజలకు అర్థమవుతోందని ‘ఎక్స్‌ (ట్విట్టర్‌)’ వేదికగా మండిపడ్డారు. ‘‘కర్ణాటకలో వ్యవసాయానికి ఐదు గంటల కరెంటు ఇవ్వడం అక్కడి కాంగ్రెస్‌ ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనం. కాంగ్రెస్‌ వైఫల్యాలను చూసేందుకు కర్ణాటక వరకు వెళ్లాల్సిన అవసరం లేదు. అక్కడ దగాపడిన రైతులు తెలంగాణకు వచ్చి అన్యాయాలను వివరిస్తున్నారు. కాంగ్రెస్‌ నుంచి తెలంగాణకు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. ఓవైపు కర్ణాటక ప్రజలు పుట్టెడు కష్టాలు పడుతుంటే అవి పట్టించుకోకుండా డీకే శివకుమార్‌ తెలంగాణకు ఓట్ల వేటకోసం వచ్చారా?’’ అని కేటీఆర్‌ ప్రశ్నించారు.

అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు.

కర్ణాటక ఎన్నికల సందర్భంగా ఐదు గ్యారెంటీలు అంటూ హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్‌.. ఆ తర్వాత సవాలక్ష కొర్రీలు పెడుతూ ప్రజలతో ఆడుకుంటోందని కేటీఆర్‌ ఆరోపించారు. అక్కడ గృహజ్యోతి పథకం గాలిలో దీపంలా ఆరిపోయిందని, చార్జీల వాతతో కర్ణాటక చీకటి రాజ్యంగా మారిందని విమర్శించారు. కరెంటు కోతలతో బెంగళూరు సహా వ్యాపార, వాణిజ్య సంస్థలు ఇబ్బందులు పడుతున్నాయని, రేషన్‌ బియ్యం కూడా ఇవ్వలేని స్థితిలో అన్నభాగ్య పథకం అటకెక్కిందని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహలక్ష్మి పథకాలకు గ్రహణం పట్టిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అక్కడ కమిషన్లకు కాంగ్రెస్‌ ద్వారాలు తెరిచిందని ఆరోపించారు. కర్ణాటకలో అన్ని రంగాలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్‌ను నమ్మేందుకు తెలంగాణ సిద్ధంగా లేదని వ్యాఖ్యానించారు.

రేవంత్‌కు అధికారమిస్తే కోఠిలో అమ్మేస్తాడు

▶ మొదటి పేజీ తరువాయి

అమ్మేస్తాడు. అందుకే కాంగ్రెస్‌ పార్టీని నమ్మొద్దు..’’ అని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మంత్రి కేటీ రామారావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, టూరిజం కార్పొరేషన్‌ చైర్మన్‌ గెల్లు శ్రీనివాస్‌ యాదవ్‌ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్వీ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్‌ మాట్లాడారు. రాష్ట్రంలో ఒక్క చాన్స్‌ ఇవ్వాలని కాంగ్రెస్‌ వాళ్లు బతిమాలుతున్నారని.. ఎందుకు చాన్స్‌ ఇవ్వాలని ప్రశ్నించారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ డబ్బు సంచులతో వచ్చినా ఇక్కడ చేసేదేమీ లేదని.. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తున్న తెలంగాణకు వచ్చి కర్ణాటకలో ఐదు గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామని డీకే చెప్పడంపై నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. రాజకీయ యుద్ధంలో తమతో పోటీ పడుతున్న కాంగ్రెస్‌ పార్టీ.. ఉద్యమ సమయంలో యువత, విద్యార్థుల చావులకు కారణమైందని, ఇప్పుడు ఓట్లు అడగటానికి వస్తోందని పేర్కొన్నారు.

టీఎస్‌పీఎస్సీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తాం

‘‘గతంలో ప్రశ్నపత్రాలు లీక్‌ చేసింది బీజేపీ ఎంపీ బండి సంజయ్‌ చెంచా గాడు కాదా? గ్రూప్‌–2 పరీక్ష రద్దు చేయాలని డిమాండ్‌ చేసిందే బండి సంజయ్‌, ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌. ఆ తర్వాత పరీక్ష రద్దు చేస్తే గొడవ చేసిందీ వీళ్లే. కోర్టులో కేసు వేసి గ్రూప్‌–2 పరీక్షను రద్దు చేయించారు. కడుపులో గుద్ది.. నోట్లో పిప్పర మెంట్‌ పెడతారు వాళ్లు. పరీక్షల నిర్వహణలో కొన్ని తప్పులు జరిగినట్టు ఒప్పుకుంటున్నా. డిసెంబర్‌ 3 తర్వాత టీఎస్‌పీఎస్సీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసే బాధ్యత తీసుకుంటా..’’ అని కేటీఆర్‌ ప్రకటించారు. సోషల్‌ మీడియా ద్వారా బీజేపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని అదే వేదికల ద్వారా తిప్పికొట్టి వాస్తవాలు ప్రచారం చేయాలని బీఆర్‌ఎస్వీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తొమ్మిదేళ్లలో కేసీఆర్‌ ఏం చేశారని ప్రతిపక్షాలు వేస్తున్న ప్రశ్నలకు సోషల్‌ మీడియా వేదికగా దీటుగా సమాధానాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పదేళ్ల వయసున్న పిల్లలకు ఇప్పుడు ఓటు హక్కు వచ్చిందని.. 2014 ముందు నాటి పరిస్థితులను వారికి తెలియచేయాలని.. ఊదరగొట్టే ఉపన్యాసాలు ఇచ్చే వారి డొల్లతనాన్ని బయట పెట్టాలని సూచించారు. 33 జిల్లాల్లో విద్యార్థి సంఘం నాయకులు తెలంగాణ అభివృద్ధిపై చర్చ పెట్టాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్‌ మాజీ డిప్యూటీ మేయర్‌ బాబా ఫసియుద్దీన్‌, స్వామి యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.



నా అజ్ఞానపు వాస్తవం తప్ప, నాకు ఇంకేమీ తెలియదు.
– డైయొజినీజ్

సాక్షి
సోమవారం, 30 అక్టోబర్ 2023

మాటలంటే మాటలా!

మాటలదేముంది మాటలే కదా అని తేలికగా తీసిపారేయలేము. మాటలు కేవలం మాటలే కావచ్చు గాని, మాటలంటే మాటలు కాదు. లోకంలో మాటలు నేర్చిన జీవులు మనుషులే! తాము నేర్చిన మాటలను ఊసుపోక శుక పికాదులకు నేర్పించిన ఘనత కూడా మనుషులకే దక్కుతుంది గాని, అది వేరే విషయం. మాటల మహిమను వర్ణించాలంటే మాటలు చాలవు. మాటకారులు ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఇట్టే నెట్టుకొచ్చేయగలరు. అసాధ్యమనుకున్న పనులను చిటికెలో చక్కబెట్టగలరు. మాటకారులైన దౌత్యవేత్తలు మాటలతో యుద్ధాలను కూడా నివారించగలరు.

మాటల మహత్తును ఒక పూర్వకవి ఇలా వర్ణించాడు: 'మాటల చేత దేవతలు మన్నన జేసి వరంబు లిత్తురా/ మాటల చేత భూపతులు మన్నన జేసి పురంబు లిత్తురా/ మాటల చేత మానినులు మన్నన జేసి మనంబు లిత్తురా/ మాటలు నేర్వకున్న నవమానము, న్యూనము, మానభంగమున్'. చక్కగా మాట్లాడటం చేతనైతే దేవతలను; భూపతులను; మానినులను సైతం మెప్పించి, వారి ద్వారా కోరిన ప్రయోజనాలు పొందడం సాధ్యమవుతుంది. సక్రమంగా మాట్లాడటం చేతగాకుంటే చీవాట్లు, శిక్షలు తప్పకపోవచ్చు. నలుగురిలోనూ నవ్వుల పాలయ్యే పరిస్థితులు కూడా తప్పకపోవచ్చు.

మాటకారితనానికి మారుపేరుగా వెలిగిన మహానుభావులు చరిత్రలో చాలామంది ఉన్నారు. అక్బర్ ఆస్థానంలోని బీర్బల్, శ్రీకృష్ణదేవరాయల వారి ఆస్థానంలోని తెనాలి రామకృష్ణుడు వంటి వారు ఆ కోవలోకే వస్తారు. వారి మాటకారితనాన్ని ఇప్పటికీ జనాలు కథలు కథలుగా చెప్పుకుంటూనే ఉన్నారు. కొందరు ముక్తసరిగా మాట్లాడతారు. కొందరు ఆచి తూచి తూకం వేసినట్లుగా మాట్లాడతారు. కొందరు గలగలా ధారాళంగా మాట్లాడతారు. కొందరు రసజ్ఞులు సరసంగా మాట్లాడతారు. రసజ్ఞత బొత్తిగాలేని కొందరు విరసంగా మాట్లాడతారు. కొందరు నిష్ఠురంగా మాట్లాడతారు. 'నరుడు మదిలో దొంగ/ నాల్క బూతులబుంగ/ కడుగజాలదు గంగ' అన్నారు ఆరుద్ర. అదేం కర్మమోగాని కొందరు నోరు తెరిస్తే చాలు, బూతులతో మోత మోయిస్తారు. ఇటీవలి రాజకీయాల్లో ఇలాంటివారి వాగ్ధాటి విపరీతంగా మార్మోగుతోంది.

కొందరు మాటలతోనే కోటలు కట్టేస్తుంటారు కొందరి మాటలు కోటలు దాటేస్తుంటాయి. అలాంటివారు రాజకీయాల్లో అమోఘంగా రాణిస్తుంటారు. 'ఏదైనా సభలో ఆశువుగా మాట్లాడటానికి ముందు నేను కనీసం మూడువారాల పాటు సాధన చేస్తాను' అని చెప్పుకున్న మార్క్ ట్వేన్ మన రాజకీయ నాయక దిగ్గజాల ముందు ఎంతటి అర్భకుడో కదా పాపం! మన రాజకీయ నాయకులు అంత శ్రమ లేకుండానే, ఎంత పెద్ద బహిరంగ సభలోనైనా గంటల కొద్ది ఏకధాటిగా ప్రసంగించగలరు. రాజకీయరంగంలోనే కాదు, సాహితీ రంగంలోనూ, ఆధ్యాత్మిక ప్రవచన రంగంలోనూ ఇలాంటి అనర్గళ వాక్ప్రతిభాసంపన్నులు తారసపడుతుంటారు.

మాటలు రకరకాలు. మనుషుల్లో ఎన్ని రకాలో మాటలు కూడా అన్ని రకాలు. హితవైన మాటలు, మధురమైన మాటలు, కల్లబొల్లి మాటలు, సరళమైన మాటలు, పరుషమైన మాటలు, దుందుడుకు మాటలు, ముతక మాటలు, నాజూకు మాటలు, చమత్కారం మాటలు, వెటకారం మాటలు– చెప్పుకుంటూ పోతే జాబితా చేంతాడంతవుతుంది. మనది ప్రజాస్వామ్యం. అందువల్ల మనకు మాట్లాడుకునే స్వేచ్ఛ ఉంది. మన రాజ్యాంగం ప్రకారం 'వాక్స్వాతంత్య్రం' మన ప్రాథమిక హక్కుల్లో ఒకటి. దురదృష్టవశాత్తు జనాలు అతిగా దుర్వినియోగం చేసుకునే హక్కు కూడా ఇదే! 'ప్రజలు వాక్స్వాతంత్య్రాన్ని ఎందుకు కోరుకుంటారంటే, దాన్ని ఆలోచనా స్వాతంత్య్రానికి ప్రత్యామ్నాయంగా భావిస్తారు. ఆలోచనా స్వాతంత్య్రాన్ని దాదాపుగా వారు ఎప్పుడూ ఉపయోగించుకోరు' అని డేనిష్ కవి, తత్త్వవేత్త సోరెన్ కీర్కెగార్డ్ వాక్స్వాతంత్య్రాభిలాష వెనుకనున్న మతలబును రెండు శతాబ్దాల కిందటే తేటతెల్లం చేసేశాడు.

మాటలు నోటి ద్వారా వెలువడతాయి. అంతమాత్రాన మాట్లాడటానికి నోరు మాత్రమే ఉంటే సరిపోదు. మాట్లాడటానికి ఆలోచన అవసరం. అనాలోచితంగా మాట్లాడే మాటలు ఒక్కోసారి చిక్కుల్లోకి నెడతాయి. 'వివేకవంతులు తమ మాటలను ఆలోచనలతో జల్లెడ పడతారు' అన్నాడు బుద్ధుడు. కాకపోతే సమాజంలో వివేకవంతుల సంఖ్య ఎప్పుడూ పరిమితమే! అరకొర జ్ఞానంతో అల్లాడే వాక్శూరులు వినేవాళ్లను వెర్రిగొర్రెల్లా లెక్కగట్టి చేటభారతాలు చెప్పుకుంటూ పోతారు. వారి వాక్స్వాతంత్య్రాన్ని ఎవరూ హరించలేరు గాని, అమెరికా మాజీ ప్రధాన న్యాయమూర్తి వారెన్ ఇ బర్గర్ అన్నట్లుగా 'వాక్స్వాతంత్య్రంలో శ్రవణ స్వాతంత్య్రం కూడా మిళితమై ఉంటుంది' అనే వాస్తవాన్ని గుర్తెరగాలి. అప్పుడే వాక్స్వాతంత్య్రాన్ని సద్వినియోగం చేసుకోగలుగుతాం.

మనకు బహుభాషా పరిజ్ఞానం ఉంటే ఉండవచ్చు; అపారమైన పదసంపద ఉండవచ్చు; అనర్గళ వాగ్ధార ఉండవచ్చు. అంతమాత్రాన అనాలోచితంగా నోటికి ఎంతొస్తే అంత మాట్లాడుతూ పోతే శృంగభంగం తప్పదు. అసలే ఇది మనోభావాల కాలం. ఏ మాట ఎలాంటి విపరిణామాలకు దారితీస్తుందో అనేదానిపై కనీసమైన అంచనా మాట్లాడే ముందే ఉండాలి. ఎంతటి భాషావేత్తలయినా మాటలను ఆచి తూచి ఉపయోగించాలి. మాటల గురించి ఇన్ని మాటలు ఎందుకంటే, 'ఆది నుంచి ఆకాశం మూగది/ అనాదిగా తల్లి ధరణి మూగది/ నడుమ వచ్చి ఉరుముతాయి మబ్బులు/ నడమంత్రపు మనుషులకే మాటలు– ఇన్ని మాటలు' అని సెలవిచ్చారు వేటూరి. అదీ సంగతి. మరి మాటలంటే మాటలా!

పోయినవాళ్లు మిగిల్చేవి జ్ఞాపకాలే!

కామెంట్



కరణ్ థాపర్

ఇటీవల మరణించిన క్రికెటర్ బిషన్ సింగ్ బేడీ ఉల్లాసంగా ఉండేవారు. ఆయన భావోద్వేగాలు పారదర్శకంగా ఉండేవి. మంచి సంభాషణను ఇష్టపడతారు. మాట్లాడినదంతా ఓపిగ్గా వింటారు. ఆపలేనంతగా మాట్లాడుతూనే ఉంటారు. మరో క్రికెటర్ స్నేహితుడు టైగర్ పటౌడీలో ఆహ్లాదం కలిగించే హాస్యస్ఫూర్తి ఉంటుంది. అది అచ్చమైన బ్రిటిష్ నుడికారంతో కూడిన వెటకారం. పడాల్సిన చోట, పడాల్సిన మాటను సమయానికి, సందర్భానికి తగినట్లుగా తనదైన శైలిలో తటాలున జారవిడుస్తారు. మరో క్రికెట్ దిగ్గజం అబ్బాస్ అలీ బేగ్ లోతైన రాజకీయ అవగాహనను కలిగి ఉండేవారు. టైగర్, బిషన్ ఇప్పుడు మనతో లేరు. స్నేహితులకు సంబంధించిన ముఖ్యమైన విషయాలలో తరచు మనలో కదలాడేది వారి జ్ఞాపకాలే.

నేను క్రికెట్ అభిమానిని కాదన్న సంగతి రహస్యమేమీ కాదు. నిజానికి ఆ ఆట నాకు అర్థమయ్యేది కాదు. ఎప్పుడో గాని చూడను కూడా. ఫలితంగా చాలా మంది క్రికెటర్లు నాకు తెలియదు. కానీ గొప్ప జ్ఞాన గాంభీర్యంతో నేను క్రికెట్ చర్చలకు తెగించినప్పుడు, తెలిసీ తెలియని విషయ సమాచారంతో బుద్ధిహీనమైన ప్రశ్నలు సంధించినప్పుడు పదే పదే నన్ను గట్టున పడేసిన వారిలో నేను స్నేహితులుగా పరిగణించే క్రికెటర్లు ముగ్గురున్నారు. వారు – టైగర్ పటౌడీ, బిషన్ సింగ్ బేడీ, అబ్బాస్ అలీ బేగ్.

బాధాకరం... టైగర్(2011లో మరణించారు), బిషన్ ఇప్పుడు మనతో లేరు. బగ్గీ (అబ్బాస్ అలీ బేగ్) ఈ మధ్యే తన భార్య వినూ (వినూ మీర్‌చందానీ)ను కోల్పోయారు. గత సోమవారం (23 అక్టోబర్) నాటి బిషన్ సింగ్ మరణం ఈ ముగ్గురు స్నేహితుల జ్ఞాపకాలను తిరిగి తెచ్చిపెట్టింది. వారి గౌరవార్థం, ఆ జ్ఞాపకాలను మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను.

టైగర్‌కు నా క్రీడా పరిజ్ఞానం అంతంత మాత్రమేనని తెలుసు. ఒక్క టీవీ స్టూడియోలో తప్ప, ఆయన నా ముఖంపై కోడిగుడ్లు పగిలే అవకాశం ఉన్న పరిస్థితికి నన్ను వదిలేయకుండా మా సంభాషణను సున్నితంగా, నేర్పుగా నాకు నచ్చిన విషయాల వైపు మళ్లించేవారు. తరచు ఆ మళ్లింపు నేను ధరించిన టై గురించిన పొగడ్త అయివుండేది. వివేచనను అభిరుచిగా కలిగిన వ్యక్తి ఆయన. కనుక ఆయన మెచ్చుకోలు నన్ను అదే టైని మళ్లీ మళ్లీ ధరించేలా చేసేది. ఒక సందర్భంలో తొలిసారిగా ఆయన తన కనుబొమ నొకదాన్ని ఎగరేస్తూ, నెమ్మదైన స్వరంతో... "మీరు ఆ టై ధరించడం ఇది మూడోసారి!" అని అనేంతవరకు ఆ టైని నేను వదిలిపెట్టలేదు.

టైగర్‌లో ఆహ్లాదం కలిగించే హాస్యస్ఫూర్తి కూడా ఉంది. అది అచ్చమైన బ్రిటిష్ నుడికారంతో కూడిన వెటకారం. పడాల్సిన చోట, పడాల్సిన మాటను సమయానికి, సందర్భానికి తగినట్లుగా తనదైన శైలిలో తటాలున జారవిడుస్తారు.

బిషన్ చాలా భిన్నమైనవారు. ఉల్లాసంగా ఉండేవారు. ఆయన భావోద్వేగాలు, అంతర్గత భావాలు తరచు పారదర్శకంగా, పైకి కనిపించేలా ఉండేవి. మంచి సంభాషణను ఆయన ఇష్టపడతారు. మాట్లాడినదంతా ఓపికగా వింటారు. అలాగే ఆపలేనంతగా మాట్లాడుతూనే ఉంటారు.



మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ



బిషన్ సింగ్ బేడీ



అబ్బాస్ అలీ బేగ్

మేము తరచు బగ్గీ, వినూ వాళ్లింట్లో కలుసుకునేవాళ్లం. మేడపైన మాటల్లో మునిగిపోయేవాళ్లం. 'ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై మీ ఆలోచనలు ఏమిటి' అని బగ్గీ నన్ను అడిగేవారు. అయితే రాజకీయాలను ఆయన నాకంటే బాగా అర్థం చేసుకున్నారని నాకు అర్థమయేందుకు ఎక్కువ సమయం పట్టేది కాదు. నేను చెప్పేది వినేవారు. నా గ్రహింపులో లేని లోతైన గమనింపుల గురించి చెప్పి నన్ను ఉల్లాసపరిచేవారు.

ముగ్గురిలోకి బగ్గీ ఎక్కువగా తటపటాయింపుతో ఉండేవారు. వినూ అప్పుడు ఆ సంకోచాల నుంచి ఆయన్ని కాపాడేందుకు ముందుకొచ్చేవారు. ఆమె చురుకైనవారు. సంభాషణ ప్రియత్వం కలిగినవారు. విలాసవంతమైన జీవనశైలిని ఆస్వాదించే స్నేహశీలి. అతిథులను ఆదరించే అద్భుతమైన మహిళ. రుచిగా వండినంత మాత్రానే కాదు, అతిథుల సన్నిధి ఆమెను ఉల్లాసపరచడం వలన కూడా వారింట్లో భోజనం ఆరగించడం అన్నది ఒక సంతుష్టికరమైన భావనను కలిగించేది. తన స్నేహితుల సమక్షంలో ఆమె అపరిమితమైన సంతోషంతో ఉండేవారు.

నేనిది రాస్తున్న సమయానికి, స్నేహితులకు సంబంధించిన ముఖ్యమైన విషయాలలో తరచు మనలో కదలాడేది వారి జ్ఞాపకాలే నన్న మెలకువను కూడా మొత్తంగా నేను కలిగి ఉన్నాను. మీరు నెలలు లేదా ఏళ్లపాటు కలుసుకుని ఉండకపోవచ్చు. మిమ్మల్ని సముద్రాలు, తరచు రాసుకోని ఉత్తరాలు వేరు చేస్తుండొచ్చు. అయితే ఆ దూరమే మిమ్మల్ని కలిపి ఉంచే జ్ఞాపకాలను శక్తిమంతం చేస్తుంది. కాలక్రమేణా ఆ జ్ఞాపకాలు తమ సొంత అస్తిత్వాన్ని ఏర్పరుకుంటాయి. ఇప్పుడు టైగర్, బిషన్, వినూ గురించి నాకు మిగిలింది జ్ఞాపకాలు మాత్రమే! ఆ ముగ్గురూ నాకు దూరమయ్యాక తమవైన స్థానాలను నాలో ఏర్పచుకున్నారు.

ఒక అర్థంలో నేను స్పష్టమైన దానిని చెబుతున్నాను. అలాగే, మరొక విషయం కూడా చెబుతాను. మనుషులు చనిపోయినప్పుడు మాత్రమే మళ్లీ ఇక వారిని కలవలేం అన్న భావనలో మనం మునిగిపోతాం. అప్పుడు వారి జ్ఞాపకాలు వేరే భిన్నమైన స్థాయిని పొందుతాయి. బతికున్నవాళ్లను – రేపో, తర్వాతి వారమో, ఫోన్ కాల్‌లోనో, ఈమెయిల్ ద్వారానో – జ్ఞాపకం చేసుకున్నట్లుగా అది ఇకపై ఉండదు. ఇప్పుడిక మీకున్నవన్నీ కేవలం జ్ఞాపకాలే! ఒక సమావేశం, ఒక సంభాషణ, ఒక ఈమెయిల్ అన్నది ఇక ఎప్పటికీ సంభవించవివే!

అనేకమైన ఈ ఆలోచనలు నిస్సందేహంగా వయసు నిర్దేశించినవే. అది అనివార్యం. నిజాయతీగా చెప్పాలంటే 34 ఏళ్ల క్రితం నా భార్య నిషా చనిపోయినప్పుడు కూడా పూర్తి భిన్నంగా ఏమీ లేదు. 2015లో మా అమ్మ చనిపోయినప్పుడు కూడా! లేదా నేను సన్నిహితంగా ఉన్న మరెవరి విషయంలోనైనా! నా చిన్నతనంలో నేను జ్ఞాపకాలు ఎలా జనిస్తాయి, ఎలా రూపాంతరం చెందుతాయి అనే ఆలోచనను కలిగిలేను. ఇటీవల కొద్ది వారాల తేడాతో సంభవించిన వినూ, బిషన్ మరణాలు నాలో ఆ స్పృహను కలిగించాయి.

ప్రియ మిత్రమా! నా ఉద్దేశం మనో దౌర్బల్యం లోనికో, తాత్విక చింతన లోనికో జారుకోవడం కాదు. ఆనందకరమైన జ్ఞాపకాలతోనే నేను మొదలయ్యాను. కానీ నేను చెప్పాలని భావించిన దానికంటే విచారంగా ముగించినట్లున్నాను. అంటుంటారు కదా: ఇదే జీవితం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆగని దుఃఖం



ఒక పాలస్తీనియన్‌గా ఉండటం ఎంత బాధాకరమో ఎవరికీ అర్థం కాదు. నేను దుఃఖిస్తున్నాను. నన్ను నేను ఊరడించుకోలేను. వాళ్లు నా జనాన్ని తుడిచిపెడుతున్నారు. ఒక వైపే సైన్యం ఉన్నప్పుడు దాన్ని యుద్ధం అనరు!

– కరీమ్ వఫా అల్–హుస్సేనీ, రచయిత

బాధాకరం



కొన్ని సందర్భాల్లో, మనం జీవితాంతం దేనికోసం పనిచేశామో అదంతా నిరర్థకం అనిపిస్తుంది. మనం విశ్వాసం పెట్టుకున్న ప్రతి సంస్థా తన శక్తిహీనతను చూపుతుంది. మనకు మిగిలివున్నవల్లా... మాట్లాడలేని దుష్టత్వం మీద మన ఆగ్రహం, మన శోకం, మన అరుపు! ఇంకా మనకు మిగిలివున్నదల్లా మన హృదయం.

– శైలజా పటేల్, రచయిత్రి

జోస్యం



2016 ఎన్నికల సమయంలో యూఎస్‌లో పనిచేస్తున్నాను. డెమోక్రాట్లకు ఓటు వేసే స్నేహితులకు... ఎందుకో ట్రంప్ (రిపబ్లికన్) గెలుస్తాడన్న చెడ్డ ఫీలింగ్ వస్తోందని చెప్పేవాడిని. కానీ వాళ్లు నన్ను పిచ్చోడి కింద జమకట్టారు. అయితే చాలామంది క్లింటన్ (హిల్లరీ)ను ద్వేషించి, ఆమెకు ఓటు వేయడానికి నిరాకరించారు. ఇక వచ్చే 2024లో డెమోక్రాట్లు (మళ్లీ) ఎందుకు ఓడిపోబోతున్నారో కొన్ని వారాలుగా నాకు స్పష్టంగా అర్థమవుతోంది.

– ఆసిఫ్ కపాడియా, దర్శకుడు

ఇదేం తర్కం?



కుర్దుల ఊచకోత, తమ కోసం ఒక సొంత నేల ఉండాలన్న వారి పోరాటాన్ని ముస్లిం ప్రపంచం ఏనాడూ పట్టించుకోలేదు. ముస్లింలు తమ సహ మతస్థులను వధించినప్పుడు ముస్లిం సమాజం నిశ్శబ్దంగా ఉండిపోతుంది. కానీ అదే ఘర్షణ ముస్లింలు, ముస్లిమేతరుల మధ్య అయినప్పుడు మాత్రం... వాటి వెనకుండే భౌగోళిక రాజకీయాంశాలను విస్మరించి మతం పేరుతో ఉన్మత్తతకు లోనవుతారు.

– యూసుఫ్ ఉంర్గూవాలా, స్కాలర్

కదా!



అంపైర్లలో మహిళలు ఎందుకు లేరు? తీర్పులు ఇవ్వడంలో సహజంగానే మహిళలకు మంచి నేర్పు ఉంటుంది కదా!

– రాజేశ్వరి, ఆర్కిటెక్ట్

మహారాజునే!



నేను డబ్బుల విషయంలో జాగ్రత్తగా లేనప్పుడల్లా మా అమ్మ, "నువ్వేమైనా మైసూరు మహారాజు అనుకుంటున్నావా?" అనేది. నేననుకోవడం తమిళుల ఇళ్లలో ఇది సాధారణ సామెత. కానీ వారికి మైసూరు మహారాజు ఎవరో, ఎలా ఉంటాడో తెలుసని అనుకోను. ఇదిగో... ఆయన ఇక్కడున్నారు. ఆయన అందరికీ సంపదను ఆశీర్వదించాలని ప్రార్థిస్తాను. (కృష్ణరాజ వడయార్ విగ్రహంతో ఉన్న ఫొటోను షేర్ చేశారు.)

– రెక్స్ క్లెమెంటైన్, శ్రీలంక క్రికెట్ రచయిత

సింహళ బౌద్ధానికి పెద్దక్క

శ్రీలంక జనాభా రెండు కోట్లు. ఉత్తరం నుంచి దక్షిణానికి 432 కి.మీ.లుంటే, తూర్పు నుంచి పడమరకు 224 కిలోమీటర్ల దూరం. సముద్రంలో నీటిబొట్టు లాంటి చిన్నదేశం. విస్తీర్ణంలో చిన్నదే కానీ, వైవిధ్యాల సుమహారం. బౌద్ధం జనజీవనాన్ని స్వచ్ఛంగా, నిశ్శబ్దంగా శాసిస్తోంది. బౌద్ధావలంబకులుగా సింహళీయులు ప్రశాంత జీవనాన్ని సాగిస్తుంటారు. బౌద్ధ క్షేత్రాలు ప్రశాంతతకు నిలయాలు. వందలు, వేలాది మంది ఒకే ఆవరణలో నిశ్శబ్దంగా ధార్మిక సాధన చేస్తుంటారు. వాళ్ల వైపు చూస్తే చాలు... స్వచ్ఛంగా నవ్వుతారు. భారతీయులను ఇట్టే పట్టేస్తారు. పుట్టింటికి వచ్చిన పెద్దక్కతో పంచుకుంటున్న ఆత్మీయతను తలపిస్తుంది వాళ్ల అభిమానం. బౌద్ధ భిక్కులు ధ్యాన సంచారులు. మనుషుల మధ్య జీవిస్తున్నప్పటికీ లౌకిక విషయాలతో మమేకమవకుండా నడుస్తున్నప్పుడు కూడా ధ్యానంలోనే ఉంటారు.

శ్రీలంకలో అనూరాధపుర, పొలోన్నరువా, సిగిరియా, దంబుల్లా, కాండీ... ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాలు. మన దేశం నుంచి బౌద్ధం శ్రీలంకలో తొలి అడుగువేసిన నేల – అనూరాధపుర. అశోకుడి కుమార్తె థెరి 'సంఘమిత్ర' శ్రీలంకకు వెళ్తూ బుద్ధుడికి జ్ఞానోదయం అయిన బోధివృక్షం (బోధ్‌గయ) నుంచి ఒక మొక్కను తీసుకుని వెళ్లింది. ఆ మొక్కను సింహళరాజు 'దేవానాంపియ తిస్స' అత్యంత భక్తి ప్రపత్తులతో అందుకుని అనూరాధపురలో నాటాడు. ఆ బోధి వృక్షమే 'జయ శ్రీ మహా బోధి'. ఈ వృక్షానికి వెళ్లే దారిలో దేవానాం పియ తిస్సకు సంఘమిత్ర బోధి మొలకను అందిస్తున్న శిల్పం ప్రాచీన కాలం నాటి భారత్– సింహళ బౌద్ధ బంధానికి ప్రతీక. అశోకుడి కుమారుడు అర్హత్ 'మహేంద్ర' కూడా శ్రీలంకలో బౌద్ధాన్ని వికసింపచేశాడు. మహేంద్ర కోరిక మీద దేవానాంపియ తిస్స నిర్మించిన 'తూపారామ' విహారాయ శ్రీలంకలో తొలి బౌద్ధ స్తూపం. స్తూప ఆరామ... తూపారామగా మారింది. ఈ స్తూపం గంట ఆకారంలో ఉంటుంది.



సింహళ బౌద్ధులు తమ నేల మీద పుట్టని వ్యక్తిని గురువుగా స్వీకరించింది మన తెలుగువాడైన బుద్ధఘోషుడిని మాత్రమే! బుద్ధఘోషుడు రాసిన 'విశుద్ధిమగ్గ' గ్రంథాన్ని ఆచరణీయ కావ్యంగా గౌరవిస్తారు. నాటి ఆత్మీయ బంధాన్ని రెండు దేశాలూ కొనసాగిస్తున్నాయి. రెండు ప్రభుత్వాలూ 1977లో కల్చరల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ ద్వారా బంధాన్ని పటిష్ఠపరుచుకున్నాయి. ఆ మరుసటి ఏడాది మనదేశంలో ఉన్న బుద్ధుడి అవశిష్టాలను శ్రీలంకలో ప్రదర్శన పెట్టారు. దేశం దేశమే కదిలి వచ్చిందా అన్నట్లు కోటిమంది దర్శించుకున్నారు. బుద్ధుడికి జ్ఞానోదయం అయిన 2,600 సంవత్సరాల వేడుకలకు కూడా అవశిష్టాలు మనదేశం నుంచి శ్రీలంకకు వెళ్లివచ్చాయి. తాజాగా 2020లో మనదేశం శ్రీలంకలోని బౌద్ధ క్షేత్రాలు, మ్యూజియమ్‌ల పరిరక్షణ కోసం భారీగా నిధులిచ్చింది. బుద్ధుడు మహా పరినిర్వాణం చెందిన 'కుశి' నగరలోని విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేయడం రెండుదేశాల మధ్య బౌద్ధ బంధాన్ని పటిష్ఠం చేయడంలో భాగమే! కోవిడ్ సమయంలో భారతీయుల క్షేమాన్ని కూడా కాంక్షిస్తూ శ్రీలంక బౌద్ధులు ప్రార్థనలు చేశారు. వాళ్ల దేశంలో చర్చిలో బాంబుదాడులు జరిగినప్పుడు మన నుంచి అందిన సహాయాన్ని గుర్తు చేసుకుంటారు. సింహళీయులు భారతీయులనూ, భారతీయ కళలను కూడా ప్రేమిస్తారు.

శ్రీలంక ఎగుమతుల్లో 60 శాతం మనదేశానికే వస్తాయి. మన నుంచి వస్త్రాన్ని దిగుమతి చేసుకుని దుస్తులు కుట్టి ప్రాచ్య, పాశ్చాత్యదేశాలకు ఎగుమతి చేస్తోందా దేశం. కొలంబో కేంద్రంగా వ్యాపారం చేస్తున్న బ్రాండిక్స్ కంపెనీ మన విశాఖపట్టణంలో భారీ యూనిట్‌ని స్థాపించి మనవాళ్లకు ఉపాధినిస్తూ వ్యాపారాన్ని విస్తరించుకుంటోంది. ఒక్కమాటలో చెప్పాలంటే సింహళులు మనదేశాన్ని పరాయి దేశంగా చూడరు, తమ ప్రధాన దేశంగా చూస్తారు.

– వాకా మంజులారెడ్డి, జర్నలిస్ట్

ఢిల్లీ పీఠాన్ని బెంబేలెత్తించిన వీరుడు

అభిప్రాయం



ప్రొ॥ నాగపట్ల భక్తవత్సల రెడ్డి

ఊరూరా కోటలు కట్టి, వరంగల్లు కోటని దోచుకొని, దొరల, జమీందారుల కోపానికి గురయి, పద్దెనిమిదో శతాబ్ది తొలినాళ్లలో ప్రభుత్వాల్ని ముప్పుతిప్పలు పెట్టిన ప్రజాబంధువు సర్దార్ సర్వాయి పాపన్న. చరిత్రకారులకు బందిపోటుగా, వృత్తిగాయకులకు గోలకొండ కోటని ఆక్రమించిన పరాక్రమవంతుడుగా, బహదూర్ షా చక్రవర్తికి 'సర్దార్' బిరుదుకి తగ్గవాడుగా కనబడ్డ పాపన్న చరిత్ర ఎటు చూసినా అద్భుతమే.

సర్దార్ సర్వాయి పాపన్న చారిత్రక వ్యక్తి. ఔరంగజేబు చరిత్రను పరామర్శించిన ప్రతి చరిత్రకారుడు పాపన్నను పరామర్శించారు. అయితే వాళ్ల దృష్టిలో పాపన్న బందిపోటు. దానికి ప్రధాన కారణం పాపన్న తన అనుచరులతో మొహరం (1 ఏప్రిల్ 1708) నాడు ఓరుగల్లు కోటను ముట్టడించి, లక్షల విలువ చేసే సొత్తుని, పన్నెండు వేల మందిని బందీలుగా చేసుకోవడం. అందులో ఓరుగల్లు సంస్థానాధీశుడైన కాశి మొహమ్మద్ సైద్ భార్య, కూతురు కూడా ఉన్నారు. ఈ విజయంతో సర్వాయి పాపన్న విజృంభించి చాలా గ్రామాల్లో కోటలు కట్టి తన స్థానాన్ని పదిలపర్చుకొంటాడు. హసేన్, హుసేన్, హిమామ్, దూదేకుల పీరు, జక్కుల పెరుమాళ్లు, నెల్లూరి హనుమంతు, చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, మేదరి యెంకన్న లాంటి సాహసవంతులైన యోధులతో దళాన్ని ఏర్పర్చుకొన్నాడు. సర్వాయి పాపన్నని బందీగా చేసుకొని తమను రక్షించవలసిందిగా బహదూర్ షాకు విజ్ఞాపనలు వరంగల్లు నుంచి అందే దాకా అతడికి తిరుగులేకుండా పోయింది. యూసుఫ్ ఖాన్ రుజ్బిహానీని పాపన్నను పట్టుకోవడానికి పంపిస్తాడు చక్రవర్తి. అతను షాహపురం ఆక్రమించుకున్నా పాపన్న దొరకకుండా తాటికొండ కోటకు చేరుకొంటాడు. తొమ్మిది నెలల తర్వాత తన అనుయాయులు ఒక్కొక్కరే వదిలి వెళ్లడం వల్ల గత్యంతరం లేక ఏకాకిగా హుస్నాబాదు చేరి యూసుఫ్ ఖాన్‌కు చిక్కుతాడు. 1710లో యూసుఫ్ ఖాన్ సైన్యం సర్వాయి పాపన్నను ముక్కలుగా నరికి చంపారనీ, అతని తలను చక్రవర్తికి పంపారనీ చరిత్రకారుల (టి.డబ్ల్యు. హేగ్) మాట.

1709 మే మాసంలో నాగపట్నం నుంచి బటేవియాకు పంపిన ఒక డచ్ ఉత్తరంలో హైదరాబాదులో బహదూర్ షా చక్రవర్తి ప్రముఖుల సమక్షంలో సర్దార్ (డెన్ రోవర్ సెర్వాపాపర్) బిరుదును పాపన్నకు ఇచ్చినట్టు తెలుస్తోంది. అంటే బహదూర్ షా ఒక పక్క సర్వాయి పాపన్నను అణచటానికి సైన్యాన్ని పంపి, మరో పక్క అతణ్ణి గౌరవించాడని అర్థం చేసుకోవాల్సి ఉంది. అది అసంబద్ధం. అయితే ఈ చరిత్ర రాసిన వారు ఒకరు అధికార పక్షానికి చెందిన వారైతే, మరొకరు డచ్ కంపెనీ అధికార వర్గానికి చెందినవారు.



సర్వాయి పాపన్న గురించిన వీరగాథలు చాలా ప్రచారంలో ఉండేవి. 1874లో జె.ఎ. బోయలు దొర బళ్లారిలో, 1906లో ప్రచురణ పొందిన గాథను మల్లంపల్లి వారు, 1966లో పీలేరు ప్రాంత వాసి అయిన వెంకటరమణ చెప్పిన కథను తిరుపతిలో 1966లో తంగిరాల వెంకటసుబ్బారావు, పూదోట కోటిలింగం చెప్పిన కథను 1974లో జెని రోఘైర్, 'క్షాం భిక్షం' కథను నల్లగొండలో శతృఘ్న రెడ్డి, 1998లో సిరిగిరి వెంకటయ్య బృందం చెప్పిన కథని వరంగల్లు జానపద గిరిజనవిజ్ఞాన పీఠం సేకరించాయి. ఈ కథల మధ్య సామ్యాలూ, భేదాలూ ఉన్నాయి. ఇవే కాకుండా నవలలు, నాటకాలు, బుర్రకథలు లాంటి వాటిని... ఒక రకంగా సర్వాయి పాపన్న సమగ్ర సాహిత్యాన్ని ఆచార్య పేర్వారం జగన్నాథం సేకరించారు.

'క్షాం బిక్షం' చెప్పిన కథలో పాపన్న... దోచుకున్న డబ్బు మొత్తాన్నీ ప్రజలకు పంచాడనీ, ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టించాడనీ, బావులు లేని వారికి బావులు తవ్వించాడనీ, అందరికీ మేలే చేసినాడనీ 'భళా భళి' అని కీర్తిస్తారు.

మొగలు సామ్రాజ్య చివరి దశలో చాలా మంది స్వాతంత్య్రం ప్రకటించుకొన్నారు. అదే సమయంలో రాబిన్ హుడ్ లాంటి జానపద వీరులు కూడా వచ్చారంటారు బర్బరా. "దుర్గములను నిర్మించి, దుర్గములను సాధించి రాజ్యమును విస్తరింపజేసికొన ప్రయత్నించిన వాడు దొర కాక దొంగ ఎట్లగును" అన్నది మల్లంపల్లి వారి ప్రశ్న.

పట్టుదలతో సాధించి, దోచుకొన్న సంపదను ప్రజల కోసమే వినియోగించిన సర్దార్ సర్వాయి పాపన్న ధన్యుడు. అతని చరిత్రను వీరగాథలుగా ప్రచారం చేసి అద్భుత వ్యక్తిగా మల్చిన గాయకులు ప్రశంసనీయులు.

వ్యాసకర్త తెలుగు యూనివర్సిటీ జానపద గిరిజన విజ్ఞాన పీఠం మాజీ డీన్
మొబైల్: 94401 70703

సహనంతోనే!

రమణాశ్రమానికి ఒకరోజు కుంభకోణం నుంచి ఓ మహిళ వచ్చింది. 'స్వామీ! అందరూ అజ్ఞానం, అజ్ఞానం అని అంటుంటారు. అదేమిటి' అని అడిగింది. ఆయన ఏమీ చెప్పకుండా కాలయాపన చేయడంతో 'నాకు రైలు సమయం మించుతోంది. తొందరగా చెబితే వెళ్లి పోతాను' అంది.



కొద్ది సమయం తర్వాత భగవాన్ 'అన్నీ వెంట వెంటనే దొరకాలి. చాలామంది తిరిగి వెళ్లిపోవడానికి ఏదో ఒక రైలందుకోవాలనే ఆలోచనలోనే ఉన్నారు. ఆదరాబాదరగా వచ్చి, తొందరగా మోక్షంతో వెళ్ళాలనుకుంటారు. అందరూ ఇక్కడ శ్రద్ధగా సాధన చేయాలనే వస్తారు. తీరా వచ్చిన తర్వాత వారిలో అహం తలకెక్కుతుంది. వారు ఎందుకు ఇక్కడకు వచ్చారో ఆ సంగతే మరచిపోతారు. నాకు ఏదో గొప్ప సేవ చేస్తున్నట్టు అనుకొంటారు. వారు మాత్రమే భగవాన్‌కి సేవ చేయడానికి పుట్టినట్లూ, మిగిలిన వారందరూ ఏదో కాలక్షేపం చేయడానికి వస్తున్నట్లూ అనుకొంటారు. ఆ ధ్యాస వారిక్కడకు వచ్చిన ప్రధానోద్దేశాన్ని చెడగొడుతుంది. వినయ విధేయతలు మాత్రమే అహంకారాన్ని నాశం చేయగలవు. ఈశ్వరుడి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. కానీ ప్రవేశద్వారం ఎత్తు చాలా చిన్నది. తల వంచితేనే లోపలికి వెళ్ళగలం. కానీ అది గ్రహించరు. మనసులో 'నేనే' అనే భావం రవ్వంత ఉన్నా అది వేగంగా వ్యాపించి ఇక్కడకు ఎందుకు వచ్చామన్న ఉద్దేశాన్ని చెడగొడుతుంది. దుష్ట ఆలోచనలు, దుష్ట కార్యాలు వేగంగా విస్తరిస్తాయి' అన్నారు భగవాన్. ఆ మహిళకు తన అజ్ఞానం అవగతమై సంతోషంగా ఇంటి దారి పట్టింది.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: బ.విదియ రా.11.30 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: భరణి ఉ.6.11 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం: సా.6.05 నుండి 7.42 వరకు, దుర్ముహూర్తం: ప.12.06 నుండి 12.52 వరకు, తదుపరి ప.2.23 నుండి 3.10 వరకు, అమృతఘడియలు: రా.3.38 నుండి 5.13 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 5.27.

ఓటర్ల నమోదుకు రేపే చివరి అవకాశం

- వేరే ప్రాంతానికి ఓటు బదిలీ, వివరాల దిద్దుబాటుకు సైతం చాన్స్
- 31 వరకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఫారం–6, ఫారం–8 దరఖాస్తుల స్వీకరణ
- అర్హులైన వారి పేర్లతో త్వరలో అనుబంధ ఓటర్ల జాబితా ప్రచురణ
- నవంబర్ 30న శాసనసభ ఎన్నికల్లో ఓటేసేందుకు లభించనున్న అవకాశం
- వెబ్‌సైట్, యాప్ ద్వారా దరఖాస్తుల ప్రక్రియను సులభతరంచేసిన ఈసీ

సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితా రెండో ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇటీవల ప్రకటించిన తుది జాబితాలో మీ పేరు లేదా? జాబితాలో పేరు ఉన్నా మరో ప్రాంతానికి నివాసం మార్చారా? మీ పేరు, ఇతర వివరాలు తప్పుగా అచ్చు అయ్యాయా?.. ఇలాంటి కారణాలతో నవంబర్ 30న జరగనున్న రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో ఓటేయలేమని బాధపడుతున్నారా? అయితే మీలాంటి వారి కోసం కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పిస్తోంది. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం–6, ఇతర ప్రాంతానికి ఓటు బదిలీ, పేరు, ఫొటో, ఇతర వివరాల దిద్దుబాటు కోసం ఫారం–8 దరఖాస్తులను అక్టోబర్ 31లోగా సమర్పిస్తే వచ్చే శాసనసభ సాధారణ ఎన్నికల్లో మీకు ఓటు హక్కు లభించనుంది. నివాసం ప్రస్తుతం ఉండే నియోజకవర్గంలోనే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారినా, లేదా ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మారినా ఫారం–8 దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. ఓటరు జాబితా/ ఓటరు గుర్తింపు కార్డులో ఫొటో సరిగ్గా లేకపోయినా, పేరు, ఇతర వివరాలు తప్పుగా వచ్చినా ఫారం–8 దరఖాస్తు ద్వారానే సరిదిద్దుకోవచ్చు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారితో ప్రత్యేకంగా అనుబంధ ఓటర్ల జాబితాను ఎన్నికల యంత్రాంగం ప్రచురించనుంది. తుది ఓటర్ల జాబితాతో పాటు అనుబంధ ఓటర్ల జాబితాలోని ఓటర్లకు వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పిస్తారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియ ముగింపునకు 10 రోజుల ముందు నాటికి వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఎన్నికల్లో ఓటేసేందుకు అవకాశం కల్పించాల్సి ఉంటుంది. నవంబర్ 3న రాష్ట్ర శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ రానుండగా, 10తో నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుంది. దానికి 10 రోజుల ముందు అనగా, అక్టోబర్ 31 నాటికి దరఖాస్తు చేసుకున్న వారికి శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించనున్నారు.

దరఖాస్తు ఎలా చేసుకోవాలి..?

ఓటర్ల నమోదు, ఓటు బదిలీ, వివరాల దిద్దుబాటు.. తదితర సేవల కోసం కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ https://voters.eci.gov.in లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్(వీహెచ్‌ఏ)ను మొబైల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని కూడా ఈ సేవలను పొందవచ్చు. లేకుంటే స్థానిక బూత్ స్థాయి అధికారి(బీఎల్‌ఓ), ఓటరు నమోదు అధికారి (ఈఆర్వో)ను కలసి సంబంధిత దరఖాస్తు ఫారాన్ని నింపి అందజేయాల్సి ఉంటుంది. ఓటరు నమోదు కోసం కొత్తగా దిగిన ఫొటోతో పాటు చిరునామా, వయసు ధ్రువీకరణ కోసం పదో తరగతి మార్కుల పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లు డిమాండ్ నోటీసు, గ్యాస్/బ్యాంక్ పాసుపుస్తకాలు వంటి పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

జాబితాలో పేరు ఉందా? లేదా? ఎలా తెలుసుకోవాలి?

ఓటరు జాబితాలో పేరు ఉందా? లేదా ? అనేది తెలుసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా https://electoralsearch.eci. gov.in అనే వెబ్‌సైట్‌ను నిర్వహిస్తోంది. ఓటరు వివరాలు, ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్), మొబైల్ నంబర్ ఆధారంగా జాబితాలో పేరును సెర్చ్ చేయడానికి ఈ పోర్టల్ అవకాశం కల్పిస్తోంది. మొబైల్ ఫోన్ నంబర్, ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా జాబితాలో పేరు సెర్చ్ చేయడం చాలా సులువు. గతంలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారు మాత్రమే మొబైల్ ఫోన్ నంబర్ ఆధారంగా పేరును సెర్చ్ చేయడానికి వీలుండేది. ఓటరు పేరు, తండ్రి పేరు/ వయసు ఇతర వివరాలను కీ వర్డ్స్‌గా వినియోగించి సెర్చ్ చేసినప్పుడు అక్షరాల్లో స్వల్ప తేడాలున్నా జాబితాలో పేరు కనిపించదు. అయితే ఓటర్స్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటర్ల జాబితాలో పేరును సులువుగా సెర్చ్ చేయవచ్చు.

కొత్త ఎపిక్ కార్డు నంబర్ ఎలా తెలుసుకోవాలి?

గతంలో కేంద్ర ఎన్నికల సంఘం 13/14 అంకెల సంఖ్యతో ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేయగా, గత కొంత కాలంగా 10 అంకెల సంఖ్యతో కొత్త ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేస్తోంది. పాత ఓటరు గుర్తింపు కార్డు నంబర్ ఆధారంగా మీ కొత్త ఓటరు గుర్తింపు కార్డు నంబర్‌ను తెలుసుకోవచ్చు. ఇందుకోసం మీరు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) కార్యాలయం రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్ https://ceotserms2.telangana.gov.in/ ts search/ Non Standard Epic.aspx ను సందర్శించి మీ పాత కార్డు నంబర్ ఆధారంగా కొత్త ఎపిక్ కార్డు నంబర్‌ను తెలుసుకోవచ్చు.

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ తట్టాబుట్టా సర్దుకోవాలి: తరుణ్‌ఛుగ్



సాక్షి, హైదరాబాద్: బంధుప్రీతి, అవినీతిలో కూరుకుపోయిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం తట్టాబుట్టా సర్దుకునే సమయం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో బీఆర్‌ఎస్ భయాందోళనలకు గురవుతోందని ఆదివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఏనాడూ పనిచేయని బీఆర్‌ఎస్.. కేవలం ఒక కుటుంబ ప్రయోజనా లను కాపాడుకునేందుకే పరిమితమైందని విమర్శించారు.

ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఆరోపణలు

- దిగ్విజయ్ వ్యాఖ్యలను ఖండించిన జవదేకర్



సాక్షి, హైదరాబాద్: ఈవీఎంలపై కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ ప్రకాశ్ జవదేకర్ ఖండించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ఓడిపోయే పరిస్థితి వచ్చినప్పుడే ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం అవుతాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే ఐదు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని తెలిసే ఇలాంటి ఆరోపణలను ఆ పార్టీ చేస్తోందని మండిపడ్డారు. గతంలో ఓడిపోయిన సందర్భంలో కూడా కాంగ్రెస్ నేతలు ఇలాంటి ఆరోపణలే చేశారని జవదేకర్ గుర్తుచేశారు. ఎవరికి ఓటు వేసినా బీజేపీకే వెళుతోందని కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు గుప్పించిందని, ఇందుకోసమే ఎలక్షన్ కమిషన్ వీవీ ప్యాట్స్ తీసుకొచ్చి ఓటు ఎవరికి వేస్తున్నారో తెలిసేలా ఓ స్లిప్పును కూడా చూపిస్తోందని చెప్పారు.

గజ్వేల్‌లో నేను గెలిస్తే ప్రజాస్వామ్యం గెలిచినట్లే

- ఈటల రాజేందర్



మేడ్చల్ రూరల్: గజ్వేల్ నియోజకవర్గంలో తాను గెలిస్తే ప్రజాస్వామ్యం గెలిచినట్లేనని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం మేడ్చల్ మండలం పూడూ ర్‌లోని తన నివాసంలో గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఈటల రాజేందర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడు తూ... గజ్వేల్‌లో ఎవరు గెలిస్తే వారి ప్రభుత్వ మే వస్తుందనే సెంటిమెంట్ ఉందని, బీజేపీని గెలిపించి ఆ పరంపర కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం తప్ప ఏ వర్గం కూడా సంతోషంగా లేదని విమర్శించా రు. గజ్వేల్‌లో అవసరం లేకున్నా వ్యవసాయ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వారి భూములు తిరిగి ఇస్తామని, బకాయిలన్నీ చెల్లిస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలో బీసీని ముఖ్యమంత్రిని చేసుకుందామని అమిత్‌షా పిలుపునిచ్చారని దీనికి ఎంతో సాహసం కావాలని చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వారు బీజేపీలో చేరారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంపూర్ణ మద్దతు

- డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులకు కిషన్‌రెడ్డి హామీ



కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న డీజేహెచ్‌ఎస్ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశాన్ని పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్‌ఎస్) అధ్యక్షుడు బొల్లోజు రవి, ట్రెజరర్ చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్ దండ రామకృష్ణ, సలహాదారు కె. విక్రమ్‌రెడ్డి తదితరులు కిషన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తాము అధికారంలోకి వస్తే తప్పకుండా ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు డీజేహెచ్‌ఎస్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. అనంతరం డీజేహెచ్‌ఎస్ అధ్యక్షుడు బొల్లోజు రవి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు, ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయాలని, ఆ మేరకు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరినట్లు తెలిపారు.

గులాబీ గూటికి నాగం జనార్దన్‌రెడ్డి

- ఆయన నివాసానికి వెళ్లి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించిన కేటీఆర్, హరీశ్‌రావు



కేసీఆర్‌ను కలిసిన విష్ణువర్ధన్ రెడ్డి





కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఎర్ర శేఖర్, పి.చంద్ర శేఖర్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. ఆదివారం రాత్రి ప్రగతిభవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో నాగం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ నెల 31న మంగళవారం ఉదయం 11 గంటలకు కేసీఆర్ సమక్షంలో తెలంగాణ భవన్ వేదికగా తన అనుచరులతో కలసి నాగం గులాబీ కండువా కప్పుకోనున్నారు.

కేటీఆర్, హరీశ్ ఆహ్వానించడంతో..

నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌లో నాగర్ కర్నూల్ అసెంబ్లీ టికెట్ ఆశించారు. కానీ అవకాశం దక్కకపోవడంతో ఆదివారం ఉదయం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. దీంతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఇతర నేతలతో కలిసి హైదరాబాద్‌లోని నాగం నివాసానికి వెళ్లారు. బీఆర్‌ఎస్‌లోకి రావాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. తర్వాత నాగం జనార్దన్‌రెడ్డి ప్రగతిభవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. నాగం సీనియారిటీని గౌరవించి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని కేసీఆర్ భరోసా ఇవ్వడంతో బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు.

కాంగ్రెస్‌లో డబ్బులున్న వారికే టికెట్లు: నాగం

కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు తనను ఎంతో బాధకు గురిచేశాయని.. అధ్వాన స్థితికి చేరిన కాంగ్రెస్‌కు అధికారం దక్కదని నాగం జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ''ఉదయం పార్టీలో చేరిన వారికి సాయంత్రం టికెట్ ఇచ్చారు. సునీల్ కనుగోలు సర్వే ఆధారంగా టికెట్లు ఇచ్చామని రేవంత్ చెప్తున్నారు. పార్టీ జెండా పట్టుకున్న వారికి కాకుండా అవతలి పార్టీలో డబ్బులున్న వారిని పిలిచి టికెట్ ఇస్తున్నారు. నాగర్ కర్నూల్ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు రాజీనామా చేసి కార్యకర్తల ముందుకు వచ్చా. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలసి బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తాం..'' అని పేర్కొన్నారు.

సముచిత స్థానం ఇస్తాం: కేటీఆర్

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ''సీఎం కేసీఆర్‌కు నాగం జనార్దన్‌రెడ్డి సన్నిహిత మిత్రుడు. తెలంగాణ కోసం గతంలో జైలుకు వెళ్లిన వ్యక్తి. నాగంతోపాటు ఆయన వెంట వచ్చే కార్యకర్తలకు బీఆర్‌ఎస్‌లో సముచిత స్థానం ఇస్తాం. భవిష్యత్తులో కలసి ముందుకు సాగుతాం..'' అని చెప్పారు. ఇక సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాగం జనార్దన్‌రెడ్డితో కలసి పనిచేసేందుకు తాను సిద్ధమని, ఆయన అడుగు జాడల్లో నడుస్తానని ఎమ్మెల్యే మర్రి జనార్దనరెడ్డి పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి విష్ణు

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ ఆశించి దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి కూడా బీఆర్‌ఎస్‌లో చేరికకు రంగం సిద్ధమైంది. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఆదివారం విష్ణుతోనూ మంతనాలు జరిపారు. తర్వాత ప్రగతిభవన్‌కు తోడ్కొని వెళ్లి సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. సీఎంతో చర్చించిన తర్వాత తాను బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్టు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

గులాబీ తీర్థం పుచ్చుకున్న పి.చంద్రశేఖర్, ఎర్ర శేఖర్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఇద్దరు కీలక నేతలు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్‌కు చెందిన మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ తెలంగాణభవన్‌లో మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. జడ్చర్ల కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరి చేరికతో మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ మరింత బలోపేతమవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓ కీలక నేతతోనూ బీఆర్‌ఎస్ మంతనాలు జరుపుతున్నట్టు తెలిసింది. ఓ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆ నేత ఒకటి రెండు రోజుల్లో బీఆర్‌ఎస్ గూటికి చేరే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

ప్రచారాన్ని పరిగెత్తిస్తాం

► మొదటి పేజీ తరువాయి

ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ప్రచారపర్వం కూడా ఊపందుకుంటుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలకు చెందిన ఇతర పార్టీల నేతలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీసీ సామాజికవర్గానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చే పార్టీ బీజేపీ మాత్రమే అని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బీసీ ముఖ్యమంత్రి ప్రకటన చేసిన ఏకైక పార్టీ బీజేపీయేనని గుర్తు చేశారు. బీజేపీ నేతృత్వంలో దేశంలోనే తొలిసారిగా బీసీ వ్యక్తి నరేంద్రమోదీ ప్రధానమంత్రి పీఠం అధిరోహించి.. ప్రపంచం అబ్బురపడేలా నీతివంతమైన, సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని వివరించారు. కేంద్రంలో బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కేసీఆర్ దళితుడిని సీఎం చేస్తానని చెప్పి మోసం చేసి దళిత సామాజిక వర్గాన్ని అవహేళన చేశారని ధ్వజమెత్తారు. మత రిజర్వేషన్ల పేరుతో బీసీలకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు.

మొదటి కేబినెట్‌లోనే ముస్లిం రిజర్వేషన్లు రద్దు

హైదరాబాద్‌లో బీసీలకు 50 కార్పొరేటర్ స్థానాలు రిజర్వ్ చేస్తే.. అందులో 37 సీట్లను మజ్లిస్ ఎత్తుకుపోయిందని కిషన్‌రెడ్డి నిందించారు. బీజేపీ అధికారంలోకి రాగానే బీసీలకు అన్యాయం చేసే ముస్లిం రిజర్వేషన్లను మొదటి కేబినెట్ లోనే రద్దు చేస్తామని, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేసేలా రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. మజ్లిస్ అనుమతి లేకుండా నాడు కాంగ్రెస్ మంత్రులు, నేడు బీఆర్‌ఎస్ మంత్రులు పాతబస్తీలో పర్యటించలేని పరిస్థితి ఉందని, మజ్లిస్ పార్టీ కనుసైగల్లో కేసీఆర్ కుటుంబం పనిచేస్తోందన్నారు. మజ్లిస్ ప్రాబల్యమున్న ప్రాంతాల్లో కరెంటు బిల్లులు, పన్నులు కట్టడం లేదని, ప్రభుత్వ అధికారులు వెళ్తే వారిపై కత్తులతో రౌడీయిజం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ అధికారులపై దాడులు చేసిన వారిపై యూపీలో యోగీ ప్రభుత్వం తరహాలో బుల్డోజర్లతో అణచివేస్తామని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

పార్టీలో చేరిన నేతలకు కండువాలు కప్పి..

నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్లెల ఇంద్రకరణ్ రెడ్డి, నలుగురు మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు మంథని నియోజకవర్గ నేత చల్ల నారాయణ రెడ్డికి కిషన్‌రెడ్డి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నా భార్య తల నరికేస్తామన్నారు


- పాతబస్తీలో సభ పెడితే నా పిల్లలను కిడ్నాప్ చేస్తామన్నారు: బండి సంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: తాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద బహిరంగ సభకు సిద్ధమైతే గుర్తు తెలియని వ్యక్తుల నుంచి అనేక బెదిరింపు కాల్స్ వచ్చాయని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. 'ఏయ్ బండి సంజయ్.. పాతబస్తీలో సభ పెట్టాలనే ఆలోచన విరమించుకోకుంటే నీ భార్య తల నరికి నీకు గిఫ్ట్‌గా ఇస్తాం. నీ ఇద్దరు కొడుకులను కిడ్నాప్ చేస్తాం ..'అంటూ బెదిరించారు. అయినా వెనుకంజ వేయకుండా పాతబస్తీలో సభ పెట్టిన చరిత్ర మాది'అని సంజయ్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఈఎస్ గార్డెన్స్‌లో జరిగిన పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కరీంనగర్ ఎంపీగా తాను గెలిచానంటే అది కార్యకర్తలతోనేనని అన్నారు. ప్రజలు ఎంపీగా గెలిపించారు కాబట్టే తెలంగాణ అంతా తిరిగి పేదల పక్షాన పోరాడానని, ఫాంహౌస్‌కు పరిమితమైన కేసీఆర్‌ను ధర్నా చౌక్‌కు గుంజుకొచ్చానని పేర్కొన్నారు. కాగా, ధర్మం కోసమే పోరాడే మరో నాయకుడు రాజాసింగ్ ఏడాదిపాటు బీజేపీకి దూరమైనా.. చంపుతామని కొందరు బెదిరించినా హిందూ ధర్మాన్ని వదిలిపెట్టలేదని సంజయ్ అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సీహెచ్. విఠల్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక వర్షం.. తడిసిన ధాన్యం



శాలిగౌరారం మార్కెట్ యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం. (ఇన్‌సెట్‌లో) కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతు

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో శనివారం రాత్రి అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. దీంతో సుమారు పది వరకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు తడిసిపోయాయి. వీటిలో సుమారు 1.20 లక్షల క్వింటాళ్ల వరకు ధాన్యం రాశులు, ఆరబోసిన వడ్లు ఉండగా.. వేలాది క్వింటాళ్లు తడిసిపోయాయి. ఆయా కేంద్రాల్లో లోతట్టు ప్రాంతంలో పోసిన ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. శాలిగౌరారంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణ సీసీ ప్లాట్‌ఫాం కావడంతో ధాన్యం అత్యధికంగా కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన, నీటిలో ఉన్న ధాన్యం రాశులను బయటకు తరలించేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

గజ్వేల్‌లోనూ పోటీచేస్తా

- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెల్లడి



మునుగోడు: ఈ ఎన్నికల్లో తాను మునుగోడు నియోజకవర్గంతో పాటు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పోటీచేస్తున్న గజ్వేల్‌లో కూడా పోటీచేస్తానని మాజీ ఎమ్మెల్యే, మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరి.. టికెట్ దక్కించుకుని మొదటిసారి మునుగోడుకు వచ్చిన ఆయన ఆదివారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గత ఉప ఎన్నికల్లో అధికార పార్టీ మునుగోడు ఓటర్లని అనేక ప్రలోభాలకు గురిచేసినా తనపై ప్రేమతో 87వేల ఓట్లు వేసి నైతికంగా గెలిపించారన్నారు. ఆ ప్రజల రుణం తీర్చుకునేందుకు తిరిగి ఇక్కడి నుంచి పోటీచేస్తున్నానని చెప్పారు. తాను బీజేపీలో చేరినా..తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరినా అది కేవలం సీఎం కేసీఆర్‌ని గద్దె దింపాలనే ఏకైక లక్ష్యంతోనేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తుందని, ఈ ఎన్నికల్లో 80 నుంచి 90 స్థానాలు గెలుచుకొని కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. దీంతో సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నిద్రపోవడం లేదన్నారు.

ఉప ఎన్నిక వచ్చాకే మునుగోడు అభివృద్ధి

నేను రాజీనామా చేసి ఉప ఎన్నిక తీసుకువచ్చినందునే మునుగోడు అభివృద్ధి జరిగిందని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బీటీ రోడ్ల మరమ్మతు, ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారని అన్నారు. పాల్వాయి స్రవంతి, చలమల్ల కృష్ణారెడ్డి ఈ ఒక్కసారి తనకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్ రెడ్డి, దోటి వెంకన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలతో కలకలం

- భూదాన్‌పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌లో డంపింగ్
- ఎన్నికల నేపథ్యంలో పుకార్లు
- గోదాముల్లేక తెచ్చినట్టు అధికారుల వివరణ



హ్యాండ్లూమ్ పార్కుకు వాహనాల్లో వచ్చిన గ్రే క్లాత్ మెటీరియల్

భూదాన్‌పోచంపల్లి: ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభపరిచేందుకు భారీ ఎత్తున డబ్బు, మద్యం, కానుకలు పోలీసులకు పట్టుబడుతున్న వేళ.. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో ఆదివారం బతుకమ్మ చీరల డంపింగ్ కలకలం రేపింది. రెండు రోజులుగా సిరిసిల్ల నుంచి బతుకమ్మ చీరల గ్రే మెటీరియల్, పిల్లల స్కూల్ యూనిఫాం, పాలీ ఓణి ఇతర డ్రెస్ మెటీరియల్ స్టాక్‌ను తీసుకొచ్చి భూదాన్‌పోచంపల్లిలోని హ్యాండ్లూమ్ పార్క్‌లో డంప్ చేస్తున్నారు. సిరిసిల్లలోని వివిధ పవర్‌లూమ్ సొసైటీల ద్వారా తయారైన లక్షలాది మీటర్ల మెటీరియల్‌ను భద్రపరచడానికి ఖాళీ స్థలం లేదు. గోదాములన్నీ ధాన్యంతో నిండిపోవడంతో హ్యాండ్లూమ్ పార్కుకు తీసుకొచ్చినట్లు టెస్కో జనరల్ మేనేజర్ రఘునందన్‌రావు, మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. వివిధ ప్రభుత్వరంగ సంస్థల నుంచి బతుకమ్మ చీరలు, విద్యార్థులు, ఉద్యోగుల యూనిఫాంను టెస్కో ఆర్డర్ తీసుకొని సరఫరా చేస్తుందన్నారు. అందులో భాగంగానే మిగిలిపోయిన స్టాక్‌ను నిల్వ చేసేందుకు అక్కడ గోదాములు ఖాళీ లేకపోవడంతో హ్యాండ్లూమ్ పార్కుకు తీసుకొచ్చామని పేర్కొన్నారు.

పరిశీలించిన అధికారులు

ఓటర్లకు పంచేందుకు భారీగా బతుకమ్మ చీరలు వచ్చాయని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. రాష్ట్ర చేనేత జౌళి శాఖ రీజినల్ డైరెక్టర్ ఇందుమతి, తహసీల్దార్ వీరాబాయి, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి హ్యాండ్లూమ్ పార్కును సందర్శించారు. ఇన్‌వాయిస్ బిల్లులను పరిశీలించారు. టెస్కో అధికారులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్నారు.

జనసేనతో మనకెందుకు?

- శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి సీట్లు ఇచ్చేందుకు ససేమిరా అంటున్న నేతలు...
- జనసేనతో సీట్ల సర్దుబాటు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలన్న డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కమలనాథుల్లో బీజేపీ, జనసేన పొత్తు అంశం కలకలం రేపుతోంది. పొత్తులో భాగంగా 32 సీట్లు కేటాయించాలని ఆ పార్టీ కోరగా, 10 నుంచి 12 సీట్లు కేటాయించేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం సుముఖంగా ఉన్నట్టు పార్టీవర్గాల సమాచారం. ఇందులో భాగంగా జనసేనకు కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి కేటాయిస్తారనే ప్రచారంతో ఆయా చోట్ల పార్టీ వర్గాలు భగ్గుమంటున్నాయి. శేరిలింగంపల్లి టిక్కెట్ జనసేనకు ఇచ్చే ప్రతిపాదనను మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు విశ్వేశ్వర్‌రెడ్డితో అక్కడి టికెట్‌ను ఆశిస్తున్న రవికుమార్ యాదవ్ సమావేశమై చర్చించినట్టు తెలిసింది. మరోవైపు ఈ టికెట్‌నే ఆశిస్తున్న గజ్జల యోగానంద్ కూడా జనసేనకు టికెట్ కేటాయించొద్దని, 40 ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్న తనకే ఇవ్వాలని కోరుతున్నారు. తనకు టికెట్ ఇవ్వకపోతే పార్టీ నేతల బండారాన్ని బయటపెడతానని ఆయన హెచ్చరిస్తుండటంతో వాతావరణం వేడెక్కింది. మరోవైపు కూకట్‌పల్లి టికెట్‌ను జనసేనకు ఇచ్చే ప్రతిపాదనను మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీశ్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అసలు జనసేనతో పొత్తే అవసరం లేదనే వైఖరిని నాయకత్వం తీసుకుంటే మంచిదనే వాదనను కూడా పార్టీ నాయకులు బలంగా వ్యక్తం చేస్తున్నారు.

మూడోజాబితాపై కసరత్తు...నేడు ఢిల్లీకి

బీజేపీ మూడో జాబితా అభ్యర్థుల ప్రకటన కసరత్తులో భాగంగా.. జాతీయ నాయకత్వం, కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) పెద్దలతో చర్చల నిమిత్తం సోమవారం రాత్రికి రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, బండి సంజయ్, డీకే అరుణ, ఈటల రాజేందర్ ఢిల్లీ వెళుతున్నారు.. ఢిల్లీ పెద్దలతో భేటీ సందర్భంగా జనసేనతో పొత్తుపై పార్టీ క్యాడర్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడం, హైదరాబాద్‌లోని పలు సీట్లలో తీవ్రపోటీ, పీటముడి పడిన స్థానాలపైనా చర్చ జరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

ఓయూ స్నాతకోత్సవానికి వేళాయె

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే స్నాతకోత్సవానికి సర్వం సిద్ధమైంది. పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టాలు అందుకోనున్న 979 మంది అభ్యర్థులకు, 57 బంగారు పతకాలు అందుకునే విద్యార్థులతో పాటు అతిథులు, సిబ్బంది, ఇతరులకు ఆడిటోరియంలో 1000కి పైగా సీట్లను ఏర్పాటు చేశారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు, వారితో పాటు మరొకరికి ప్రవేశం కల్పించనున్నారు. ఎంట్రీ పాస్‌లున్న అభ్యర్థులకు మాత్రమే ఆడిటోరియంలోకి ప్రవేశం ఉంటుందని, అభ్యర్థులు గంట ముందు చేరుకొని కేటాయించిన సీట్లలో కూర్చోవాలని ఎగ్జామినేషన్ కంట్రోల్ ప్రొ.రాములు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎగ్జామినేషన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే 83వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ అందుకోనున్న ప్రముఖులు

ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీలను 979 మంది అభ్యర్థులు అందుకోనున్నారు. అందులో మహిళలు 371 మంది కాగా, పురుషులు 608 ఉన్నారు. వన్‌టైం చాన్స్‌తో యూనివర్సిటీ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాదిలో 1325 పీహెచ్‌డీ పూర్తి చేయగా అందులో 979 మంది అభ్యర్థులు కాన్వొకేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఐఏఎస్, ఐపీఎస్, అధ్యాపకులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు ఆఫీసర్లు, వివిధ శాఖలలో ఉన్నత అధికారులతో పాటు ఎమ్మెల్యేలు సీతక్క, బాల్క సుమన్, గువ్వల బాలరాజు ఉన్నారు. పూర్తిగా కళ్లు కనిపించని దివ్యాంగుడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) అనిల్‌కుమార్ న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకోనుండటం విశేషం.

క్లుప్తంగా...

క్రికెట్ ఆడుతుండగా కాల్పులు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఆదివారం ఓ పోలీసు అధికారి క్రికెట్ ఆడుతుండగా ఉగ్రకాల్పులకు బారిన పడ్డారు. ఇన్‌స్పెక్టర్ మస్రూర్ అహ్మద్ వనీ శ్రీనగర్ శివార్లలో ఈద్గా క్రీడాస్థలంలో క్రికెట్‌ఆడుతుండగా లష్కరే తొయిబా ఉగ్రవాది ఒకడు అతి సమీపం నుంచి మూడు రౌండ్లు కాల్పులకు దిగాడు. కంట్లోకి, పొట్టలోకి, చేతిలోకి తూటాలు దూసుకెళ్లడంతో వని కుప్పకూలారు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ముష్కరుడిని బాసిత్ దార్‌గా గుర్తించినట్టు ఏడీజీ విజయ్ కుమార్ తెలిపారు. అతని కోసం ఆ ప్రాంతాన్నంతా పోలీసులు జల్లెడ పడుతున్నారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు

తంపా (యూఎస్): అమెరికాలో మరోసారి కాల్పులు జరిగాయి. ఫ్లోరిడాలో స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున రెండు గ్యాంగుల మధ్య పోరాటం కాల్పుల దాకా వెళ్లడంతో ఇద్దరు మరణించారు. 18 మంది దాకా గాయపడి ఆస్పత్రి పాలయ్యారని పోలీసులు తెలిపారు. ఆ ప్రాంతమంతా బార్లు, క్లబ్బులతో, లేట్ నైట్ కార్యకలాపాలతో నిండి ఉంటుంది. అనుమానితుల్లో ఒకరు ఇప్పటికే పోలీసులకు లొంగిపోయారు. మిగతావారి కోసం గాలింపు జరుగుతున్నట్టు పోలీసులు తెలిపారు. మరో ఘటన... జార్జియా యూనివర్సిటీ అట్లాంటా క్యాంపస్‌లో జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు విద్యార్థులు సహా నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

అధ్యక్ష రేసుకు పెన్స్ దూరం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకుంటున్నట్టు దేశ మాజీ ఉపాధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత మైక్ పెన్స్ ప్రకటించారు. లాస్‌వెగాస్‌లో పార్టీ జ్యూయిష్ కోవలిషన్ డోనర్ సదస్సులో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కొద్ది నెలలుగా ఆయన పోటీ పడుతుండటం తెలిసిందే. ''ఆరు నెలలుగా దేశవ్యాప్తంగా తిరిగిన అనంతరంఒక స్పష్టత వచ్చింది. అధ్యక్ష బరిలో దిగేందుకు నాకింకా సమయం రాలేదు. తప్పుకుందామని నిర్ణయించుకున్నా''అని చెప్పారు. దాంతో ట్రంప్‌కు రిపబ్లికన్ అభ్యర్థిత్వం దిశగా లైన్ మరింత క్లియరైనట్టు భావిస్తున్నారు. అయితే ట్రంప్‌కు మద్దతిస్తారా అని ప్రశ్నించగా పెన్స్ సూటిగా బదులివ్వలేదు. పార్టీలో ట్రంప్‌కు గట్టి ప్రత్యర్థిగా భావించిన డిశాంటిస్ కూడా మద్దతు కూడగట్టుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ట్రంప్ మాత్రం తిరుగులేని మద్దతుతో దూసుకుపోతున్నారు.

అంబానీకి మళ్లీ బెదిరింపులు

ముంబై: కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి మరోసారి బెదిరింపులు వచ్చాయి. రూ.20 కోట్లు ఇవ్వాలని లేకుంటే చంపేస్తామని శుక్రవారం ఓ అగంతకుడు మెయిల్ ద్వారా బెదిరించిన విషయం తెలిసిందే. ఆదివారం మళ్లీ అదే అడ్రస్‌తో మరోసారి బెదిరింపు మెయిల్ పంపినట్లు పోలీసులు తెలిపారు. రూ.200 కోట్లు ఇవ్వకుంటే చంపేస్తామని అందులో ఉందన్నారు. అంబానీ నివాసం అంటీలియా భద్రతాధికారి దేవేంద్ర మున్షీరామ్ ఫిర్యాదు చేశారు. నిందితుడు యూరప్‌కు చెందిన ఈ-మెయిల్ సర్వీస్ ప్రొవైడర్ ఉపయోగించాడని చెప్పారు. అతడిపై ఐపీసీ 387, 506(2) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. అయితే షాదాబ్ ఖాన్ అనే వ్యక్తి నుంచి ఆ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అతడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంట్లో యువకుడి ఉరి

జునాగఢ్: గుజరాత్ రాష్ట్రం జునాగఢ్ జిల్లా చార్వాడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే విమల్ చుదాసామా ఇంట్లో ఓ యువకుడు(28) అనుమాస్పద స్థితిలో ఉరికి వేలాడుతూ శవమై కనిపించాడు. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభించిందని, తన ఆత్మహత్యకు ఎమ్మెల్యే విమల్‌తోపాటు అతడి అత్త, మామ వేధింపులే కారణమంటూ ఆ లేఖలో ఉందని వివరించారు. బలవన్మరణానికి పాల్పడిన యువకుడిని నితిన్ పర్మర్‌గా పోలీసులు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి తర్వాత ఇంటి పైకప్పునకు ఉరి వేసుకొని చనిపోయినట్లు చెప్పారు. చనిపోయిన యువకుడు నితిన్ ఎమ్మెల్యేకు దగ్గరి బంధువేనని తెలిసిందని అన్నారు. అయితే, ఎమ్మెల్యే విమల్ వాదన మరోలా ఉంది. నితిన్‌ను ఎవరో హత్య చేశారని, తనను అప్రతిష్టపాలు చేయడానికే ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించారని, నకిలీ సూసైడ్ నోట్‌ను సృష్టించారని ఆరోపించారు. నితిన్ చావుకు తానే కారణం అంటూ రాజకీయ ప్రత్యర్థులు నిందలు మోపుతున్నారని వాపోయారు.

'నాలుగు రోజుల్లో మధ్యప్రదేశ్‌లోనూ ఈడీ దాడులు'

భోపాల్: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజస్తాన్‌లో మాదిరిగానే మధ్యప్రదేశ్‌లో కూడా వచ్చే నాలుగు రోజుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బృందాలు సోదాలు జరిపే అవకాశముందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ జోస్యం చెప్పారు. ఇటీవలే రాజస్తాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ విద్యాశాఖ మంత్రి గోవింద్ సింగ్ దోతాస్రా ఇంటిపై ఈడీ దాడులు జరిగిన విషయం తెలిసిందే. పరీక్ష పేపర్ లీకేజీ కేసులో మనీల్యాండరింగ్ ఆరోపణలపై సోదాలు జరిపినట్లు ఈడీ తెలిపింది. ఆదివారం భోపాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో దిగ్విజయ్ సింగ్ ఈ దాడులను ప్రస్తావించారు. ఒకపక్క అధికారులను వేధిస్తున్న బీజేపీ నేతలు, మరోపక్క రాజస్తాన్‌లో మాదిరిగా మధ్యప్రదేశ్‌లోనూ ఈడీ సోదాలు జరిపిస్తారని అన్నారు. దాడులు జరగటానికి అవకాశం ఉందంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతల పేర్లను ఆయన పేర్కొన్నారు.

హమాస్ స్థావరాలే లక్ష్యం

గాజాలో భూతల, వైమానిక దాడులు ఉధృతం

- 24 గంటల వ్యవధిలో 450 స్థావరాలపై నిప్పుల వర్షం
- మిలిటెంట్లపై రెండో దశ యుద్ధం కొనసాగుతోందన్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ
- గాజాలో 8,000 దాటిన మృతుల సంఖ్య

గాజాస్ట్రిప్/జెరూసలేం/న్యూఢిల్లీ: గాజాలో హమాస్ మిలిటెంట్ గ్రూప్ స్థావరాలను నామరూపాల్లేకుండా చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు మరింత ఉధృతం చేసింది. ఇజ్రాయెల్ పదాతి దళం మన్ముందుకు చొచ్చుకెళ్తోంది. మరోవైపు వైమానిక దళం నిప్పుల వర్షం కురిపిస్తూనే ఉంది. గత 24 గంటల్లో 450 హమాస్ స్థావరాలపై దాడుల చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం ప్రకటించింది. మిలిటెంట్ల కమాండ్ సెంటర్లు, అబ్జర్వేషన్ పోస్టులు, యాంటీ-ట్యాంక్ మిస్సైల్ లాంచింగ్ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు తెలియజేసింది. గాజాలోకి మరిన్ని పదాతి దళాలు అడుగుపెట్టబోతున్నాయని పేర్కొంది. ఖాన్ యూనిస్ సిటీలో ఓ భవనంపై జరిగిన వైమానిక దాడిలో 13 మంది మరణించారు. వీరిలో 10 మంది ఒకే కుటుంబానికి చెందినవారు. హమాస్ కమాండ్ పోస్టు ఉందని భావిస్తున్న షిఫా ఆసుపత్రిపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాడి చేశాయి. గాజా సిటీలో ఇదే అతిపెద్ద ఆసుపత్రి. ఇక్కడ వందలాది మంది క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. ఎంతమంది బలయ్యారన్నది తెలియరాలేదు. హమాస్‌పై రెండో దశ యుద్ధం కొనసాగుతోందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ ఉద్ఘాటించారు. రాబోయే రోజుల్లో శత్రువులపై భీకర పోరు తప్పదన్న సంకేతాలు ఇచ్చారు. మరోవైపు హమాస్ మిలిటెంట్లు సైతం వెనక్కి తగ్గడం లేదు. ఇజ్రాయెల్‌పైకి అప్పుడప్పుడు రాకెట్లు ప్రయోగిస్తున్నారు. దక్షిణ ఇజ్రాయెల్‌లో తరచుగా సైరన్ల మోత వినిపిస్తూనే ఉంది.

మూడు వారాలు దాటిన ఘర్షణ

ఇజ్రాయెల్ దాడుల్లో కమ్యూనికేషన్ల వ్యవస్థ దారుణంగా దెబ్బతిన్నది. మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆదివారం కొన్ని ప్రాంతాల్లో కమ్యూనికేషన్ల వ్యవస్థను పునరుద్ధరించారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఘర్షణ మొదలై మూడు వారాలు దాటింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 8,000 దాటిందని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. వీరిలో 3,300 మంది మైనర్లు, 2,000 మందికిపైగా మహిళలు ఉన్నారని ప్రకటించింది. శిథిలాల కింద మరో 1,700 మంది చిక్కుకుపోయినట్లు అంచనా. వారు ఎంతమంది బతికి ఉన్నారో చెప్పలేని పరిస్థితి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఇజ్రాయెల్‌దాడులు తీవ్రతరం కావడం పాలస్తీనియన్లలో గుబు లు పుట్టిస్తోంది. ఇలాంటి భీకర దాడులను తామెప్పుడూ చూడలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్మీకి నెతన్యాహూ క్షమాపణ

ఇజ్రాయెల్ భద్రతా దళాలకు ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ క్షమాపణ చెప్పారు. ఈ నెల 7న జరిగిన హమాస్ దాడిని ముందుగా గుర్తించడంలో నిఘా వ్యవస్థ దారుణంగా విఫలమైందంటూ ఆయన తొలుత 'ఎక్స్'లో పోస్టు చేశారు. దాడికి సంబంధించి భద్రతా దళాల అధికారులు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు జారీ చేయలేదని తప్పుపట్టారు. నెతన్యాహు పోస్టుపై ఆయన సహచర మంత్రులు, విపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. భద్రతా సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా పోస్టులు పెట్టడం ఏమిటని పలువురు మండిపడ్డారు. దీంతో బెంజమిన్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. భద్రతా బలగా లకు క్షమాపణ చెప్పారు. వారికి తన పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.



దాడులతో గాజాస్ట్రిప్‌లో చెలరేగిన మంటలు. ఇజ్రాయెల్‌లోని సమీప సెడెరాట్ నగరం నుంచి కనిపించిన దృశ్యమిది



ఐరాస కేంద్రం నుంచి సరుకులు ఎత్తుకుపోతున్న పాలస్తీనియన్లు

పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలి: మోదీ

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తత పెరిగిపోతుండడం పట్ల భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన శనివారం ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్-సిసీతో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియా పరిణామాలపై చర్చించారు. గాజాలో పరిస్థితులు నానాటికీ దిగజారుతుండడం, సాధారణ ప్రజలు మరణిస్తుండడం తీవ్ర విచాకరమని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని, ఇందుకు అంతర్జాతీయ సమాజం చొరవ చూపాలని కోరారు. ఈ మేరకు మోదీ ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. గాజాకు మానవతా సాయం అందిస్తామన్నారు.

'ద్విదేశ' విధానమే పరిష్కారం: బైడెన్

ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదానికి తెరపడాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆకాంక్షించారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ముగిసిన తర్వాత సమస్య పరిష్కారం కోసం ఏం చేయాలన్న దానిపై ఇజ్రాయెల్ ప్రభుత్వం, అరబ్ దేశాల నాయకత్వం ఇప్పటినుంచే దృష్టి పెట్టాలని సూచించారు. ద్విదేశ విధానానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, దీనిపై ఒప్పందానికి వస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్, స్వతంత్ర పాలస్తీనా అనే రెండు దేశాలు ఉండాలని తాను కోరుకుంటున్నట్లు బైడెన్ స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూకు తెలియజేశానని అన్నారు.

వెస్ట్‌బ్యాంక్‌లో మరో దారుణం

ఇజ్రాయెల్‌పై హమాస్ రాకెట్ దాడులు మొదలైన తర్వాత వెస్ట్‌బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై దాడులు పెరిగిపోతున్నాయి. ఆదివారం వెస్ట్‌బ్యాంక్‌లోని నబ్లూస్‌లో ఓ యూదు సెటిలర్ జరిపిన కాల్పుల్లో బిలాల్ సాలెహ్ అనే పాలస్తీనియన్ రైతు మరణించాడు. ఈ రైతు ఆలివ్ తోటలు సాగుచేస్తుంటాడు. వెస్ట్‌బ్యాంక్‌లో గత 23 రోజుల్లో యూదు సెటిలర్ల దాడుల్లో ఏడుగురు పాలస్తీనియన్లు మృతిచెందారు. ఇక ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో ఇక్కడ 110 మందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారు.

గోదాములు లూటీ

మూడు వారాలుగా కొనసాగుతున్న యుద్ధం వల్ల 23 లక్షల మంది గాజా ప్రజల్లో ఆగ్రహావేశాలు పెరిగిపోతున్నాయి. చల్లారని ఆకలి మంటలు వారిని లూటీలకు పురికొల్పుతున్నాయి. అంతర్జాతీయ సంస్థలు, ప్రపంచ దేశాలు అందిస్తున్న మానవతా సాయాన్ని గాజాలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని యూఎన్ఆర్‌డబ్ల్యూఏ సంస్థ గోదాముల్లో భద్రపరుస్తోంది. ప్రజలకు పంపిణీ చేస్తోంది. అయితే, ఆకలికి తాళలేని జనం గోదాములను లూటీ చేస్తున్నారని, గోధుమ పిండి, ఇతర నిత్యావసరాలు, పరిశుభ్రతకు సంబంధించిన సామగ్రిని తీసుకెళ్తున్నారని వెల్లడించింది. గాజాలో 'సివిల్ ఆర్డర్' గతి తప్పుతోందని పేర్కొంది. పరిస్థితి నానాటికీ ఆందోళనకరంగా మారతోందని, ఆవేశంలో ఉన్న ప్రజలను నియంత్రించలేకపోతున్నామని తెలియజేసింది. రణభూమిగా మారిన గాజాలో ఉండలేక, ఇతర దేశాలకు వలస వెళ్లే మార్గం కనిపించక జనం నిరాశలో మునిగిపోతున్నారని, అంతిమంగా వారిలో హింసాత్మక ధోరణి పెరిగిపోతోందని స్పష్టం చేసింది.

కేరళలో వరుస పేలుళ్లు

'జెహోవా' క్రైస్తవుల మత ప్రార్థనల్లో ఘటన

- ఇద్దరు మహిళలు మృతి... 51 మందికి గాయాలు
- దేశవ్యాప్తంగా చర్చిల వద్ద భద్రత కట్టుదిట్టం

కొచ్చి: కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలోని కొచ్చి నగర సమీపంలో వరుస పేలుళ్ల ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. మతపరమైన వేడుక జరుగుతున్న కన్వెన్షన్ సెంటర్‌లో చోటుచేసుకున్న ఈ పేలుళ్లలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో 51 మంది గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మూడు రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనేందుకు కలామాస్సెరీలోని జామ్రా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు ఆదివారం ఉదయం వందలాది మంది 'జెహోవా' క్రైస్తవులు తరలివచ్చారు. అందరూ ప్రార్థనల్లో ఉండగా, ఉదయం 9.40 గంటలకు హఠాత్తుగా పేలుడు జరిగింది. కొద్దిసేపటికే మరోరెండు పేలుళ్లు సంభవించాయి. దీంతో జనమంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. చాలామంది మంది రక్తమోడుతూ కనిపించారు. ఘటనా స్థలంలో భయానక వాతావరణం నెలకొంది. మొదటి రెండు పేలుళ్లు శక్తివంతమైన వగా, మూడోది తక్కువ తీవ్రత కలిగిన పేలుడుగా పోలీసులు గుర్తించారు. పేలుళ్ల కోసం దుండగులు ఐఈడీ ఉపయోగించినట్లు కేరళ డీజీపీ షేక్ దర్వేష్ సాహెబ్ చెప్పారు. ఇది ఉగ్రవాద చర్యా? లేక మరేదైనా కారణం ఉందా? అనేది ఇప్పుడే చెప్పలేమని పేర్కొన్నారు. పేలుళ్లకు కారణమైన ముష్కరులను గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామని, చికిత్స కొనసాగుతోందని డీజీపీ స్పష్టంచేశారు. పేలుళ్ల సమాచారం తెలియగానే కేరళ రాష్ట్ర యాంటీ-టెర్రరిజం స్క్వాడ్, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు రంగంలోకి దిగారు. ఘటనా స్థలంలో ఆధారాల కోసం అన్వేషణ ప్రారంభించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.



బాంబు పేలుడుతో కన్వెన్షన్ సెంటర్ నుంచి భయంతో పరుగులు తీస్తున్న జనం

కేరళ గవర్నర్ దిగ్భ్రాంతి


క్రైస్తవుల మత ప్రార్థనల్లో పేలుళ్లు జరగడం పట్ల కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పేలుళ్ల ఘటన అత్యంత దురదృష్టకరమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, దోషులను కఠినంగా శిక్షిస్తామని తేల్చి చెప్పారు.

పేలుళ్లకు తానే కారణం అంటూ వ్యక్తి లొంగుబాటు

కలామాస్సెరీలో తానే వరుస పేలుళ్లకు పాల్పడ్డానంటూ ఓ వ్యక్తి ఆదివారం కేరళలోని త్రిసూర్ జిల్లా కొడాకర పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. తాను కూడా 'జెనోవా' సభ్యుడినేనని చెప్పారు. లొంగిపోయిన వ్యక్తి పేరు డొమినిక్ మార్టిన్ అని పోలీసులు తెలిపారు. పేలుళ్లకు తానే కారణం అంటూ కొన్ని ఆధారాలు చూపించాడని వెల్లడించారు. అతడు చెప్పేది నిజమేనా? అనేది క్షుణ్నంగా విచారిస్తున్నామని అన్నారు.

కళ్ల ముందు అగ్నిగోళం కనిపించింది

కలామస్సెరీలో మత ప్రార్థనల్లో జరిగిన పేలుళ్లను తల్చుకొని ప్రత్యక్ష సాక్షులు బెంబేలెత్తిపోతున్నారు. తాను కళ్లు మూసుకొని పార్థన చేస్తున్నానని, హఠాత్తుగా భారీ పేలుడు శబ్దం వినిపించిందని ఓ మహిళ చెప్పారు. వెంటనే ఉలిక్కిపడి కళ్లు తెరిచానని అన్నారు. కళ్ల ముందు భగభగ మండుతున్న ఒక అగ్నిగోళం కనిపించిందని పేర్కొన్నారు.



పటేల్ జయంతి నాడు... మేరా యువ భారత్

యువతకు అద్భుత వేదిక • మన్ కీ బాత్‌లో మోదీ

న్యూఢిల్లీ: జాతి నిర్మాణ కార్యకలాపాల్లో యువత మరింత చురుగ్గా పాల్గొనేందుకు వీలుగా మేరా యువ భారత్ పేరుతో జాతీయ స్థాయి వేదికను అందుబాటులోకి తేనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సర్దార్ వల్లభ్ బాయి పటేల్ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న దీన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆ సందర్భంగా మేరా యువ భారత్ వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభిస్తామని చెప్పారు. MYBharat.Gov.in సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని యువతకు సూచించారు. దీన్ని యువ శక్తిని జాతి నిర్మాణానికి, ప్రగతికి వినియోగపరిచేందుకు తలపెట్టిన అద్భుత కార్యక్రమంగా మోదీ అభివర్ణించారు. ఆదివారం ఆయన మన్ కీ బాత్ కార్యక్రమంలో జాతినుద్దేశించి మాట్లాడారు. అక్టోబర్ 31 దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి కూడానని గుర్తు చేసుకున్నారు. ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. నవంబర్ 15న ఆదివాసీ నేత బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయనకు కూడా మోదీ నివాళులర్పించారు. విదేశీ పాలనను ఒప్పుకోని ధీర నాయకునిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారన్నారు. తిల్కా మహరాజ్, సిద్ధూ, కాన్హు, తాంతియా భీల్ వంటి వీర గిరిజన నాయకులు దేశ చరిత్రలో అడుగడుగునా కనిపిస్తారన్నారు. గిరిజన సమాజానికి దేశం ఎంతగానో రుణపడిందన్నారు. స్థానికతకు మరింతగా పెద్ద పీట వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి రోజున ఖాదీ వస్తువుల అమ్మకం రికార్డులు సృష్టించిందని గుర్తు చేశారు.

ఢిల్లీలో అమృత్ వాటిక

రెండున్నరేళ్లుగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అక్టోబర్ 31న ఘనంగా ముగియనుందని మోదీ చెప్పారు. ''దీనికి గుర్తుగా ఢిల్లీలో అమృత్ వాటిక నిర్మించనున్నాం. ఇందుకోసం అమృత్ కలశ్ యాత్రల పేరుతో దేశవ్యాప్తంగా మట్టిని సేకరించి పంపుతుండటం హర్షణీయం''అన్నారు. వ్యర్థాల నుంచి సంపద అన్నది మన నూతన నినాదమని మోదీ అన్నారు. గుజరాత్‌ల అంబా జీ మందిర్‌లో వ్యర్థబూాల నుంచి రూపొందించిన పలు కళాకృతులు అద్భుతంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. దీన్ని దేశవాసులంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బెర్లిన్‌లో తాజాగా ముగిసిన ఒలింపిక్స్ వరల్డ్ సమ్మర్ గేమ్స్‌లో భారత్ 75 స్వర్ణాలతో పాటు ఏకంగా 200 పతకాలు సాధించడం గర్వకారణమన్నారు.

గిరిజన వీరుల ప్రస్తావన

ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్‌లో గిరిజన వీరుల గురించి ప్రస్తావించారు. గిరిజన యుద్ధ వీరుల చరిత్రను ప్రశంసించారు. తెలంగాణలోని నిర్మల్, ఉట్నూరు, చెన్నూరు, అసిఫాబాద్ ప్రాంతాలను పరిపాలించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేంగా పోరాడి ఉరికొయ్యకు ప్రాణాలర్పించిన రాంజీ గోండు, ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్‌ప్రాంతానికి చెందిన వీర్ గుండాధుర్, మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు భీమా నాయక్‌ల వీర చరిత్రను కొనియాడారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన తిల్కా మాంఝీ, సమానత్వం కోసం పోరాడిన సిద్ధో-కన్హూ, స్వాతంత్ర్య యోధుడు తాంతియా భీల్‌లు ఈ గడ్డపై పుట్టినందుకు గర్విస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గిరిజన ప్రజల్లో అల్లూరి సీతారామరాజు నింపిన స్ఫూర్తిని దేశం ఇప్పటికీ గుర్తుంచుకుందని పేర్కొన్నారు. గిరిజన సమాజానికి స్ఫూర్తినిచ్చిన రాణి దుర్గావతి 500వ జయంతిని దేశం జరుపుకొంటోందని, గిరిజన సమాజానికి స్ఫూర్తినిచ్చిన వారి గురించి యువత తెలుసుకొని వారి నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

సార్.. ప్రేమలో పడ్డా కాస్త డబ్బు సర్దండి!

నాగాలాండ్ బీజేపీ నేతకు యువకుడి వినతి

కోహిమా: రాజకీయ నాయకులకు తరచూ ఉద్యోగం, ఉపాధి, డబ్బు సాయం కావా లంటూ విజ్ఞాపనలు అందుతుండటం సహజంగా జరిగేదే. కానీ, ఓ యువకుడు మాత్రం తన కలల రాణితో ప్రేమ వ్యవ హారం సాగించేందుకు డబ్బు సర్దాలంటూ ప్రాధేయ పడ్డాడు. ఈ విడ్డూరం నాగాలాండ్‌లో చోటుచేసుకుంది. బీజేపీ నాగాలాండ్ అధ్యక్షుడు టెమ్‌జెన్ ఇమ్నా అలోంగ్ తనకు ఎదురైన అరుదైన అనుభవాన్ని స్వయంగా 'ఎక్స్'లో వివరించారు. ఆయనకు అరవింద పాండా అనే ఓ యువకుడు పంపిన మెయిల్‌లో ఇలా ఉంది.. 'సర్, ఈ నెల 31వ తేదీన నా గర్ల్‌ఫ్రెండ్‌తో మొద టిసారిగా డేటింగ్‌కు వెళ్తున్నాను. కానీ, ఇప్పటి వరకు నాకు ఉద్యోగం రాలేదు. దయవుంచి కొద్దిగా సాయం చేయండి. ఏదో ఒకటి చేయండి సార్'అని అందులో ఉంది. అందుకాయన, 'ఎలాంటి సాయం కావాలో చెప్పండి'అంటూ బదులి చ్చారు. 'ఎక్స్'లో అలోంగ్ పోస్టుకు నెటిజన్లు తమాషా వ్యాఖ్యలతో స్పందించారు. యువకు డితోపాటు డేటింగ్‌కు వెళ్లాలంటూ అలోంగ్‌కు ఒకరు సూచించగా, అతడికి డబ్బు సాయం చేయాలని మరొకరు కోరారు. లవర్ బోయ్ అరవింద పాండాకు ఎమ్మెల్యేగా అవకాశమి వ్వాలని, అతడికి ఉద్యోగమి వ్వాలని.. ఇలా రకరకాల సూచనలు చేశారు. తల్లిదండ్రులు ఎంపిక చేసిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని మరొకరు ఆ యువకుడికి తెలిపారు. ఆ యు వకుడు జీవితంలో కఠినమైన పాఠా లను నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నందున ఆ వినతిని పట్టించుకోవద్దని కొందరు పేర్కొన్నారు.

దేశ రాజధానికి చేరుకున్న తెలుగునేల మట్టి కలశాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని నలు మూలల నుంచి సేకరించిన మట్టి కలశాలు ఆదివారం ప్రత్యేక రైలులో ఢిల్లీకి చేరుకున్నాయి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా నేల నా మట్టి కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని వందలాది గ్రామాల నుంచి సేకరించిన మట్టిని తీసుకొచ్చారు. ఈ క్రమంలో ప్రత్యేక రైలులో ఏపీ నుంచి 800 మంది, తెలంగాణ నుంచి 150 మంది వచ్చారు. సోమవారం ఇండియా గేట్ దగ్గర నిర్వహించే కార్యక్రమంలో ఉంచే కలశంలో ఈ మట్టిని పోస్తారు. తర్వాత ఆజాదీ కా మహోత్సవ్ గుర్తుగా చేపట్టే నిర్మాణాల్లో ఈ మట్టిని వినియోగించనున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారికి నిజాముద్దీన్ రైల్వేస్టేషన్‌లో ఏపీ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్ ఆధ్వర్యంలో సిబ్బంది సంప్రదాయ దుస్తులతో ఘన స్వాగతం పలికారు. ఏపీ ప్రభుత్వం వారందరికీ వసతి, బస సౌకర్యాలు ఏర్పాటు చేసింది. లైజన్ ఆఫీసర్ సురేశ్‌బాబు, ఓఎస్డీ రవిశంకర్, జీవీఆర్ మురళి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో విన్యాసం.. అతడి ప్రాణం తీసింది

చండీగఢ్: ట్రాక్టర్‌తో విన్యాసం చేస్తూ ఓ వ్యక్తి దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయాడు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లా సర్చుర్‌లో శనివారం ఈ విషాదం చోటుచేసుకుంది. సుఖ్‌మన్‌దీప్ సింగ్(29) గ్రామంలో జరుగుతున్న ఉత్సవంలోని మైదానంలో ట్రాక్టర్‌తో విన్యాసాలు చేస్తున్నాడు. స్టంట్స్‌లో నిపుణుడైన సుఖ్‌మన్‌దీప్ ముందుగా తన ట్రాక్టర్ రెండు చక్రాలను గాల్లోకి లేపి కిందికి దిగాడు. ఆ వాహనం గిరగిరా తిరుగుతుండగానే తిరిగి టైరుపైకి కాలుపెట్టి డ్రైవర్ సీట్లో కూర్చునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కాలు జారీ ట్రాక్టర్ వెనుక చక్రాల కిందపడిపోయాడు. వేగంగా తిరుగుతున్న ట్రాక్టర్ అతడిపైకి పలు మార్లు వెళ్లడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు.

రూ.160 కోట్ల డ్రగ్స్ పట్టివేత

ముంబై: మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లోని ఓ ఫ్యాక్టరీలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. ఆదివారం అపెక్స్ మెడికెమ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రెండు ప్రాంతాల్లో దాడులు జరిపి రూ.160 కోట్ల విలువైన 107 లీటర్ల మెఫెడ్రిన్‌ను గుర్తించారు. ఈనెల 20న ఇదే జిల్లాలో జరిపిన దాడుల్లో రూ.250 కోట్ల విలువైన కెటమిన్, కొకైన్, మెఫెడ్రిన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

పిస్టల్‌తో పారిపోయిన రేపిస్టు... ఎట్టకేలకు అదుపులోకి

నోయిడా: ఒక కస్టమర్‌పై ఆమె ఫ్లాట్‌లో అత్యాచారానికి పాల్పడి పోలీసుల నుంచి తప్పించుకున్న డెలివరీ బాయ్ ఆదివారం ఎట్టకేలకు మళ్లీ చిక్కాడు. నోయిడాకు చెందిన డెలివరీ బాయ్ సుమిత్ శర్మ శుక్రవారం ఒక స్థానిక అపార్ట్‌మెంట్‌లో పార్సిల్ డెలివరీ సందర్భంగా ఫ్లాట్‌లో ఒంటరిగా ఉన్న యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దాంతో పోలీసులు శనివారం అతన్ని ఖరీపూర్‌లో అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్ తీసుకెళ్లే దారిలో అతను పోలీసుల నుంచి పిస్టల్ లాక్కుని పారిపోయాడు. దాంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి అతనికోసం వేట సాగించారు. ఎట్టకేలకు వారి కంటబడ్డ సుమిత్ కాల్పులకు దిగాడు. పోలీసుల కాల్పుల్లో కాలికి తూటా దిగి పట్టుబడ్డాడు. అతనికి, సోదరునికి నేర చరిత్ర ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

మొన్న బీఆర్ఎస్‌లోకి.. నిన్న కాంగ్రెస్‌లోకి..



సూర్యాపేట జిల్లా కోదాడ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గరిణె కోటేశ్వరరావు శనివారం తన నివాసంలోనే ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, వేనేపల్లి చందర్‌రావు సమక్షంలో తిరిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. -కోదాడ

ఆశావహుల తాకిడి తట్టుకోవాలంటే...

గాసిప్ టైమ్

ఎన్నికలంటేనే ఆశావహుల తాకిడి అధికం. పార్టీలో కీలకనేతలు టికెట్లు ఖరారు చేసే వారికి వీరి నుంచి ఎప్పుడూ ఇబ్బందులు తప్పవు. ఎన్నికల వ్యూహంలో బీజీగా ఉన్నప్పుడు టికెట్లు కోరే నేతలు రావడం ఇబ్బందులు సృష్టిస్తుంటే.. సీనియర్ నేతలంతా కొత్త ఉపాయాన్ని అమలు చేస్తున్నారట. అదే ఎవరికి అందుబాటులోకి లేకుండా వెళ్లడం. అదేమంటే సీరియస్ సమావేశాల్లో పాల్గొంటున్నట్లు చెబుతున్నారట. ఫోన్ ఎత్తడం కూడా ఆపేస్తున్నారట. తమకు ఆప్తులు, కావాల్సిన వారైతే తప్ప ఫోన్ కూడా ఎత్తకుండా మౌన ముద్ర దాలుస్తున్నారట. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లానుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఆ నాయకుడు తమ పార్టీ నాయకులు ఫోన్ చేస్తే కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదని వాపోవడం చూస్తుంటే కమలం నేతలు ఎంత బిజీగా ఉన్నారో అర్థమవడం లేదూ. కార్యకర్తలు, టికెట్లు ఆశిస్తున్న నాయకులకు అందుబాటులో ఉండాల్సిన నేతలు రహస్య ప్రాంతాల్లో సమావేశాలకు తరలిపోతున్నారు. ఎవరు ఎక్కడికి వెళ్లారో తెలుసుకోవడానికి ఆశావహులు తెగ హైరానా పడిపోతున్నారట.నేతలనే ప్రసన్నం చేసుకోలేని వారు.. ఇక ఓటర్లనేమి ప్రసన్నం చేసుకుంటారంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.




మూడ్ మారుతున్న 33

రాష్ట్రంలోని నాలుగో వంతుకు పైగా నియోజకవర్గాల్లో విలక్షణ తీర్పు

- మెజారిటీ స్థానాల్లో ఒకసారి గెలిపించిన పార్టీకి మళ్లీ పట్టం కట్టని ఓటర్లు
- ఆ 33 సెగ్మెంట్లలో మారుతున్న పార్టీల రాతలు

మేకల కళ్యాణ్ చక్రవర్తి

ప్రతిసారీ ఎన్నికలు జరుగుతాయి..ఏ ఎన్నికల్లోనైనా పోటీ చేసిన వారిలో ఒక్కరు గెలిస్తే, మిగిలిన వారంతా ఓడిపోతారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా జరిగేది ఇదే. కానీ, కొన్ని నియోజకవర్గాల్లోని ప్రజలు ఈ విజేతలు, పరాజితులను నిర్ణయించే క్రమంలో విలక్షణంగా వ్యవహరిస్తుంటారు. అక్కడి పరిస్థితులను బట్టి కొన్ని నియోజకవర్గాల ప్రజలు తమ మూడ్‌ను ఎప్పటికప్పుడు మార్చేస్తుంటారు. కొన్నిచోట్ల ఒక్కసారి గెలిచిన పార్టీకి మరోమారు పట్టం కట్టరు. మరికొన్ని చోట్ల వరుసగా ఒక్కో పార్టీని గెలిపిస్తుంటారు. అలాంటి విలక్షణ తీర్పునిచ్చే నియోజకవర్గాలు తక్కువేం లేవు. రాష్ట్రంలోని నాలుగో వంతుకుపైగా నియోజకవర్గాల్లో విభిన్న తీర్పులిస్తున్నారు ప్రజలు. ఆ నియోజకవర్గాలేంటి... ఈ ప్రజల 'మూడ్' కథాకమామీషు ఏంటో తెలుసుకుందాం.



- ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎనిమిది ఎన్నికల్లో ఒక్కసారి మినహా ఏడుసార్లు విభిన్న తీర్పునిచ్చారు. ఒకసారి గెలిచిన పార్టీని మళ్లీ అక్కడి ప్రజలు ఆదరించలేదు(2004లో మినహా). 2018లో ఇక్కడ కాంగ్రెస్ గెలిస్తే 2014లో టీఆర్ఎస్, 2009లో కాంగ్రెస్ గెలిచాయి. ఈ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడుగా ఉన్నప్పుడు 2004లో టీడీపీ, 1999లో టీడీపీ, 1994లో సీపీఐ, 1989లో కాంగ్రెస్, 1985లో సీపీఐ గెలిచాయి. అంటే (2004లో మినహా) ఒక్కసారి గెలిచిన పార్టీ మళ్లీ గెలవని సంప్రదాయం 40 ఏళ్లుగా కొనసాగుతోందన్నమాట.
- ఖానాపూర్‌లో ఒక్కసారి మినహా గత ఆరు ఎన్నికల్లో ఏ పార్టీనయినా ప్రజలు వరుసగా రెండుసార్లు గెలిపిస్తున్నారు. 1994, 1999ల్లో టీడీపీ, 2004లో టీఆర్ఎస్, 2008, 2009లో మళ్లీ టీడీపీ, 2014, 18 ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను గెలిపించారు.
- ఆదిలాబాద్‌లో 1978 నుంచి మూడుసార్లు వరుసగా ఇండిపెండెంట్లు గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్ గెలిచింది. మళ్లీ రెండుసార్లు టీడీపీ గెలిచింది. మరోసారి కాంగ్రెస్ గెలిచింది. మళ్లీ టీడీపీ గెలిచింది. తాజాగా జరిగిన మూడు ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ గెలిచింది.
- నిర్మల్‌లో నాలుగు ఎన్నికల్లోనూ నాలుగు పార్టీలు గెలిచాయి. 2004లో కాంగ్రెస్, 2009లో పీఆర్పీ, 2014లో బీఎస్పీ, 2018లో టీఆర్ఎస్ ఇక్కడ గెలుపొందాయి.
- ముథోల్‌లో 1983లో కాంగ్రెస్ గెలవగా, ఆ తర్వాత వరుసగా టీడీపీ, కాంగ్రెస్, టీడీపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ గెలిచాయి. అంటే 40 ఏళ్లుగా ఇక్కడ ఒకసారి గెలిచిన పార్టీ మళ్లీ గెలవలేదు.

- ఆర్మూరులో 1983లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే, ఆ తర్వాత వరుసగా టీడీపీ, కాంగ్రెస్, టీడీపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్, టీడీపీ గెలిచాయి. గత రెండు ఎన్నికల్లో మాత్రమే టీఆర్ఎస్ వరుసగా గెలిచింది.
- జగిత్యాలో 2004లో కాంగ్రెస్, 2009లో టీడీపీ, 2014లో కాంగ్రెస్, 2018లో టీఆర్ఎస్ గెలిచాయి.
- పెద్దపల్లిలో 1978లో కాంగ్రెస్, 83లో టీడీపీ, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, 85లో టీడీపీ, 89లో కాంగ్రెస్, 94లో టీడీపీ, 99లో బీజేపీ, 2004లో టీఆర్ఎస్, 2009లో టీడీపీ, 2014లో టీఆర్ఎస్ గెలిచాయి. ఇలా వరుసగా 45 ఏళ్ల సంప్రదాయానికి గండికొడుతూ 2018లో కూడా టీఆర్ఎస్ ఇక్కడ గెలిచింది.
- హుజూరాబాద్‌లో1962 నుంచి వరుసగా నాలుగు సార్లు కాంగ్రెస్ గెలిస్తే, ఆ తర్వాత వరుసగా నాలుగుసార్లు టీడీపీ గెలిచింది. టీఆర్ఎస్ ఏర్పాటైన తర్వాత 6సార్లు ఆ పార్టీనే గెలిచింది. గత ఉప ఎన్నికల్లో మాత్రం బీజేపీ గెలిచింది.
- శేరిలింగంపల్లి ఏర్పాటైన తర్వాత మూడుసార్లు మూడు పార్టీలను అక్కడిప్రజలు గెలిపించారు. 2009లో కాంగ్రెస్, 2014లో టీడీపీ, 2018లో టీఆర్ఎస్‌లు ఇక్కడి నుంచి గెలిచాయి.

- సంగారెడ్డిలో 1989 నుంచి గెలిపించిన పార్టీ మళ్లీ ప్రజలు గెలిపించడం లేదు. 1989లో కాంగ్రెస్, 94లో టీడీపీ, 99లో బీజేపీ, 2004లో టీఆర్ఎస్, 09లో కాంగ్రెస్, 14లో టీఆర్ఎస్, 18లో కాంగ్రెస్‌ను అక్కడి ప్రజలు గెలిపించారు.
- ప్రస్తుతం సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తోన్న గజ్వేల్ నియోజకవర్గంలో ప్రజలు ఏ పార్టీనయినా రెండుసార్లు ఆదరిస్తున్నారు. 1994, 99లో టీడీపీ అభ్యర్థులు అక్కడ గెలిస్తే, 2004, 09లో కాంగ్రెస్, 2014, 18లో టీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు.
- చేవెళ్లలో 2004లో కాంగ్రెస్, 09లో టీడీపీ, 14లో కాంగ్రెస్, 8లో టీఆర్ఎస్ గెలుపొందాయి.
- తాండూరులో 1999లో టీడీపీ, 2004లో కాంగ్రెస్, 2009లో టీడీపీ, 2014లో టీఆర్ఎస్, 2018లో కాంగ్రెస్ గెలిచాయి. ఐదు ఎన్నికల్లో ఒకసారి గెలిచిన పార్టీని ప్రజలు మరోసారి ఆదరించలేదు.
- ముషీరాబాద్‌లో 1989, 94లో కాంగ్రెస్ గెలిచింది. ఆ తర్వాత ఒసారి బీజేపీ, మరోమారు టీఆర్ఎస్ గెలిచింది. అక్కడ మళ్లీ రెండు సార్లు కాంగ్రెస్ గెలిచింది. ఆ తర్వాత ఒకసారి బీజేపీ, మరోసారి టీఆర్ఎస్ గెలిచాయి. ఇప్పుడు ఏం జరుగుతుందో చూడాలి.

- జూబ్లీహిల్స్ ఏర్పాటయిన తర్వాత మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో వరుసగా కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ విజయం సాధించాయి.
- గోషామహల్‌లో ప్రజలు డబుల్ ధమాకా సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇక్కడ 1972, 78లో కాంగ్రెస్ గెలిస్తే, 83, 85లో టీడీపీ గెలిచింది. 94, 99 ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే, 2004, 09 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. ఆ తర్వాత 2014, 18 ఎన్నికల్లో బీజేపీ గెలిచింది. కానీ, 1989లో మాత్రం ఇందుకు భిన్నంగా కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు.
- కంటోన్మెంట్ నియోజకవర్గంలో నాలుగు ఎన్నికల్లో నాలుగు పార్టీలు గెలిచాయి. 2004లో టీడీపీ, 09లో కాంగ్రెస్, 14లో టీడీపీ, 18లో టీఆర్ఎస్ గెలిచాయి. మరి ఈసారి ఎవరు గెలుస్తారో?
- కొడంగల్‌లో కూడా రెండుసార్లు గెలిచే సంప్రదాయం కొనసాగుతోంది. 1994,96లో టీడీపీ, 1999,2004లో కాంగ్రెస్, 2009,14లో టీడీపీ గెలిచాయి. 18లో టీఆర్ఎస్ గెలవగా, 23లో ఎవరు గెలుస్తారో వేచి చూడాలి.
- మక్తల్‌లో 2005 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే 2009లో టీడీపీ, 14లో కాంగ్రెస్, 18లో టీఆర్ఎస్ గెలిచాయి.

- వనపర్తిలో గత నాలుగు ఎన్నికల్లో నాలుగు పార్టీలు గెలిచాయి. ఇక్కడ 2004లో కాంగ్రెస్, 2009లో టీడీపీ, 2014లో కాంగ్రెస్, 2018లో టీఆర్ఎస్ గెలిచాయి.
- కల్వకుర్తిలో 1989 నుంచి గెలిచిన పార్టీ మళ్లీ గెలవడం లేదు. 1989లో కాంగ్రెస్, 94లో ఇండింపెండెంట్, 99లో టీడీపీ, 2004లో కాంగ్రెస్, 2009లో టీడీపీ, 2014లో కాంగ్రెస్, 2018లో టీఆర్ఎస్ గెలవడం గమనార్హం.
- దేవరకొండలోనూ గెలిచిన పార్టీ మళ్లీ గెలవడం లేదని గత ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. ఇక్కడ 1994లో సీపీఐ గెలిస్తే 99లో కాంగ్రెస్, 2004లో సీపీఐ, 2009లో కాంగ్రెస్, 14లో సీపీఐ, 18లో టీఆర్ఎస్ గెలిచాయి.
- కోదాడలోనూ గత నాలుగు పర్యాయాలుగా ఓసారి గెలిచిన పార్టీ మరోమారు గెలవడం లేదు. ఇక్కడ 2004లో కాంగ్రెస్, 2009లో టీడీపీ, 14లో కాంగ్రెస్, 18లో టీఆర్ఎస్ గెలిచాయి.
- తుంగుతుర్తిలో 1989లో కాంగ్రెస్ విజయం సాధించగా, 94లో ఇండిపెండెంట్, 99లో టీడీపీ, 2004లో కాంగ్రెస్, 2009లో టీడీపీ, 14లో టీఆర్ఎస్ గెలిచాయి. వరుసగా రెండోసారి 2018లో మాత్రమే టీఆర్ఎస్ గెలిచింది.

- నర్సంపేటలో ఐదు పర్యాయాలుగా గెలిచిన పార్టీ గెలవడంలేదు. 1999లో ఇక్కడ టీడీపీ గెలిస్తే, 2004లో టీఆర్ఎస్, 2009లో టీడీపీ, 2014లో ఇండిపెండెంట్, 2018లో టీఆర్ఎస్ పార్టీలు గెలుపొందాయి.
- పరకాలలో 1989లో బీజేపీ గెలిస్తే, 94లో సీపీఐ, 99లో టీడీపీ, 2004లో టీఆర్ఎస్, 09లో కాంగ్రెస్, 12లో టీఆర్ఎస్, 14లో టీడీపీ, 18లో టీఆర్ఎస్ పార్టీలు గెలిచాయి. గత 8 ఎన్నికల్లోనూ అక్కడ ఒకసారి గెలిచిన పార్టీ మరోమారు గెలవడం లేదు.
- ములుగులోనూ నాలుగు పర్యాయాలుగా గెలుపు గుర్రాలు మారుతూనే ఉన్నాయి. 2004లో ఇక్కడ కాంగ్రెస్ గెలిస్తే 09లో టీడీపీ, 14లో టీఆర్ఎస్, 18లో కాంగ్రెస్ పార్టీలు విజయం సాధించాయి.
- ఖమ్మం నియోజకవర్గంలో 1994 నుంచి గెలిచిన పార్టీ మళ్లీ గెలవడం లేదు. ఇక్కడ 1994లో సీపీఐ, 1999లో కాంగ్రెస్, 2004లో సీపీఎం, 2009లో టీడీపీ, 2014లో కాంగ్రెస్, 2018లో టీఆర్ఎస్ గెలిచాయి.
- కొత్తగూడెంలోనూ నాలుగు దఫాలుగా విజయం వేర్వేరు పార్టీలను వరిస్తోంది. 2004లో అక్కడ కాంగ్రెస్ గెలిస్తే, 2009లో సీపీఐ, 14లో టీఆర్ఎస్, 18లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు.
- ఇక, అశ్వారావు పేట ఏర్పడిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లోనూ మూడు పార్టీలు గెలిచాయి. ఇక్కడ 2009లో కాంగ్రెస్, 2014లో వైఎస్సార్‌సీపీ, 2018లో టీడీపీ గెలిచాయి.
- నకిరేకల్‌లోనూ నాలుగు దఫాలుగా ఇవే ఫలితాలొస్తున్నాయి. ఇక్కడ 2004లో సీపీఎం గెలిస్తే 2009లో కాంగ్రెస్, 2014లో టీఆర్ఎస్, 2018లో కాంగ్రెస్ పార్టీలు గెలిచాయి.
- డోర్నకల్‌లోనూ ఓటర్లు ప్రతీఎన్నికల్లో తమ తీర్పు మారుస్తున్నారు. 2004లో కాంగ్రెస్‌ను గెలిపించిన అక్కడి ప్రజలు 09లో టీడీపీని, 14లో కాంగ్రెస్‌ను, 18లో టీఆర్ఎస్‌ను గెలిపించారు.

పొలిటీషియన్ కాదు.. పొలిటికల్ లీడరే ముఖ్యం

వనం దుర్గాప్రసాద్



ప్రజాస్వామ్య వ్యవస్థకు కావాల్సింది పొలిటికల్ లీడర్స్ మాత్రమే.. పొలిటీషియన్లు కాదనేది సెంటర్ ఫర్ ఎకనమిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ.రేవతి అభిప్రాయం. మహిళా మానవ వనరుల వినియోగంలో ఇప్పటికీ ప్రభుత్వాలు విఫలమవ్వడాన్ని అన్ని పార్టీలూ గుర్తించాలని ఆమె అంటున్నారు. రాష్ట్రావతరణ తర్వాత పల్లె జీవనంలో మార్పు వచ్చిందన్నారు. ఆర్థిక, సామాజిక స్థితిగతులపై నిరంతరం అధ్యయనం చేసే సెస్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న రేవతి ఎన్నికల వేళ విధానపరమైన అంశాలపై 'సాక్షి'తో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆమె మాటల్లోనే....

Interview

దృక్కోణంలో మార్పు కావాలి

పొలిటీషియన్ ఆలోచన ఎప్పుడూ కూడా తాత్కాలిక అవసరాల వైపే ఉంటుంది. అప్పటికప్పుడు ప్రజలను ప్రభావితం చేసే ధోరణిలో ఉంటుంది. ఆ దృక్కోణం దీర్ఘకాలిక ప్రయోజనాలివ్వదు. ఎన్నికల్లో గెలవడమే గీటురాయిగా సాధ్యం కాని హామీలు ఇవ్వడం పొలిటీషియన్ లక్షణం. కానీ పొలిటికల్ లీడర్ అలా కాదు. ఓ విజన్ ఉంటుంది. భావి తరాలకు మేలు చేసే ఆలోచనావిధానం ఉంటుంది. రాజకీయాల్లో ఒక్కోసారి వీరు విజయం సాధించకపోవచ్చు. కానీ ఆలస్యంగానైనా వీరి దూరదృష్టి ప్రజలను ఆకర్షిస్తుంది. ప్రజలకు హామీలిచ్చేప్పుడు నేతలు ఆలోచించాలి. కార్యాచరణలోకి తేగలమన్న విశ్వాసం ఉన్నప్పుడే హామీలివ్వాలి. అన్ని పార్టీలూ ఈ దిశగా విధాన నిర్ణయం తీసుకోవాలి.

యువశక్తిలో ఉద్వేగమెందుకు?

రాష్ట్రావతరణ తర్వాత తెలంగాణ అభివృద్ధి చెందింది. మౌలిక వసతుల కల్పన పెద్ద ఎత్తున జరిగింది. విదేశీ పెట్టుబడులూ పెరిగాయి. పరిశ్రమలూ స్థాపించారు. కానీ ఉపాధి వేటలో యువశక్తిలో నైరాశ్యం కన్పిస్తోంది. నిజానికి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇక ఉద్యోగాలొస్తాయనేది కలే. ఇక్కడే కాదు, యావత్ ప్రపంచంలో ఇదే పరిస్థితి. ప్రైవేటు రంగమే ఉపాధి మార్గం. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కన్పిస్తున్నా, యువతలో ఉద్యోగాల్లేవన్న ఆందోళనకు కారణాలున్నాయి. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యం పెంచకపోవడమే దీనికి ప్రధాన కారణం. నిజానికి ఉపాధి పొందుతున్న వారిలో మహిళలు 25 శాతమే ఉన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో

తాత్కాలిక వాగ్దానాలతో ప్రయోజనమేంటి?

- శాశ్వత పురోభివృద్ధి ప్రణాళికలే అవసరం
- రాష్ట్రావతరణ తర్వాత అభివృద్ధి జరిగింది.. విదేశీ పెట్టుబడులు, పరిశ్రమలొచ్చాయి
- కానీ ఇంకా యువతలో ఉపాధి ఆందోళనే..
- నైపుణ్యం పెంచడంలో నేతల విజన్ ఏది?

సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి

ఉద్యోగాలు చేసే పరిస్థితి కల్పించే దిశగా పాలకులు ఆలోచించాలి. యూత్ ఉద్యోగాలు సాధించే నైపుణ్యం ఉంటేనే రాష్ట్ర సంపద కూడా పెరుగుతుంది. దీన్ని గుర్తించడంలో పాలకులు వెనకపడ్డారనే చెప్పాలి. అమెరికా వెళ్తున్న మన వారు పర్మనెంట్ ఉద్యోగమే చేస్తున్నారా? చేసే ఉద్యోగం ఎప్పుడు ఊడిపోతుందో తెలియదు. అయినా మూడు నెలల్లో మరో ఉద్యోగం చూసుకోవడం లేదా? ఇక్కడి యువతలోనూ ఆ స్థాయి నమ్మకం, నైపుణ్యం కల్పించే దీర్ఘకాలిక ప్రయోజనాల వైపు పాలకులు దృష్టి పెట్టాలి.

వలసలు తగ్గాయి.. జీవనం మారింది

ఒకప్పుడు తెలంగాణలో వలసలు ఎక్కువగా ఉండేవి. మహబూబ్‌నగర్ నుంచి అనేక రాష్ట్రాలకు వెళ్లేవారు. ఇప్పుడు హైదరాబాద్ ఉపాధి అవకాశాల హబ్‌గా మారింది. దీంతో అన్‌స్కిల్డ్ సెక్టార్ నుంచి వలసలు తగ్గాయి. రాష్ట్రంలో 86 శాతం సన్న,చిన్నకారు రైతులున్నారు. ఇప్పుడు వీరు వ్యవసాయం ఒక్కటే ఉపాధి అనుకోవడం లేదు. కుటుంబంలో ఓ వ్యక్తి వ్యవసాయం చేస్తే, ఇంకో వ్యక్తి ఇతర ఉద్యోగాన్ని ఆశ్రయిస్తున్నాడు. ఉన్నత విద్యావంతులు మాత్రం వ్యవసాయం జోలికి వెళ్లడం లేదు. ఐటీ చేస్తే వ్యవసాయం చెయ్యకూడదని ఉందా? ప్రపంచీకరణ మార్పులను ప్రజలకు అవగాహన కల్పించడంలో అన్ని పార్టీలూ కృషి చేయాలి. సిరిసిల్ల వంటి చేనేత కార్మికులున్న ప్రాంతాల్లో తెలంగాణ వచ్చాక మార్పు కన్పిస్తోంది. పవర్ లూమ్స్ ద్వారా ఆదాయం పెంచుకున్నారు. ఇలా అన్ని సెక్టార్‌లోనూ స్కిల్ అభివృద్ధి చేయాలి. అప్పుడు నిరుద్యోగ సమస్య, యువతలో ఆగ్రహాన్ని కట్టడి చేయవచ్చు.

నాణ్యమైన విద్య అందుతుందా?

విద్యాబోధనలోనే తేడాలున్నాయి. ఇవి అసమానతలకు కారణమవుతున్నాయి. ప్రభుత్వ విద్యా రంగాన్నే చూడండి. గురుకులాలు... మోడల్ స్కూల్స్... కేజీబీవీలు... ప్రభుత్వ స్కూళ్ళు... స్థానిక సంస్థల స్కూళ్ళు... ఒక్కోచోట ఒక్కో నాణ్యత ఉంటోంది. నాణ్యమైన విద్య అందరికీ అందించాలనే ధోరణి పాలకుల్లో ఉండాలి. ఈ దిశగా మేధోమథనం జరగాలి. విద్యా విధానాలపై శాశ్వత మార్పులను ఆశించి నిర్ణయాలు తీసుకోవాలి. సమాజాన్ని మేలుకొల్పే విద్యను నిర్లక్ష్యం చేస్తే భావితరం ఆలోచన విధానంలో మార్పు వస్తుంది. నూతన మార్పు తెచ్చేది రాజకీయ పార్టీలే. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలే.

ఎన్నికల తర్వాతే గృహప్రవేశం!

- నగదు, ఆన్‌లైన్ లావాదేవీలపై పోలీసుల నిఘా
- తనిఖీల్లో చిక్కితే ఎలాగన్న డైలమాలో గృహ కొనుగోలుదారులు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ స్థిరాస్తి రంగంపై పడింది. సాధారణంగా రియల్టీ మార్కెట్‌లో నగదు ప్రవాహమే ఎక్కువగా ఉంటుంది. ఇందులోనూ అనధికారిక లావాదేవీలే అధికం. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఎన్నికల సంఘం అధికారులు నగదు ప్రవాహంతోపాటు ఆన్‌లైన్ లావాదేవీలపై కూడా గట్టి నిఘా పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో నగదు లావాదేవీలు జరపడం శ్రేయస్కరం కాదని గృహ కొనుగోలుదారులు భావిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో నగదు తీసుకెళ్తే.. పోలీసుల తనిఖీల్లో చిక్కితే అసలుకే ఎసరొస్తుందని ఎన్నికలు పూర్తయ్యే వరకు గృహ కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నారు. దీంతో ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లపై తీవ్ర ప్రభావం పడనుంది.

అప్పటి వరకూ ఎదురుచూపులే..

సామాన్య, మధ్యతరగతి ప్రజలు పొదుపు చేసిన డబ్బుతో ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు కొనుగోలు చేస్తుంటారు. చాలా తక్కువ మొత్తానికి గృహ రుణం కోసం బ్యాంకులకు వెళ్తుంటారు. మరో వైపు ఆన్‌లైన్ ఖాతా ద్వారా నగదు లావాదేవీలు జరుపుదామంటే.. వాటిపై కూడా నిఘా పెట్టాలని ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో బ్యాంకర్లు దృష్టి పెట్టారు. దీంతో ఎన్నికలు పూర్తయ్యే వరకు గృహ ప్రవేశాలకు గడ్డుకాలమేనని చెప్పాలి. ఎన్నికలు డెవలపర్ల మీద కంటే కొనుగోలుదారులపై ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయి. ఎన్నికలకు 1–2 నెలల ముందు నుంచి, ఎన్నికలయ్యాక 2 నెలల వరకు కస్టమర్లు వేచిచూసే ధోరణిలో ఉంటారు. ఎందుకంటే కొత్త ప్రభుత్వం వస్తే కొత్త పథకాలు, రాయితీలు, పాలసీలు తమ పెట్టుబడుల మీద ఎలాంటి ప్రభావం చూపిస్తాయోనని కొనుగోలుదారులు వేచి చూస్తుంటారు.


ముందస్తు బుకింగ్‌లు..

స్థిరాస్తి సంస్థలకు నిరంతర క్రయవిక్రయాలు జరపకపోతే సంస్థ కార్యకలాపాలు, ఉద్యోగుల జీవభత్యాలు ఇతరత్రా వ్యయాల నిర్వహణ భారంగా మారుతుంది. దీంతో పలు నిర్మాణ సంస్థలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రవాసులు, విశ్వసనీయమైన కస్టమర్లతో ముందస్తు బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ఎన్నికల తర్వాత చెల్లింపులు జరిపేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. మరో వైపు ఎన్నికల సమయంలో రియల్టర్లు రాజకీయ పార్టీలకు, నాయకులకు నిధులు సమకూర్చడం సాధారణమే కానీ, ఈసారి తెలంగాణలో నెలల వ్యవధిలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వేర్వేరుగా జరుగుతాయి. దీంతో బిల్డర్లు ఫండ్‌ను కూడా వేర్వేరుగా ఏర్పాటు చేయాల్సి వస్తుందని, ఇది డెవలపర్లకు కొంత భారమేనని ఓ డెవలపర్ అభిప్రాయపడ్డారు.



టికెట్ కోసం జలదీక్ష

కురవి (మహబూబాబాద్): వీళ్లు చేపల కోసం చెరువులోకి దిగారనుకుంటే పొరపాటే...ఇప్పుడు నడుస్తోంది ఎన్నికల సీజన్ కాబట్టి ఎమ్మెల్యే టికెట్ దక్కించుకునేందుకు నేతలు నానాపాట్లు పడుతున్నారు. ఈ ఫొటో కూడా అలాంటిదే... మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను కిసాన్ పరివార్ అధినేత నేనావత్ భూపాల్‌నాయక్‌కు ఇవ్వాలని కోరుతూ కురవి మండలం కందికొండకు చెందిన కొందరు కార్యకర్తలు ఆదివారం ఆ ఊరి చెరువులోకి దిగి జలదీక్ష చేపట్టారు.



పాలమూరుపై పట్టు ఎవరిది?

వలసలు, కరువే కాదు.. విభిన్న రాజకీయ పరిణామాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న పాలమూరుపై ప్రధాన రాజకీయ పక్షాలు ప్రత్యేక నజర్ వేశాయి. కృష్ణానది చెంతనే ఉన్నా చుక్క నీరు రాక విలవిల్లాడుతున్న పాలమూరు ప్రజల దీనగాథ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తెలంగాణ గొంతుకై దేశవ్యాప్తంగా మార్మోగింది. ఈ క్రమంలో టీడీపీ, కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఈ జిల్లా.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండు పర్యాయాలుగా జరిగిన ఎన్నికల్లో 'కారు'కు అండగా నిలిచింది. ఈసారి ఎన్నికల్లో సైతం సత్తా చాటేలా బీఆర్‌ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండగా.. పూర్వ వైభవం సాధించే దిశగా కాంగ్రెస్.. ఈసారైనా ఉనికి చాటాలనే లక్ష్యంతో కమల నాథులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

- ప్రధాన రాజకీయ పార్టీల ప్రత్యేక నజర్
- ఎన్నికల వేళ హాట్‌హాట్‌గా పరిణామాలు
- ముందస్తుగా అభ్యర్థుల ఖరారుతో 'కారు'లో జోష్
- రాజకీయాస్త్రంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల

కిషోర్ కుమార్ పెరుమాండ్ల

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్) 7, కాంగ్రెస్ 5, టీడీపీ 2 స్థానాల్లో గెలుపొందాయి. నారాయణపేటలో టీడీపీ నుంచి గెలిచిన రాజేందర్‌రెడ్డి, మక్తల్‌లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కారెక్కగా.. బీఆర్‌ఎస్ బలం తొమ్మిదికి చేరింది. 2018 ఎన్నికల్లో గులాబీ పార్టీ ఏకంగా 13 స్థానాల్లో గెలుపొందగా.. కొల్లాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి విజయం సాధించారు. అనంతర పరిణామాల క్రమంలో ఆయన సైతం బీఆర్‌ఎస్‌లో చేరారు.

పెరిగిన 'కారు' స్పీడ్

ఉమ్మడి జిల్లాలో అలంపూర్ మినహా 13 మందికి బీఫారాలు సైతం అందజేశారు. అక్కడ ఎమ్మెల్యే అబ్రహంపై అసంతృప్త జ్వాలలు ఎగిసిపడటం.. ఆయనకు బీ-ఫారమ్ ఇవ్వకపోవడం.. ఈ క్రమంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి వ్యక్తిగత సహాయకుడు విజయుడి పేరు తెరపైకి రావడం.. ఆయనపై సైతం పార్టీ శ్రేణుల్లో విముఖత వ్యక్తం కావడం గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతోపాటు కల్వకుర్తిలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై వ్యతిరేకత.. టికెట్ ఆశించి భంగపడిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్‌లో చేరటం బీఆర్‌ఎస్‌కు ఎదురుదెబ్బేనని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. షాద్‌నగర్, మక్తల్, అచ్చంపేటలో సైతం బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఎదురుగాలి వీస్తున్నట్లు తెలుస్తోంది.

చేరికలతో 'చేయి'కి జీవం

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎన్నికల పోరులో వరుస పరాజయాలతో కుంగిపోయిన కాంగ్రెస్‌కు ఇటీవల ఉమ్మడి జిల్లా నుంచి కీలక నేతల చేరికలు జీవం పోశాయి. కొల్లాపూర్‌లో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు, డాక్టర్ రాజేశ్ రెడ్డి, మహబూబ్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, గద్వాలలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, వనపర్తిలో ఎంపీపీ మేఘారెడ్డి చేరడం పార్టీలో జోష్ నింపింది. అయితే కొల్లాపూర్‌లో చింతలపల్లి జగదీశ్వర్‌రావు రూపంలో అసమ్మతి భగ్గుమంటోంది. తాజాగా నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నాగంను బీఆర్ ఎస్‌లోకి ఆహ్వానించారు. జడ్చర్ల, నారాయణపేటల టికెట్ నుంచి ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ బీఆర్ ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన వారు ఏదైనా పార్టీ లేదా స్వతంత్రంగా బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

బీజేపీ నామమాత్రమేనా..?

ఉమ్మడి జిల్లాలో బీజేపీ. గత రెండు ఎన్నికల్లో ఏ ఒక్క స్థానంలోనూ గెలుపొందలేదు. అయితే కల్వకుర్తిలో గతంలో స్వల్ప ఓట్లతో ఆచారి ఓటమి పాలు కాగా.. దీంతో ఈసారి ఈ స్థానంతోపాటు పట్టున్న మక్తల్, నారాయణపేటపై పార్టీ ఆశలు పెట్టుకుంది. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి వంటి హేమాహేమీలు ఉన్నప్పటికీ.. మారుతున్న రాజకీయ పరిణామాలు, ఇప్పటివరకు కొల్లాపూర్, కల్వకుర్తి, మహబూబ్‌నగర్ మినహా అభ్యర్థులను ప్రకటించకపోవడంతో పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంది. తాజాగా మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ ఆ పార్టీకి రాజీనామా చేసి మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

రాజకీయాస్త్రంగా 'పాలమూరు'..

ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలను సస్యశామలం చేసే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ అంశం రాజకీయాస్త్రంగా మారింది. 2014 ఎన్నికల్లో ఈ ప్రాజెక్ట్ నిర్మించి.. కృష్ణా నీటితో రైతుల కాళ్లు కడుగుతామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. అయితే కేసులు తదితర కారణాలతో ప్రాజెక్ట్ నిర్మాణంలో జాప్యం చోటుచేసుకోగా.. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సీఎం కేసీఆర్ నార్లాపూర్ వద్ద మొదటి మోటార్ స్విచ్ ఆన్ చేసి ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. అదే రోజు కొల్లాపూర్‌లో.. ఆ తర్వాత ఈ నెల 18న జడ్చర్లలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఈ అంశాన్ని పదే పదే ప్రస్తావించారు. మరోవైపు విపక్షాలు సైతం ఒకటే మోటార్ ప్రారంభించి ప్రాజెక్ట్ పూర్తయినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందంటూ విమర్శలు గుప్పించాయి. దీంతో ఈ ఎన్నికల్లో 'పాలమూరు' రాజకీయాస్త్రంగా మారినట్లు స్పష్టమవుతోంది. పాలమూరు వేదికగా దక్షిణ తెలంగాణలో సత్తా చాటే వ్యూహాన్ని బీఆర్‌ఎస్ అమలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

నేతల ఫైట్లూ... కార్యకర్తల ఫేట్లు!

ఓ రాజకీయ వేదికపై ఇద్దరు నేతల మధ్య చర్చ సాగుతోంది.

''ఇటు కిడ్నీలైనా, అటు నేతలైనా ఎన్నికల నాటికైనా నాలుగు రాళ్లు వెనకేసుకోకపోతే ఎలా? అవేమైనా మాకోసమా? మళ్లీ జనాలకు పంచడం కోసమేగా'' ఓ నేత ఉవాచ.

''నాలుగురాళ్లన్నవి కేవలం కిడ్నీల సామాజికా వర్గానికేనా?.. ప్యాంక్రియాస్ వర్గాలకు వద్దా?'' పోటీ నేత ప్రసంగంలో ఆగ్రహం.

రాళ్ల టాపిక్ కాస్తా చినికి చినికి గాలివానై, వడగళ్లతో రాళ్లవానైంది.

ప్రజాప్రతినిధి వివేకానంద, మరో నేత శ్రీశైలం మీదకు దూకినట్టుగా వారిద్దరి మధ్యా పోరాటం. అంతే..ఇరుపక్షాల నేతలూ, వాళ్లకు దన్నుగా ఇరు వైపులా కార్యకర్తల మధ్య కూడా మొదలైంది ఓ సంకుల సమరం.

కార్యకర్తల్ని కళ్లల్లోనూ, వాళ్ల బాగోగుల్ని కడుపులోనూ పెట్టుకుని చూసుకోవాల్సిన బాధ్యత నేతలదే కదా! కాబట్టి..ఈ టైములో వాళ్ల మనోస్థైర్యం దెబ్బతినకుండా ఇవ్వాల్సిన ఉపన్యాసాన్ని రెడీ చేసుకుంటున్నాడో నేత. అందులోని అంశాలివి...

....

నా ప్రియమైన కార్యకర్తలారా... డాక్టర్‌తో మాట్లాడా. పోరాటంలో దెబ్బతిన్న మీ కాళ్లచేతుల్లో ప్లేట్లు వేయాలని ఆయన చెబుతున్నారు. ఎంత ఖర్చయినా పర్లేదు. మాంఛి నాణ్యమైన ప్లేట్లు అందుబాటులో ఉంచాలని డాక్టర్లకు చెప్పా. మీకేం పర్లేదు.. రేపు సాంబార్ఇడ్లీ, మసాలాదోసెలాంటి టిఫిన్ తినాల్సి వచ్చినప్పుడు కూడా ఈ ప్లేట్లు ఉపయోగపడేలా ఉండాలని డాక్టర్లకు సూచించా. వాటి ఖర్చంతా నేనే భరిస్తానని ఈ సందర్భంగా మీకు హామీ ఇస్తున్నా.

ఇందుమూలంగా డాక్టర్ గారికి ఓ సూచన కూడా చేశా. ''సార్..ఎంత కాలం ఈ కాలం చెల్లిన బ్లాక్ అండ్ వైటు ఎక్సరేలు తీస్తారు. మా కార్యకర్తల కోసం నేనెంతమాత్రమూ ఖర్చుకు వెనకాడను. ఎంతైనా పర్లేదు. కనీసం ఇప్పట్నుంచైనా కలర్ ఎక్స్‌-రేలు తీయాలనీ, అవసరమైతే ఈ టెక్నాలజీని ఇజ్రాయెలూ, ఇస్తాంబులూ, ఇటలీ..ఎక్కడ దొరికితే అక్కణ్నుంచి తెప్పించాలం''టూ విజ్ఞప్తి చేశా.

కేవలం ఎక్సరేలు మాత్రమే కాకుండా..సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఇకపై సీటీ స్కానులూ, ఎమ్మారై ఫొటోలు కూడా పాత పద్ధతిలో బ్లాక్ అండ్ వైటులో కాకుండా..కలర్‌ఫొటోల్లోనే తీసేలా అప్‌డేట్ కావాలని కూడా సూచించా.

పొరబాట్న ఏ కార్యకర్తకైనా పెద్ద గాయాలై, అవి బయటకు అసహ్యంగా కనిపిస్తుంటే..వాటికి ప్లాస్టిక్ సర్జరీ చేయాల్సి వస్తే తప్పక చేయమనీ, ఆ ఖర్చు కూడా నేనే భరిస్తానని డాక్టర్లకు చెప్పా. అయితే వాతావరణ కాలుష్యంపై అద్భుతమైన సామాజికస్పృహ ఉన్నవాడిగా, ఓ పర్యావరణ ప్రేమికుడిగా ఇకపై ప్లాస్టిక్ సర్జరీలు వద్దనీ, ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీగా ఉండేలాంటి జూట్ సర్జరీలూ చేసి, గన్నీబ్యాగు నారతోనే కుట్లు వేయాలని డాక్టర్లను అభ్యర్థించా. ఒకరిపై ఆధారపడకుండా, పర్యావరణానికి మేలు చేసే, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ ఈ పీచునారను కూడా దేశీయంగా ఉత్పత్తి చేసేలా మనం పరిజ్ఞానం పెంచుకునేలా వైద్యపరిశోధనలు సాగాలంటూ సైంటిస్టులకు పిలుపునిచ్చా.

....

ఇలా సాగిపోతున్న ఉపన్యాసాన్ని వింటున్న ఓ మామూలు ఓటరు మాటలివి...

''కొత్తగా ముద్దుముద్దుమాటలొస్తున్న రోజుల్లో మా బుజ్జిగాడి కబుర్లివి.

ఎందుకో పాపం..వీళ్లంటే జాలేస్తోంది. ఐక్యూ పరంగా చూస్తే..వీళ్లకంటే మా బుజ్జోడే బెటరు. ఎందుకంటే..వాడిది ఇన్నోసెన్సూ... వీళ్లది ఇగ్నోరెన్సు!!''



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

జంగ్ తెలంగాణ
పంచతంత్రం

రాజస్తాన్ బరిలో నేతల బంధువులు

అసెంబ్లీ అభ్యర్థులుగా కాంగ్రెస్, బీజేపీల నుంచి 29 మంది

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీకి నవంబర్ 25వ తేదీన జరగనున్న ఎన్నికలకు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తమ పార్టీల ముఖ్య నేతల బంధువులు, రాజకీయ కుటుంబాలకు చెందిన కనీసం 29 మందిని అభ్యర్థులుగా ప్రకటించాయి. అసెంబ్లీలోని 200 సీట్లకు గాను అధికార కాంగ్రెస్ 95 స్థానాలకు, బీజేపీ 124 సీట్లకు ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించాయి. రెండు పార్టీలు ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అభ్యర్థుల ఎంపిక గెలుపు అవకాశాలపై ప్రభావం చూపకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆయా పార్టీల నేతలు అంటున్నారు. అయితే, వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయంటూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు మరో వైపు విమర్శిస్తుండటం గమనార్హం. ఏదేమైనప్పటికీ, బీజేపీ ఇప్పటి వరకు ప్రకటించిన 124 మంది అభ్యర్థుల్లో పార్టీలోని ప్రముఖ నేతల కుటుంబసభ్యులైన కనీసం 11 మందికి టికెట్లు ఇచ్చింది. అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసిన 95 మంది అభ్యర్థుల్లో రాజకీయ నేపథ్యమున్న కుటుంబాలకు చెందిన వారు 18 మంది అభ్యర్థులుగా ఉన్నారు. బీజేపీ జాబితాలో ఆ పార్టీ ప్రముఖ నేతల కుమారులు, కూతుళ్లు, మనవరాళ్లు, కోడళ్లు ఉన్నారు. ప్రధానంగా ఆరోగ్య కారణాలతో చనిపోయిన నేతల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు స్థానం కల్పించినట్లు చెబుతున్నారు.

కాషాయ పార్టీలో వారసులెవరంటే..

తాజాగా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన ప్రముఖ నేతల వారసుల్లో కొందరు.. దివంగత ఎంపీ సన్వర్ లాల్ జాట్ కుమారుడు రాం స్వరూప్ లాంబాకు బీజేపీ నాయకత్వం నసీరాబాద్ టికెట్ కేటాయించింది. అదేవిధంగా, రాష్ట్ర మాజీ మంత్రి దిగంబర్ సింగ్ కుమారుడు శైలేశ్ సింగ్‌ను డీగ్-కుమ్హేర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దించింది. గుర్జర్ నేత కిరోడి సింగ్ బైన్‌స్లా కుమారుడు విజయ్‌కి బీజేపీ డియోలి-ఉనియారా టికెట్టిచ్చింది. మాజీ ఎంపీ, జైపూర్ రాజకుటుంబానికి చెందిన గాయత్రీ దేవి మనవరాలు దియా కుమారిని విద్యాధర్ నగర్ స్థానం కేటాయించింది. మాజీ ఎంపీ కర్ని సింగ్ మనవరాలు సిద్ధి కుమారిని బికనీర్ (ఈస్ట్)స్థానంలో బరిలో నిలిపింది.

కాంగ్రెస్ పార్టీలో..

మాజీ ప్రతిపక్ష నేత రామేశ్వర్ దుడి భార్య సుశీలకు కాంగ్రెస్ పార్టీ నోఖా టికెట్టిచ్చింది. మాజీ ఎమ్మెల్యే భన్వర్‌లాల్ శర్మ కుమారుడు అనిల్ శర్మ సర్దార్‌షహర్ నుంచి, కేంద్ర మాజీ మంత్రి శ్రీష్ రామ్ ఓలా కుమారుడు బ్రిజేంద్ర ఓలాకు ఝున్‌ఝును నుంచి, సిట్టింగ్ ఎమ్మెల్యే సఫియా ఖాన్ భర్త జుబేర్ రామ్‌గఢ్ నుంచి, మాజీ ఎమ్మెల్యే బిర్దిచంద్ జైన్ బంధువు మేవారాం జైన్ బర్మేర్ నుంచి, మాజీ మంత్రి భన్వర్‌లాల్ కుమారుడు మనోజ్ సుజన్‌గఢ్ నుంచి బరిలోకి దిగుతున్నారు.

పేదలకు ఉచితంగా రూ.10 లక్షల వైద్యం


వ్యవసాయ కూలీలతో కలిసి కోసిన వరిని చూపుతున్న రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు

- భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.10 వేలు
- ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీలు

రాజ్‌నందన్‌గావ్: ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తే నిరుపేదలకు ఉచితంగా రూ.10 లక్షల వరకు వైద్యం చేయిస్తుందని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి ప్రస్తుతం ఇచ్చే రూ.7 వేల ఆర్థిక సాయాన్ని రూ.10 వేలకు పెంచుతుందని ప్రకటించారు. రాజ్‌నందన్‌గావ్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. అయిదేళ్లలో సీఎం భూపేశ్ బఘేల్ ప్రభుత్వం చేపట్టినన్ని సంక్షేమ కార్యక్రమాలు గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని రైతులు తెలిపారన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వం ఏర్పాటైన మొదటి రోజే కులగణన మొదలుపెడుతుందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వం అదానీ వంటి కోటీశ్వరుల కోసం పనిచేస్తుందని ఆరోపించారు. తమ పార్టీ పేదలు, కార్మికులు, రైతులు, వెనుకబడిన కులాలు, గిరిజనులు, దళితుల కోసం పనిచేస్తుందని, వారి ఆకాంక్షలను అర్థం చేసుకుంటుందని వివరించారు. వారి అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. అనంతరం సీఎం బఘేల్ 'ఎక్స్'లో 'కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి డాక్టర్ ఖూబ్‌చంద్ బఘేల్ ఆరోగ్య సహాయ పథకంలో భాగంగా ప్రస్తుతం పేదలకు ప్రస్తుతం చేయిస్తున్న రూ.5 లక్షల వైద్య చికిత్సల సాయాన్ని రూ.10 లక్షలకు పెంచుతాం. అదే విధంగా, ఇతరులకిస్తున్న వైద్య సాయాన్ని రూ.50 వేల నుంచి రూ.5 లక్షలకు పెంచుతాం'అని తెలిపారు.

వరి కోత పనుల్లో రాహుల్

ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న రాహుల్ గాంధీ ఆదివారం ఉదయం రాయ్‌పూర్ సమీపంలోని కథియా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతు కూలీలతో కలిసి పొలంలో వరి కోశారు. రైతులతో ముచ్చటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రైతు అనుకూల ప్రభుత్వ నమూనాను దేశమంతటా అమలు చేస్తామని చెప్పారు. రుణ మాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి వాటిని రైతుల కోసం తీసుకొచ్చామని చెప్పారు. రైతులు సంతోషంగా ఉంటే దేశం కూడా సంతోషంగా ఉంటుంది అని అనంతరం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జరిగిన కీలక పరిణామం అధికార కాంగ్రెస్‌ను, అంతకంటే ఎక్కువగా విపక్ష బీజేపీని కలవరపెడుతోంది. రాష్ట్రంలో గణనీయ సంఖ్యలో ఉన్న జాట్లు, దళితుల పేరిట రెండు పార్టీలు ఎన్నికల బరిలో దిగాయి. కనీసం 40 అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలను ప్రభావితం చేయగల ఈ రెండు సామాజికవర్గాలను అవి ఆకట్టుకుంటే ప్రధాన పార్టీలకు తీవ్ర నష్టం తప్పదన్న అభిప్రాయం వినిపిస్తోంది...

జాట్-దళితనాదం

రాజస్తాన్‌లో కొత్త పరిణామం ● బీజేపీ, కాంగ్రెస్‌లకు గుబులు

రాజస్తాన్ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగుతున్నట్టు ప్రముఖ జాట్ నేత, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్ ఎల్‌పీ) నేత హనుమాన్ బెనీవాల్ ప్రకటించారు. అంతేగాక 10 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను కూడా శనివారమే ప్రటించారాయన. మిగతా అన్ని స్థానాల్లో కూడా పోటీ చేయడం ఖాయమని స్పష్టం చేశారు. యూపీలో చెప్పుకోదగ్గ ఆదరణ ఉన్న దళిత నేత, భీం ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ కూడా ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) పేరుతో రాష్ట్రంలో తొలిసారి బరిలో దిగుతున్నారు. ఈ రెండు పార్టీలూ ఎన్నికల పొత్తు కుదుర్చుకుని రాజస్తాన్ బ్యాలెట్ పోరును మరింత ఆసక్తికరంగా మార్చేశాయి. రాజస్తాన్‌లో బీజేపీ, కాంగ్రెస్‌లకు బలమైన ప్రత్యామ్నాయం రావాల్సిన అవసరం చాలా ఉందని ఈ సందర్భంగా బెనీవాల్, ఆజాద్ సంయుక్త విలేకరుల సమావేశంలో చెప్పుకొచ్చారు. ఇందుకోసం 'కిసాన్, జవాన్, దళిత్'వర్గాలు కలిసి రావాలంటూ వారిచ్చిన పిలుపు వెనక లోతైన అర్థమే దాగుంది. ఈ నయా జాట్-దళిత బంధం కాంగ్రెస్, బీజేపీ అవకాశాలను బాగానే దెబ్బ తీసేలా కనిపిస్తోంది.



బీజేపీకే ఎక్కువ నష్టం...!

ఆరెల్పీకి జాట్లలో ఎంతో పట్టుండటమే గాక దళితుల్లోనూ ఆదరణ ఉంది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఇద్దరు దళితులే కావడం ఇందుకు నిదర్శనం. ఇక ప్రధానంగా దళిత పార్టీ అయిన ఏఎస్పీ రాజస్తాన్‌లో తొలిసారిగా బరిలో దిగుతోంది. అది కూడా దళితుల ఓట్లను గణనీయంగానే ఆకర్షించేలా కన్పిస్తోంది. వీటి జంట పోటీతో జాట్, దళిత ఓట్లు సంఘటితమైతే అది ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీలకు చేటు చేయవచ్చంటున్నారు. ముఖ్యంగా బీజేపీకి ఎక్కువ నష్టం జరిగేలా కన్పిస్తోంది. ఎందుకంటే గత నాలుగేళ్లలో రాజస్తాన్‌లో పలు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీకి ఓటమే ఎదురైంది. ఇందుకు ఆ పార్టీ ఓట్లను ఆరెల్పీ చీల్చడం కూడా గట్టి కారణమే. 2022ల సర్దార్ షహర్ స్థానంలో కాంగ్రెస్ తన ఓట్ల సంఖ్యను పెంచుకోగా, జాట్ల ఓట్లు మాత్రం బీజేపీ, ఆరెల్పీ మధ్య చీలాయి. దాంతో కాంగ్రెస్ 26 వేల ఓట్ల మెజారిటీతో నెగ్గింది. అక్కడ ఆరెల్పీకి 46,628 ఓట్లు రావడం విశేషం. అంతకుముందు 2021లో వల్లభ్‌నగర్ ఉప ఎన్నికల్లోనైతే ఆరెల్పీ ఏకంగా బీజేపీ తిరుగుబాటు అభ్యర్థినే రంగంలోకి దింపింది. దాంతో ఆ పార్టీ ఏకంగా నాలుగో స్థానానికి పడిపోయింది! సూజన్‌గఢ్ ఉప ఎన్నికలోనూ ఆరెల్పీ 32,210 ఓట్లు కొల్లగొట్టి సత్తా చాటింది. దాంతో ఇక్కడా కాంగ్రెసే నెగ్గింది! అందుకే ఈసారి అసెంబ్లీ ఎన్నికల పోరు హోరాహోరీగా సాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల్లో గెలుపోటములకు మధ్య ఆరెల్పీయే ప్రధాన కారణంగా నిలిచే ఆస్కారం కనిపిస్తోంది.

అసంతృప్తితో జాట్లు...

రాజస్తాన్‌లో జాట్ సామాజికవర్గంలో కొంత కాలంగా తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. తమ కులానికి సంబంధించిన నేతే సీఎంగా ఉండాలని డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ చీఫ్‌లిద్దరూ జాట్లే ఉండేవారు. ఇటీవలే బీజేపీ సతీశ్ పునియా స్థానంలో సీపీ జోషిని రాష్ట్ర పార్టీ అధ్యక్షున్ని చేసింది. ప్రస్తుత అసెంబ్లీలో 39 మంది జాట్ ఎమ్మెల్యేలున్నారు. అందుకే రెండు ప్రధాన పార్టీలూ తమకు కనీసం 40 చొప్పున టికెట్లివ్వాలని జాట్ మహాసభ డిమాండ్ చేస్తోంది.

ఎస్సీలు ప్రబల శక్తి

రాజస్తాన్‌లో 34 ఎస్సీ రిజర్వుడ్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 19 చోట్ల కాంగ్రెస్, 12 స్థానాల్లో బీజేపీ నెగ్గాయి. తర్వాత 2019 లోక్‌సభ ఎన్నికల వేళ ఆరెల్పీ కేంద్రంలో ఎన్డీఏ కూటమితో జట్టు కట్టింది. బెనీవాల్ ఎంపీగా నెగ్గారు కూడా. కానీ రైతు చట్టాలపై విభేదించి బీజేపీకి దూరమయ్యారు. దీనికి తోడు ఆజాద్ పార్టీ కూడా రాష్ట్రంలో బీఎస్పీకి ఉన్న దళిత ఓటు బ్యాంకుపై దృష్టి సారించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్తాన్‌లో బీఎస్పీ 6 స్థానాల్లో నెగ్గింది. తర్వాత వారంతా కాంగ్రెస్‌లో విలీనమయ్యారు. కానీ ఆ తర్వాత దళితుల పట్ల కాంగ్రెస్ ద్రోహం చేసిందని ఆజాద్ ఆరోపిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బెనీవాల్.. రైతు నేత



రాజస్తాన్‌లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా మూడో శక్తిగా ఎదిగే దిశగా అడుగులు వేస్తున్న హనుమాన్ బెనీవాల్ ప్రస్థానం ఆసక్తికరం. 1972లో నగౌర్‌లో ఓ జాట్ రైతు కుటుంబంలో పుట్టారు. రైతు నాయకునిగా ప్రసిద్ధుడైన బెనీవాల్ రాజకీయ జీవితం బీజేపీ కార్యకర్తగానే మొదలైంది! 2008లో ఆ పార్టీ తరఫున నగౌర్ నుంచి ఎమ్మెల్యే అయ్యారు. కానీ నాటి సీఎం వసుంధరరాజె సింధియా సహా రాష్ట్ర బీజేపీ నేతల అవినీతిని, కాంగ్రెస్ నేతలతో వారి సాన్నిహిత్యాన్ని బాహాటంగానే ప్రశ్నించి పార్టీకి దూరమయ్యారు. 2013లో స్వతంత్ర ఎమ్మెల్యేగా నెగ్గారు. రాజస్తాన్‌లో సరిగ్గా 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరెల్పీని స్థాపించారు. అప్పట్లో పరిమిత స్థానాల్లోనే పోటీ చేసినా ఈ ఐదేళ్లలో చెప్పుకోదగ్గ శక్తిగా ఎదిగారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏతో పొత్తు పెట్టుకున్నారు. నగౌర్ స్థానం నుంచి లోక్‌సభలో అడుగు పెట్టారు. కానీ ఎన్డీఏ సర్కారు తెచ్చిన రైతు చట్టాలను, అగ్నివీర్ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఆ కూటమికి దూరమయ్యారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాలని ఆశిస్తున్నారు.

ఆజాద్... భీం ఆర్మీ నేత



1986లో ఉత్తరప్రదేశ్‌లోని చుట్మల్‌పూర్‌లో జన్మించిన చంద్రశేఖర్ ఆజాద్ వృత్తిరీత్యా న్యాయవాది. సామాజిక కార్యకర్తగా వెలుగులోకి వచ్చారు. భీం ఆర్మీ సహ వ్యవస్థాపకుడు. ఈ సంస్థ దళితుల అభ్యున్నతికి కృషి చేస్తుంటుంది. వారి కోసం పశ్చిమ యూపీలో స్కూళ్లు తదితరాలు నడుపుతోంది. సహరన్‌పూర్ అల్లర్లలో జాతీయ భద్రతా చట్టం కింద ఆజాద్ జైలుకు వెళ్లారు. అనంతరం ఆజాద్ సమాజ్ పార్టీ స్థాపించారు. 2021లో టైం మేగజీన్ 100 మంది వర్ధమాన నేతల జాబితాలో చోటుచేసుకున్నారు.

ఆ 76 లక్షల ఓటర్లే లక్ష్యం...

2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్తాన్‌లో 3.56 కోట్ల ఓట్లు పోలయ్యాయి. వాటిలో కాంగ్రెస్, బీజేపీల్లో వేటికీ పడని ఓట్లు ఏకంగా 21.34 శాతం! అంటే 76 లక్షల ఓట్లు! వీటినే ఇప్పుడు ఆరెల్పీ, ఏఎస్పీ ప్రధానంగా లక్ష్యం చేసుకున్నాయి.

2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలవారీగా సాధించిన ఓట్లు

పోలైన ఓట్లు	3.56 కోట్లు
బీజేపీ	1.38 కోట్లు
కాంగ్రెస్	1.4 కోట్లు
ఆరెల్పీ	6.5 లక్షలు
ఏఎస్పీ	-
ఇతరులు	76 లక్షలు

ఫలితాలను నిర్దేశించే అసెంబ్లీ స్థానాల సంఖ్య

జాట్లు	40 స్థానాలు
ఎస్సీలు	55 స్థానాలు

మరెన్నో స్థానాల్లో కూడా వీరి సంఖ్య గణనీయంగా ఉంది.

రాజస్తాన్ జనాభాలో... జాట్లు 10 శాతం.. ఎస్సీలు 18 శాతం..

సాక్షి
కరీంనగర్

సోమవారం । 30 । అక్టోబర్ । 2023

ఉద్యమకారులకు హుజూరాబాద్ పట్టం

ఉద్యమాలకు కేంద్ర బిందువైన హుజూరాబాద్ 1957లో (ఎస్సీ రిజర్వ్) నియోజకవర్గంగా ఏర్పడి మూడేళ్లకే జనరల్ స్థానంగా మారింది. ఈ నియోజకవర్గానికి ఇప్పటివరకు 17సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో మూడు ఉప ఎన్నికలు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాలుగుసార్లు, టీడీపీ, స్వతంత్రులు మూడుసార్లు చొప్పున, ఇక బీఆర్ఎస్ ఏకంగా ఆరుసార్లు విజయం సాధించింది. 2021లో వచ్చిన ఉప ఎన్నికలో బీజేపీ గెలిచింది.

10లో ▸



న్యూస్‌రీల్

సమాజ హితమే సాహిత్య లక్ష్యం



అవార్డులతో సాహిత్యకారులు

కరీంనగర్‌కల్చరల్: సమాజహితమే సాహిత్య లక్ష్యమని ప్రముఖ కవి రచయిత, విమర్శకులు భవాని సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఫిలింభవన్‌లో ఆర్యాణి సకల కళావేదిక కరీంనగర్, మంథని శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సేవాసంస్థ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి సాహితీ రికార్డు పురస్కారాల ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభాధ్యక్షుడు, శ్రీ గౌతమేశ్వర సాహితీ కళాసేవా సంస్థ వ్యవస్థాపకుడు దూడపాక శ్రీధర్ మాట్లాడారు. రాయాలన్న కోరిక, తపన కవికి ఉండాలన్నారు. 60 మంది కవులకు అంతర్జాతీయ స్థాయి రికార్డు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, విమర్శకులు సంస్థ ప్రధాన సలహాదారు పొర్ల వేణుగోపాలరావు, తెలుగు వెలుగు సాహిత్య వేదిక రాష్ట్ర చైర్మన్ డా.మోటూరి నారాయణరావు, కవులు రమాదేవి కులకర్ణి, ప్రముఖ కవి జనశ్రీ జనార్ధన్, మోహన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి గెలుపుతో అభివృద్ధి పరుగులు



వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

చొప్పదండి: బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తే అభివృద్ధి మరింత పరుగులు పెడుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని వెదురుగట్టలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్లుగా తెలంగాణలో అభివృద్ధికి పునాదులు బలంగా వేయడం జరిగిందని, మూడోసారి సీఎంగా కేసీఆర్ అధికారంలోకి వస్తే అభివృద్ధి ప్రక్రియ వేగవంతమవుతుందన్నారు. కేసీఆర్ బీమా, ఇంటింకి ధీమా అనే పథకాలు సూక్ష్మంగా ఆలోచించి రూపొందించినవేనని, కేసీఆర్ బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుస్తారన్నారు.

అసంతృప్తులతో సమావేశం

మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంతకాలంగా పార్టీ సమావేశాల్లో పాల్గొనడం లేదు. ఈ నేపథ్యంలో వెదురుగట్టలోని గుడిపాటి వెంకటరమణారెడ్డి ఇంట్లో అసంతృప్తులతో వినోద్‌కుమార్ సమావేశమయ్యారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని, సమస్యలుంటే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరెళ్ళి చంద్రశేఖర్ గౌడ్, కొత్త గంగారెడ్డి, గొల్లపల్లి శ్రవన్‌కుమార్, కొత్తూరి మహేశ్, నలుమాచు రామకృష్ణ, మచ్చ రమేశ్, ఎండీ జహీరుద్దీన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి హల్‌చల్



సామగ్రి తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జమ్మికుంట(హుజూరాబాద్): కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ఓ మటన్ షాపు నిర్వాహకుడు ట్రేడ్ లైసెన్స్, పన్ను చెల్లించడం లేదంటూ అతడిపై మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి ఆదివారం హల్‌చల్ చేశాడు. షాపులోని మటన్, సామగ్రి స్వాధీనం చేసుకొని మున్సిపల్ కార్యాలయానికి తరలించాడు. బాధితుడి కథనం ప్రకారం.. పట్టణంలోని ఐబీ పెట్రోల్ పంపు సమీపంలో ఎండీ.షాబుద్దీన్ మూడేళ్లుగా మటన్‌షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. నిబంధనల ప్రకారం లైసెన్స్ తీసుకున్నాడు. దసరా పండుగ సందర్భంగా మామూళ్లు, యాటలు కోయడానికి రాలేదనే నెపంతో మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి (ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్) సిబ్బందితో షాపు వద్దకు వచ్చి, లైసెన్స్ లేదంటూ సామగ్రి, మటన్‌ను మున్సిపల్ కార్యాలయానికి తరలించాడు. షాపు యజమాని రసీదులు చూపించినా పట్టించుకోలేదు. షాబుద్దీన్ తల్లి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి మటన్ చెడిపోతుందని ప్రాధేయపడడంతో తిరిగి మటన్, సామగ్రి ఇచ్చాడు. దసరా మామూళ్లు ఇవ్వకపోవడం.. పండుగకు యాటలను (మేకలు, గొర్రెలు) కోయడానికి రాలేదని కక్ష సాధింపుతోనే ఇలా చేశాడని షాబుద్దీన్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

22 ఏళ్లు.. మూడు గుర్తులు



పోరాడి రాజులు అవుతారో.. అమ్ముకొని బానిసలు అవుతారో.. నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది.
– బీఆర్ అంబేడ్కర్

మీకు తెలుసా?

కరీంనగర్: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ పురుడు పోసుకొని సరిగ్గా 22 ఏళ్లయింది. 2001 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లోని జలదృశ్యంలో టీఆర్ఎస్‌గా ఆవిర్భవించి ప్రస్తుతం బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందింది. 22 ఏళ్లలో బీఆర్ఎస్ పార్టీ మూడు గుర్తులతో ఎన్నికల బరిలోకి దిగింది. పార్టీ ఆవిర్భావం జరిగాక సిద్దిపేట ఎమ్మెల్యే పదవి, డిప్యూటీ స్పీకర్ పదవికి సీఎం కేసీఆర్ రాజీనామా చేశారు. అప్పుడు జరిగిన సిద్దిపేట ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బస్సు గుర్తును కేటాయించారు. వెనువెంటనే వచ్చిన స్థానిక సంస్థల (2001)ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి రైతు నాగలి గుర్తును కేటాయించారు. అనంతరం 2004వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కారు గుర్తు కేటాయించడంతో ఆ గుర్తు బీఆర్ఎస్‌కు సొంతమైంది.

మనోళ్లు సీనియర్లే..!



6 సార్లు



ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983, 1989, 1996 ఉప ఎన్నిక, 1999, 2004, 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి జరగనున్న శాసనసభ ఎన్నికల్లో బరిలో నిలుస్తున్నారు.



మంత్రి కొప్పుల ఈశ్వర్ 2004, 2008లో మేడారం నుంచి 2009, 2010, 2014, 2018లో ధర్మపురి నుంచి మొత్తం ఆరుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు.

7 సార్లు



ఈటల రాజేందర్ టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021 ఎన్నికల్లో మొత్తం ఏడుసార్లు విజయం సాధించారు. ఇందులో 2008, 2010, 2021 ఉప ఎన్నికలు ఉన్నాయి. 2021లో ఆయన బీజేపీలో చేరి విజయం సాధించడం గమనార్హం.

4 సార్లు



సిరిసిల్ల నుంచి కేటీఆర్, వేములవాడ నుంచి చెన్నమనేని రమేశ్‌బాబు, కోరుట్ల నుంచి కె.విద్యాసాగర్‌రావు 2009, 2010, 2014, 2018లో వరుసగా ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఇందులో 2010లో ఉప ఎన్నిక కావడం విశేషం. ప్రస్తుతం రమేశ్‌బాబు, విద్యాసాగర్‌రావు ఈ సారి పోటీలో లేరు.



మంథని నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు 1999, 2004, 2009లో కాంగ్రెస్ నుంచి వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేశారు. 2014లో ఓడినప్పటికీ 2018లో తిరిగి శాసనసభకు నాలుగోసారి ఎన్నికయ్యారు.

3 సార్లు



గంగుల కమలాకర్ 2009, 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించారు. ఈ విజయాలతో కరీంనగర్‌లో తన పేరిట కొత్త రికార్డు లిఖించుకుని, నాలుగోసారి విజయంపై కన్నేశారు.

దివంగత మాజీ ఎమ్మెల్యేల రికార్డు



- దివంగత చెన్నమనేని రాజేశ్వర్‌రావు 1957లో చొప్పదండి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం సిరిసిల్ల నియోజకవర్గం నుంచి 1967, 1978, 1985, 1994, 2004లో ఆరుసార్లు విజయం సాధించి రికార్డు సృష్టించారు.



- దివంగత దేశిని చిన్నమల్లయ్య 1978, 1984, 1989, 1994లో ఇందుర్తి (ప్రస్తుతం హుస్నాబాద్) నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు.



- కమలాపూర్ ఎమ్మెల్యేగా దివంగత ముద్దసాని దామోదర్ రెడ్డి 1985, 1989, 1994, 1999లో నాలుగుసార్లు విజయం సాధించారు. దివంగత ఎన్టీఆర్ హయాంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.

- అసెంబ్లీలో సీనియర్లంతా ఉమ్మడి జిల్లావారే..!
- నాలుగు నుంచి ఏడుసార్లు శాసనసభకు ఎన్నిక
- ఉద్యమాల గడ్డ కావడమే ప్రధాన కారణం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: స్కూల్.. కాలేజీ.. పనిచేసే చోట.. అంతెందుకు కుటుంబంలోనూ చిన్నా, పెద్ద, సీనియర్, జూనియర్ అన్న వ్యత్యాసాలు సర్వసాధారణం. ఇందుకు అసెంబ్లీ కూడా మినహాయింపు ఏమీ కాదు. ఇపుడున్న సభలో ఉమ్మడి రాష్ట్రం నుంచి వరుసగా ఎన్నిసార్లు ఎన్నికలు వచ్చినా.. విజయం సాధిస్తున్న ఎమ్మెల్యేలు చాలామంది ఉన్నారు. వీరిని సీనియర్ శాసనసభ్యులు అంటూ స్పీకర్, తోటి ఎమ్మెల్యేలు సంబోధించడం పరిపాటి. అది ఆయా నియోజకవర్గాల్లో ఆ ఎమ్మెల్యేలకు ఉన్న ప్రజాబలం, సభలో వారికి ఉన్న అనుభవానికి తోటి సభ్యులు ఇచ్చే మర్యాద, గౌరవాలకు సూచన. అలాంటి సీనియర్ ఎమ్మెల్యేల్లో అధికశాతం మంది కరీంనగర్ జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. ప్రస్తుతం సభలో ఉన్న సభ్యులను మిగిలిన జిల్లాల సభ్యులతో పోల్చినపుడు ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలే సీనియర్లుగా నిలుస్తున్నారు. వీరిలో మెజారిటీ గులాబీ పార్టీకే చెందిన వారు కావడం విశేషం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షతో పురుడుపోసుకున్న పార్టీ నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి)కి మొదటి నుంచి కరీంనగర్ జిల్లాలో పట్టు ఎక్కువ. అందుకే రాష్ట్ర సాధనలో భాగంగా పలుమార్లు రాజీనామాలు చేయడం.. తిరిగి ఉప ఎన్నికల్లో విజయం సాధించడంతో వీరు తమతోపాటు సభకు ఎంపికైన తోటి ఎమ్మెల్యేల కంటే అత్యధిక సార్లు విజయం సాధించిన నేతలుగా అరుదైన గుర్తింపు సాధించారు. ప్రస్తుతం జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికలు తెలంగాణ శాసన సభకు మూడోవి. అదే సమయంలో సభలో కనిష్ఠంగా రెండు నుంచి గరిష్ఠంగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినవారు సభలో ఉండటం గమనార్హం. ఉమ్మడి రాష్ట్రంలో వారు సాధించిన వరుస విజయాలే వారి సీనియారిటీకి కారణం.

కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బీసీ వర్గాల ప్రజలను దారుణంగా అవమానించారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి రాగానే బీసీ వ్యక్తిని సీఎం చేస్తామంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన తర్వాతే కేటీఆర్‌కు బీసీ కులం కంటే గుణం ముఖ్యమనే మాటలు గుర్తుకొచ్చాయా? అంటూ మండిపడ్డారు. గుణమే ముఖ్యమనే కేటీఆర్.. బీఆర్ఎస్‌లో ఎంతమంది గుణవంతులకు టిక్కెట్లు ఇచ్చారో చెప్పాలన్నారు. కొడుకు చేసిన వ్యాఖ్యలపై కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పిన తరువాత ఆయా వర్గాల ప్రజలను ఓట్లు అడగాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కుమ్మక్కై బీజేపీ గ్రాఫ్‌ను తగ్గించే కుట్రలు చేస్తున్నాయని, ఎంఐఎం నాయకులకు పెద్ద ఎత్తున డబ్బు సంచులు ముట్టడంతో కరీంనగర్‌లో పోటీ చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పూర్తిగా డౌన్ ఫాల్ అయిందని, ఆ పార్టీకి ఉప ఎన్నికల్లో డిపాజిట్లే రాలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలే అమలు కావడం లేదని, అక్కడి ప్రజలు తెలంగాణకు వచ్చి ధర్నాలు చేస్తున్నారంటే ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఇవన్నీ బయటపడతాయని తెలిసి, బీజేపీ గెలవకూడదని కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో రుణమాఫీ అమలు కాలేదని రైతులతోపాటు నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు, అన్నివర్గాల ప్రజలు కేసీఆర్ పట్ల తీవ్రమైన వ్యతిరేకతతో ఉన్నారని తెలి పారు. బీఆర్ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాల సంక్షేమం

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వినోద్‌కుమార్, రసమయి బాలకిషన్

గన్నేరువరం(మానకొండూర్): బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమని, కాంగ్రెస్‌తో అంధకారమేనని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. కాంగ్రెస్ నయవంచక పాలన నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ఒకప్పుడు సాగునీరు లేక ఇబ్బందులు పడ్డ తెలంగాణ నేడు మూడు పంటలతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, అలాంటి పాలన ఇక్కడ కావాలా అని అన్నారు. కాంగ్రెస్ నాయకురాలు గొడుగు శ్రీలత, మరో 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి వినోద్‌కుమార్, రసమయి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, వైస్ ఎంపీపీ న్యాత స్వప్న, సర్పంచ్ పుల్లెల లక్ష్మి, సర్పంచ్, ఎంపీటీసీ, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, సురేశ్, మన్మోహన్‌రావు, లక్ష్మన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చల్లూర్‌ను మండలం చేస్తాం



మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక(హుజూరాబాద్) : ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే చల్లూర్‌ను మండలంగా ఏర్పాటు చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని చల్లూర్‌లో బీజేపీ నుంచి 50మంది బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా ఉందన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గాన్ని వెయ్యికోట్లతో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట మాజీ మార్కెట్ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, ఎంపీపీ రేణుక తిరుపతి రెడ్డి, జెడ్పీటీసీ మాడ వనమాల సాధవరెడ్డి, సర్పంచ్ పొదిల్ల జ్యోతి రమేశ్, గ్రామ అధ్యక్షుడు కుమార్, నాయకులు జక్కు నారాయణ, శంకర్, రమణారెడ్డి, గోపాల్, సదయ్య, బండి సమ్మయ్య, శ్రీకాంత్, చంద్రయ్య, క్రాంతికుమార్, గణేశ్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు.. సవాళ్లు

- అక్రమాలను అరికడితేనే అన్నదాతకు లాభం
- పత్తి, ధాన్యం కొనుగోళ్లలో ఏటా మాయాజాలం
- ఇంకా మొదలవని ప్రభుత్వ కొనుగోళ్లు
- ఆది నుంచే అండ లభిస్తే ఎంతో మేలు



ధాన్యం కొనుగోళ్లు(ఫైల్)

కరీంనగర్ అర్బన్: అన్నదాతకు అదరువుగా ఉండేందుకు ప్రభుత్వాలు మద్దతు ధరలు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితి. పంటలకు ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధరలు ప్రకటిస్తుండగా ఏనాడూ కర్షకునికి పూర్తిస్థాయిలో ధర లభించిన ఘటనలు శూన్యం. ప్రస్తుతం వానాకాలం పంట ఉత్పత్తులు మార్కెట్లకు చేరుతుండగా జిల్లా యంత్రాంగం తదనుగుణ చర్యలు ముమ్మరం చేస్తే సరి. ధాన్యం, పత్తి కొనుగోళ్లకు పటిష్ఠ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తే వందల కోట్ల లాభం చేకూరినట్లే.

ధాన్యం కేంద్రాల జాడేది?

జిల్లాలో వరి కోతలు ముమ్మరమవగా దళారులు దండుకుంటున్నారు. కల్లాల్లోనే కొనుగోళ్లు చేస్తుండగా కనీస మద్దతు ధరకు తక్కువగా కొంటున్నారు. ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో దళారులనే ఆశ్రయిస్తున్నారు. గతంలో లాగా అకాల వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటన్న కోణంలో తెగనమ్ముకుంటున్నారు. ఇక పత్తి కొనుగోళ్లది అదే పరిస్థితి. కరీంనగర్, జమ్మికుంట, గంగాధర, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్ మార్కెట్లుండగా దళారులు మద్దతు ధరకు తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కొనుగోళ్ల జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ దీపావళి తరువాత కొనుగోలు చేస్తుందని అధికారులు చెబుతుండగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు నవంబర్ 1 నుంచి ప్రారంభమవుతాయని డీఎస్వో చెబుతున్నారు.

తూకంలో దగా.. యంత్రాలు మోసమే

ఏటా వానాకాలం, యాసంగిలో ధాన్యం కొనుగోళ్లు చేపడుతుండగా అన్నదాతకు అడుగడుగునా దగానే. కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు కిలోన్నర నుంచి 3 కిలోల వరకు అదనంగా దోచుకుంటున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే తరుగంటూ మాటల గారడీ చేస్తున్నారు. గత యాసంగి ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు అందినంత దండుకున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు కరవయ్యాయన్నది అన్నదాతల ఆవేదన. పత్తి కొనుగోళ్లలోనూ అంతే. పేరుకు ఈ–నామ్ అయినా మార్కెట్‌లో సిండికేట్ దందానే. కార్యాలయంలో కూర్చుని ధర నిర్ణయించుకోవడం తదుపరి రెండు మూడు బస్తాలకు ఎక్కువ ఖరీదు చేయడం.. తదుపరి తామనుకున్నట్లుగా సఫలీకృతమవడం జరుగుతున్న తంతు. జిన్నింగ్ మిల్లుల్లోనూ ఇంతకుమించి దోపిడీ జరుగుతుండగా సీసీఐ నామమాత్రమే.

ప్రభుత్వరంగ సంస్థల భాగస్వామ్యమేదీ?

వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్ల తీరు మారడం లేదు. ఒకప్పుడు ప్రభుత్వరంగ సంస్థలే పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేది. కాలక్రమేణా ఆ సంస్థలు పర్యవేక్షణకే పరిమితమవడంతో దళారుల సంఖ్య క్రమేపీ పెరిగింది. మొక్కజొన్న, పప్పుధాన్యాలు కొనుగోలు చేసే మార్క్‌ఫెడ్, ధాన్యం కొనుగోలు చేసే పౌరసరఫరాల శాఖ, భారత ఆహార సంస్థ, ఆముదాలు, పొద్దుతిరుగుడు, తదితర నూనె ఉత్పత్తులు కొనుగోలు చేసే ఆయిల్‌ఫెడ్ సంస్థలు ఇపుడు పర్యవేక్షణకే పరిమితమయ్యాయి. ధాన్యం, పత్తి కొనుగోళ్లలో ఆలస్యం అటుంచితే నగదు కోత, ఇచ్చే మొత్తం ఖాతాకు అనుసంధానించడంలో జాప్యం ఆందోళనకు గురిచేస్తోంది. కొనుగోలు చేసిన 48 గంటల్లో నేరుగా రైతు ఖాతాకు నగదు చేస్తామన్న ప్రభుత్వ మాటలు నామమాత్రమే. వారం, పక్షం, నెల రోజులు గడిచినా డబ్బులు అందని రైతులెందరో.

మద్దతు ధర అంతంతే

గతేడాది పత్తి పంటకు రూ.5,550 మద్దతు ధర కాగా సీసీఐ కొనుగోలు చేసింది స్వల్పం. అత్యధికంగా వ్యాపారులే లాభపడ్డారు. మూడేళ్లుగా జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలుకు అనుమతి లభించడంతో సీసీఐ పలు మిల్లులను అద్దెకు తీసుకుని కొనుగోలు చేస్తోంది.రెండేళ్ల క్రితం మార్కెట్ యార్డుల్లోనే కొనుగోలు చేసిన సీసీఐ జిన్నింగ్ మిల్లులతో ఉన్న అనుబంధంతో మార్కెట్లను గాలికొదిలేశారు. ఇదేంటంటే మార్కెట్‌కు విడిపత్తి తేవడం లేదని, జిన్నింగ్ మిల్లుకు వెళ్తున్నారని మార్కెట్ అధికారులు చెబుతుండగా, సిబ్బంది కొరతంటూ సీసీఐ వల్లెవేస్తోంది. మొత్తంగా జిన్నింగ్ మిల్లులు కళకళలాడుతుండగా మార్కెట్లు అలంకారప్రాయమయ్యాయి.

క్లుప్తంగా

రూ.70వేలు స్వాధీనం చేసుకున్న పోలీసులు


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై తిరుపతి

సారంగాపూర్‌: ఎన్నికల విధుల్లో భాగంగా ఆదివారం సాయంత్రం కోనాపూర్‌ గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. రూ.70వేలను ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నారు. పెంబట్ల గ్రామానికి చెందిన లక్ష్మణ్‌ ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.70వేలను స్వాధీనం చేసుకొని గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ.. నలుగురికి తీవ్ర గాయాలు


నుజ్జునుజ్జయిన కారు

జగిత్యాలక్రైమ్‌: జగిత్యాల అర్బన్‌ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం కారు అతివేగంగా వచ్చి అదుపుతప్పి ద్విచక్ర వాహనం, తరువాత చెట్టును ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బుగ్గారం మండల కేంద్రానికి చెందిన మేసు రమేశ్‌, సందీప్‌ కారులో బుగ్గారం నుంచి జగిత్యాల వస్తున్న క్రమంలో జగిత్యాలకు చెందిన సాయిరెడ్డి, నరేష్‌రెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో కారులో ఉన్న రమేశ్‌, సందీప్‌, ద్విచక్ర వాహనంపై ఉన్న సాయిరెడ్డి, నరేష్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు నుజ్జునుజ్జయింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సుల్తానాబాద్‌ రూరల్‌: సుల్తానాబాద్‌ మండలం గర్రెపల్లి జెడ్పీ పాఠశాలలో 1982–83లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కిషన్‌కుమార్‌, సత్యనారాయణరావు, చక్రధర్‌, శ్రీనివాస్‌, శైలజ, శారద, తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్‌: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని 2006–07 విద్యా సంవత్సరం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రఘుపతిరావు, లక్ష్మీరాజం, ఏసుదాసు, సూర్యనారాయణ, మహేందర్‌, హాస్టల్‌ వార్డెన్లు రమణారెడ్డి, నర్సింహారెడ్డిని వారు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. తాము చదువుకునే రోజుల్లో ఆడుతూ పాడుతూ చేసిన చిలిపి పనులు, మాస్టర్లతో బెత్తం దెబ్బలు తిన్న జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యుగందర్‌రెడ్డి, రమేశ్‌, శ్రీకాంత్‌, నరేశ్‌, అంజలి, దుర్గాప్రసాద్‌, సాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు హుజూరాబాద్‌ పట్టం



● 1957లో శాసనసభ నియోజకవర్గం ఏర్పాటు ● హుజూరాబాద్‌లోకి కమలాపూర్‌ ● కమలాపూర్‌లో ముద్దసాని.. హుజూరాబాద్‌లో ఈటల మార్క్‌


నారాయణరెడ్డి | పరిపాటి జనార్దన్‌రెడ్డి | కెప్టెన్‌ లక్ష్మీ కాంతారావు | కేతిరి సాయిరెడ్డి | ముద్దసాని దామోదర్‌రెడ్డి | ఇనుగాల పెద్దిరెడ్డి | ఈటల రాజేందర్‌

ఏడాది	గెలుపు	పార్టీ	ఓటమి	పార్టీ
1957	పి.నరసింగరావు	స్వతంత్ర	గాడిపెల్లి రాములు	స్వతంత్ర
1962	గాడిపెల్లి రాములు	కాంగ్రెస్‌	నాయిని దేవయ్య	సీపీఐ
1967	పి.నరసింగరావు	కాంగ్రెస్‌	కొత్త రాజిరెడ్డి	స్వతంత్ర
1972	వి.రాజేశ్వర్‌రావు	కాంగ్రెస్‌	ఎ.కాశీవిశ్వనాథరెడ్డి	స్వతంత్ర
1978	డి.వెంకట్రావు	కాంగ్రెస్‌	ఎ.కాశీవిశ్వనాథరెడ్డి	జనతా
1983	కొత్త రాజిరెడ్డి	స్వతంత్ర	డి.వెంకట్రావు	స్వతంత్ర
1985	డి.వెంకట్రావు	టీడీపీ	భాస్కర్‌రెడ్డి	కాంగ్రెస్‌
1989	కేతిరి సాయిరెడ్డి	స్వతంత్ర	డి.వెంకట్రావు	టీడీపీ
1994	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ	బి.లక్ష్మీకాంతరావు	కాంగ్రెస్‌
1999	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ	కేతిరి సాయిరెడ్డి	కాంగ్రెస్‌
2004	బి.లక్ష్మీకాంతరావు	టీఆర్‌ఎస్‌	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ
2008	వి.లక్ష్మీకాంతరావు	టీఆర్‌ఎస్‌	కె.సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్‌
2009	ఈటల రాజేందర్‌	టీఆర్‌ఎస్‌	వీ.కృష్ణమోహన్‌రావు	కాంగ్రెస్‌
2010	ఈటల రాజేందర్‌	టీఆర్‌ఎస్‌	ఎం.దామోదర్‌రెడ్డి	టీడీపీ
2014	ఈటల రాజేందర్‌	టీఆర్‌ఎస్‌	కే.సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్‌
2018	ఈటల రాజేందర్‌	టీఆర్‌ఎస్‌	పాడి కౌశిక్‌రెడ్డి	కాంగ్రెస్‌
2021	ఈటల రాజేందర్‌	బీజేపీ	గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌	టీఆర్‌ఎస్‌



హుజూరాబాద్‌: ఉద్యమాలకు కేంద్ర బిందువైన హుజూరాబాద్‌ 1957లో (ఎస్సీ రిజర్వ్‌) నియోజకవర్గంగా ఏర్పడి మూడేళ్లకే జనరల్‌ స్థానంగా మారింది. ఇందులో హుజూరాబాద్‌, భీమదేవరపల్లి తాలూకాలుగా ఉండేవి. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 17సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో మూడు ఉప ఎన్నికలు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ నాలుగుసార్లు, టీడీపీ, స్వతంత్రులు మూడుసార్లు చొప్పున, ఇక బీఆర్‌ఎస్‌ ఏకంగా ఆరుసార్లు విజయం సాధించింది. 2021లో వచ్చిన ఉప ఎన్నికలో బీజేపీ గెలిచింది. ఇక్కడి నుంచి గెలిచిన ఇనుగాల పెద్దిరెడ్డి, కెప్టెన్‌ లక్ష్మీకాంతారావు మంత్రులుగా పని చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కమలాపూర్‌ నియోజకవర్గకేంద్రంతోపాటు ఆ నియోజకవర్గంలో ఉన్న జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట(కొత్తగా ఏర్పడిన మండలం), హుజూరాబాద్‌ (మొత్తం ఐదు మండలాలు)తో కలిపి ముఖచిత్రంగా మారింది. ఇక కమలాపూర్‌ నియోజకవర్గం పూర్తిగా కనుమరుగైంది.

జంగ్‌ తెలంగాణ

ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు ఇలా

1957లో ఏర్పడిన హుజూరాబాద్‌కు ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో ఈ నియోజకవర్గంలో ఉన్న సైదాపూర్‌, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలను హుస్నాబాద్‌ నియోజకవర్గంలో.. కమలాపూర్‌ నియోజకవర్గ కేంద్రంతోపాటు జమ్మికుంట, వీణవంక మండలాలను హుజూరాబాద్‌లో కలిపారు. అప్పటివరకు ఉన్న శంకరపట్నం, మానకొండూర్‌ మండలాలను విడదీసి కొత్తగా ఏర్పడిన మానకొండూర్‌ నియోజకవర్గంలో కలిపారు. హుజూరాబాద్‌ నుంచి 1957లో ఇద్దరు స్వతంత్రులే బరిలో దిగగా.. పోలుసాని నర్సింగరావును గెలిపించారు. 1962లో గాడిపల్లి రాములు (కాంగ్రెస్‌), 1967లో తిరిగి పోలుసాని నరసింగరావు (కాంగ్రెస్‌), 1972లో వొడితెల రాజేశ్వరరావు (కాంగ్రెస్‌), 1978లో దుగ్గిరాల వెంకట్రావు (కాంగ్రెస్‌), 1983లో కొత్త రాజిరెడ్డి (స్వతంత్ర), 1985లో దుగ్గిరాల వెంకట్రావు (టీడీపీ), 1989లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కేతిరి సాయిరెడ్డి విజయం సాధించారు. ఇక 1994, 1999లో వరుసగా ఇనుగాల పెద్దిరెడ్డి (టీడీపీ) గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ అభ్యర్థి కెప్టెన్‌ లక్ష్మీకాంతరావును ఆదరించారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ లక్ష్మీకాంతారావు టీఆర్‌ఎస్‌ నుంచి గెలిచారు. పునర్విభజన అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ నుంచి ఈటల రాజేందర్‌, 2010లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఈటల ఘన విజయం సాధించారు. 2014, 2018లో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లోనూ ఈటల రాజేందర్‌ టీఆర్‌ఎస్‌ నుంచే గెలిచి హ్యాట్రిక్‌ కొట్టారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ బీజేపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2004వరకు జమ్మికుంటలో నామినేషన్‌ వేసే ఇక్కడి అభ్యర్థులు.. 2009 నుంచి హుజూరాబాద్‌ నియోజకవర్గ కేంద్రంలోనే వేస్తున్నారు.

నియోజకవర్గ ప్రత్యేకతలు

నియోజకవర్గం వ్యవసాయ ఆధారితం. ఎస్సారెస్పీ నుంచి ప్రవహించే కాకతీయకాలువ ద్వారా ఈ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 59 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. జమ్మికుంటలోని పత్తిమార్కెట్‌ ఉత్తర తెలంగాణలోనే అతి పెద్దదిగా పేరుగాంచింది. సీడ్‌ ఉత్పత్తిలోనూ హుజూరాబాద్‌ దేశంలోనే పేరుగాంచింది. జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు వ్యవసాయంలో సూచనలు చేస్తూ కొత్త వంగడాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. జమ్మికుంట, ఉప్పల్‌, బిజిగిర్‌షరీఫ్‌లో ఉన్న రైల్వేస్టేషన్‌ ద్వారా ప్రయాణికులకు రవాణా సులువవుతోంది.

మొత్తం ఓటర్లు 2,44,514

హుజూరాబాద్‌ నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 106 గ్రామాలు, రెండు మున్సిపాలిటీలు ఉండగా, మొత్తం 305 పోలింగ్‌ స్టేషన్లు ఉన్నాయి. 2,44,514 మంది ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 1,19,676 మంది పురుషులు, 1,24,833 మహిళలు, ఇతరులు ఐదుగురు ఉన్నారు.

బీసీ సీఎం అభ్యర్థి పేరు ప్రకటించాలి


మాట్లాడుతున్న బొల్లం లింగమూర్తి

కరీంనగర్‌: బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థిని సీఎం చేస్తామనడం ఓట్ల కోసమేనని, చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి బీసీ అభ్యర్థి ఎవరో ముందే వెల్లడించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బొల్లం లింగమూర్తి డిమాండ్‌ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్లు దండుకునేందుకు బీజేపీ బీసీ సీఎం జపం మొదలుపెట్టిందని విమర్శించారు. విదేశీ విద్యకోసం జ్యోతిబాపులే నిధినుంచి బీసీ విద్యార్థులను విదేశాలకు పంపుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి బీజేపీ జీర్ణించుకోలేకపోతుందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేసి, కేంద్ర కేబినెట్‌లో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన తర్వాత ఓట్లు అడగాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో బీసీసంక్షేమ సంఘం నాయకులు రమేశ్‌, అజయ్‌, అశ్విన్‌, వేణుగోపాల్‌, ఆంజనేయులు, కోటేశ్వర్‌, నారాయణ, కిషన్‌, సతీశ్‌, కుమార్‌, రమేశ్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీలోకి సిరిసిల్ల నేతలు


పార్టీలో చేరినవారితో అంబటి జోజిరెడ్డి

కరీంనగర్‌ : ఆలిండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మేకల కమలాకర్‌ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి సమక్షంలో సిరిసిల్ల నుంచి పత్తిపాక సురేశ్‌, మున్సిపల్‌ కౌన్సిలర్‌ పత్తిపాక పద్మ, నాయకులు, యువతి, యువకులు పార్టీలో చేరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో అంబటి జోజిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిరిసిల్ల ఆలిండియా ఫార్వర్డ్‌ జెండా ఎగురవేయాలన్నారు. పత్తిపాక శంకర్‌, కూరపాటి శ్రీకర్‌, గుండేటి రవితేజ, మహేశ్‌, నజీర్‌, పత్తిపాక రోహిణి, శ్రీనివాస్‌, భట్ల అజయ్‌, సౌమ్య, బైరి కమల్‌, బొడ్డు బాలు, నికిలి గండి, బాలయ్య, నాగరాజుతోపాటు 50 మంది పార్టీలో చేరారు. చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్‌ కుమార్‌, చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్‌ శేఖర్‌, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్లను రిలీవ్‌ చేయాలి

కరీంనగర్‌: రాష్ట్రంలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవర్స్‌తో సంబంధం లేకుండా వెంటనే రిలీవ్‌ చేయాలని టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు పొరెడ్డి దామోదర్‌ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. వెంటనే ప్రభుత్వం బదిలీ అయిన టీచర్లను రిలీవ్‌ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్‌ చేసి అవసరం అయితే వారిని పాతస్థానంలో పనిచేసేలా చూడాలన్నారు.

లక్నోలో యువతి.. తీసుకొచ్చిన పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన ఓ యువతి వారం రోజుల క్రితం అదృశ్యమవగా.. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. యువతి లక్నోలో ఉన్నట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. రైలు లేదా బస్సులో వెళితే జాప్యమవుతుందని పోలీసులు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్పీ విమానం ద్వారా పట్టణ పోలీసులను లక్నో పంపారు. పోలీసులు లక్నోలో ఉన్న యువతిని అదుపులో తీసుకొని ఆదివారం జగిత్యాలకు తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులకు అప్పగించగా.. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌, పట్టణ సీఐ నటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభలను విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్‌: బీహార్‌ రాజధాని పాట్నాలో నవంబర్‌ 2,3,4,5వ తేదీల్లో జరిగే భారతీయ ఖేత్‌ మజ్దూర్‌ యూనియన్‌ (బీకేఎంయూ) 15వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్‌ పిలుపునిచ్చారు. ఆదివారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బీకేఎంయూ జాతీయ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. దేశంలో యాంత్రీకరణ వేగంగా అభివృద్ధి చెందడంతో వ్యవసాయ కూలీలకు పనిలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధిహామీ పథకంపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఉపాధి పనులను 200 రోజులకు పెంచి దినసరి కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. నాలుగు రోజులపాటు జరిగే జాతీయ మహాసభల సందర్భంగా మొదటి రోజు లక్షలాదిమంది వ్యవసాయ కూలీలతో ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, మూడు రోజులపాటు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రతినిధులతో మహాసభ జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులసాధనపై, ఉపాధి హామీ పథకం పరిరక్షణ కోసం చర్చలు జరిపి, భవిష్యత్‌ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్‌, జిల్లా ఉపాధ్యక్షుడు అందె చిన్నస్వామి, దరిపెల్లి అంకూస్‌, కార్యదర్శులు విలాసాగరం అంజయ్య, ఎగుర్ల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు గరుడ సేవ



గంభీరావుపేట(సిరిసిల్ల): లింగన్నపేటలోని శ్రీహరిహర దేవాలయంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి గరుడ సేవ నిర్వహించారు. భక్తుల దైవ నామస్మరణతో పుర వీధులు మారుమోగాయి. భక్తుల కోలాటాలు ఆకట్టుకున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు.

ఉపాధ్యాయురాలికి సాహితీ సామ్రాట్‌ రికార్డు పురస్కారం

జగిత్యాలరూరల్‌: ఆర్యాని సకల కళావేదిక గౌతమేశ్వర సాహితి కళా సేవాసంస్థ పెద్దపల్లి సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్‌ 15న గంట వ్యవధిలో ఆరు అంశాలపై కవితల పోటీ నిర్వహించారు. లక్ష్మీపూర్‌ జిల్లాపరిషత్‌ పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు మద్దెల సరోజన గంట వ్యవధిలో ఆరు కవిత్వాలు రాయగా.. ఆదివారం కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో ఆమెకు అంతర్జాతీయ స్థాయి సాహితి సామ్రాట్‌ రికార్డు పురస్కారం –2023ను అందుకున్నారు. అధ్యక్షుడు దూడపాక శ్రీధర్‌, సాహితివేత్తలు ప్రభాకర్‌, సాహితి, నిర్వాహకులు రమాదేవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

తాపీ మేస్త్రీ ఆత్మహత్య


మొండయ్య మృతదేహం

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌కు చెందిన లంక మొండయ్య (53) అనే తాపీ మేస్త్రీ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మేస్త్రీ పని చేసే మొండయ్యకు మూడు నెలల క్రితం పక్షవాతం వచ్చింది. చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఇంటి పక్కనే భీముకు శనివారం రాత్రి ఉరేసుకున్నాడు. ఆదివారం ఉదయం భార్య లక్ష్మి గమనించి కుమారుడు మారుతికి సమాచారం ఇచ్చింది. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేంద్ర చారి తెలిపారు.

మద్యం మత్తులో మరో వ్యక్తి ...

కొత్తపల్లి(కరీంనగర్‌): మండలంలోని చింతకుంట పంచాయతీ పరిధిలోని ప్రగతినగర్‌లో నివాసముండే అమిరిశెట్టి తిరుపతి (50) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు. గంగాధర మండలం పానుగంటిపల్లి గ్రామానికి చెందిన తిరుపతి కొంతకాలంగా భార్యతో విభేదాలు రావడంతో చింతకుంటలోని ప్రగతినగర్‌లో నివాసముంటూ మేస్త్రీ పని చేస్తున్నాడు. మృతుడి భార్య రాజేశ్వరి సీతారాంపూర్‌లో నివాసముంటూ దుస్తులు కుడుతూ కుమారుడితో నివసిస్తోంది. ఇంటి యజమాని రాజేశ్వరికి సమాచారం ఇచ్చారు. రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సతీశ్‌ (ఫైల్‌)

మానకొండూర్‌ రూరల్‌ : మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన ఓవ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య సౌజన్య, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పాముల సతీశ్‌ (37) ఐదు రోజుల క్రితం తన పొలం వద్దకు వెళ్లాడు. కాలుజారి ట్రాక్టర్‌కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి


గంగరాజు (ఫైల్‌)

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలం దుర్శేడ్‌కు చెందిన ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం గంగరాజు (35) డెకరేషన్స్‌ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య మమత పెద్దపల్లి జిల్లా.. జయ్యారంలోని పుట్టింటికి వెళ్లింది. గంగరాజు శనివారం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామ శివారులోని చెరువులో గంగరాజు మృతదేహం లభ్యంకాగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంగరాజు మృతిపై అనుమానాలున్నాయని భార్య మమత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాలకొండపల్లిలో..

గంగాధర: మండలంలోని న్యాలకొండపల్లికి చెందిన నిమ్మనవేని కొంరయ్య (46) అనుమానస్పదంగా మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కొంరయ్య న్యాలకొండపల్లి గ్రామ పరిధిలోని చెరువులో కోలకాడుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 25న భార్య పద్మతో కలిసి కూతురు నిర్మలను కొలిమికుంట గ్రామంలో దింపి తిరిగి న్యాలకొండపల్లికి చేరుకున్నాడు. 27న సాయంత్రం గ్రామానికి చెందిన శేఖర్‌, లక్ష్మీనర్సవ్వ కొంరయ్య మృతిచెంది ఉండడాన్ని గమనించి పద్మకు సమాచారం అందించారు. కాగా 26న కొంరయ్య శ్వాస తీసుకోవడంతో ఇబ్బంది పడుతుండగా గీకురు చందు అనే వ్యక్తి కురిక్యాలకు తీసువెళ్లి ఆర్‌ఎంపీకి చూపించారని, తర్వాత తన భర్త ఎలా మృతిచెందాడో తెలియదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెల్టు షాపులపై దాడి


పట్టుకున్న మద్యంతో పోలీసులు

మల్లాపూర్‌: ఒగులాపూర్‌ గ్రామంలోని బెల్టు షాపులపై పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌ తెలిపారు. రూ.33వేల విలువగల 71 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్‌బీ కానిస్టేబుల్‌ రశీద్‌, కానిస్టేబల్‌ కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రామన్నపల్లె గ్రామ రైతు జూపల్లి శ్రీనివాస్‌కు చెందిన బర్రె దూడ ఆదివారం ఉదయం మృతిచెంది కనిపించింది. శనివారం రాత్రి తన పొలం వద్ద దూడను కట్టేసి ఇంటికెళ్లాడు. ఉదయం వెళ్లి చూసేసరికి దూడ చనిపోయింది. చిరుత పులి దాడి చేయడంతోనే దూడ మృతిచెందిందని రైతు శ్రీనివాస్‌ తెలిపాడు. పొలం పరిసరాల్లో చిరుత పులి పాదముద్రలను గుర్తించినట్లు పేర్కొన్నాడు. అధికారులు వెంటనే స్పందించి తనకు న్యాయం చేయాలని, చిరుత నుంచి కాపాడాలని కోరాడు. అధికారులు మాత్రం చిరుత దాడి చేసినట్లు నిర్ధారించలేదు.

బ్రహ్మోత్సవాలకు యజ్ఞవరాహక్షేత్రం ముస్తాబు

నేటి నుంచి ఉత్సవాలు





కరీంనగర్‌కల్చరల్: నగరంలోని యజ్ఞవరాహస్వామి ఆలయం 37వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయాన్ని రంగవల్లులు, పూలు, రంగులతో శోభాయమానంగా అలంకరించారు. సోమవారం నుంచి శనివారం వరకు వైభవోపేతంగా శాస్త్రోక్తంగా వివిధ ప్రాంతాల వేద పండితుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సర్వవైదిక సంస్థానం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ తెలిపారు. 30న అంకురార్పణ, 31న ఉదయం ధ్వజారోహణం, స్నపన తిరుమంజనం, సాయంత్రం ఎదుర్కోలు. హిరణ్యాక్ష సంహార లీల, శేషవాహనం, 1న ఉదయం మోహినీ ఉత్సవం. కల్యాణ మహోత్సవం. సాయంత్రం గరుడసేవ, 2న ఉదయం హనుమంత వాహనం, మహాభిషేకం. సాయంత్రం ఊంజల్‌సేవ, ముత్యాల పందిరి వాహనం. 3న ఉదయం సూర్యప్రభ వాహనం, పూలంగిసేవ, తిరుప్పావడసేవ. అష్టదళ పాదపద్మారాధన, సాయంత్రం శాంతి హోమం, సహస్ర దీపాలంకరణ. గజ వాహనసేవలు. 4న ఉదయం రథోత్సవం, వసంతోత్సవం. చక్రస్నానం, సాయంత్రం శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగింపు.

అటు వరికోత.. ఇటు ఎన్నికల కూత

- వ్యవసాయ పనుల్లో రైతులు
- ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు



చెర్లభూత్కూర్‌లో వరికోస్తున్న హార్వెస్టర్

కరీంనగర్‌రూరల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే వానాకాలం సీజన్ వరికోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో వరిపంట చేతికి రావడంతో రైతులు వరికోతలు చేపట్టారు. మరో వారం పదిరోజుల్లో ముమ్మరంగా సాగే అవకాశముంది. దీంతో ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులకు కూలీలు లభించని పరిస్థితులు ఏర్పడుతాయని రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన చెందుతున్నారు. అయితే రాజకీయ పార్టీలు ఎక్కువ డబ్బులు చెల్లించే అవకాశముండటంతో కూలీల కరువు తమకు వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 1,07,242 హెక్టార్లలో వరి పంట సాగు చేయగా 5.83లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నవంబరు నెల కీలకం

వచ్చేనెల నవంబరు అటు రైతులు ఇటు అభ్యర్థులకు కీలకంగా మారింది. ఎస్సారెస్పీ కాలువ ఆయకట్టు పరిధిలోని వరిపంటను ముందుగా సాగు చేసిన రైతులు కోతలు ప్రారంభించగా ఆలస్యంగా నాట్లేసిన వారు నవంబరులో కోతలు చేపడుతారు. ఈ సమయంలో ఎన్నికల సందడి ఎక్కువగా ఉంటుంది. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం, పరిశీలన, తిరస్కరణ తదితర కార్యక్రమాలు నవంబరు 15వ తేదీ వరకు సాగుతాయి. అనంతరం ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు 15రోజులపాటు విస్తృతంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో రైతులు, రాజకీయ నాయకులకు నవంబర్ నెల అత్యంత కీలకంగా మారింది. రైతులు, కూలీలు ఎన్నికల ప్రచారంలో పెద్దసంఖ్యలో పాల్గొనే అవకాశం లేకపోవడంతో రాజకీయ పార్టీల నాయకులు తమ కార్యకర్తలకు సంబంధించిన వరికోతలు పూర్తి చేసుకునేలా ఒత్తిడి తెస్తున్నారు. నవంబర్‌లో అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతుల కోసం పొలాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జంగ్ తెలంగాణ

క్లుప్తంగా

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన యువకులతో సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 32, 36, 48 డివిజన్‌లకు చెందిన పలువురు యువకులు భారతీయ జనతాపార్టీలో చేరారు. ఆదివారం సీతారాంపూర్ కేఆర్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువకులు చేరగా, వారికి ఎంపీ బండి సంజయ్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కార్యవర్గం

కరీంనగర్: ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా మోహసిన్ అహ్మద్ ఖాన్, వైస్ చైర్మన్‌గా జఫర్ షాఖాన్, జనరల్ సెక్రటరీగా అబ్దుల్ జబ్బార్ ఖాన్, సెక్రటరీగా ఖాజా ఖాన్, ట్రెజరర్‌గా సయ్యద్ తాజుద్దీన్ ఖాద్రీ, మెంబర్లుగా సాజిద్ నవాజ్, షేక్ మదార్ సాబ్, అహ్మద్ హమద్ రజా, ఎండీ నవాబ్ ఖాన్, ఎండీ అక్రమ్, ఎండీ ఫిరోజ్‌లు ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం అందించాలి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన డా.గోసికొండ శ్రీరాములు అమెరికాలోని హవాయి రాష్ట్రంలో జనవరి మొదటి వారంలో జరగబోయే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో పరిశోధన వివరించాల్సి ఉందంటూ ఆహ్వానం అందింది. ఈమేరకు వెళ్లేందుకు సుమారు రూ.మూడు లక్షలు ఖర్చు అవుతుందని, దాతలు ఎవరైనా స్పందించి ఆర్థికసాయం అందించాలని కోరారు.

లీకేజీ పరేషాన్

- తరచూ ఎక్కడో చోట పైపులైన్ లీకేజీ
- బురదమయమవుతున్న రోడ్లు
- తాగునీటి కలుషితంపై నగరవాసుల ఆందోళన



కమాన్ సమీపంలో లక్ష్మినగర్ మెయిన్‌రోడ్డుపై పైప్‌లైన్ లీకేజీ, రహదారిపై పారుతున్న నీరు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు పరేషాన్ చేస్తున్నాయి. నీటి ప్రెషర్‌కు అనుగుణంగా పైప్‌లైన్ లేకపోవడం, నగరపాలక సంస్థ సిబ్బంది నిర్వహణ లోపం ఫలితంగా నగర వ్యాప్తంగా నిత్యం ఎక్కడో ఒక చోట పైప్‌లైన్ లీకేజీ తప్పడం లేదు. నల్లా నీటి సరఫరా సందర్భంలో రోడ్లు బురదమయమవుతున్నాయి. లీకేజీల కారణంగా మురుగు నీరంతా నల్లా నీటిలో కలిసి కలుషితమవుతున్నాయని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు.

తరచూ లీకేజీ సమస్యలు

నగరవ్యాప్తంగా తరచూ తాగునీటి పైప్‌లైన్ లీకేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. సంవత్సరాల క్రితం వేసిన పైప్‌లైన్లు కావడం, నీటి ప్రెషర్ సామర్థ్యానికి తగినట్లు పైప్‌లైన్లు వేయకపోవడం, నగరపాలకసంస్థ సిబ్బంది పర్యవేక్షణ సరిగా లేకపోవడం, నగరంలో నిత్యం ఏదో ఒక చోట అభివృద్ధి పనులు జరుగుతుండడం మూలంగా పైప్‌లైన్ ధ్వంసం అవుతుండడం.. తదితర కారణాలతో పైప్‌లైన్‌లు లీకేజీ సమస్యను ఎదుర్కొంటున్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో తరచూ పైప్‌లైన్‌లు పగిలి లీకేజీ అవుతున్నా, శాశ్వత పరిష్కారం చూపడం లేదు. నగరంలోని కమాన్ చౌరస్తాకు సమీపంలో లక్ష్మినగర్ మెయిన్‌రోడ్ వద్ద నాలుగు రోజులుగా పైప్‌లైన్ నుంచి తాగునీరు లీకవుతున్నాయి. నగరపాలకసంస్థ తాగు నీటిని సరఫరా చేస్తున్న సమయంలో మెయిన్ రోడ్డు కాస్తా ఫౌంటేన్‌ను, జలాశయాన్ని తలపిస్తోంది. సిబ్బంది రోడ్డుపై గుంతలు తవ్వి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నా అంతగా సఫలం కావడం లేదు. కమాన్‌చౌరస్తా నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లే మెయిన్‌రోడ్డు కావడంతో ప్రతిరోజూ వేలాది వాహనాలు ఈ రోడ్డు వెంట తిరుగుతుంటాయి. లీకేజీ అయిన నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ లీకేజీ సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కాకుండా, శాశ్వత పరిష్కారం చూడాలని నగరవాసులు కోరుతున్నారు.

'గంగుల'కు ఓటేసి గెలిపించండి



బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేస్తున్న మంత్రి సతీమణి గంగుల రజిత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంటలో ఆదివారం బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సతీమణి గంగుల రజిత విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ మహిళలకు బొట్టు పెడుతూ బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా మార్గంలో కనిపించిన ప్రతీ ఒక్కరిని ఓట్లు అభ్యర్థిస్తున్న ఆమెకు వికలాంగ ముస్లిం తారసపడటంతో 'కారు'కో ఓటు దాలియే.. అంటూ కోరారు. కరీంనగర్ నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపిన గంగుల కమలాకర్‌ను నాల్గోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఎంపీపీ పిల్లి శ్రీలత, జెడ్పీటీసీ పిట్టల కరుణ, ఎంపీటీసీలు పత్తెం శారద, భూక్య తిరుపతినాయక్, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్: సైలెంట్ బ్రెయిన్‌స్ట్రోక్ ప్రమాదకరంగా పరిణమిస్తోందని, ఈ వ్యాధి బారినపడకుండా ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి పని చెప్పాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా నగరంలోని ఎస్సారార్ కళాశాల ఆవరణలో మెడికవర్ ఆస్పత్రి, ఎస్సారార్ కళాశాల, ఐఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం బ్రెయిన్ స్ట్రోక్‌లు, హార్ట్‌స్ట్రోక్‌లు పెరిగాయన్నారు. ఉదయం లేవగానే ఫోన్ వస్తే ఏ చెడు వార్త వినాల్సివస్తుందోనని ఆందోళన కలిగే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం వేల మందికి శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ హరికృష్ణ మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్‌తో అవయవాలు శాశ్వతంగా దెబ్బతిని, జ్ఞాపకశక్తి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు రాంకిరణ్, వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మెడికవర్ చేపట్టే సీపీఆర్ శిక్షణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలకు ఐఎంఏ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు కొండపాక కిరణ్, ఉపేందర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ రవిమల్లారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ రోహిణి, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పర్లపల్లిలో మెగా హెల్త్ క్యాంప్



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

తిమ్మాపూర్: మండలంలోని పర్లపల్లి గ్రామంలో ఆదివారం దీపిక హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ మాదాడి భారతిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్య రక్ష గ్రామమే ధ్యేయంగా ప్రజలు శ్రేయస్సు కోసం క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వైద్యులు వెంకటేశ్వర్లు, కిరణ్, మహేశ్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సుమారు 200 మంది పలురకాల వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముప్పిడి సంపత్ రెడ్డి,ఉప సర్పంచ్ రాజేశ్, శంకర్ శ్రీధర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఆదివారం మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా రసమయి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్పొరేటర్ సల్ల శారద, సొసైటీ చైర్మన్ స్వామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, నాయిని వెంకట్ రెడ్డి, మహేందర్, పర్శరాములు, రమేశ్, సంపత్, రవి, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పూర్‌లో జీకే యూత్ ప్రచారం



వృద్ధులను ఓట్లడుగుతున్న గంగుల ప్రదీప్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో ఆదివారం కరీంనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు మద్దతుగా జీకే యూత్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జీకే యూత్ గౌరవ అధ్యక్షుడు గంగుల ప్రదీప్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్ చేసిన అభివృద్ధి పనులను చూసి బీఆర్‌ఎస్‌కు ఓటేయాల్సిందిగా కోరారు. చౌరస్తాలో కూర్చున్న వృద్ధుల వద్దకు ప్రదీప్ వెళ్లి అమ్మ పెన్షన్ వస్తుందా మీకు అంటూ పలకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఉప సర్పంచ్ ఆరె శ్రీకాంత్, కరీంనగర్, దుర్శేడ్ సింగిల్‌విండోల చైర్మన్లు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, గోనె నర్సయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ జువ్వాడి రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ దాది సుధాకర్, జీకే యూత్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకట్, నాయకులు ఊరడి మల్లారెడ్డి, మేడిద రాజిరెడ్డి, ముస్కు మల్లారెడ్డి, దాడి రాములు తదితరులు పాల్గొన్నారు.

జోజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి



మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

కరీంనగర్: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి అంబటి జోజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం నగరంలోని ఏఐఎఫ్‌బీ కార్యాలయంలో మేనిఫెస్టో విడుదల చేసి మాట్లాడారు. అంబటి జోజిరెడ్డి తన నియోజకవర్గ మేనిఫెస్టో రూపొందించారని, ఇది ఈ నియోజకవర్గానికే పరిమితమైన మేనిఫెస్టో మాత్రమేనని అన్నారు. రాష్ట్రవ్యాప్త మేనిఫెస్టో కూడా త్వరలో ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు. ప్రతీ సమస్యపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తారని అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ సభ్యులు కోమటిరెడ్డి తేజ్‌దీప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, జిల్లా నాయకులు కురువెళ్లి శంకర్, కరీంనగర్, చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థులు జోజిరెడ్డి, విజయ్‌కుమార్, చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలా అక్షర సేద్యం

- ఎన్నీల ముచ్చట్లు ఆయనకు ప్రేరణ
- కవిగా రాణిస్తున్న మహ్మద్ ఖాలీద్
- మిమిక్రీ, సామాజిక సేవలోనూ గుర్తింపు
- ఇటీవల 'మనమంతా ఒక్కటే' కవితా సంకలనం విడుదల



మనమంతా ఒక్కటే కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు (ఫైల్)

కరీంనగర్‌కల్చరల్: 'ప్రాచీన కవిత్వం పండితులకే పరిమితం.. ఆధునిక కవిత్వం అనేక మందికి అందివచ్చిన ఫలం'. అయినప్పటికీ బాగా చదువుకున్న వారే కవిత్వంలో రాణించిన సందర్భాలు పలుచోట్ల చూస్తున్నాం. అందులోనూ ఉపాధ్యాయులు, ఉపన్యాసకుల సంఖ్య మరింత అధికం. ఈనేపథ్యంలో కవిత్వం సామాన్యుని స్థాయికి వెళ్లే అవకాశాలు తక్కువ. సామాన్యులపై కవిత్వం రాసిన సామాన్యుల సంఖ్య మాత్రం వేళ్లమీద లెక్కబెట్టాల్సిందే. అందులో మహ్మద్ ఖాలీద్ మొదటి వరుసలో ఉంటారని చెప్పొచ్చు. అందుకు కారణం ఆయన బతుకుదెరువు కోసం ఆటో నడుపుతూనే.. ఓవైపు సాహిత్యం.. మరోవైపు సమాజ సేవ రెండు కన్నులుగా చేసుకొని మూడో నేత్రంగా మిమిక్రీని ప్రదరిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

మహ్మద్ ఖాలీద్ 1974 ఏప్రిల్ 10న కరీంనగర్‌లోని ఖాజా–వహిమిదా బేగం దంపతులకు జన్మించారు. ఇక్కడే పదో తరగతి వరకు చదువుకున్నారు. బండ్లపై సాగుతున్న పండ్ల వ్యాపారమే ఆయన కుటుంబం నేపథ్యం. రెక్కాడితే డొక్కాడని పరిస్థితుల్లో పదో తరగతితోనే చదువు ఆగిపోయింది. బతుకు దెరువు కోసం పండ్ల బండిని ఆశ్రయించక తప్పలేదు. తరాలుగా వస్తున్న పండ్ల వ్యాపారం ఆయన తరంతో దెబ్బతినడంతో మరోవృత్తికి మారారు. తోటి మిత్రులు, ఆంధ్రా బ్యాంకు అధికారుల ప్రోత్సాహంతో 2001లో ఆటో కొనుక్కొని జీవనాన్ని వెళ్లదీస్తున్నారు.

కవితా ప్రస్థానం

తెలంగాణ ఉద్యమ నేపథ్యమే తనను కవిగా మర్చిందని చెబుతున్నారు. 2013లో ప్రారంభమైన ఆయన కవితా ప్రస్థానానికి కరీంనగర్‌లో ప్రతినెలా నిర్వహిస్తున్న ఎన్నీల ముచ్చట్లుకు పలువురు సృజనకారులను తన ఆటోలో దించడంతో ఆయన మనుస్సు కవిత్వం వైపునకు మళ్లింది. ప్రపంచ తెలుగు మహాసభల్లో తన కవిత్వాన్ని వినిపించి ప్రశంసలు పొందారు. 100పైగా కవితలు రాసిన ఆయన ఇటీవలనే 'మనమంతా ఒక్కటే' కవితా సంపుటిని ఆవిష్కరించారు.

సమాజ సేవ, నటనలో..

సమాజసేవతో పాటు నటనలో పలు రంగాల్లో కృషి చేస్తున్న ఖాలీద్ మిమిక్రీ కూడా చేస్తారు. అనేక సందర్భాల్లో రక్తదానం చేసి ఆపదలో ఉన్న పలువురిని ఆదుకున్నాడు. రోడ్డు సేఫ్టీ క్లబ్‌లో సభ్యుడిగా ఉంటూ హరితహారం, రోడ్డు భద్రతా వారోత్సవాలు, అవినీతి నిరోధక దినోత్సవం వంటి కార్యక్రమాల్లో పలు పంచుకుంటున్నారు. క్రైంఫోన్, మోదీ, నేనెవ్వరికీ పుట్టలే వంటి సందేశాత్మక లఘు చిత్రాల్లో నటించారు.

పురస్కారాలు.. సన్మానాలు



ఖాలీద్ రచించిన మనమంతా ఒక్కటే పుస్తకం

తెలుగు రక్షణ వేదిక బతుకమ్మ పురస్కారం, రేస్‌స్టార్ డ్యాన్స్ అకాడమీ ప్రశంసాపత్రం, సమైక్య సాహితీ ఉగాది కవి సమ్మేళనం పురస్కారం, ప్రపంచ తెలుగు కవి సమ్మేళనం పురస్కారం, ప్రపంచ తెలుగు కవి సమ్మేళనం పురస్కారం అందుకున్నారు. సాహితీ సోపతి కవిత్వ కార్యశాలలో ధ్రువీకరణ పత్రం, ఫ్రెండ్స్ కల్చరల్ అకాడమీ ప్రశంసాపత్రం, సన్‌షైన్, సజ్జాన కల్చరల్ అకాడమీ పురస్కారాలు, గురజాడ సంస్థ అమెరికా పురస్కారం, తెలంగాణ జాగృతి సన్మానం, ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులో పురస్కారం అందుకున్నారు. సాహితీ గౌతమి ఉగాది పురస్కారం, ప్రపంచ తెలుగు మహాసభలలో సన్మానించారు. రెండుసార్లు ఉత్తమ ఆటో డ్రైవర్‌గా కరీంనగర్ పోలీసు కమిషనరేట్ ప్రశంసాపత్రం అందుకున్నారు. పుడమి సాహితీ వేదిక ఆధ్వర్యంలో అబ్దుల్ కలామ్ జాతీయ పురస్కారాన్ని తీసుకున్నారు. ప్రపంచ తెలుగు రచయితల 5వ మహాసభలకు ప్రశంసాపత్రం అందుకున్నారు. వాల్మీకి సోమన పోతన వేమన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఖాలీద్ ఆత్మీయ సన్మానం జరిగింది. ఎన్నీల ముచ్చట్లు పదేళ్ల సందర్భంగా తన కవితకు మెమొంటో అందించారు. అక్కెపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినారె విశిష్ట పురస్కారం, డాక్టర్ కాలువ మల్లయ్య స్ఫూర్తి పురస్కారం, కరీంనగర్ బుక్ ఫెయిర్ ప్రశంసాపత్రం అందుకున్నారు.

ఎన్నీల ముచ్చట్ల ప్రేరణతో..



అప్పుడప్పుడు ఎన్నీల ముచ్చట్లలో కవితల విన డంతో నా మనుస్సు కవిత్వం వైపు మళ్లింది. కొంత మంది కవుల సాయంతో చిన్నచిన్న కవితాలు రాయడం ప్రారంభించా. మనమంతా ఒక్కటే కవిత సంపుటిని వెలువరించా. – మహ్మద్ ఖాలీద్

సులభ్ కాంప్లెక్స్‌ను పట్టించుకోండి



స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలోని పలు సులభ్‌కాంప్లెక్స్‌లను తీర్చిదిద్దారు. కొన్ని ప్రాంతాల్లో కొత్తవి వేయగా.. మరికొన్ని ప్రాంతాల్లో అలాగే వదిలేశారు. టవర్‌సర్కిల్, అన్నపూర్ణకాంప్లెక్స్, కామధేనువులకు వచ్చి వెళ్లె ప్రజలకు అమరవీరుల స్తూపం వద్ద ఉన్న పురాతన సులభ్ కాంప్లెక్స్ మూత్రశాల శిథిలావస్థకు చేరి అధ్వానంగా తయారైంది. దీనిని కూడా స్మార్ట్‌సిటీలో భాగంగా తీర్చిదిద్దాలని నగరవాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

అర్హులకు అందని డబుల్‌బెడ్రూం ఇళ్లు




డాక్టర్ నగేశ్

తిమ్మాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించలేదని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ నియోజకవర్గంలోని బలహీన వర్గాలకు ఎమ్మెల్యే, మంత్రిగా గంగుల కమలాకర్ ఎలాంటి మేలు చేయలేదని, అర్హులను డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఎంపిక చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. పేదలను ఓటు అడిగే హక్కు మంత్రికి లేదని, కేబుల్ బ్రిడ్జ్ కుంగితే దర్యాప్తు జరిపించకపోవడం దురదృష్టకరమని, కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకే పరిమితమని, మిగతా గ్యారంటీలు నాన్ గ్యారెంటీలని ప్రజల గుర్తించాలన్నారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బోగీలు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఏపీ విపత్తు నిర్వహణ సిబ్బంది



రెండు రైళ్లు ఢీ..

విజయనగరం జిల్లాలో పెను ప్రమాదం..

సాక్షి ప్రతినిధి విజయనగరం/జామి/లక్కవరపుకోట/శృంగవరపు కోట/పెందుర్తి/సాక్షి, అమరావతి/కొవ్వూరు: విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రైలు ప్రమాదం సంభవించింది. రెండు రైళ్లు బయల్దేరిన కొద్ది నిమిషాల వ్యవధిలో ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. ఈ పెను ప్రమాదంలో 12 మంది మరణించగా.. 32 మందికి పైగా గాయపడ్డారు. వీరిని విశాఖపట్నం, విజయనగరం ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే కొన్ని బోగీలు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో ఒక్కసారిగా అరుపులు, కేకలు, హాహాకారాలతో ఆ ప్రాంతం భయానకంగా మారింది. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం రాత్రి జామి మండల పరిధిలో జరిగింది. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. వివరాలివీ..

విశాఖ నుంచి–పలాస వెళ్లే ప్యాసింజర్ రైలు ఆదివారం సా.6.25 గంటలకు కొత్తవలస రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరింది. భీమాళి రైల్వేస్టేషన్ దాటిన తర్వాత అలమండ రైల్వేస్టేషన్ నుంచి సిగ్నల్ రాకపోవడంతో డ్రైవర్ రైలును నెమ్మదిగా నడుపుతున్నారు. అదే సమయంలో సా.6.40 గంటల ప్రాంతంలో రాయగడ పాసింజర్ కొత్తవలస నుంచి బయల్దేరింది. వేగంగా వస్తున్న రాయగడ పాసింజర్ అదే ట్రాక్‌పై ముందు వెళ్తున్న పలాస పాసింజర్ రైలును రాత్రి 7.10 గంటల సమయంలో వెనుక నుంచి భీమాళి–అలమండ రైల్వేస్టేషన్ల మధ్య ఢీకొట్టింది. దీంతో పలాస పాసింజర్ వెనుకనున్న రెండు బోగీలు, వాటిని ఢీకొన్న రాయగడ ప్యాసింజర్ రైలు ఇంజన్‌తో పాటూ మరో మూడు బోగీలు పలాస రైలు మీద పడి నుజ్జునుజ్జయ్యాయి. అదే సమయంలో కొన్ని బోగీలు పక్క ట్రాక్‌పై ఉన్న గూడ్స్ మీద పడ్డాయి. దీంతో పెను విషాదం అలముకుంది.

మృతులు 12 మంది..

ఈ ఘటనలో 12 మంది మృతిచెందినట్లు గుర్తించారు. వారి మృతదేహాలను బయటికి తీశారు. నుజ్జునుజ్జయిన బోగీల్లో మరిన్ని మృతదేహాలు ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక బోగీల్లో చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీసేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మృతుల్లో ఒక లోకో పైలట్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే 32 మంది క్షతగాత్రులను 20 అంబులెన్స్‌ల్లో విజయనగరం, విశాఖల్లో వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు.

చీకట్లో సహాయక చర్యలు..

ఇక ప్రమాద స్థలిలో విద్యుత్ వైర్లు తెగిపోవటంతో పూర్తిగా చీకట్లు అలముకున్నాయి. దీంతో సహాయక చర్యలు కాస్త నెమ్మదిగా జరుగుతున్నాయి. రెండు రైళ్లలో మిగిలిన బోగీల్లో ఉన్న ప్రయాణికులు రోడ్డు మార్గంలో తమ గమ్యాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం దెబ్బతిన్న బోగీల్లో చిక్కుకున్న వారిని బయటికి తీసేందుకు స్థానికులు, రైల్వే, జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు, వైద్య సిబ్బంది తదితరులు అంతా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

హుటాహుటిన ప్రజాప్రతినిధులు, అధికారుల రాక

ప్రమాద ఘటన వార్త తెలుసుకున్న వెంటనే మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపికతో పాటూ పలువురు జిల్లా అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలను సమీక్షించారు. జిల్లా యంత్రాంగానికి మంత్రి బొత్స పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఘటనాస్థలిలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

వైద్యశాఖ అప్రమత్తం..

ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాఖను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ప్రమాదం గురించి తెలిసిన కొద్ది నిమిషాల్లోనే అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం 108 అంబులెన్సులను ఘటనా స్థలికి తరలించింది. విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 30 వరకూ 108 అంబులెన్సుల్లో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని విశాఖ కేజీహెచ్‌కు.. స్వల్పంగా గాయపడ్డ వారిని విజయనగరంతో పాటు, సమీపంలోని ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. బాధితులకు వైద్య సహాయార్థం కేజీహెచ్‌లో 24/7 హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటుచేశారు. మరోవైపు.. ప్రమాద స్థలంలోనే క్షతగాత్రులకు తక్షణ వైద్యం కోసం ప్రత్యేక వైద్య బృందాలను రంగంలోకి దించారు.

సీఎం జగన్ దిగ్భ్రాంతి

ఇక ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. విశాఖ నుంచి రాయగడ వెళ్తున్న ప్యాసింజర్ రైలుకు ప్రమాదం జరిగినట్లుగా.. పలు బోగీలు పట్టాలు తప్పినట్లుగా ప్రాథమిక సమాచారం అందుతోందని సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వెంటనే హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. విజయనగరం సమీప జిల్లాలైన విశాఖపట్నం, అనకాపల్లి నుంచి వీలైనన్ని అంబులెన్సులను పంపించాలని, మంచి వైద్యం అందించడానికి సమీప ఆస్పత్రుల్లో అన్నిరకాల ఏర్పాట్లుచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వైద్య ఆరోగ్య, పోలీసు, రెవిన్యూ సహా ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలన్నారు. మరోవైపు.. దుర్ఘటనపై రాష్ట్ర హోం, విపత్తుల నివారణ శాఖ మంత్రి తానేటి వనిత కూడా దిగ్భ్రాంత్రి వ్యక్తంచేసి మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని 'సాక్షి'కి చెప్పారు.

ముఖ్యమంత్రికి రైల్వే మంత్రి ఫోన్

ఈ ప్రమాదంపై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సీఎం జగన్‌తో ఫోన్‌లో ఆదివారం రాత్రి మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే తీసుకున్న చర్యలను సీఎం జగన్ ఆయనకు వివరించారు. సహాయ బృందాలను వెంటనే ఘటనా స్థలానికి పంపించామని, క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు సత్వర చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యన్నారాయణ, స్థానిక కలెక్టర్, ఎస్పీ అక్కడే ఉండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రులకు సరైన వైద్యసేవలు అందించడంపై అధికారులు దృష్టిపెట్టారని, వీరిని సమీపంలో ఉన్న ఆస్పత్రులకు పంపిస్తున్నారని, ఆ మేరకు ఆయా ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్యసేవలు అందించేలా చర్యలు కూడా తీసుకున్నామని సీఎం కేంద్ర మంత్రికి చెప్పారు.

ఏపీ మృతులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలతో పాటు, క్షతగాత్రులకు సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.2 లక్షలు చొప్పున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. రైలు ప్రమాద ఘటనలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. మరణించిన వారిలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉంటే బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.50వేల చొప్పున సహాయం అందించాలన్నారు.

ఏం జరిగిందో అర్థంకాలేదు..

పార్వతీపురంలోని మా ఇంటికి వెళ్లేందుకు పెందుర్తిలో రైలెక్కాను. సుమారు గంట తరువాత అకస్మాత్తుగా రైలు భారీ కుదుపునకు గురైంది. మా బోగిలో అందరూ చెల్లాచెదురైపోయారు. కాసేపు ఏం జరిగిందో అర్థంకాలేదు. తేరుకునేటప్పటికి నా కాలికి తీవ్ర గాయమైంది. మా అల్లుడు వచ్చి పెందుర్తి ఆసుపత్రిలో చికిత్స చేయించాడు.

– వరలక్ష్మి, ప్రమాదంలో గాయపడిన మహిళ

వెనుక నుంచి ఢీకొట్టడంవల్లే..

- ప్రమాద ఘటనపై రైల్వేశాఖ ప్రాథమిక ఎఫ్ఐఆర్
- రాత్రి 7 గంటలకు జరిగినట్లు నిర్ధారణ
- 10 నిమిషాల వ్యవధిలో కంటకాపల్లి నుంచి బయలుదేరిన రైళ్లు

సాక్షి, విశాఖపట్నం/విజయనగరం అర్బన్/రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): వాల్తేరు డివిజన్ పరిధిలోని విజయనగరం జిల్లా అలమండ సమీపంలో రైలు ప్రమాదం జరిగిన ప్రాంతం భీతావహంగా మారింది. ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు ప్రాథమిక ఎఫ్ఐఆర్ సిద్ధంచేసి రైల్వే మంత్రిత్వ శాఖకు పంపించారు. ప్రమాదం ఎప్పుడు జరిగింది? ఏఏ రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి? అనే ప్రాథమిక అంశాల్ని అందులో పొందుపరిచారు. ఈ ఎఫ్ఐఆర్ ప్రకారం వివరాలిలా ఉన్నాయి..

- **ప్రమాదం జరిగిన తీరు:** వెనుక నుంచి ఢీకొట్టడంవల్ల..
- **ప్రమాదం జరిగిన సమయం :** 29 అక్టోబరు రాత్రి 7 గంటలకు..
- **డివిజన్ :** వాల్తేరు రైల్వే డివిజన్
- **ఏ సెక్షన్‌లో జరిగింది :** కంటకాపల్లి–అలమండ డీఎస్ మిడిల్ లైన్‌లో
- **ప్రమాదం జరిగిన ప్రాంతం :** 840/27 కి.మీ వద్ద
- **ఏఏ రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి :** 08532 ఎక్స్‌ప్రెస్, 08504 ఎక్స్‌ప్రెస్
- **సమీప స్టేషన్ నుంచి ఎప్పుడు బయలుదేరాయి :** 08532 ఎక్స్‌ప్రెస్ సా. 6.42 గంటలకు బయల్దేరింది.. 08504 ఎక్స్‌ప్రెస్ 6.52 గంటలకు బయలుదేరింది
- **ఇతర సమాచారం :** యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ ఎక్విప్‌మెంట్ కోసం 7.05కి సమాచారం ఇచ్చారు
- 7.07 గంటలకు యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్‌ను (ఏఆర్‌టీ) ఆర్డర్ చేయగా 7.31 గంటలకు విశాఖ నుంచి బయల్దేరింది.
- 7.10 గంటలకు 120 టన్నుల క్రేన్ బయల్దేరింది
- **సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు :** వాల్తేరు డివిజన్ డీఆర్ఎం, ఏడీఆర్ఎం(ఆపరేషనల్), ఇతర అధికారులు

బాధితుల సమాచారం కోసం కంట్రోల్ రూం..

బాధితులకు సహాయం, వారి సమాచారం తెలుసుకోవడం కోసం కంట్రోల్ రూంలను ఏర్పాటుచేసినట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు.

కలెక్టరేట్ కార్యాలయంలో :
9493589157
రైల్వే శాఖలో :
89780 80006
రైల్వే కంట్రోల్ రూంలో :
8978080777
విశాఖ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్:
9030226621,
7036111169,
0891 2590102

విజయవాడ డివిజన్ అధికారులు ప్రకటించిన హెల్ప్‌లైన్ నంబర్లు..
ఏలూరు :
0881-2232267
సామర్లకోట :
0884-2327010
రాజమహేంద్రవరం :
0883-2420541
తుని :
0885-4252172

రైలు ప్రమాదంపై ప్రధాని విచారం

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఆదివారం రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో ప్రాణ నష్టం జరగడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని జాతీయ విపత్తుల సహాయ నిధి నుంచి రూ.రెండు లక్షల చొప్పున పరిహారాన్ని చెల్లించనున్నట్లు ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున సహాయం అందించనున్నట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది. తక్షణమే పరిస్థితిని సమీక్షించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ప్రధాని ఆదేశించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- స్టేషన్ బెయిల్‌కు లంచం డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

ఏసీబీకి చిక్కిన మామడ ఎస్సై


ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు


ఏసీబీకి చిక్కిన ఎస్సై రాజు



వివరాలు నమోదు చేస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

మామడ: స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ నిర్మల్ జిల్లా మామడ ఎస్సై కే రాజు ఏసీబీకి చిక్కారు. ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మామడ మండలం అనంతపేట్ గ్రామానికి చెందిన సల్కం సతీశ్, సుదర్శన్ ఇదే గ్రామానికి చెందిన సొప్పరి నరేశ్‌తో ఈ నెల 24న గొడవపడ్డారు. దీంతో నరేశ్ వీరిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజు ఇద్దరిపై ఈనెల 25న కేసు నమోదు చేశారు. కాగా, నిందితులు స్టేషన్ బెయిల్ అడగగా ఎస్సై రాజు రూ.10వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో నిందితుడు సల్కం సతీశ్ సోదరుడు తిరుమల్ ఆదిలాబాద్ ఏసీబీ కార్యాలయ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏసీబీ అధికారులు ఆదివారం మామడ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. నిందితుడి నుంచి ఎస్సై రాజు పోలీస్‌స్టేషన్‌లో రూ.10వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. లంచంగా తీసుకున్న రూ.10వేల నగదు సీజ్ చేశారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం


వేదికపై ప్రతిజ్ఞ చేస్తున్న వాసవీ క్లబ్‌ల అంతర్జాతీయ అధికారులు

- క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు రాములు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లాలోని 35 వాసవీ క్లబ్‌లు అంతర్జాతీయ స్థాయిలో విశేషమైన సేవలు అందిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు అయిత రాములు అన్నారు. హాజీపూర్ మండలం వేంపల్లి పద్మావతి గార్డెన్స్‌లో జిల్లా 107వ వార్షిక సదస్సు ఆదివారం జరిగింది. ఈ సదస్సుకు జిల్లా గవర్నర్ దంపతులు కొండ పద్మ–చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా క్లబ్‌ల అంతర్జాతీయ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ వివిధ సేవా కార్యక్రమాలతోపాటు అన్నదాన కార్యక్రమాలు, విద్యార్థులకు నోట్‌బుక్కులు, మొక్కలు నాటడం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వడ్డీ లేని రుణాలతో ఆర్థిక చేయూతగా నిలవడం వంటి సేవా కార్యక్రమాల నిర్వహణలో అంతర్జాతీయ స్థాయిలో ప్రసంశలు అందుకుంటున్నారని వివరించారు. ఆర్యవైశ్యులుగా సభ్యులుగా ఉండి అన్నివర్గాల ప్రజలకు సేవలు అందిస్తున్నందుకు 2013లో రాష్ట్రపతి అవార్డు కూడా అందుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని వాసవీ క్లబ్‌ల సేవా కార్యక్రమాలకు అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. అత్యధికంగా అవార్డులు సాధించిన క్లబ్‌లకు నంది అవార్డులతో సత్కరించారు. కార్యక్రమ పరిశీలకులుగా గంప శ్రీనివాస్ హాజరు కాగా, కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా బాల సంతోష్, చైర్మన్‌గా ముక్తా శ్రీనివాస్, కోచైర్మన్లుగా కట్కం హరీశ్, శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ అధికారులు సిరిపురం సత్యనారాయణ, శ్రీనివాస్, కేబినెట్ కార్యదర్శి శ్రీధర్, సహాయకుడు కేశెట్టి వంశీకృష్ణ పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో పూజలు


పూజల్లో పాల్గొన్న ఈశ్వరిబాయి, నీలబాయి

ఇంద్రవెల్లి: కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఎస్సీ, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలబాయి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు వారిని శాలువాతో సన్మానించారు. ఇందులో సోంబాయి, కుడ్మేత జంగు, సతీశ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

ఆన్‌లైన్ నృత్యపోటీల్లో సత్తా


దువాస శ్రీహర్షిని

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన నృత్యకారిణి దువాస శ్రీహర్షిని అంతర్జాతీ య ఆన్‌లైన్ నృత్య పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీరాగ రమ్య కల్చరల్ అండ్ సోషల్ యాక్టివిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ నృత్య పోటీల్లో సీనియర్స్ విభాగంలో కూచిపూడిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. విజేతగా నిలిచిన హర్షినికి రూ.ఐదువేల నగదుతో పాటు మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేశారు. అలాగే నృత్య కిన్నెర పురస్కారం సైతం ప్రదానం చేస్తారని బాలకేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తెలిపారు. హర్షినిని పలువురు అభినందించారు. అలాగే నృత్య శిక్షకుడు రవికి ఉత్తమ నాట్యగురు పురస్కారం సైతం అందించారు.

ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న ఆదివాసీలు


నైవేద్యాలతో తరలివస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో దసరా పూజలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీలు ఆదివారం భారీగా తరలివచ్చారు. చిరుధాన్యాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమను చల్లంగా చూడాలని వేడుకున్నారు. పూజారి సూర్యారావ్ తదితరులు పాల్గొన్నారు.

నాడు రికార్డులు.. నేడు రిపేర్లు..!

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వెలుగులు విరజిమ్మిన తొలివిద్యుత్ కేంద్రం
- రెండేళుళ్లగా చతికిలపడుతున్న రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం


రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: పెద్దపల్లి జిల్లాలోని రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్‌టీపీపీ)కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి 1965 జూలై 19న శంకుస్థాపన చేశారు. ఇందుకోసం అప్పట్లో రూ.14.8 కోట్లు వెచ్చించారు. దానికి జవహర్‌లాల్ నెహ్రూ థర్మల్ విద్యుత్ కేంద్రంగా నామకరణం చేశారు. దశల వారీగా విస్తరించాలని తొలుత నిర్ణయించినా.. 1969నాటి తెలంగాణ–ఆంధ్ర ప్రాంతీయ విభేదాలతో విస్తరణకు నోచుకోలేదు. ఉమ్మడిరాష్ట్రంలో ఆర్‌టీపీఎస్ తొలివిద్యుత్ కేంద్రం కావడం విశేషం. అయితే, దశాబ్దం క్రితం వరకు ఆధునిక విద్యుత్ కేంద్రాలతో పోటీపడుతూ ఉత్పత్తి సాధిస్తూ, పీఎల్ఎఫ్‌లో అనూహ్య రికార్డులు సొంతం చేసుకుంది. ప్రస్తుతం సాంకేతిక సమస్యలు, కాలంచెల్లిన కేంద్రం కావడం, విడిభాగాల లభ్యత కష్టంగా మారడంతో చతికిలపడిపోతోంది.

తెలంగాణలో రెండోస్థానం..
2016–17 ఆర్థిక సంవత్సరంలో రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం 419 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయితే, మార్చి ఏడో తేదీన లక్ష్యాన్ని మించి 453.70 మిలియన్ యూనిట్లు, 82.87 ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) సాధించింది. తద్వారా తెలంగాణ రాష్ట్రంలోని 14 జెన్‌కో విద్యుత్ కేంద్రాల్లో రెండోస్థానం సాధించింది.

రికార్డులకు బ్రేక్..
రామగుండం విద్యుత్ సంస్థ 10 డిసెంబర్ 2007 నుంచి 17 మే 2008 వరకు 92.64 పీఎల్ఎఫ్‌తో 221.74 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. 20 ఫిబ్రవరి 2017 నుంచి 29 జూలై 2017 నాటికి నిరంతరం విద్యుత్ ఉత్పత్తి చేసి రాష్ట్రంలోనే రికార్డు సొంతం చేసుకుంది.

సీఈఏ నివేదికతో నీలినీడలు..
పర్యావరణ అంశాలను పరిగణనలోకి తీసుకుని 25 ఏళ్లక్రితం నిర్మించి 200 మెగావాట్లలోపు విద్యుత్ కేంద్రాలను మూసివేయాలని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) 2020లో ఆదేశించింది. దేశవ్యాప్తంగా 14 విద్యుత్ కేంద్రాలు ఆ జాబితాలో ఉండగా, అందులో రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం ఒకటి. మరోవైపు.. ఎలాంటి అనుమతులు లేకుండానే రాష్ట్రప్రభుత్వ నిధులతో అదేస్థానంలో 600 మెగావాట్ల విద్యుత్ కేంద్రం స్థాపించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

పురాతన కేంద్రమైన సీఈఏ నిబంధనలకు లోబడే..
సీఈఏ నివేదిక ప్రకారం.. ఒక యూనిట్ విద్యుత్ ఉత్పత్తికి కిలో క్యాలరీ 2500 లోపు ఉండాలని, బొగ్గు వినియోగం తక్కువగా ఉండి విద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా ఉండాలని, విద్యుత్ ఉత్పత్తి యూనిట్‌కు ధర రూ.4.40 ఉండాలని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ 40శాతానికి లోబడి ఉన్న విద్యుత్ కేంద్రాలు మూసివేయాలని ఉంది. రామగుండం బీ థర్మల్ విద్యుత్ కిలో క్యాలరీ పర్ యూనిట్ 2,600 ఉండగా, యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ధర రూ.4.50 ఉందని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ 80శాతం పైబడి నమోదవుతోదని, సీఈఏ నిబంధనలకు లోబడి ఉందని ఎంపీ చొరవతో సీఈఏ కొన్నేళ్లపాటు కొనసాగించే అవకాశం ఇచ్చింది.

బీ–థర్మల్ రికార్డులను పరిశీలిస్తే..

ఏడాది	పీఎల్ఎఫ్	ఉత్పత్తి
2010–11	85.83	469.91
2011–12	82.46	452.70
2012–13	79.6	435.83
2013–14	81.42	445.77
2014–15	81.4	445.27
2015–16	81.4	446.20
2016–17	419	453.70

మరోవారం రోజుల్లో ఉత్పత్తి దశలోకి..
దసరా పండుగ నాడు జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో రామగుండం బీ థర్మల్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాలిపోయిన కేబుల్స్‌ను కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ నుంచి తెప్పించి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చేపట్టారు. ఈసారి బాయిలర్, టర్బయిన్, మిల్స్, జనరేటర్, కంట్రోల్‌రూం తదితర విభాగాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పనులు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నవంబర్ ఐదోతేదీ నాటికి విద్యుత్ కేంద్రాన్ని ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చేందుకు ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలకు విశేష స్పందన


క్రీడాకారులతో నిర్వాహకులు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎంపికపోటీలకు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, కోరుట్ల, పెద్దపల్లి, మెట్‌పల్లి వేంపేట, కొడిమ్యాల, సిరిసిల్ల, మంథని మాదాపూర్, సారంగాపూర్, హుస్నాబాద్, రుక్మాపూర్, ఇల్లంతకుంట , తదితర ప్రాంతాల నుంచి 200 మంది బాలురు 130 మంది బాలికలు హాజరయ్యారు. కరీంనగర్ ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు నటరాజు రవి, కరీంనగర్ ఆర్ఐ పోలీస్ సీనియర్ ఖోఖో క్రీడాకారుడు కుమారస్వామి, జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి వై మహేందర్ రావు, పెద్దపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్లు ప్రతిభ చాటి చాంపియన్లుగా నిలవాలన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 15, 16, 17 తేదీల్లో తూప్రాన్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ సభ్యులు చిట్టి తిరుపతిరెడ్డి, ఎం.సమ్మిరెడ్డి, వి.గంగాధర్, వంగపల్లి సూర్యప్రకాశ్, కట్ట సంతోష్, డి.ప్రసాద్, పి.జ్యోతి, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్‌రెడ్డి, శివకుమార్, కృష్ణంరాజు ఎస్కే మోహినుద్దీన్, కట్ట అశోక్‌కుమార్, ఇక్బాల్ భూపతి, తదితరులు పాల్గొన్నారు.

సన్నిధి

మంచిమాట

“ఆకులందున అణిగి మణిగి కవిత కోకిల పలుకవలెనోయ్” అంటారు గురజాడ. తన ఘనతని తాను ప్రకటించుకోవటం కాక, ప్రతిభని అవతలి వారు గుర్తించాలి. కోకిల కనపడ నవసరం లేదు. దాని గుర్తింపు మధురమైన కంఠస్వరం మాత్రమే. కావాల్సిన వారు దానిని వెతుక్కోవాలి. ఎందుకంటే - రత్నాన్ని అన్వేషించాలే కాని, అది తనని తాను ప్రకటించుకోదు.



అణకువ

‘‘అన్నీ ఉన్న ఆకు అణిగి మణిగి ఉంటుంది. ఏమీ లేని విస్తరి ఎగిరెగిరి పడుతుంది.’’ అనే సామెత తెలుసు కదా! నిండు కుండ లాగా తొణకకుండా బెణకకుండా ఉండటం సమృద్ధికి, సంపదకి సంకేతం. అది ఉత్తమ వ్యక్తిత్వ లక్షణం. ఎగిరెగిరి పడకుండా, తన గొప్పని, లేదా తానే గొప్ప అని ప్రకటించుకుంటూ, ప్రదర్శించుకుంటూ ఉండక పోవటమే అణకువ. ఎందుకంటే ఎవరైనా ఒక రంగంలో గొప్ప అనుకుంటే, అదే రంగంలో అంత కన్న ఘనులు అప్పుడే కాని, తరువాత కాని ఉండచ్చు. కనక అహంకరించకూడదు. తన స్థాయి ఏమిటో తెలుసుకుని ఉండాలి. నీలో గొప్పతనం ఉంటే అది నువ్వు ప్రకటించుకోకూడదు. ఇతరులు గుర్తించాలి. ఎట్లా? ప్రవర్తన ద్వారా, మాట ద్వారా. తన గొప్పతనం తానే చెప్పుకున్న వాడు హాస్యాస్పదుడు అవుతాడు. అంతకన్న ముందు ఆయుః క్షీణం అని పెద్దలు చెప్పిన మాట. పైగా తనని తాను పొగడుకోవటం ఆత్మహత్యా సదృశం. మహాపాతకం. అంటే నివృత్తి లేని పరిహారం, ప్రాయశ్చిత్తం లేని పెద్ద పాపం.

నోటితో చెప్పక పోయినా తమ ప్రవర్తన ద్వారా తామే చాలా ఘనులు, ఇతరులు పనికిరాని వారు అనే అభిప్రాయం కలిగేట్టు ప్రవర్తిస్తారు కొందరు. అది వారి విద్యావిహీనతను సూచిస్తుంది. విద్య వల్ల మొదట వచ్చేది వినయం. (విద్య యొసగును వినయంబు, వినయంబు వలన పాత్రత, పాత్రత వలన ధనం, ధనం వల్ల ఐహికాముష్మిక సంపదలు బడయు నరుడు) అంటే వినయం అన్నది విద్యావంతుల లక్షణం. వినయ విధేయతలు లేని వారు డిగ్రీలు ఉన్నా విద్యావంతులుగా పరిగణింపబడరు. చదువు ‘‘కొన్నవారు’’ మాత్రమే అవుతారు. ‘‘వస్త్రేణ, వపుషా, వాచా, విద్యయా, వినయేన చ నరో యాతి గౌరవం’’ గౌరవార్హతలలో ప్రధానమైన ఐదింటిలో వినయం కూడా ఒకటి. అలా ఒదిగి ఉండటం మనిషి గొప్పతనాన్ని ఏ మాత్రం తగ్గించదు.

‘‘అనువు గాని చోట అధికుల మన రాదు/ కొంచెముండు టన్న కొదువ గాదు / కొండ అద్దమందు కొంచెమై ఉండదా? విశ్వదాభిరామ వినుర వేమ.’’ పరిస్థితులు అనుకూలం గా లేనప్పుడు కొంచెం తగ్గి ఉండటం శ్రేయస్కరం. ఎవరో నన్ను గుర్తించి గౌరవించలేదు అనుకుని కుంగిపోవటం, గుర్తింపు కోసం పాకులాడటం దుఃఖానికి అవమానాలకి హేతువు లవుతాయి. కాస్త తల ఒగ్గి అనుకూల పరిస్థితులు వచ్చాక మళ్ళీ తల ఎత్తవచ్చు.

> పెద్ద ఉప్పెనలు, తుఫానులు వచ్చినప్పుడు పెద్ద పెద్ద చెట్లు విరిగి పడతాయి. కాని, గరిక ఈదురు గాలికి అనుకూలంగా తల వంచటం వల్ల సురక్షితంగా ఉంటుంది. గాలివాన తగ్గగానే యథాప్రకారం తల ఎత్తి నిలబడుతుంది.

సముద్రంలో అలలు ఎగసి ‘పడుతూ’ ఉంటాయి. ఎగిరితే ఆకాశంలో ఉండలేము కదా! కింద పడక తప్పదు. పడకుండా ఉండాలంటే ఎగరకూడదు. ఎదగాలి. ఉన్నత స్థానానికి వెళ్ళాలి అంటే పైకి క్రమం గా ఎక్కాలి. పైగా ఎత్తుకి వెళ్ళిన కొద్ది మరింత జాగ్రత్తగా ఉండాలి. నేల మీద ఉన్నప్పుడు పడితే చిన్న దెబ్బ. ఎంత ఎత్తునుండి పడితే అంత పెద్ద దెబ్బ. అణకువ తో ఉన్న వారి మీద పెద్దలకి వాత్సల్యం ఉంటుంది. వారి ఆశీస్సులు, సహాయ సహకారాలు ఉంటాయి. ఎంత ఒదిగితే అంత ఎదుగుతారు.

– డా॥ ఎన్.అనంతలక్ష్మి

లోపలి అరలు, పొరలు, వాటికి అడ్డంగా తెరలు

వాగ్గేయకార వైభవం

భక్తి ఎప్పుడూ ఆధిపత్య ధోరణిని, అహంభావాన్ని ప్రదర్శించదు. నేను గొప్ప, నాకిది వచ్చు. నాకన్నా వాళ్లెంత...అన్న వైఖరిని చూపదు. విద్య...విత్ అంటే తెలుసుకొనుట. ఏది తెలుసుకోవాలో అది తెలుసుకుంటే అది వినయం. ‘‘విద్యాదదాతి వినయం వినయాద్యాతిపాత్రతాం పాత్రత్వాత్ ధనమాప్నోతి ధనాద్ధర్మం తత సుఖం’’ వైరాగ్య సుఖం, మోక్ష సుఖం వరకు అంతే. అందుకే త్యాగరాజ స్వామి వారిని... మీరంతవారు, మీరింత వారని అంటూంటే... ఆయన పొంగిపోలేదు. పైగా ఆయనేమన్నారు.. అంటే...

ఎందరో మహానుభావులు ...అందరికీ వందనములు... అన్నారు. బ్రహ్మాన్ని తెలుసుకున్నవారు, రమించినవారు, పాడినవారు, అర్చించినవారు, అనుభవించినవారు ఎంతో మంది ఉండగా వారి ముందు నేనెంత, వారికి నేనేం చేయగలను, నమస్కారం చేస్తా...’’ అని వారందరినీ ఆదరపూర్వకంగా స్మరించుకున్నారు. వినయం అంటే అదీ.

ఆదిశంకరులు అంతటి వారు ‘‘పశుం మాం సర్వజ్ఞ ప్రథితకృప యాపాలయవిభో’’...‘శివా! నేను పశువును. నీవు పశుపతివి. ఇదే మనిద్దరి మధ్య బంధం’ అన్నారు. అది వినయం. అది విద్యకు పరమార్థం.అది దేనిచేత ప్రకాశిస్తుంది... అంటే ఉపాసనా దేవత అనుగ్రహానికి పాత్రమయితే అప్పుడు వినయం వస్తుంది. ఆ వినయం మనకు వాగ్గేయకారులందరిలో కనబడుతుంది. అందుకే వారు ఏది చెప్పినా ఏది చేసినా మనకు సందేశం ఇస్తున్నట్లో, సలహా ఇస్తున్నట్లో ఉండదు. వారికి వారు చెప్పుకున్నట్లు ఉంటుంది.

భిన్న కథనాలు ఉన్నప్పటికీ, త్యాగరాజ స్వామివారు ఒకసారి వేంకటాచలం వెళ్ళారు, స్వామి వారి దర్శనం కోసం కూచున్నారు. తెర అడ్డంగా ఉంది. దిగంతాలకు వ్యాపించిన కీర్తిమంతుడిని, సాక్షాత్ ఉపనిషద్బ్రహ్మేంద్రులంతటి వారు నన్నుపిలిచి కీర్తనలు పాడించుకుంటారే, నేనొస్తే తెర వేస్తారా... అని ఆయన కోపగించుకోలేదు.

ఈ తెర కాసేపయితే తీస్తారు.. ఇవ్వాళ కాకపోతే రేపయినా తీస్తారు. కానీ లోపల ఇంకొక తెర ఉంది... అనే అర్థంలో ఆయన అన్న మాటేమిటంటే...‘‘తెర తీయగ రాదా, నాలోని తిరుపతి వేంకటరమణా! మదమత్సరమను తెరదీయగరాదా, పరమ పురుషా!’’ అని పిలిచారు.



నిజానికి భగవంతుడు ఎక్కడ దర్శనం కావాలి? మన లోపల.. ‘అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా... లోపల అక్కడ కనబడాలి. పరమ యోగీంద్రులకు భావగోచరమైన పాదాబ్జములు నాకు దర్శనమయితే నేను యోగిని. .. అన్నారు

తెర వేసినందుకుగానీ, తెర తొలగించనందుకు గానీ ఆయన ఎవరినీ నింద చేయలేదు. నా అంతటివాడొస్తే.. అని అహంకరించలేదు. ఎప్పుడు తీస్తారని అడగలేదు. ఇక్కడ ఉన్న తెర ఎవరయినా, ఎప్పుడయినా తీస్తారు. ‘లోపల నాకు అడ్డొస్తోన్న తెరవల్ల నీవు నాకు ఎప్పటికీ కనబడడం లేదు. అది నీవే తీయాలి. నేను తీసుకోలేను. ఇంకొకరు తీయలేరు. అది తీయవయ్యా నాలోని వేంకటరమణా!’- అని వేడుకున్నారు.

నిన్ను పొందడానికి నాకు అడ్డొస్తున్నదేమిటంటే మత్సరం... అన్నారు. ఎంతగొప్పమాట! మత్సరం అంటే అన్య సుఖ ద్వేషి. ఇంకొకరికేదయినా మంచి జరిగితే మనం చాలా బాధపడిపోతుంటాం. అన్నపానీయాలు ఎక్కువ. నిద్రాసుఖం ఉండదు. వాడికి శుభం జరగడమా, నాకన్నా వాడేం గొప్ప. వాడికేం తెలుసని. వాడికి కీర్తి రావడమేమిటి, వాడికి శుభాలు జరగడమేమిటి ... ఇలా ఇతరులను తక్కువచేసి తన గొప్పదనం స్మరించుకోవడం... అది మత్సరానికి ప్రారంభ స్థానం. అది అడ్డొస్తున్నదన్నారు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

కోరికలు కలలోని పూదోటలు

ఒక రోజున బుద్ధుడు అచిరవతి నదీ తీరంలోని ఒక ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడే ఒక ఆరామం కూడా ఉంది. బుద్ధుడు అక్కడే ఉన్నాడని తెలుసుకుని ఆ పరిసర గ్రామ వాసులు ఎందరో అక్కడికి వచ్చారు.

బుద్ధుని ధర్మోపదేశం పూర్తి చేయగానే... ఒక యువకుడు లేచి నమస్కరించి...

‘‘భగవాన్! కోరికలు చెడ్డవా? వాటి వల్ల ప్రయోజనం ఉండదా? వివరించి చెప్పగలరు’’ అని ప్రార్థించాడు.

‘‘ఓ యువకా! జాగ్రత్తగా విను. ఒక మాంసం వ్యాపారి తన దుకాణం దగ్గరకు వచ్చిన కుక్కకు మాంసం గీకేసిన ఎముకను వేస్తాడు. ఆ ఎముకకు మాంసం చెమ్మ, కొద్దిగా రక్తం మాత్రమే అంటి ఉంటాయి. కానీ... ఆ కుక్క ఆ ఎముకను కరచుకొని నానా తంటాలు పడుతుంది. దాని వల్ల దాని ఆకలి తీరదు. దౌర్బల్యమూ తొలగదు. కోరికల వల్ల దొరికేది కూడా ఇంతే!

అలాగే... వెలుగు కోసం ఒకడు ఒక గడ్డిదివిటీని పట్టుకుని గాలికి ఎదురుగా పరుగులు తీస్తుంటాడు. దివిటీ మంట చెలరేగి, పెద్దదవుతుంది. దివిటీని పట్టుకున్న వాని ముఖం మీదకే జ్వాలలు వచ్చి పడుతుంటాయి. అప్పుడు వాడు ఆ దివిటీని వదిలి పెట్టకపోతే.. తన దివిటీనే తనని కాల్చేస్తుంది. మనలో రేగిన కామాగ్నులు కూడా మనల్ని అలానే దహిస్తాయి. నిలువెత్తు లోతులో నిప్పుల గుండం ఉంటుంది. అది రగిలి చల్లారింది. పైకి మంట గానీ, పొగ గానే లేవడం లేదు. పైపై బొగ్గులన్నీ చల్లారాయి. కానీ... దానిలో దిగిన వాడు మాత్రం నిప్పుల్లో దిగబడిపోతాడు. మాడి బొగ్గులా మారిపోతాడు. కామం అనే



నిప్పుల గుండంలో దిగబడిన వారు కూడా అలానే నశించిపోతారు. అలాగే... ఒకడు స్వప్నంలో అందమైన పూల తోటలో విహరిస్తూ ఉంటాడు. రంగురంగుల పూలచెట్లు, అందమైన సీతాకోకచిలుకలు, తుమ్మెదల ఝుంకార నాదాలూ... మత్తు కలిగించే చల్లని గాలి, వాడు ఆనందంలో తేలిపోయి, మైమరచిపోతాడు. అంతలో మెలకువ వస్తుంది. ఆనంద దృశ్యాలన్నీ అదృశ్యమై పోతాయి. మధురానుభూతి మాయమైపోతూ ఉంటుంది. కామ సుఖాలు కూడా అలాంటివే...

ఇంకా ఒకరు అందమైన, విలువైన నగల్ని అరువు తెచ్చుకుంటారు. ధరిస్తారు. దూరంగా ఉన్న పట్టణానికి వెళ్తారు. అక్కడ అంగడిలో వాటిని అమ్మకానికి పెడతారు. బేరం జరుగుతూ ఉండగా, అసలైన నగల యజమాని వస్తాడు. దూషించి తన నగలు తాను పట్టుకుపోతాడు. అవమానంతో బేలతనంతో ఆ అరువు తెచ్చుకున్న వారు హేళన పాలవుతారు.

కామాలు అంటే కోరికలు కూడా మనకి చివరికి అవమానాల్ని తెస్తాయి. హేళన పాల్జేస్తాయి.

కాబట్టి కోరికలల వెంటపడి పరుగుతీసే మన మనస్సుని మనం నియంత్రించుకోవాలి.’’ అని చెప్పాడు. ఆ యువకునితో పాటు, అక్కడ ఉన్న వారందరికీ కోర్కెల వల్ల కలిగే కీడు అర్థమైంది. ఆ యువకుడు లేచి, బుద్ధునికి వంగి నమస్కరించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా


● రజనీకాంత్, అమితాబ్ బచ్చన్

బై బై ముంబై

రజనీకాంత్ హీరోగా ‘జై భీమ్’ ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవల ముంబైలో ప్రారంభమైంది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ ముంబై షెడ్యూల్ ముగిసిందని వెల్లడించి, ఓ వర్కింగ్ స్టిల్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు మేకర్స్. ఇలా ముంబైకి బై బై చెప్పారు రజనీకాంత్. ఇక 1991లో విడుదలైన హిందీ చిత్రం ‘హమ్’ తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలిసి 33 ఏళ్లకు స్క్రీన్ షేర్ చేసుకుంటున్న చిత్రం ఇది. రానా, ఫాహద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. ఓ సామాజిక అంశం నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పోలీసాఫీసర్ పాత్రలో రజనీకాంత్ కనిపిస్తారని, వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది.


● కమల్‌హాసన్

ఇంట్రో రెడీ

కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం ‘ఇండియన్ 2’. 1996లో కమల్, శంకర్ కాంబినేషన్‌లోనే వచ్చిన ‘ఇండియన్’కు సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా మేజర్ షూట్ పూర్తయింది. తాజాగా ‘ఇండియన్ 2’ సినిమాకు సంబంధించిన వీడియోను ‘ఇండియన్ 2 యాన్ ఇంట్రో’ టైటిల్‌తో నవంబరు 3న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, బాబీ సింహా, రకుల్‌ప్రీత్ సింగ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సుభాస్కరన్, ఉదయనిధి స్టాలిన్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్.


● విష్ణు మంచు

విష్ణు మంచుకు గాయాలు

హీరో విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న మైథలాజికల్ ఫిల్మ్ ‘కన్నప్ప’. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ న్యూజిల్యాండ్‌లో జరుగుతోంది. ఈ సినిమాలోని ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను డ్రోన్ కెమెరాతో చిత్రీకరిస్తున్న సమయంలో ఆ డ్రోన్ అదుపు తప్పి విష్ణు చేతికి తాకడంతో, ఆయన గాయలపాయ్యారని సమాచారం. దీంతో ‘కన్నప్ప’ షూటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారట. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.

అక్కడ మొదలైంది వేట!


● జపాన్ సినిమా వేడుకలో ఓ దృశ్యం

‘‘ఓపెన్ చేస్తే ఓ పెద్ద సముద్రాన్ని చూపిస్తున్నాం. అందులో ఒక బుల్లి చేప. దాని వయసు పదేళ్లు. ఈ బుల్లి చేప.. అమ్మ చేప కోసం ఓ కన్నం వేసింది. అక్కడ మొదలైంది బుల్లి చేప వేట.. ఎండ్రకాయకో కన్నం, రొయ్యకో కన్నం, మొసలికో కన్నం... కన్నాల మీద కన్నాలేసి ఆ బుల్లి చేప ఓ పెద్ద తిమింగలమై పోయింది’’ అంటూ మొదలైంది ‘జపాన్’ సినిమా తెలుగు ట్రైలర్. కార్తీ హీరోగా రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్న చిత్రం ఇది. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సునీల్, విజయ్ మిల్టన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ‘జపాన్’ సినిమా దీపావళి సందర్భంగా విడుదల కానుంది. కార్తీ కెరీర్‌లో 25వ సినిమా తెరకెక్కుతోన్న ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ వేడుక చెన్నైలో జరిగింది. తెలుగు వెర్షన్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేస్తోంది. ట్రైలర్ రిలీజ్ వేడుకలో హీరోలు సూర్య, విశాల్, ఆర్య, ‘జయం’ రవి, దర్శకులు లోకేశ్ కనకరాజ్, పా. రంజిత్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

యాక్షన్ ఘోస్ట్

కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ హీరోగా శ్రీని దర్శకత్వంలో రూపొందిన కన్నడ యాక్షన్ చిత్రం ‘ఘోస్ట్’. అనుపమ్ ఖేర్, జయరామ్, ప్రశాంత్ నారాయణ్, అర్చనా జాయిస్, సత్య ప్రకాశ్ కీలక పాత్రల్లో నటించారు. ఎన్. సందేశ్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 19న విడుదలైంది. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన లభించిందని, దీంతో ఈ సినిమాను నవంబరు 4న తెలుగులోనూ విడుదల చేయనున్నట్లుగా చిత్రం యూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి సంగీతం: అర్జున్ జన్య.


● శివరాజ్‌కుమార్

లవ్ అండ్ ఎమోషన్


● హెబ్బా పటేల్, దినేష్, పాయల్ రాధాకృష్ణ

దినేష్ తేజ్ హీరోగా, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్లుగా నటించిన ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ ఫిల్మ్ ‘అలా నిన్ను చేరి’. మారేష్ శివన్ దర్శకత్వంలో కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 10న విడుదల కానుంది. ‘‘కుటుంబ సమేతంగా చూడదగ్గ లవ్ అండ్ ఎమోషనల్ ఫిల్మ్ ఇది. చంద్రబోస్‌గారి సాహిత్యం, సుభాస్ ఆనంద్ సంగీతం అదనపు ఆకర్షణలు ’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఓ యువతి కథ


● నిహాల్, అశ్లేషా

కర్ణాటక రాష్ట్రంలో హళిబేడు ఆలయానికి సమీపంలో ఉన్న గిరిజన తండాలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా నిర్మాత కేఎస్ రామారావు పర్యవేక్షణలో తెరకెక్కిన పీరియాడికల్ ఫిల్మ్ ‘శాంతల’. నిహాల్ కోదాటి, అశ్లేషా ఠాకూర్ హీరోహీరోయిన్లుగా నటించగా, వినోద్ కుమార్ ఓ ప్రధాన పాత్రలో నటించారు. ఇండో అమెరికన్ ఆర్ట్స్ పతాకంపై డా. యిర్రంకి సురేష్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 17న తెలుగు, మలయాళ, తమిళ, కన్నడ, హిందీ, మరాఠీ భాషల్లో విడుదల కానుంది. ‘‘ఓ గిరిజన తండాలో అమాయక స్త్రీలను చెరబట్టే అరాచకానికి ఒడిగడుతున్న ఒక కామాంధుడి బారి నుండి విముక్తి పొందిన ఒక యువతి కథే ‘శాంతల’ చిత్రకథ. బేలూరు, హళిబేడు జంట దేవాలయాల వద్ద అత్యంత సుందరమైన సన్నివేశాలు, పాటలను చిత్రీకరించాం. అలాగే కీలక సన్నివేశాలను కర్ణాటకలోని మారుమూల ప్రాంతాల్లో దర్శకుడు శేషు పెద్దిరెడ్డి నిర్దేశకత్వంలో కేఎస్ రామారావు షూటింగ్ కార్యక్రమాలను నిర్వహించారు’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

హాలీవుడ్ నటుడు మాథ్యూ ఫెర్రీ ఇక లేరు

అమెరికన్ ప్రముఖ నటుడు మాథ్యూ ఫెర్రీ (54) ఇక లేరు. లాస్ ఏంజిల్స్‌లోని స్వగృహంలో ఫెర్రీ అనుమానాస్పద రీతిలో మరణించినట్లుగా అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. జాన్ బెన్నెట్ ఫెర్రీ, సుజానే మేరీ మోరిసన్ దంపతులకు 1969 ఆగస్టు 19న జన్మించారు మాథ్యూ ఫెర్రీ. ఫెర్రీకి ఏడాది వయసు పూర్తి కాక ముందే బెన్నెట్ ఫెర్రీ, సుజానే మేరీ విడాకులు తీసుకున్నారు. 15 ఏళ్ల తల్లి వద్దే ఉంటూ చదువుకున్నాడు ఫెర్రీ. ఆ తర్వాత అప్పటికే నటనా రంగంలో ఉన్న తండ్రి బాటలో నడిచారు ఫెర్రీ. అలా సినిమాలు, ముఖ్యంగా సీరియల్స్‌లో నటించి పేరు గడించారు. 1994లో ఆరంభమైన ‘ఫ్రెండ్స్’ సిరీస్‌తో ఆయన జీవితం కీలక మలుపు తీసుకుంది. ఇందులో ఫెర్రీ పోషించిన చాండ్లర్ బింగ్ పాత్ర అద్భుతంగా క్లిక్ అయ్యింది. ప్రపంచవ్యాప్తంగా ఫెర్రీకి అభిమానులను సంపాదించిపెట్టింది. ‘ఫ్రెండ్స్’ సిరీస్ 2014 వరకు ఓ అమెరికన్ చానెల్‌లో ప్రసారమైంది. అలాగే 2021లో ‘ఫ్రెండ్స్ రీ యూనియన్ షో’ కూడా జరిగింది. ఈ షో ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. ‘ఎమ్టీ నెస్ట్’, ‘హైవే టు హెవెన్’, ‘ఫ్రెండ్స్’, ‘మిస్టర్ సన్‌షైన్’... ఇలా 40కి పైగా టెలివిజన్ సిరీస్‌లలో నటించారు ఫెర్రీ. అలాగే ‘ది కిడ్’, ‘బర్డ్స్ ఆఫ్ అమెరికా’.. ఇలా దాదాపు 15 హాలీవుడ్ సినిమాల్లో కూడా నటించారాయన. ఇక ఫెర్రీ మృతి పట్ల ఇండియన్ స్టార్స్ వెంకటేశ్, మహేశ్‌బాబు, అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, సమంత, కరీనా కపూర్‌లతో పాటు పలువురు హాలీవుడ్ స్టార్స్ సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు.


● మాథ్యూ ఫెర్రీ

యూత్‌ఫుల్ ప్రేమకథ


● కిశోర్ కేఎస్‌డీ

కిశోర్ కేఎస్‌డీ, దియా సితెపల్లి జంటగా నటిస్తున్న చిత్రం ‘ప్రేమ కథ’. టాంగా ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ, సినీ వ్యాలీ మూవీస్ పతాకాలపై విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజిపల్లి, శింగనమల కల్యాణ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేసి, లుక్ బాగుందని, ఈ సినిమా విజయం సాధించాలని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ‘‘వైవిధ్యమైన లవ్‌స్టోరీతో నేటితరం యువ ప్రేక్షకులకు నచ్చేలా ఈ చిత్రం ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: రధన్, సహనిర్మాత: ఉపేంద్ర గౌడ్ ఎర్ర.



1 వన్డే ప్రపంచకప్ టోర్నీ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి తొలిసారి 'డకౌట్' అయ్యాడు. వరుసగా నాలుగో ప్రపంచకప్ ఆడుతున్న కోహ్లి ఇప్పటివరకు ఈ టోర్నీ చరిత్రలో 32 మ్యాచ్‌లు ఆడి 1,384 పరుగులు సాధించాడు. ఇందులో 3 సెంచరీలు, 9 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

5 ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో 87 పరుగులు చేసిన క్రమంలో రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో 18 వేల పరుగులు పూర్తి చేసుకున్న ఐదో భారతీయ క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీ, విరాట్ కోహ్లి ఉన్నారు.

100 అంతర్జాతీయ క్రికెట్‌లో 100 మ్యాచ్‌ల్లో (మూడు ఫార్మాట్‌లు కలిపి) కెప్టెన్‌గా వ్యవహరించిన ఏడో భారతీయ కెప్టెన్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. రోహిత్‌కంటే ముందు ధోని, అజహరుద్దీన్, కోహ్లి, గంగూలీ, కపిల్ దేవ్, రాహుల్ ద్రవిడ్ ఈ ఘనత సాధించారు. రోహిత్ సారథ్యంలో 100 మ్యాచ్‌లు ఆడిన భారత్ 74 మ్యాచ్‌ల్లో విజయం అందుకుంది.

ప్రపంచకప్‌లో నేడు

శ్రీలంక X అఫ్గానిస్తాన్

వేదిక: పుణే


మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
శ్రీలంక	5	2	3	4	-0.025
పాకిస్తాన్	6	2	4	4	-0.387
అఫ్గానిస్తాన్	5	2	3	4	-0.969
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఆరు... భారత్ జోరు...



షమీ



బుమ్రా



సూర్యకుమార్

ఆరో పోరులోనూ భారత్ అదరగొట్టింది. ఎదురులేని ఆటతో దూసుకుపోతున్న జట్టు మళ్లీ తమ స్థాయిని ప్రదర్శించింది. కనీసం పోటీ కూడా ఇవ్వలేని స్థితికి ఇంగ్లండ్‌ను నెడుతూ సంపూర్ణ ఆధిపత్యంతో మరో ఘన విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. గత ఐదు మ్యాచ్‌లలో ఛేదనలో లక్ష్యం చేరిన టీమిండియా ఈసారి ముందుగా బ్యాటింగ్ చేసి తమ బలాన్ని ప్రదర్శించింది. పరుగులు సాధించేందుకు కాస్త ఇబ్బందిగా కనిపించిన పిచ్‌పై కొంత తడబడినా... 229 స్కోరు కూడా టీమిండియా గెలిచేందుకు సరిపోయింది. పట్టుదలతో కూడిన బ్యాటింగ్‌తో రోహిత్ జట్టు ఇన్నింగ్స్‌ను నిలబెట్టగా... బౌలింగ్‌లో బుమ్రా, షమీ, కుల్దీప్ చెలరేగి ఇంగ్లండ్ పని పట్టడంతో భారత్ సెమీస్ చేరడం దాదాపు ఖాయమైంది.

డిఫెండింగ్ చాంపియన్‌గా భారీ అంచనాలతో బరిలోకి దిగి ఆపై వరుస ఓటములతో దిగాలు పడి ఈ మ్యాచ్ బరిలోకి దిగిన ఇంగ్లండ్ మళ్లీ అదే పేలవ ఆటను కనబర్చింది. ఈ టోర్నీలో దాదాపుగా ఆ జట్టు ఆట ముగిసినట్లే. గత మ్యాచ్‌లకంటే మెరుగైన బౌలింగ్ ప్రదర్శనతో భారత్‌లాంటి పటిష్ట జట్టును తక్కువ స్కోరుకే పరిమితం చేసినప్పుడు ఇంగ్లండ్ విజయంపై ఆశలు రేగాయి. ఆ టీమ్ కోలుకునేందుకు ఇదే సరైన మ్యాచేమో అనిపించింది. కానీ కనీసం ఓనమాలు తెలియని రీతిలో ఇంగ్లండ్ బ్యాటర్లు ఘోరంగా ఆడి మరో 15 ఓవర్లు ఉండగానే మ్యాచ్‌ను అప్పగించేశారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు బౌల్డ్ లేదా ఎల్బీడబ్ల్యూలు ఉన్నాయంటే మన బౌలింగ్ పదును, ఇంగ్లండ్ చెత్త బ్యాటింగ్ ఏమి అర్థమవుతుంది.

టీమిండియాకు వరుసగా ఆరో విజయం
- 100 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు
- గెలిపించిన షమీ, బుమ్రా
- రోహిత్ కీలక ఇన్నింగ్స్
- సెమీస్ బెర్త్ దాదాపు ఖరారు
- గురువారం శ్రీలంకతో టీమిండియా తర్వాతి పోరు

లక్నో: సొంతగడ్డపై వరల్డ్‌కప్‌లో భారత జట్టు అసాధారణ ప్రదర్శన కొనసాగుతోంది. టైటిల్ వేటలో ఒక్క ఓటమీ లేకుండా వెళుతున్న రోహిత్ సేన ఆరో మ్యాచ్‌లోనూ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 100 పరుగుల భారీ తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (101 బంతుల్లో 87; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) మరో చక్కటి ప్రదర్శనతో జట్టును ఆదుకోగా, సూర్యకుమార్ యాదవ్ (47 బంతుల్లో 49; 4 ఫోర్లు, 1 సిక్స్), కేఎల్ రాహుల్ (58 బంతుల్లో 39; 3 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం ఇంగ్లండ్ 34.5 ఓవర్లలో 129 పరుగులకే కుప్పకూలింది. లివింగ్‌స్టోన్ (27)దే అత్యధిక స్కోరు కాగా... మొహమ్మద్ షమీ (4/22), బుమ్రా (3/32) తమ బౌలింగ్‌తో ప్రత్యర్థిని చిత్తు చేశారు. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో గురువారం ముంబైలో శ్రీలంకతో తలపడుతుంది.

కీలక భాగస్వామ్యం...

విల్లీ వేసిన తొలి ఓవర్‌ను 'మెయిడిన్'గా ఆడిన రోహిత్ అతని తర్వాతి ఓవర్లో ఫోర్, 2 సిక్స్‌లతో దూకుడు ప్రదర్శించాడు. అయితే మరో ఎండ్‌లో భారత్ 14 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయింది. గిల్ (9)ను వోక్స్ అవుట్ చేయగా, అతని బౌలింగ్‌లోనే అయ్యర్ (4) చెత్త షాట్ ఆడి నిష్క్రమించాడు. ఈ రెండు వికెట్ల మధ్య విల్లీ బౌలింగ్‌లో కోహ్లి (0) డకౌట్ కావడంతో స్టేడియంలో నిశ్శబ్దం ఆవరించింది. ఎనిమిది బంతుల పాటు పరుగు తీసేందుకు తీవ్రంగా ప్రయత్నించిన అనంతరం సహనం కోల్పోయిన విరాట్ ముందుకొచ్చే ఆడే క్రమంలో సునాయాస క్యాచ్ ఇచ్చాడు. దాంతో స్కోరు 40/3కి చేరింది. ఈ దశలో రోహిత్, రాహుల్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. బౌలింగ్‌కు బాగా అనుకూలిస్తున్న కఠినమైన పిచ్‌పై వీరిద్దరు జాగ్రత్తగా ఆడుతూ పరుగులు రాబట్టారు. 33 పరుగుల వద్ద రోహిత్‌ను వుడ్ ఎల్బీగా దొరికిపోయినా...రివ్యూలో అతను బతికిపోయాడు. అనంతరం 66 బంతుల్లో రోహిత్ అర్ధ సెంచరీ పూర్తయింది. నాలుగో వికెట్‌కు 18.3 ఓవర్లలో 91 పరుగులు జోడించిన తర్వాత రాహుల్‌ను అవుట్ చేసిన ఇంగ్లండ్ ఈ జోడీని విడదీసింది. కొద్ది సేపటికి సెంచరీకి చేరువవుతున్న తరుణంలో రోహిత్ కూడా వెనుదిరగ్గా... లోయర్ ఆర్డర్ ప్రభావం చూపలేకపోయింది. అయితే సూర్యకుమార్ కొన్ని చక్కటి షాట్లతో స్కోరును 200 పరుగులు దాటించగలిగాడు.



రోహిత్ శర్మ



కుల్దీప్ బౌలింగ్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్ క్లీన్‌బౌల్డ్

టపటపా...

సిరాజ్ ఓవర్లో మలాన్ (16) వరుసగా ఫోర్, సిక్స్ కొట్టడంతో ఇంగ్లండ్ ఛేదన జోరుగా మొదలైంది. 4.4 ఓవర్లలో స్కోరు 30/0కు చేరింది. కానీ ఇక్కడి నుంచే భారత బౌలర్లు చెలరేగడంతో మొదలైన ఇంగ్లండ్ పతనం చివరి వరకు వేగంగా సాగింది. బుమ్రా వరుస బంతుల్లో మలాన్, రూట్ (0)లను వెనక్కి పంపి ప్రత్యర్థి పని పట్టాడు. ఆ తర్వాత షమీ తన వరుస ఓవర్లలో అద్భుత బంతులతో స్టోక్స్ (0), బెయిర్‌స్టో (14)లను బౌల్డ్ చేయగా... కుల్దీప్ వేసిన బంతి అనూహ్యంగా టర్న్ అయి బట్లర్ (10) స్టంప్స్‌ను పడగొట్టింది. ఈ వికెట్‌తో 15.1 ఓవర్లు ముగిసేసరికే ఇంగ్లండ్ పోరాటం దాదాపుగా ముగిసింది. తర్వాతి వరుస బ్యాటర్లకు తమ జట్టును గెలిపించేంత శక్తి లేకపోయింది.



కుల్దీప్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) లివింగ్‌స్టోన్ (బి) రషీద్ 87; గిల్ (బి) వోక్స్ 9; కోహ్లి (సి) స్టోక్స్ (బి) విల్లీ 0; అయ్యర్ (సి) వుడ్ (బి) వోక్స్ 4; రాహుల్ (సి) బెయిర్‌స్టో (బి) విల్లీ 39; సూర్యకుమార్ (సి) వోక్స్ (బి) విల్లీ 49; జడేజా (ఎల్బీ) (బి) రషీద్ 8; షమీ (సి) బట్లర్ (బి) వుడ్ 1; బుమ్రా (రనౌట్) 16; కుల్దీప్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 229.** **వికెట్ల పతనం:** 1-26, 2-27, 3-40, 4-131, 5-164, 6-182, 7-183, 8-208, 9-229. **బౌలింగ్:** విల్లీ 10-2-45-3, వోక్స్ 9-1-33-2, రషీద్ 10-0-35-2, వుడ్ 9-1-46-1, లివింగ్‌స్టోన్ 4-1-29-0, అలీ 8-0-37-0.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (బి) షమీ 14; మలాన్ (బి) బుమ్రా 16; రూట్ (ఎల్బీ) (బి) బుమ్రా 0; స్టోక్స్ (బి) షమీ 0; బట్లర్ (బి) కుల్దీప్ 10; మొయిన్ అలీ (సి) రాహుల్ (బి) షమీ 15; లివింగ్‌స్టోన్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 27; వోక్స్ (స్టంప్డ్) రాహుల్ (బి) జడేజా 10; విల్లీ (నాటౌట్) 16; రషీద్ (బి) షమీ 13; వుడ్ (బి) బుమ్రా 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (34.5 ఓవర్లలో ఆలౌట్) 129.** **వికెట్ల పతనం:** 1-30, 2-30, 3-33, 4-39, 5-52, 6-81, 7-98, 8-98, 9-122, 10-129. **బౌలింగ్:** బుమ్రా 6.5-1-32-3, సిరాజ్ 6-0-33-0, షమీ 7-2-22-4, కుల్దీప్ 8-0-24-2, జడేజా 7-1-16-1.

ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే...

- చాంపియన్స్ ట్రోఫీలో అవకాశం
- పాకిస్తాన్ వేదికగా 2025లో టోర్నీ

దుబాయ్: వరల్డ్ కప్‌లో అత్యంత పేలవమైన ఆటతో పాయింట్ల పట్టికలో ప్రస్తుతం చివరి స్థానంలో ఉన్న ఇంగ్లండ్‌ను మరో ప్రమాదం వెంటాడుతోంది. వన్డే క్రికెట్‌లో ఎనిమిది జట్లతో ఆడే మరో ప్రతిష్టాత్మక టోర్నీ చాంపియన్స్ ట్రోఫీకి ఆ జట్టు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2021లోనే ఐసీసీ తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రస్తుతం వరల్డ్ కప్‌లో టాప్-7లో నిలిచిన జట్లే చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశమైన పాకిస్తాన్‌కు నేరుగా అవకాశం లభిస్తుంది. టోర్నీలో ఆడుతున్న కొన్ని టీమ్‌లకు ఈ విషయంపై అవగాహన లేదని సమాచారం. అయితే బట్లర్, షకీబ్ మాత్రం ఈ విషయం తమకు తెలుసని, టాప్-7 లక్ష్యంగా ఆడతామని కూడా చెప్పారు. ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, పాకిస్తాన్‌లతో మ్యాచ్‌లు మిగిలి ఉన్న ఇంగ్లండ్ ఏ రకంగా ముందంజ వేస్తుందనేది చూడాలి. టాప్-7 నిబంధన కారణంగా ఈ వరల్డ్ కప్‌లో ఆడని వెస్టిండీస్, ఐర్లాండ్, జింబాబ్వేలకు ఏ రకంగానూ చాంపియన్స్ ట్రోఫీలో ఆడే అవకాశమే లేదు. మరోవైపు 2025లో పాకిస్తాన్ ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీకి భారత్ వెళుతుందా... లేక భారత్ కోసం తటస్థ వేదికను ఏర్పాటు చేస్తారా అనేది ఆసక్తికరం. చివరిసారి 2017లో చాంపియన్స్ ట్రోఫీ జరగ్గా... ఫైనల్లో భారత్‌పై గెలిచి పాకిస్తాన్ తొలిసారి చాంపియన్‌గా నిలిచింది.



డిఫెండింగ్ చాంప్ పాక్ (ఫైల్)

ప్రపంచ మాజీ చాంపియన్‌పై వైశాలి విజయం

చెన్నై: స్విస్ గ్రాండ్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) ఆర్. వైశాలి సంచలన ప్రదర్శన చేసింది. ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్‌లో వైశాలి నల్ల పావులతో ఆడుతూ కేవలం 23 ఎత్తుల్లో ప్రపంచ మాజీ చాంపియన్ మరియా ముజిచుక్ (ఉక్రెయిన్)ను ఓడించింది. భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద సోదరి అయిన వైశాలి నాలుగో రౌండ్ తర్వాత 3.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా టాప్ ర్యాంక్‌లో ఉంది. ఇటీవల మూడో గ్రాండ్‌మాస్టర్ (జీఎం) నార్మ్ సాధించిన వైశాలి ఎలో రేటింగ్ పాయింట్లు 2500 దాటితే కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక తర్వాత భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకున్న మూడో మహిళా క్రీడాకారిణిగా నిలుస్తుంది. ఇదే టోర్నీ ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ నాలుగో రౌండ్ తర్వాత మూడు పాయింట్లతో మరో 17 మందితో కలిసి రెండో స్థానంలో ఉన్నాడు.



విష్ణు జోడీకి టైటిల్

దావణగెరె : అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య పురుషుల ఎం-15 టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ విష్ణువర్ధన్ డబుల్స్ విభాగంలో టైటిల్ సాధించాడు. భారత్‌కే చెందిన సిద్ధాంత్‌తో జతకట్టి ఈ టోర్నీలో బరిలోకి దిగిన విష్ణు ఫైనల్లో 6-2, 7-5తో గంటా సాయికార్తీక్ రెడ్డి-మనీశ్ (భారత్) జంటపై గెలిచాడు. విష్ణు కెరీర్‌లో ఇది 45వ డబుల్స్ టైటిల్ కావడం విశేషం. 36 ఏళ్ల విష్ణువర్ధన్ 2010 గ్వాంగ్జౌ ఆసియా క్రీడల్లో పురుషుల డబుల్స్‌లో కాంస్యం, మిక్స్‌డ్ డబుల్స్‌లో రజత పతకం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్‌తో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో పోటీపడ్డాడు. డేవిస్‌కప్ టోర్నీలో మూడు సార్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.



తనిష్క్ బృందానికి రజతం

చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం భారత్‌కు రెండు రజత పతకాలు లభించాయి. జూనియర్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ ప్లేయర్ కొడవలి తనిష్క్ మురళీధర్ నాయుడు, రాజ్‌కన్వర్ సింగ్ సంధూ, సమీర్‌లతో కూడిన భారత జట్టు రెండో స్థానంలో నిలిచింది. తనిష్క్ (569), సమీర్ (573), రాజ్‌కన్వర్ (579) బృందం ఓవరాల్‌గా 1721 పాయింట్లు స్కోరు చేసి రజత పతకం కైవసం చేసుకుంది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ జాహిద్ హుస్సేన్ రజత పతకం సొంతం చేసుకున్నాడు. జాహిద్ 624.5 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. మరో మూడు రోజులపాటు కొనసాగే ఈ చాంపియన్‌షిప్‌లో ప్రస్తుతం భారత్ 8 స్వర్ణాలు, 12 రజతాలు, 5 కాంస్యాలతో కలిపి మొత్తం 25 పతకాలతో రెండో స్థానంలో ఉంది.



తనిష్క్

వ్రితి అగర్వాల్‌కు కాంస్యం



పనాజీ: జాతీయ క్రీడల్లో తెలంగాణకు ఎనిమిదో పతకం లభించింది. ఆదివారం జరిగిన మహిళల స్విమ్మింగ్ 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో తెలంగాణ అమ్మాయి వ్రితి అగర్వాల్ కాంస్య పతకం గెలిచింది. వ్రితి 200 మీటర్ల దూరాన్ని 2ని:09.42 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం తెలంగాణ ఎనిమిది పతకాలతో 20వ ర్యాంక్‌లో ఉంది. పురుషుల టేబుల్ టెన్నిస్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ జట్టు 2-3తో ఢిల్లీ జట్టు చేతిలో ఓడిపోయింది. అథ్లెటిక్స్ 100 మీటర్ల విభాగంలో ఎలాకియాదాసన్ (తమిళనాడు), స్నేహ (కర్ణాటక) చాంపియన్స్‌గా అవతరించారు.

యూకీ ఖాతాలో మూడో డబుల్స్ టైటిల్



న్యూఢిల్లీ: భారత అగ్రశ్రేణి టెన్నిస్ క్రీడాకారుడు యూకీ బాంబ్రీ ఈ ఏడాది మూడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఫ్రాన్స్‌లో ఆదివారం ముగిసిన బ్రెస్ట్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-జూలియన్ క్యాష్ (బ్రిటన్) ద్వయం విజేతగా నిలిచింది. ఫైనల్లో యూకీ-క్యాష్ జోడీ 6-7 (5/7), 6-3, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ రాబర్ట్ గాలోవే (అమెరికా)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జంటను ఓడించింది. గంటా 39 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ ద్వయం ఏడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. టైటిల్ నెగ్గిన యూకీ జోడీకి 6,845 యూరోల (రూ. 6 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది యూకీ గిరోనా చాలెంజర్ టోర్నీ (స్పెయిన్), నొంతబురి (థాయ్‌లాండ్) చాలెంజర్ టోర్నీలో కూడా డబుల్స్ టైటిల్ సాధించాడు.

భారత్ 'పారిస్' ఆశలు ఆవిరి

మహిళల ఫుట్‌బాల్ జట్టుకు రెండో ఓటమి

తాష్కెంట్: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు అర్హత సాధించే అవకాశాలకు తెరపడింది. ఇక్కడ జరుగుతున్న ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ (ఏఎఫ్‌సీ) ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. తొలి మ్యాచ్‌లో భారత్ 0-7తో ప్రపంచ మాజీ చాంపియన్ జపాన్ చేతిలో ఓడిపోగా...ఆదివారం జరిగిన గ్రూప్ 'సి' రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియాకు 1-3 గోల్స్ తేడాతో వియత్నాం జట్టు చేతిలో పరాజయం ఎదురైంది. లీగ్ దశ తర్వాత మూడు గ్రూప్‌ల్లో అగ్రస్థానంలో నిలిచిన మూడు జట్లతోపాటు రెండో స్థానంలో నిలిచిన ఉత్తమ జట్టు ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. భారత్ తరఫున సంధ్య రంగనాథన్ (80వ ని.లో) ఏకైక గోల్ చేయగా... వియత్నాం తరఫున హున్ ఎన్‌హూ (4వ ని.లో), ట్రాన్ థి హై లిన్ (22వ ని.లో), ఫామ్ హై యెన్ (73వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ ఈ మ్యాచ్‌లో 59 నిమిషాలు ఆడింది. ఆ తర్వాత ఆమె స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా గ్రేస్‌ను బరిలోకి దించారు. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను నవంబర్ 1న ఉజ్బెకిస్తాన్‌తో ఆడుతుంది.



సౌమ్య

ప్రపంచకప్ నుంచి లహిరు అవుట్

పుణే: అఫ్గానిస్తాన్‌తో కీలక మ్యాచ్‌కు ముందు శ్రీలంక జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో మూడు కీలక వికెట్లు తీసిన పేసర్ లహిరు కుమార కాలి కండరాల గాయం కారణంగా ప్రపంచ కప్‌లోని మిగతా మ్యాచ్‌లకు దూరమయ్యాడు. లహిరు స్థానంలో దుష్మంత చమీరా శ్రీలంక జట్టులోకి వచ్చాడు. 31 ఏళ్ల చమీరా శ్రీలంక తరఫున 44 వన్డేలు ఆడి 50 వికెట్లు పడగొట్టాడు.

'ఫినిషింగ్ టచ్' ఎవరిదో?

- నేటి నుంచి డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీ
- ఫైనల్ చేరితే సబలెంకాదే 'టాప్' ర్యాంక్

కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సీజన్ ముగింపు టోర్నమెంట్ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌కు రంగం సిద్ధమైంది. ఈ ఏడాది జరిగిన టోర్నీల్లో సాధించిన పాయింట్ల ఆధారంగా టాప్-8లో నిలిచిన క్రీడాకారిణులు ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి అర్హత సాధించారు. నవంబర్ ఐదో తేదీ వరకు జరిగే ఈ టోర్నీకి మెక్సికోలోని కాన్‌కున్ నగరం ఆతిథ్యమిస్తోంది. ప్రస్తుత ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్), రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), మూడో ర్యాంకర్ కోకో గాఫ్ (అమెరికా), నాలుగో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్), ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా), ఆరో ర్యాంకర్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్), ఏడో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యూనిషియా), తొమ్మిదో ర్యాంకర్ మరియా సాకరి (గ్రీస్) ఈ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. ఎనిమిదో ర్యాంకర్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) గాయం కారణంగా వైదొలగడంతో సాకరికి ఈ టోర్నీలో ఆడే అవకాశం లభించింది. 'బాకలార్ గ్రూప్'లో సబలెంకా, రిబాకినా, పెగూలా, సాకరి... 'చెటుమల్ గ్రూప్'లో స్వియాటెక్, కోకో గాఫ్, జబర్, వొండ్రుసోవా ఉన్నారు. గ్రూప్ దశ మ్యాచ్‌లు ముగిశాక రెండు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తారు. గత ఏడాది రన్నరప్ సబలెంకా ఈసారి ఫైనల్ చేరితే ఆమె ఈ ఏడాదిని నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగిస్తుంది. ఈ సంవత్సరం సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచి, యూఎస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది. వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీల్లో సెమీఫైనల్ చేరుకుంది. స్వియాటెక్ ఫ్రెంచ్ ఓపెన్‌లో, వొండ్రుసోవా వింబుల్డన్ టోర్నీలో, కోకో గాఫ్ యూఎస్ ఓపెన్‌లో టైటిల్స్ సాధించారు.

- మొత్తం టోర్నీ ప్రైజ్‌మనీ 90 లక్షల డాలర్లు (రూ. 75 కోట్లు). పార్టిసిపేషన్ ఫీజు రూపంలో ఎనిమిది మందికి 1,98,000 డాలర్ల (రూ. కోటీ 65 లక్షలు) చొప్పున లభిస్తాయి. లీగ్ దశలో ఒక్కో విజయానికి అదనంగా 1,98,000 డాలర్లు (రూ. కోటీ 65 లక్షలు) అందజేస్తారు. ఈ టోర్నీలో అజేయంగా విజేతగా నిలిచిన క్రీడాకారిణి 30,24,000 డాలర్లు (రూ. 25 కోట్ల 21 లక్షలు) ప్రైజ్‌మనీగా అందుకుంటుంది.



విన్నర్స్ ట్రోఫీతో వొండ్రుసోవా, పెగూలా, కోకో గాఫ్, సబలెంకా, స్వియాటెక్, రిబాకినా, ఆన్స్ జబర్, మరియా సాకరి (ఎడమ నుంచి)

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
635	190
63,783	19,047

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	12,643	▲	47
డోజోన్స్	32,418	▼	367
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,291	▼	63
డాక్స్	14,687	▼	44
షాంఘై	3,018	▲	29
నికాయ్	30,992	▲	443

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.46	102.77
€	యూరో	ఒకటి	86.51	89.56
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.63	56.32
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.75	54.04
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.91	61.84
SAR	సౌదీ రియాల్	కామన్‌కట్	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	కామన్‌కట్	21.77	23.56
¥	చైనా యువాన్	కామన్‌కట్	10.25	12.33

ఆపదలో చేయూత.. క్రౌడ్ ఫండింగ్


శాంతి, ఏకాంబరం దంపతులు (పేరు మార్చాం) తొలి కాన్పులో పుత్రుడు అని తెలియగానే పొంగిపోయారు. బాబును చూస్తూ భవిష్యత్తుపై ఎన్నో కలలుగన్నారు. చిన్నారి మూడేళ్ల వయసుకొచ్చేసరికి కదల్లేని స్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ చిన్నారుల ఆస్పత్రిలో చూపించారు. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ(ఎస్ఎంఏ)తో బాధపడుతున్నట్టు తేలింది. ఈ సమస్య నుంచి బయటపడాలంటే విదేశాల నుంచి 'జోల్‌జెన్స్‌మా' అనే ఇంజెక్షన్‌ను తీసుకొచ్చి ఇవ్వాలి. ఇందుకు సుమారు రూ.16 కోట్లు అవుతుందని వైద్యులు వెల్లడించారు. ఈ సమయంలో బాబు తల్లిదండ్రులకు 'ఇంపాక్ట్ గురూ' ప్లాట్‌ఫామ్ సంజీవనిగా కనిపించింది. చిన్నారి ఎదుర్కొంటున్న పరిస్థితిని వివరిస్తూ విరాళాలకు (ఫండ్ రైజింగ్) పిలుపునిచ్చారు. మూడున్నర నెలల్లో 65,000 మంది దాతల ఉదారంతో ఊహించనిది సాధ్యమైంది. విదేశాల నుంచి సదరు ఇంజెక్షన్‌ను తీసుకొచ్చి ఇవ్వడంతో బాబు కోలుకున్నాడు.

వేణు నెట్ బ్రౌజింగ్ చేస్తున్న సమయంలో ఓ బాలిక లివర్ సమస్యతో బాధపడుతుందన్న 'కెట్టో' ప్రకటన కనిపించింది. అది క్లిక్ చేయగా, ఆ సమస్య నుంచి బయటపడేందుకు రూ.30 లక్షలు అవుతుందని, దాతలు దయతలిస్తేనే తన కుమార్తె బయటపడుతుందంటూ చిన్నారి తల్లి ఆవేదనతో చెబుతున్న మాటలకు వేణు చలించిపోయాడు. కానీ, కాలేయ చికిత్సకు భారీ మొత్తాన్ని పేర్కొనడంపై అతడిలో అనుమానం కలిగింది. సదరు ప్రకటన నిజమేనా..? అంత ఖర్చు అవుతుందా..? ప్రభుత్వాలు ఎందుకు సాయం చేయవు? ఆస్పత్రులు అయినా బాధితుల విషయంలో కొంత లాభాపేక్ష తగ్గించుకుని చికిత్సలకు ముందుకు రావచ్చుగా..? ఇలాంటి ప్రశ్నలు మెదిలాయి. చివరికి తన సందేహాలన్నీ పక్కన పెట్టేసి రూ.500 అప్పటికప్పుడు డొనేట్ చేశాడు.

ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా, తమ వల్ల ఏమవుతుంది? అంటూ కుదేలు అయిపోవాల్సిన పని లేదని శాంతి దంపతుల కథనం ధైర్యాన్నిస్తోంది. ఆరోగ్య పరంగా ఎంత కష్టం వచ్చినా, దాతల నుంచి విరాళాలు తెచ్చి పెట్టేందుకు నేడు ఎన్నో వేదికలు పనిచేస్తున్నాయి. వేలాది మంది బాధితుల కుటుంబాల్లో సంతోషానికి దారి చూపిస్తున్నాయి. అదే సమయంలో ఇలాంటి బాధితులకు సాయం చేశామనే సంతృప్తి దాతలకు లభిస్తోంది. కాకపోతే విరాళం ఇచ్చే ముందు కాస్తంత విచారించి, కథనం నిజమైనదేనని నిర్ధారించుకోవడం ద్వారా తమ దానం నిష్ఫలం కాకుండా చూసుకోవచ్చు. మెడికల్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఎలా పనిచేస్తాయో తెలుసుకుంటే.. వీటి సాయం పొందడమే కాకుండా, వీటి ద్వారా నలుగురికీ తోచినంత సాయం చేయడానికి అవకాశం లభిస్తుంది.

విరాళాలు కోరేందుకు ఆన్‌లైన్ వేదికలు

- సాయం చేసేందుకు ఎన్నో మంచి మనసులు
- ఎన్నో కుటుంబాలకు దారి చూపుతున్న ప్లాట్‌ఫామ్‌లు
- ఆరోగ్యం కోసం ఆర్థికంగా గుల్ల కావద్దు
- రుణాల కోసం అవస్థలు పడొద్దు



మనోళ్లకు దాన గుణం ఎక్కువే..

2021 వరల్డ్ గివింగ్ ఇండెక్స్ ప్రకారం దానంలో భారత్ 14వ స్థానంలో ఉంది. అపరిచితులకు మన దేశంలో 61 శాతం మంది సాయం చేస్తున్నారు. కాకపోతే విశ్వసనీయత విషయంలో ఉండే సందేహాలు ఈ దాతృత్వాన్ని మరింత విస్తరించకుండా అడ్డుకుంటున్నాయని చెప్పుకోవచ్చు. బాధితులకు, దాతలకు మధ్య వేదికగా నిలిచే విశ్వసనీయ సంస్థలు వస్తున్న కొద్దీ, క్రౌడ్ ఫండింగ్ మరింత పరిడవిల్లుతూనే ఉంటుంది. మరింత మంది బాధితులకు చేయూత లభిస్తుంది.

ప్రచార మార్గం..

ఇంపాక్ట్ గురూ, కెట్టో, మిలాప్ ఇవన్నీ ప్రముఖ మెడికల్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు. ఆన్‌లైన్ ప్రకటనలు, సామాజిక మాధ్యమాల ద్వారా బాధితుల తరఫున విరాళాల సమీకరణకు ఇవి ప్రచారం కల్పిస్తుంటాయి ఇంటర్నెట్ బ్రౌజ్ చేసే సమయంలో వైద్య చికిత్సల కోసం సాయం కోరుతూ ఈ సంస్థలకు సంబంధించి ప్రకటనలు కనిపిస్తుంటాయి. వీటిని క్లిక్ చేసి చూశారంటే, తర్వాత కూడా అలాంటి ప్రకటనలే మళ్లీ మళ్లీ కనిపిస్తుంటాయి. ప్రకటనల్లో బాధితుల కథనానికి ఆధారంగా వైద్యులు జారీ చేసిన లెటర్, టెస్ట్ రిపోర్ట్‌లను ఉంచుతున్నాయి. సామాజిక మాధ్యమాలతోపాటు, బాధితులు సైతం తమకు తెలిసిన వారికి ఈ లింక్‌లు పంపి సాయం కోరవచ్చు. ఒక్కసారి కావాల్సిన నిధులు లభించగానే, ఈ ఫండ్ రైజింగ్ కార్యక్రమం ముగుస్తుంది. ఈ సంస్థలు విరాళం ఇచ్చిన వ్యక్తులను నెలవారీ స్కీమ్‌లతో ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రతి నెలా తోచినంత దానం ఇచ్చే విధంగా స్కీమ్‌లు తీసుకొచ్చాయి. విరాళాలకు సెక్షన్ 80జీ కింద పన్ను మినహాయింపు కల్పిస్తున్నాయి.

బాధితుల అనుభవాలు..

లాహిరి సోదరికి బ్రెయిన్ టీబీ నిర్ధారణ కావడంతో 2019 డిసెంబర్‌లో నిధుల సమీకరణ కోసం మిలాప్ సంస్థను సంప్రదించారు. మిలాప్ ఆమె అభ్యర్థనకు చక్కగా స్పందించింది. ఫొటోగ్రాఫ్‌లు, డాక్యుమెంట్లు అడిగారు. అవన్నీ ఇవ్వడంతో, వాటి ఆధారంగా ఒక ప్రచార ప్రకటనను మిలాప్ రూపొందించింది. తెలిసిన వారి సాయంతో దీనికి మంచి ప్రచారం కల్పించుకోవాలని మిలాప్ సూచించింది. తాము ఆ ప్రచారాన్ని చేపట్టబోమని, బాధితులే సొంతంగా నిర్వహించడం వల్ల మరింత విశ్వసనీయత ఉంటుందనే సూచన వచ్చింది. దీంతో లాహిరి తనకు తెలిసిన వారికి షేర్ చేశారు. అలా రూ.45,000 విరాళాలు వచ్చాయి. ఇందులో మిలాప్ తన కమీషన్‌గా రూ.5,000 మినహాయించుకుని, రూ.40,000ను లాహిరి చికిత్స పొందుతున్న ఆసుపత్రికి చెల్లించింది. కానీ, మిలాప్ ద్వారా చేసిన ప్రచారం లాహిరి బంధు మిత్రులకు తెలిసిపోవడంతో, వారి నుంచి ఆమెకు మరో రూ.12 లక్షలు విరాళాల రూపంలో నేరుగా వచ్చాయి. మిలాప్ రూపొందించిన ప్రచారమే లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదని లాహిరి అనుభవం చెబుతోంది. దురదృష్టవశాత్తూ లాహిరి సోదరి బ్రెయిన్ టీబీతో 2020 ఫిబ్రవరిలో మరణించారు.

విజయం ఎంత?


మీరా అనే వ్యక్తి సైతం, తన భర్త సర్జరీ కోసం కెట్టో ద్వారా నిధుల సమీకరణ చేయగా, మంచి ఆదరణే లభించింది. కెట్టో రిప్రజెంటేటివ్ ఎప్పటికప్పుడు ఆమెతో సంపద్రింపులు చేస్తూ సహకారం అందించడంతో, సర్జరీకి కావాల్సిన మొత్తం 48 గంటల్లోనే సమకూరింది. దేశ, విదేశాల్లోని స్నేహితులు, కుటుంబ సభ్యులు విరాళం ఇచ్చేందుకు సముఖంగా ఉన్నారని తెలిసినా, అందుకు వీలుగా కెట్టో ప్లాట్‌ఫామ్ సాయాన్ని ఆమె తీసుకున్నారు. ఎక్కడ ఉన్నా కెట్టో ద్వారా విరాళం పంపడం సులభమని భావించి అలా చేసినట్టు చెప్పారు. అయితే, అందరికీ ఇదే తరహా అనుభవం లభిస్తుందా..? ప్రతి ఫండ్ రైజింగ్ విజయవంతం అవుతుందా? అంటే నూరు శాతం అవును అని చెప్పలేం. ఇదంతా తమకున్న పరిచయాలు, ఎంపిక చేసుకున్న ప్లాట్‌ఫామ్, రూపొందించిన ప్రకటన, ప్లాట్‌ఫామ్ నుంచి ప్రచారం తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. ''కొన్నేళ్ల క్రితం మేము సాయం కోసం ఇంపాక్ట్ గురూ ప్లాట్‌ఫామ్‌ను సంప్రదించాం. ఇంపాక్ట్ గురూ దాతల నెట్‌వర్క్ సాయంతో నిధులు సమకూర్చుతారని అనుకున్నాం. కానీ, ఇంపాక్ట్ గురూ అలా చేయలేదు. ప్రచార కార్యక్రమం పేజీని రూపొందించి, ఆ లింక్‌ను తమ పరిచయస్తులతో పంచుకోవాలని సూచించింది''అని ఓ వ్యక్తి అనుభవం చెబుతోంది. తమ ప్లాట్‌ఫామ్‌పై వేలాది ప్రచార కార్యక్రమాలు నమోదవుతున్నందున.. ప్రతీ ఒక్క ప్రచారాన్ని తామే సొంతంగా చేపట్టడం సాధ్యం కాదని ఇంపాక్ట్ గురూ సహ వ్యవస్థాపకుడు, సీఈవో పీయూష్ జైన్ స్పష్టం చేశారు. దాతల కమ్యూనిటీ నుంచి మంచి స్పందన వస్తుందనుకుంటే, తాము తప్పకుండా ప్రమోట్ చేస్తుంటామని చెప్పారు.

నిధుల సమీకరణ ఇలా..?

- చికిత్సలకు దాతల సాయం అవసరమైన వారు క్రౌండ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లను (ఇంపాక్ట్‌గురూ, మిలాప్, కెట్టో మొదలైనవి) సంప్రదించాలి.
- పాన్, ఆధార్, మెడికల్ డాక్యుమెంట్లు సమర్పించాలి.
- వీటిని క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్ ధ్రువీకరించుకుంటుంది. తగిన విచారణ అనంతరం బాధితుల కథనం నిజమేనని నిర్ధారించుకున్న తర్వాత వారి తరఫున నిధుల సమీకరణ పేజీని అవి సిద్ధం చేస్తాయి.
- ఇక ఇక్కడి నుంచి నిధుల సమీకరణ మొదలవుతుంది. సాయం అవసరమైన వారు ఈ పేజీ లింక్‌ను తమ నెట్‌వర్క్‌లో షేర్ చేసుకోవాలి. తమ వంతు ప్రచారం కల్పించుకోవాలి. అలాగే, ప్లాట్‌ఫామ్‌లు సైతం ప్రచారానికి తమ వంతు సాయం అందిస్తాయి.
- సమీకరించే విరాళంలో ఎక్కువ మొత్తాన్ని కమీషన్ రూపంలో మినహాయించుకునేందుకు సమ్మతి తెలియజేస్తే, వారి తరఫున క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు సైతం విస్తృత ప్రచారాన్ని చేపడతాయి.
- బాధితులు ఎదుర్కొంటున్న సమస్య, వైద్యులు చెబుతున్న వెర్షన్, చికిత్సకు ఎంత ఖర్చవుతుంది? తదితర వివరాలన్నీ ఈ పేజీలో ఉంటాయి. దాతలు విరాళం చెల్లించేందుకు పేమెంట్ లింక్‌లు కూడా అక్కడ కనిపిస్తాయి.
- కనీసం 300–350 అంతకంటే ఎక్కువ విరాళాలనే అనుమతిస్తున్నాయి.
- దాతలు చేసే చెల్లింపులన్నీ కూడా ప్రత్యేక ఖాతాలో జమ అవుతాయి.
- కావాల్సిన మొత్తం వచ్చినా.. లేదంటే గడువు ముగిసినా లేదంటే అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి అకాలంగా మరణించినా నిధుల సమీకరణ ముగిసిపోతుంది.
- అనంతరం ఈ మొత్తం నుంచి కమీషన్ మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని హాస్పిటల్/బాధితులకు క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు చెల్లిస్తాయి. ఇలా చేసే ముందు హాస్పిటల్ బిల్లులను చెక్ చేస్తాయి.
- విరాళం ఇచ్చిన వారికి ఎప్పటికప్పుడు మెయిల్ ద్వారా బాధితుల తాజా ఆరోగ్య పరిస్థితిపై వివరాలను ఇవి అప్‌డేట్ చేస్తుంటాయి.

విశ్వసించడం ఎలా..?

సాయం అవసరమైన వారికి క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు మార్గాన్ని చూపిస్తున్నాయి. మరి విరాళం ఇచ్చే వారు ఈ కథనాలను విశ్వసించేది ఎలా..? ఈ సందేహం చాలా మందికి వస్తుంది. మన దేశంలో విరాళాలకు సంబంధించి భౌతిక వేదికలే ఎక్కువ. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల సేవలు ఇటీవలి కాలంలోనే వెలుగులోకి వచ్చాయి. ఇంటర్నెట్ విస్తరణ ఇందుకు వీలు కల్పించిందని చెప్పుకోవాలి. ఆన్‌లైన్ ప్రపంచంలో అన్నింటినీ నమ్మలేం. సైబర్ మోసాలు గణనీయంగా పెరిగిపోయిన నేపథ్యంలో, అన్నీ విచారించుకున్న తర్వాతే విరాళం ఇవ్వడం సురక్షితంగా ఉంటుంది. కోటక్ ఆల్టర్నేటివ్ అస్సెట్ మేనేజర్స్ సీఈవో (ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ) లక్ష్మీ అయ్యర్ దీనిపై తన అనుభవాన్ని పంచుకున్నారు. ''నాకు రిఫరల్ ద్వారా వచ్చే వాటికే నేను దానం చేస్తాను. ఈ విషయంలో నా మార్గం చాలా స్పష్టం. సులభంగా డబ్బులు సంపాదించే మోసగాళ్లకు కొదవ లేదు''అన్నది లక్ష్మీ అయ్యర్ అభిప్రాయంగా ఉంది. సన్సేరా ఇంజనీరింగ్ జాయింట్ ఎండీ ఎఫ్ఆర్ సింఘ్వి ఈ విషయంలో సందేహాలు వ్యక్తం చేశారు. ''చాలా వరకు విరాళాలు కోరుతున్న ఆన్‌లైన్ కేసులు వైద్య పరమైనవే ఉంటున్నాయి. కొన్ని సందర్భాల్లో అవి పేర్కొనే చికిత్సల వ్యయాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. నాకు ఒక ఆస్పత్రితో అనుబంధం ఉంది. కనుక చికిత్సల వ్యయాల గురించి తెలుసుకోగలను''అని పేర్కొన్నారు. ఇలాంటిదే ఒక విరాళం కేసులో చికిత్సకు రూ.18–24 లక్షలు ఖర్చువుతుందన్న కొటేషన్ కనిపించగా, దీనిపై విచారించగా, తెలిసిన హాస్పిటల్‌లో రూ.5–6 లక్షలకే చేస్తున్నట్టు విని ఆశ్చర్యపోయినట్టు సింఘ్వి తెలిపారు. నిజానికి కొన్ని కేసుల్లో భారీ అంచనాలు పేర్కొంటున్న ఉదంతాలు లేకపోలేదు. హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుల తరఫున నిధుల సమీకరణ కార్యక్రమాలు నడిపించే కొందరు మోసగాళ్ల ఉదంతాలు సైతం లోగడ వెలుగు చూశాయి. అలా అని కష్టాల్లో ఉన్న బాధితులకు విరాళాలు ఆగకూడదు కదా..?



ముందస్తు పరిశీలన

క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు చికిత్సల వ్యయాలను ముందుగానే నిర్ధారించుకుంటామని చెబుతున్నాయి. హాస్పిటల్ వ్యయ అంచనాలను, చారిత్రక గణాంకాలు, బీమా థర్డ్ పార్టీ అగ్రిగేటర్ సంస్థల డేటా ఆధారంగా పోల్చి చూస్తామని ఇంపాక్ట్‌గురూ సీఈవో జైన్ తెలిపారు. తమ ప్యానెల్ డాక్టర్లతోనూ దీనిపై నిర్ధారించుకుంటామని చెప్పారు. నిధుల సమీకరణ నిజమైన కారణాలతో చేసినప్పటికీ, తర్వాత ఆ నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు కూడా ఇవి చర్యలు తీసుకుంటున్నాయి. ''ఇంపాక్ట్ గురూ వేదికగా సమీకరించే నిధుల్లో 80 శాతానికి పైగా నేరుగా హాస్పిటల్స్‌కు బదిలీ చేస్తున్నాం. ఈ హాస్పిటల్స్ కూడా హెల్త్ ఇన్సూరెన్స్ జాబితాలోనివే''అని జైన్ తెలిపారు. తమ ప్లాట్‌ఫామ్‌పై లిస్ట్ చేసే వైద్య పరమైన కేసుల్లో విరాళాలను హాస్పిటల్ బ్యాంక్ ఖాతా ద్వారానే తీసుకోగలరని కెట్టో అంటోంది.

- బాధితుల కేవైసీ పత్రాలను ముందుగా ఇవి నిర్ధారించుకుంటాయి.
- వైద్య పరమైన అన్ని డాక్యుమెంట్లు తీసుకుని వాటిని తనిఖీ చేస్తాయి.
- తమ ప్యానెల్ వైద్యులతో మాట్లాడి నిర్ధారణకు వస్తాయి.
- అవసరమైతే క్షేత్రస్థాయిలో హాస్పిటల్‌కు తమ ఉద్యోగిని పంపించి వాస్తవమా, కాదా అన్నది నిర్ధారించుకుంటాయి.

కొంచెం కమీషన్..

క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్ లు మొత్తం విరాళం నుంచి నిర్ణీత మొత్తాన్ని కమీషన్/చార్జీ కింద మినహాయించుకుంటున్నాయి. ఇది ఒక్కో సంస్థలో ఒక్కో విధంగా ఉంటుంది. ''అంతర్జాతీయంగా చూస్తే ప్రతీ మెడికల్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్ ఎంతో కొంత స్వల్ప ఫీజును వసూలు చేస్తున్నాయి. తమ కార్యకలాపాలు నిర్విరామంగా కొనసాగేందుకే ఇలా చేస్తున్నాయి. టెక్నాలజీ సదుపాయాలు, సిబ్బంది, నిధుల సమీకరణ, ముందస్తు విచారణలకు సంబంధించి వ్యయాలు అవుతాయి. మేము నిలదొక్కుకున్నప్పుడే మా లక్ష్యాన్ని (ఫండ్ రైజింగ్) సాధించగలం'' అని పీయూష్ జైన్ తెలిపారు. ఈ ప్లాట్‌ఫామ్‌లలో కొన్ని ప్రీమియం సేవలను కూడా ఆఫర్ చేస్తున్నాయి. ఇంపాక్ట్ గురూ అయితే 0 శాతం, 5 శాతం, 8 శాతం ఇలా మూడ్ స్కీమ్‌ల కింద ఈ సేవలను ఆఫర్ చేస్తోంది.


మోసాలుంటాయ్.. జాగ్రత్త

అవగాహన, జాగ్రత్తలు లేకపోతే ఆన్‌లైన్ మోసాల బారిన పడే రిస్క్ ఉంటుంది. క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విరాళాలు కోరినా లేక విరాళం ఇచ్చినా సరే.. ఆ తర్వాత ఫోన్ కాల్ లేదా వాట్సాప్ మెస్సేజ్ లేదా మెయిల్ రావచ్చు. కష్టంలో ఉన్న బాధితులకు సంబంధించి అందులో సాయం కోరొచ్చు. లేదంటే అప్పటికే విరాళం ఇచ్చిన కేసుకు సంబంధించి అప్‌డేట్ అంటూ మోసగాళ్లు మెయిల్ పంపించొచ్చు. ఒక్కసారి విరాళం ఇస్తే, ఆ తర్వాత నుంచి క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఇతర బాధితులకు సంబంధించిన వివరాలను మెయిల్స్, వాట్సాప్ మెస్సేజ్‌లు, కాల్స్ రూపంలో మార్కెటింగ్ చేస్తుంటాయి. ఇదంతా ఇబ్బందికరంగా అనిపించొచ్చు. చాలా మంది సాయం చేయాలని భావిస్తుంటారని, బాధితుల వివరాలను వారు మెయిల్ లేదా వాట్సాప్ సందేశాలు, కాల్స్ రూపంలో తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారని జైన్ తెలిపారు. ఇవి వద్దనుకునే వారు అన్‌సబ్‌స్క్రయిబ్ చేసుకోవాలని సూచించారు. క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు అన్నీ కూడా సురక్షిత చెల్లింపుల సాధనాలనే వినియోగిస్తున్నాయి. కానీ, వీటి పేరుతో సైబర్ నేరస్థులు ఆకర్షించే కథనాలు, మోసపూరిత పేమెంట్ లింక్‌లు పంపించి, బ్యాంక్ ఖాతాలో బ్యాలన్స్ మొత్తాన్ని ఊడ్చేసే ప్రమాదం లేకపోలేదు. అందుకే విరాళం ఇచ్చే ముందు సంబంధిత సంస్థల యూఆర్ఎల్‌ను జాగ్రత్తగా గమనించుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

స్టాక్స్ వ్యూ

యథార్థ్ హాస్పిటల్స్
చాయిస్ బ్రోకింగ్ — **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ. 364 టార్గెట్: రూ. 523



ఎందుకంటే: సూపర్ స్పెషాలిటీ విభాగాలుగల యథార్థ్ హాస్పిటల్స్ అండ్ ట్రామా కేర్ 2008లో ఏర్పాటైంది. 1,405 పడకల సామర్థ్యంతో నోయిడా, నోయిడా ఎక్స్‌టెన్షన్, గ్రేటర్ నోయిడా ప్రాంతాలతోపాటు ఝాన్సీలో 4 ఆసుపత్రులను నిర్వహిస్తోంది. ఢిల్లీ- జాతీయ రాజధాని ప్రాంతంలోని అతిపెద్ద ప్రయివేట్ రంగ ఆసుపత్రులలో నోయిడా ఎక్స్‌టెన్షన్ ఆసుపత్రి 8వ, గ్రేటర్ నోయిడాలోని ఆసుపత్రి 10వ ర్యాంకులో నిలిచాయి. 2022 ఏప్రిల్ 10న ప్రారంభమైన మల్టీ స్పెషాలిటీ సేవల ఆర్కా ఆసుపత్రిని కొనుగోలు చేసింది. 305 పడకల సామర్థ్యంగల ఈ ఆసుపత్రి ఝాన్సీ- ఆర్కా- గ్వాలియర్ ప్రాంతంలోని అతిపెద్ద ఆసుపత్రుల్లో ఒకటిగా నిలుస్తోంది. కాగా.. యథార్థ్ హాస్పిటల్స్.. సెంటర్ ఆఫ్ మెడిసిన్, కార్డియాలజీ, న్యూరోసైన్సెస్, జనరల్ సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పిడియాట్రిక్స్, గ్యాస్ట్రోఎంటరాలజీ, పుల్మనాలజీ, ఆర్థోపెడిక్స్ అండ్ స్పైన్, రుమటాలజీ తదితర పలు కేంద్రాలతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా సేవలందిస్తోంది. వెరసి ఢిల్లీ- జాతీయ రాజధాని ప్రాంతంలో అత్యున్నత సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లలో ఒకటిగా పేరొందింది. ప్రస్తుత మార్జిన్లను మించుతూ అధిక లాభదాయకత సాధించగల కొత్త స్పెషాలిటీ విభాగాలలోకి ప్రవేశించింది. ఇతర సంస్థల కొనుగోళ్ల ద్వారా పలు ప్రాంతాలలో కార్యకలాపాలు విస్తరిస్తోంది. తద్వారా వేగవంత వృద్ధివైపు అడుగులేస్తోంది. విభిన్న చికిత్సలు అందిస్తూ అంతర్జాతీయస్థాయిలో వ్యాధిగ్రస్తులను ఆకట్టుకుంటోంది.

గల్ఫ్ ఆయిల్
ఎమ్‌కే గ్లోబల్ — **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ. 609 టార్గెట్: రూ. 730



ఎందుకంటే: వార్షికంగా 5 కోట్ల లీటర్ల లూబ్రికెంట్స్, 1.8 కోట్ల లీటర్ల యాడ్‌బ్లూ అమ్మకాలను హ్యాండిల్ చేయగల గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా లిమిటెడ్ చెన్నై ప్లాంటును ఇటీవల సందర్శించాం. నిజానికివి రెట్టింపు షిఫ్టుల ఆధారంగా కంపెనీకి కీలకమైన ల్యూబ్స్ సామర్థ్యంలో 35 శాతానికి సమానం. ఫ్రాన్స్ దిగ్గజం ఏబీబీ నుంచి ఆటోమాటిక్ బ్యాచ్ బ్లెండింగ్ సాంకేతికతను సొంతం చేసుకుంది. తద్వారా లూబ్రికెంట్స్ తయారీ కార్యకలాపాల సామర్థ్యాలను మరింత మెరుగుపరచుకుంది. అవసరార్థం చెన్నై ప్లాంటు సామర్థ్యాన్ని మూడు షిఫ్టుల్లో 100 శాతానికి మించి వినియోగించుకునే వీలుంది. అంతేకాకుండా ప్లాంటువద్దగల భూమిని వినియోగించుకోవడం ద్వారా సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకునేందుకూ అవకాశముంది. కొత్త బ్లెండ్‌లతోపాటు ప్రత్యామ్నాయ ఫార్ములేషన్లు.. తదితరాలను రూపొందించగల ఆర్అండ్‌డీ కేంద్రాన్ని సైతం చెన్నై ప్లాంటు కలిగి ఉంది. యూఎస్, ఈయూ ఓఈఎంల ద్వారా కఠినమైన విజయవంత ఆడిట్లకు అవకాశమిస్తోంది. కంపెనీ యాజమాన్యం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో లూబ్రికెంట్స్ 7–8 శాతం, యాడ్‌బ్లూ 15–20 శాతం స్థాయిలో అమ్మకాలు సాధించగలవని విశ్వసిస్తోంది. 12–14 శాతం స్థాయిలో నిర్వహణ(ఇబిటా) మార్జిన్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు మద్దతుగా లాంగ్ డ్రెయిన్ ప్రొడక్టులు, ఉత్పత్తులకు వ్యూహాత్మక ధరల నిర్ణయం, బ్రాండింగ్ తదితరాలను చేపట్టనుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

వృద్ధులకు స్థిరమైన ఆదాయ మార్గాలు?

నేను ఒకేసారి రూ.12 లక్షలను మూడు, నాలుగేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. మెరుగైన రాబడుల కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి? డెట్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టి.. అక్కడి నుంచి సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ ఎంచుకోవడం ద్వారా మంచి రాబడులు అందుకోవచ్చా?

– మయూర్

సంపద సృష్టి మూడు నాలుగేళ్లలో సాధ్యపడుతుందా? ఇది ఆందోళన కలిగించే అంశం. మూడు నుంచి నాలుగేళ్లలో సంపద సృష్టి సాధ్యపడదు. ఈక్విటీలు గణనీయమైన రాబడులను అందిస్తాయి. కానీ వాటికి కూడా 10–15 ఏళ్ల కాల వ్యవధి కావాలి. అంత కాలవ్యవధి మీకు లేకపోతే అప్పుడు సంప్రదాయ ఇన్వెస్టర్‌గానే ఆలోచించాలి. మూడు నుంచి నాలుగేళ్లలోనే పెట్టుబడిపై చెప్పుకోతగ్గంత రాబడి కావాలని కోరుకునేట్టు అయితే.. ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ లేదా కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్ ఎక్కువ మొత్తాన్ని డెట్ సాధానాల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. మూడు నుంచి నాలుగేళ్ల వ్యవధి కోసం అంటున్నారు కనుక 12–18 నెలల కాలం పాటు సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ ఎంపిక చేసుకుంటే మొత్తం పెట్టుబడుల్లో సగం కాల వ్యవధి అవుతుంది. దీనికి బదులు మూడు నుంచి నాలుగు నెలల్లోగా సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ద్వారా ఈక్విటీలకు కేటాయించుకోవడం సరైన నిర్ణయం అవుతుంది.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

Q & A

నా వయసు 62 ఏళ్లు. స్థిరమైన ఆదాయం కోసం ఉన్న మార్గాలు ఏవి?

– నారాయణ

విశ్రాంత జీవనాన్ని ప్రశాంతంగా గడపాలంటే అందుకు తగినంత నిధిని ఉండాలి. అప్పుడే ఆ మొత్తం నుంచి క్రమం తప్పకుండా ఆదాయం పొందడం ద్వారా సౌకర్యవంతమైన జీవితాన్ని గడపొచ్చు. సీనియర్ సిటిజన్లు సహజంగా సంప్రదాయ మార్గాలనే ఎంపిక చేసుకుంటూ ఉంటారు. అత్యవసర సమయాల్లో పెట్టుబడులను వెంటనే వెనక్కి తీసుకునే విధంగా లిక్విడిటీ ఉండాలని కోరుకుంటారు. సీనియర్ సిటిజన్లు ఇన్వెస్ట్ చేయడానికి ముందు ప్రతీ నెలా ఎంత మొత్తం కావాలో నిర్ణయించుకోవాలి. ఇతర మార్గాల ద్వారా ఏదైనా ఆదాయం వస్తుంటే దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అంటే అద్దె రూపంలో ఆదాయం, పెన్షన్ లేదా మరొకటి కావచ్చు. ఏటా ఎంత మొత్తం పెట్టుబడి నుంచి కావాలో స్పష్టతకు రావాలి. ఒకవేళ ఏటా 4–6 శాతానికంటే ఎక్కువ కోరుకుంటుంటే అంచనాలను తగ్గించుకోవాల్సిందే. ఉదాహరణకు మీ పెట్టుబడి నిధి రూ.కోటి ఉందనుకుంటే వార్షికంగా ఉపసంహరించుకునే మొత్తం రూ.6 లక్షలకు మించి ఉండకూడదు. ఒకవేళ 6 శాతానికి మించి వెనక్కి తీసుకుంటే కనుక ఆ తర్వాతి సంవత్సరాల్లో తక్కువ ఆదాయానికి సిద్ధం కావాల్సిందే. ద్రవ్యోల్బణాన్ని విస్మరించడానికి లేదు. నేడు నెలవారీ ఖర్చులకు రూ.50,000 సరిపోతుంటే.. 5, 10, 15 ఏళ్ల తర్వాత ఈ మొత్తం చాలదు. ఆ సమయంలో ఇంకా అధికంగా కావాల్సి ఉంటుంది. అందుకనే రిటైర్మెంట్ తీసుకున్న వారు ద్రవ్యోల్బణాన్ని తట్టుకుని రాబడులను ఇచ్చే మార్గాలను చూసుకోవాలి. అందుకని రిటైర్మెంట్ తర్వాత కూడా ఈక్విటీల్లో పెట్టుబడులు కొనసాగించాలి. అప్పుడే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం మించి రాబడులకు అవకాశం ఉంటుంది. పెట్టుబడుల మొత్తాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయకూడదు. 30–40% చాలు. మిగతా మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లోనే ఉంచాలి. ప్రభుత్వ హామీతో కూడిన పథకాలను పరిశీలించాలి. ఎస్‌సీఎస్ఎస్, పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. కొంత మొత్తాన్ని అధిక నాణ్యతతో కూడిన డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీల వాటా 30–40% మేర ఉండేలా ఏడాదికోసారి అస్సెట్ (పెట్టుబడులు)రీబ్యాలన్స్ చేసుకోవాలి.

క్లుప్తంగా...

ఆక్స్‌ఫర్డ్‌కు ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: ఆక్స్‌ఫర్డ్ యూని వర్సిటీ ఆహ్వానం మేరకు.. సీఎం కేసీఆర్ నా యకత్వంలో తెలంగాణ స్థితిగతులు మార్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కీలకోపన్యాసం చేయడానికి ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత యూకేకు బయల్దేరి వెళ్లారు. 'ఎక్స్‌ప్లోరింగ్ ఇన్ క్లూసివ్ డెవలప్‌మెంట్: ద తెలంగాణ మోడల్' అనే అంశంపై ఈ నెల 30న కీలకోపన్యాసం చేయాలని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ కవితను ఆహ్వానించడం తెలిసిందే. యూకే పర్యటనకు వెళ్తున్న కవితకు ఆదివారం బీఆర్ఎస్ నాయకులు, కా ర్యకర్తలు హైదరాబాద్ విమానాశ్రయంలో ఘన వీడ్కోలు పలికారు. సీఎం కేసీఆర్ దూర దృష్టి, బహుళార్థ ప్రయోజనాల పథకాల రూప కల్పనపై అంతర్జాతీయ వేదికపై కవిత వివరించనున్నారు.

హైదరాబాద్-సింగపూర్‌కు మరిన్ని విమాన సర్వీసులు

శంషాబాద్: హైదరాబాద్ నుంచి సింగపూర్‌కు మరిన్ని విమాన సర్వీసులు పెరిగాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాలకు ప్రధాన అనుసంధానంగా ఉండే సింగపూర్‌కు ఉన్న డిమాండ్ మేరకు సర్వీసులను పెంచారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 11.20 గంటలకు ఎస్క్యూ 519 విమానం ఇక్కడి నుంచి టేకాఫ్ తీసుకుని సింగపూర్‌కు బయల్దేరింది. వారంలో ఐదురోజుల పాటు ఈ సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంస్థతో పాటు జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయ ప్రతినిధులు సింగపూర్ ఎయిర్‌లైన్స్ 20 వార్షికోత్సవాల్లో కూడా పాల్గొన్నారు.

బీఈడీ ప్రవేశాల చివరి జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల పరిధిలోని కళాశాలల్లో బీఈడీ కోర్సులో సీట్లు సాధించిన అభ్యర్థుల రెండో, చివరి జాబితాను విడుదల చేసినట్లు టీఎస్- సెట్ కన్వీనర్ ప్రొ.రమేశ్‌బాబు ఆదివారం తెలిపారు. బీఈడీ కన్వీనర్ కోటాలోని మొత్తం 14,267 సీట్లకు మొదటి విడత కౌన్సెలింగ్‌లో 4,674 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన 9,593 సీట్లకు రెండవ, చివరి విడత కౌన్సెలింగ్‌కు 8,338 మంది వెబ్ ఆప్షన్స్ ఇవ్వగా 6,223 సీట్లను కేటాయించినట్లు వివరించారు. సీటు సాధించిన అభ్యర్థులు సోమవారం నుంచి వచ్చే నెల 4 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

మనకు రెండు వందే సాధారణ్ రైళ్లు

హైదరాబాద్-ఢిల్లీకి పచ్చజెండా

- పరిశీలనలో హైదరాబాద్-నాగర్‌కోయల్ కూడా..
- త్వరలో అందుబాటులోకి
- చెన్నై ఐసీఎఫ్ నుంచి తొలి రైలు ముంబైకి చేరిక
- దీపావళి కానుకగా 'పేదల వందేభారత్' ప్రారంభం



ముంబైకి చేరుకున్న తొలి రైలు

సాక్షి, హైదరాబాద్: వందేభారత్ రైళ్ల తర్వాత అదే తరహాలో సిద్ధమవుతున్న వందే సాధారణ్ రైళ్లు వచ్చే నెలలో పట్టాలెక్కబోతున్నాయి. వందేభారత్ రైళ్లు పూర్తి ఏసీ కోచ్‌లతో ఉండగా, ఇవి నాన్ ఏసీ కోచ్‌లతో నడిచే సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లు. వందేభారత్ రైళ్లలో టికెట్ ఛార్జీలు ఎక్కువగా ఉండటంతో పేద ప్రజలు వాటిలో ప్రయాణించడానికి ఇష్టపడటం లేదు. ఈ వెలితిని దూరం చేయాలన్న ఉద్దేశంతో దాదాపు అదే రూపంతో, ఇంచుమించు అంతే వేగంతో నడిచేలా కేంద్ర ప్రభుత్వం వందే సాధారణ్ పేరుతో ఈ రైళ్లను అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో సిద్ధమైన తొలి రైలును పశ్చిమ రైల్వేకు కేటాయించారు. అది రెండు రోజుల క్రితం ముంబైకి చేరుకుంది. దాన్ని ఢిల్లీ-ముంబై మధ్య నడిపే యోచనలో అధికారులున్నారు. ఇప్పటికే వందే సాధారణ్ రైళ్ల కోసం ఐదు మార్గాలకు రైల్వే బోర్డు అనుమతించింది. ఇందులో హైదరాబాద్-న్యూఢిల్లీ కూడా ఉండటం విశేషం. మరో 13 మార్గాలలో నడిపేందుకు అధికారులు ప్రతిపాదించారు. వాటికి అనుమతి రావాల్సి ఉంది. ఆ జాబితాలో హైదరాబాద్-నాగర్‌కోయల్ సర్వీసు కూడా ఉండటం విశేషం. వెరసి తెలంగాణకు రెండు వందేసాధారణ్ రైళ్లు అందుబాటులోకి రాబోతున్నాయి.

పుష్‌పుల్ పద్ధతిలో..

తొలి రెండు విడతలలో పట్టాలెక్కిన వందేభారత్ రైళ్లు తెలుపు రంగుపై నీలి చారలతో ఆకట్టుకున్నాయి. మూడో విడతకొచ్చేసరికి కాషాయం-నలుపులతో కూడిన మరింత ఆకర్షణీయ కలర్ కాంబినేషన్ ప్రత్యక్షమైంది. ఇప్పుడు వందే సాధారణ్ రైళ్లు కూడా కాషాయ-నలుపు కాంబినేషన్‌తో వస్తున్నాయి. వందేభారత్ తరహాలోనే ఇవి కూడా పుష్‌పుల్ ఇంజన్లతో నడుస్తాయి. అయితే, వందేభారత్‌లో ఇంజిన్లు విడిగా ఉండవు. రైలులోనే అంతర్భాగంగా ఉంటాయి. వందే సాధారణ్‌లో మాత్రం డబ్ల్యూపీ-5 లోకోమోటివ్‌లను ముందు ఒకటి వెనక ఒకటి అమరుస్తారు.

130 కి.మీ. గరిష్ట వేగం..

డబ్ల్యూపీ-5 లోకోమోటివ్‌లు గంటకు 200 కి.మీ. వేగంతో ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. కానీ, వందే సాధారణ్ రేక్ వేగాన్ని తట్టుకునే 130 కి.మీ.వేగాన్ని మాత్రమే తట్టుకుంటాయి. ఇక ట్రాక్ సామర్థ్యం కూడా చాలా ప్రాంతాల్లో అంతే ఉంది. దీంతో ఈ రైలు గరిష్ట వేగం గంటకు 130 కి.మీ.

అనుమతి పొందిన మార్గాలు ఇవీ..

ఢిల్లీ- ముంబై
ఢిల్లీ - పట్నా
ఢిల్లీ - హౌరా
ఢిల్లీ - హైదరాబాద్
గువాహటి - ఎర్నాకులం

పరిశీలన జాబితాలో ఉన్న రూట్లలో కొన్ని

హైదరాబాద్ - నాగర్‌కోయల్
దర్భంగా- లూథియానా
ముంబై-చాప్రా
ముంబై-రాక్సౌల్
ముంబై-జమ్మూతావి
దర్భంగా-అహ్మదాబాద్
కోల్‌కతా-పోర్‌బందర్
వారణాసి-దర్భంగా
సార్సా-అమృత్‌సర్
మెంగళూరు-కోల్‌కతా
గువాహటి-జమ్మూతావి

- 2004లో రైల్వే జన్‌సాధారణ్ పేరుతో రైళ్లను ప్రారంభించారు. సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్ల కంటే వేగంగా వెళ్లే ఈ రైళ్లు పూర్తిగా అన్ రిజర్వ్‌డ్ కోచ్‌లతో ఉంటాయి. కానీ, అవి సరిగా నడవలేదు. ఇప్పుడు వాటిని రీప్లేస్ చేస్తున్నట్టుగా వందే సాధారణ్ పేరుతో రైళ్లను ప్రారంభిస్తుండటం విశేషం.
- ఈ రైలులో రెండు ఇంజన్‌లతోపాటు 12 స్లీపర్ క్లాస్ కోచ్‌లు, 8 జనరల్ కంపార్ట్‌మెంట్ కోచ్‌లుంటాయి.
- ప్రతి కోచ్‌లో సీసీటీవీ కెమెరాలు, ప్రతి సీట్ వద్ద ఫోన్ ఛార్జింగ్ పాయింట్లు, మడత స్నాక్ టేబుల్స్, లగేజీ ర్యాక్, అగ్ని నియంత్రణ వ్యవస్థ ఉంటాయి.
- సెమీ పర్మనెంట్ కప్లర్స్ వ్యవస్థ వల్ల కుదుపులు తక్కువ.
- ఈ రైళ్లు 8.36 నిమిషాల్లో 110 కి.మీ. వేగాన్ని అందుకుంటాయి. 130 కి.మీ. వేగాన్ని 9.2 నిమిషాల్లో అందుకుంటాయి.

నేడు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీసీపీటీ వాహనాల విడుదల

- టెక్నికల్ ఫైర్ కంట్రోల్ విధుల్లో అత్యంత కీలకం
- ఇప్పటికే విజయవంతంగా పరీక్షించిన డిఫెన్స్ అధికారులు



సాక్షి, హైదరాబాద్: భారత రక్షణశాఖ అమ్ములపొదిలో మరో కీలక అస్త్రం చేరనుంది. మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తయారు చేసిన సీసీపీటీ(క్యారియర్ కమాండ్ పోస్ట్ ట్రాక్) వాహనాలను సోమవారం సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో విడుదల చేయనున్నారు. మేకిన్ ఇండియాలో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో అనేక రక్షణ ఉత్పత్తులను ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉత్పత్తి చేస్తోంది. ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్ఎల్) ఐదు ఉత్పత్తి యూనిట్లలో మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఒకటి. ఏవీఎన్ఎల్ ప్రధానంగా ఆర్మ్‌డ్ ఫైటింగ్ వెహికల్స్(మెయిన్ బ్యాటిల్ ట్యాంకులు), మైన్ ప్రొటెక్టెడ్ వెహికల్స్‌ని భారత సైన్యంలోని వివిధ విభాగాల కోసం తయారు చేస్తుంది. ఇప్పటికే టీ-90 ట్యాంక్, టీ-72 ట్యాంక్, బీఎంపీ-2(శరత్ ట్యాంక్), ఎంబీటీ అర్జున్ ఉండగా, యుద్ధక్షేత్రంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా తాజాగా ఈ క్యారియర్ కమాండ్ పోస్ట్ ట్రాక్(సీసీపీటీ) వాహనాన్ని రూపొందించారు.

సీసీపీటీ ప్రత్యేకతలు ఇవీ..

సీసీపీటీని డీఆర్‌డీవోలోని కంబాట్ వెహికల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీవీఆర్‌డీఈ) రూపొందించింది. అన్ని వ్యూహాత్మక, సాంకేతిక అగ్ని నియంత్రణ విధుల కోసం దీనిని ప్రత్యేకంగా రూపొందించారు. ఆర్టిలరీ గన్‌ల అన్ని వెర్షన్ల ఫైర్ కంట్రోల్ ఫంక్షన్లను సాధించడం కోసం తయారు చేశారు. సీసీపీటీ అనేది అన్ని భారతీయ ఆర్టిలరీ గన్ కమాండ్ పోస్ట్ ఫంక్షన్లకు ఒక సాధారణ వేదికగా పనిచేస్తుంది. తొలుత 2018లో 43 వాహనాల సరఫరా కోసం మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ఇండెంట్ ఇచ్చారు. వివిధ దశల్లో రూపొందించిన అనంతరం 2021లో మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ రెండు సీసీపీటీ వాహనాలు ఉత్పత్తి చేసి, ట్రయల్స్ కోసం భారత సైన్యానికి అప్పగించింది. వివిధ భూభాగాలు, వాతావరణ పరిస్థితులలో ప్రభావవంతంగా పని చేయగలదని ట్రయల్స్‌లో సీసీపీటీ వాహనాలు నిరూపించాయి. దీంతో వాటిని పూర్తిస్థాయిలో సైన్యంలో ప్రవేశపెట్టేవిధంగా సోమవారం వాటిని విడుదల చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు యూడైస్ టెన్షన్

పేరు లేకుంటే ఫీజు కట్టించుకోవద్దనే యోచన

- విద్యాశాఖ నిర్ణయంతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- పాత రికార్డులు దొరక్కపోతే ఏం చేయాలంటున్న ఉపాధ్యాయ వర్గాలు
- లక్ష మంది విద్యార్థులపై ప్రభావం!



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది పదవ తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు కొత్త చిక్కు వచ్చిపడేలా ఉంది. యూడైస్‌లో పేరు లేకుంటే పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఇవ్వకూడదని విద్యాశాఖ భావిస్తోంది. దీనివల్ల దాదాపు లక్ష మంది విద్యార్థులు పరీక్ష ఫీజు కట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిణామం విద్యార్థుల తల్లిదండ్రులను కలవర పెడుతుండగా.. ఇప్పటికిప్పుడు ఈ నిబంధన తేవడం సరికాదని ఉపాధ్యాయులూ అంటున్నారు. యూడైస్ అప్‌డేట్‌లో క్షేత్రస్థాయి సమస్యలు గుర్తించాలని సూచిస్తున్నారు. పాఠశాల విద్యా డైరెక్టరేట్ మాత్రం ఇవేవీ పట్టించుకునేందుకు సిద్ధంగా లేకపోవడం సమస్యకు దారి తీస్తోంది. ఈ నెల 28వ తేదీ నాటికి యూడైస్‌లో విద్యార్థులందరి పేర్లు చేర్చాలని విద్యాశాఖ ఆదేశించింది. అయితే గడువు ముగిసే నాటికి దాదాపు 45 శాతం మంది విద్యార్థుల పేర్లు ఎక్కించే అవకాశం లేకుండా పోయింది. ఈ ఏడాది టెన్త్ పరీక్షలు 5 లక్షల మంది రాసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

పాత రికార్డు లేకుంటే అంతే...

ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్)లో ప్రతి విద్యార్థి సమగ్ర వివరాలు చేర్చాలని విద్యాశాఖ నిర్ణయించింది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థి ఎక్కడ చదివింది, వారి టీసీల వివరాలు ఇందులో పొందుపర్చాల్సి ఉంటుంది. విద్యార్థులకు ప్రభుత్వ పరంగా లభించే ప్రతి ప్రయోజనానికి (సంక్షేమ పథకం) యూడైస్‌నే ప్రామాణికంగా తీసుకోవాలన్నది విద్యాశాఖ ఆలోచన. అయితే విద్యాహక్కు చట్టం ప్రకారం 8వ తరగతి వరకూ విద్యార్థికి అంతకుముందు ఎక్కడ చదివిందీ తెలిపే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ)తో పనిలేదు. ఈ మేరకే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను టీసీలు లేకున్నా 8వ తరగతిలో చేర్చుకున్నాయి. స్కూల్ ఫీజు చెల్లించని విద్యార్థులకు కొన్ని ప్రైవేటు స్కూళ్లు టీసీలు ఇవ్వకుండా ఆపాయి. ఈ కారణంగా రాష్ట్రంలో చాలామంది విద్యార్థులు టీసీల్లేకుండానే ఇతర స్కూళ్లలో చేరారు. ఇంతే కాకుండా చాలా స్కూళ్లు కింది తరగతుల్లో అనుమతులు లేకుండానే విద్యార్థులను చేర్చుకున్నాయి. ఈ కారణంగానూ విద్యార్థుల వివరాలు లభించని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో యూడైస్ కోసం పాత రికార్డు ఎలా తేవాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

టెన్త్ విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

యూడైస్ సాధ్యాసాధ్యాలను ఉన్నతాధికారులు గుర్తించాలి. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను అర్థం చేసుకోవాలి. యూడైస్‌లో పేరులేదని పరీక్ష ఫీజు కట్టించుకోని పరిస్థితి వస్తే, అనేకమంది టెన్త్ విద్యార్థులు ఇబ్బందులు పడతారు. పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో వారిని మానసికంగా దెబ్బతీయడం సరైన చర్య కాదు.

– చావా రవి
(టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

వెసులుబాటు ఇవ్వకపోతే ఇబ్బందులే

విద్యార్థి 8 నుంచి ఒకే స్కూల్‌లో ఉన్నప్పుడు దాన్నే ప్రామాణికంగా తీసుకుని యూడైస్‌లో చేర్చే ఆప్షన్ ఇవ్వాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు ఇందులోని ఇబ్బందులను విద్యా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. అప్పటివరకూ తాము యూడైస్‌లో చేర్చే ప్రక్రియ పూర్తి చేయలేమంటున్నాయి. ఆన్‌లైన్ ఈ మేరకు సాంకేతిక వెసులుబాటును కల్పించాలని కోరుతున్నాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.